www.andhrajyothy.com
నిజామాబాద్ సిటీ*
ఆంధ్రజ్యోతి
సంపుటి: 14
సంచిక: 174

గురువారం | 4-1-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ.5.00

శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 9.32 వరకు తదుపరి చవితి; నక్షత్రం: ఆశ్లేష తె. 3.54 వరకు తదుపరి మఖ; వర్జ్యం: సా. 5.44-7.11; దుర్ముహూర్తం: ఉ. 10.31-11.15, మ. 2.55-3.39; అమృతఘడియలు: రా. 2.26-3.54; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.50

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

మెరుపు వెంటే పిడుగు!

24 గంటల విద్యుత్తుతో రైతులకు మేలు

విచ్చలవిడితనం పెరిగితే అసలుకే మోసం

ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించాల్సిందే

లేదంటే భూగర్భ జలాలు పడిపోతాయి

బోరుకు తహసీల్దారు అనుమతి తప్పనిసరి

భూగర్భ జల శాఖ కార్యాచరణ ప్రణాళిక

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సాగుకు 24 గంటల విద్యుత్తు రైతులకు గొప్ప వరం అని అంటున్న నిపుణులు పథకం అమలులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. విద్యుత్తు వినియోగంలో విచ్చలవిడితనం

మిగతా 2వ పేజీలో...

ఐడియా గురూ!!

చెట్టుకు సౌండ్ బాక్స్.. దానికి మొబైల్‌తో లింకు. పంటలను నాశనం చేసే అడవి పందులు ఈ చప్పుడుకు ఆ వైపు వస్తే ఒట్టు!! వనపర్తి జిల్లా చిట్యాల తండాకు చెందిన ఓ యువకుడి ఐడియా ఇది!!





నేను కూడా!

..బాధితురాలినే!

కీచకులను వదిలే సవాలే లేదు

ఉధృతమవుతున్న 'మీ టూ' ఉద్యమం

కొనసాగింపుగా 'టైమ్ ఈజ్ అప్' ఆందోళన

'రోజు కూలీ ఇస్తున్నా కదా రోజూ రా' అనే కామాంధులు ప్రతి ఊరిలోనూ ఉన్నారు. నెలకోసారి జీతం ఇస్తున్నాను కదా అని.. ఏం చేసినా పడి ఉండాలనుకునే బాబులు గజాని కొకరున్నారు. 'ప్రమోషన్ ఇస్తే నాకేంటి' అని ఆకలిగా చూసే



లేకి బాస్‌లకు కొదవే లేదు. సినిమా చాన్స్ ఇస్తే పక్కలోకి రావాల్సిందే అని విర్రవీగే హార్వే వీన్‌స్టీన్‌లకు లెక్కేలేదు. కూలీలైనా, కార్మికులైనా, ఉద్యోగులైనా, సినీ తారలైనా.. పనిచేసే ప్రదేశాలే వేరు. కానీ ప్రపంచ వ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు ఒకటే! అయితే మగ మదాన్ని సహించే సవ్వాలే లేదని 'మీ టూ' ఉద్యమం ముక్తకంఠంతో నినదిస్తోంది. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా హాలీవుడ్ నటి అసిసా మిలానో 'మీ టూ' ఉద్యమాన్ని ప్రారంభించింది. దీనికి బాలీవుడ్ తారలు సైతం మద్దతు పలికారు. తాము కూడా వేధింపులు ఎదుర్కొన్నామని కొంకణసేన్, కంగనా రనౌత్, రాధికా ఆప్టే సోషల్ మీడియాలో వెల్లడించారు. మరో వైపు కీచకులను కోర్టు కీడ్చటానికి 'టైమ్ ఈజ్ అప్' ఆందోళన మొదలైంది. దీనికి కొనసాగింపుగానా అన్నట్టు ఒక తెలుగు యువతి కూడా తెగువ ప్రదర్శించింది. కెమెరాలతో గజల్ శ్రీనివాస్ అసలు స్వరూపాన్ని ప్రపంచం ముందుంచింది.

-ఆమే ఒక సైన్యం.. ప్రత్యేక కథనాలు 'అనేక'లో

యూటీ నంబర్ 1327

చంచల్‌గూడ జైలు బ్యారక్‌లో గజల్ శ్రీనివాస్

2

బెయిల్, కస్టడీ పిటిషన్లపై తీర్పు నేటికి వాయిదా

సాక్ష్యాలు బలంగా ఉన్నాయంటున్న పోలీసులు

పిపెట్,బ్యూరెట్ తెల్వదు

ప్రయోగాలకు దూరంగా ఇంటర్ విద్యార్థులు



అన్ని కాలేజీల్లోనూ ప్రాక్టికల్స్‌కు పాతర

కార్పొరేట్ కాలేజీల్లో మరీ దారుణం

ల్యాబ్‌లు ఉండవు.. ఉన్నా అరకొర

వార్షిక ప్రాక్టికల్స్ తూతూ మంత్రం

దాదాపు అందరికీ పూర్తి మార్కులు

జేఈఈ, నీట్ కోసం థియరీకే ప్రాధాన్యం

"ఈ రోజుల్లో ఇంటర్ విద్యార్థులకు పిపెట్, బ్యూరెట్ అంటే ఏమిటో కూడా తెలియదు. కాలేజీల్లో ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యమే లేకుండా పోయింది. విద్యార్థులతో ప్రయోగాలు చేయించడం పూర్తిగా మానేశారు. కొన్ని కాలేజీల్లోనైతే అసలు ల్యాబ్ సౌకర్యమే లేదు. నేను అధ్యాపకుడిగా ఉన్నరోజుల్లో ప్రయోగాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేవాళ్లం. విద్యార్థులతో ప్రయోగాలు చేయించేవాళ్లం".. ఓ సమావేశంలో సాక్షాత్తు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలివి!!

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు అనే తేడా లేకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలేజీల్లోనూ ప్రాక్టికల్స్‌కు పాతరేస్తున్నారు. విద్యార్థులతో ప్రాక్టికల్స్ చేయించకుండానే విద్యా సంవత్సరాన్ని పూర్తి చేయిస్తున్నారు. తెలంగాణలో దాదాపుగా 1,500 ప్రైవేటు కాలేజీలు, 402 ప్రభుత్వ కాలేజీలు ఉన్నాయి. వీటిలో సైన్స్ గ్రూప్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల సంఖ్య సుమారుగా 2లక్షల వరకు

మిగతా 5వ పేజీలో...

ప్రవాసీ ఘర్ వాపసీ

అమెరికా నుంచి సామూహిక తిరుగు ప్రయాణమే!

15 లక్షల మంది భారతీయులపై హెచ్1బీ వీసాల దెబ్బ



న్యూఢిల్లీ, జనవరి 3: హెచ్1బీ వీసాల పొడిగింపు ఇక జరగదన్న వార్త ఇపుడు అమెరికాలోని భారతీయ సంతతిని కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఎందుకంటే దీని ప్రభావం దాదాపు ఏడున్నర లక్షల మంది భారతీయులపై ప్రత్యక్షంగా పడుతుంది. గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుని- అవి పరిశీలనలో ఉన్నంతకాలం హెచ్1బీ వీసాలపై కొనసాగుతున్న వారే అక్కడ ఎక్కువగా ఉన్నారు. "అమెరికా ప్రభుత్వ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) పరిశీలనలో ఉన్న ప్రతిపాదనలు భారతీయులకు గొడ్డలి పెట్టు లాంటివి. ఇప్పటికే డీహెచ్ఎస్ పరిశీలనలో ఏడున్నర లక్షల అప్లికేషన్లు (గ్రీన్‌కార్డు నిమిత్తం) ఉన్నాయి. ఈ ఏడున్నర లక్షల మంది మీద దాదాపు ఎనిమిది లక్షల మంది - అంటే వారి భార్యా బిడ్డలు ఆధారపడి ఉన్నారు. డీహెచ్ఎస్ గనక - ఆరేళ్ళకు

మిగతా 6వ పేజీలో...

ఐఏఎస్ నారాజ్

బదిలీలపై బ్యూరోక్రాట్ల కుతకుత

సీఎంను తప్పుదోవ పట్టించారు

మాజీ ఐఏఎస్ పనేనని ఆగ్రహం

అప్రాధాన్య పోస్టింగ్ అవమానమే

రగిలిపోతున్న సీనియర్లు

సర్కారు సహనానికీ హద్దుంటుంది

ప్రభుత్వ వర్గాల వ్యాఖ్యానం

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం రెండో రోజు తెలంగాణ ప్రభుత్వం భారీ ఎత్తున చేపట్టిన బదిలీలు ఐఏఎస్‌లలో తీవ్ర కలకలం సృష్టించాయి. బదిలీలు జరిగిన తీరుపై టాప్ బ్యూరోక్రసీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఈ మూకుమ్మడి బదిలీలు సీనియర్లను అవమానించే విధంగా ఉన్నాయనే భావనను ఓ వర్గం వ్యక్తం చేసింది. ఇదంతా పదవీ విమరణ చేసిన ఓ ఐఏఎస్ అధికారి నిర్వాకమేనని

మిగతా 5వ పేజీలో...



పెద్దల దందా!

ఇసుక అక్రమ రవాణాకు పాలక ప్రముఖుల దన్ను

(ఇసుక రీచ్‌ల నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఇసుక దందా వ్యవహారంలో ప్రభుత్వంలోని పెద్దల హస్తం ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర మంత్రి వర్గంలోని కొంత మంది సభ్యుల పేర్లు కూడా ఇందులో వినిపిస్తున్నాయి. కొందరు మంత్రుల తనయులకు ఇదే ప్రధాన ఆదాయ వనరుగా మారిందనే వాదనలు ఉన్నాయి. సదరు నేతల నియోజకవర్గం, జిల్లా పరిధిలోని ఇసుక రీచ్‌ల్లో సక్రమమైనా, అక్రమమైనా ఇసుక రవాణా చేస్తే వారికి కప్పం కట్టాల్సిందేనని తెలుస్తున్నది. ఇసుక వ్యాపారులు ఈ పెద్దలను కాదని వ్యాపారం చేస్తే ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్టు సమాచారం. లేదంటే అధికారులకు ఫోన్ చేసి ఇసుక వ్యాపారులు తమ దారికి వచ్చే విధంగా పావులను కదుపుతున్నారు. కొందరైతే

రైతు కంట్లో ఇసుక

మిగతా 5వ పేజీలో...

రాజ్యసభ రేసులో నాయిని, స్పీకర్!



పార్టీ ప్రధాన కార్యదర్శి సంతోష్‌పైనా ప్రచారం

యాదవ నేతల్లో తుల ఉమ, కన్నెబోయిన రాజయ్య పేర్లు


హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి రాజ్యసభలో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఖాళీ కానున్న మూడు స్థానాలు టీఆర్ఎస్ ఖాతాలో పడనున్న దృష్ట్యా ఆ అదృష్టం ఎవరిని

మిగతా 5వ పేజీలో...



Paramjyothi
పరంజ్యోతి

తత్త్వం, కర్తవ్యం రెండూ చెప్పే భగవద్గీత



భగవద్గీత తత్వాన్ని చెబుతుందా, కర్తవ్యాన్ని చెబుతుందా అనే సంశయం కలగడం సహజం. సామాన్యంగా స్వామీజీలు, సన్యాసులు గీతపై ప్రవచనాలు చేస్తుంటారు కాబట్టి అది ఏదో అర్థం కాని తత్వాన్ని చెబుతుందనే అభిప్రాయం చాలా మందికి ఉంటుంది. ముందు ఈ రెండిటికీ తేడా చూద్దాం. వ్యవస్థలో ఒక వ్యక్తి కర్తవ్యం అతని స్థానాన్ని బట్టి ఉంటుంది. కలెక్టర్ కర్తవ్యం ఒక జిల్లాను పర్యవేక్షణ చేయడం. అటెండర్ కర్తవ్యం ఆఫీసులో పై అధికారి చెప్పిన పని చేయడం. అలాగే క్షత్రియుడిగా అర్జునుడి కర్తవ్యం ధర్మాన్ని రక్షించడం, అధర్మాన్ని ఎదిరించడం. అందుకు యుద్ధం అవసరమైతే యుద్ధం కూడా చేయడం.

తత్వం అంటే ఒక వస్తువు, లేదా విషయం యొక్క నిజమైన స్వరూపం. వేదాంతంలో 'తత్' అనే పదం పరమాత్మకు సంకేతం. 'త్వం' అనేది ప్రత్యయం. పురుషత్వం అంటే పురుష స్వభావం, స్త్రీత్వం అంటే స్త్రీ స్వభావం ఎలాగో తత్వం అంటే పరమాత్మ స్వభావం అని అర్థం. యుద్ధభూమిలో ఉన్న అర్జునుడికి గీతా బోధ ఎందుకు? అంటే.. అన్ని సన్నాహాలూ చేసుకుని యుద్ధభూమికి వచ్చిన అర్జునుడికి తను చేయబోతున్న యుద్ధం పట్ల సంశయం కలిగింది. 'నేను గొప్ప పాపాన్ని మూటగట్టుకుంటున్నాను' అనుకున్నాడు. తన కర్తవ్యాన్ని వదిలి బ్రాహ్మణుడి కర్తవ్యమైన భిక్షాటనం చేస్తానని కూర్చున్నాడు. అయితే, కృష్ణుడి అవతారం లక్ష్యమే దుష్ట శిక్షణ. తను నేరుగా కాకుండా పాండవుల ద్వారా ఆ పని చేయిస్తున్నాడు. వీరులందరిలో శ్రేష్ఠుడు అర్జునుడే. ఆలోచించేవాడూ, ప్రశ్నించేవాడూ అర్జునుడే. అలాంటివాడు యుద్ధం చేయనని కూర్చున్నాడు. మామూలు సైనికుడైతే అతణ్ని ఆజ్ఞాపించవచ్చు. అర్జునుడి లాంటి వాడిని అలా ఆజ్ఞాపించడం కుదరదు. అతనికి పూర్తిగా సందేహ నివృత్తి చేయాలి. అందువల్ల ధర్మస్వరూపాన్ని మొత్తం వివరించి చెప్పాల్సి వచ్చింది. అర్జునుడు పుణ్యం, పాపం, నరకం లాంటి విషయాల గురించి ప్రస్తావించాడు. అందువల్ల వాటన్నింటినీ వివరించడానికి.. పరమాత్మ స్వరూపమేమిటి, సృష్టి తత్వమేమిటి, జీవుడి స్వరూపమేమిటి మొదలైన విషయాలన్నింటినీ కృష్ణుడు వివరించాల్సి వచ్చింది.

జ్ఞానమే ఏ వ్యక్తికైనా దిశానిర్దేశం చేస్తుంది. అది లౌకిక విషయం కావచ్చు, ఆధ్యాత్మిక మార్గంలో వచ్చే సందేహం కావచ్చు. ధర్మం లౌకిక విషయానికీ, ఆధ్యాత్మిక విషయానికీ రెండింటికీ చెందినది. యుద్ధభూమిలో శత్రువులను ఎదిరించడమనేది కేవలం లౌకిక విషయమే కాదు, పుణ్య పాపాలకు సంబంధించిన ప్రశ్న. అందువల్ల కృష్ణుడు ఒక విశాలమైన అవగాహన ఇవ్వాల్సి వచ్చింది. అతని దృష్టి కోణాన్ని మార్చాల్సి వచ్చింది. ఫలితం.. కృష్ణుడు గీతా బోధ ద్వారా తత్వాన్ని బోధించి అర్జునుడిని కర్తవ్యోన్ముఖుడిని చేశాడు.

\- అరవిందరావు (రిటైర్డ్ డీజీపీ)

జేఎల్ఎం పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్పీడీసీఎల్‌లో 1800 జూనియర్ లైన్‌మన్(జేఎల్ఎం) పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. సంస్థ పాలక మండలి సమావేశం నిర్వహించిన అనంతరం రెండువారాల్లోగా ఈ మేరకు ప్రకటన జారీ కానుంది. ఇప్పటికే తెలంగాణ ట్రాన్స్‌కోలో 330 అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ), 174 సబ్ ఇంజనీర్(ఎలక్ట్రికల్), 1100 జూనియర్ లైన్‌మన్(జేఎల్ఎం) పోస్టుల కలిపి మొత్తం 1604 పోస్టుల భర్తీకి ఇప్పటికే ప్రకటన జారీ అయింది. ఎస్పీడీసీఎల్‌లో కూడా 150 అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ), 500 జూనియర్ అసిస్టెంట్, 100 జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్(జేఏఓ) పోస్టులతో పాటు 2000 జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం) పోస్టుల భర్తీ చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఈ రెండు డిస్కమ్‌ల నోటిఫికేషన్లు కూడా వెలువడితే విద్యుత్‌శాఖలో భర్తీచేయనున్న కొలువుల సంఖ్య 6,154కు చేరనుంది.

ట్రాన్స్‌కో సీఎండీకి సీబీఐపీ అవార్డు

న్యూఢిల్లీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో విశేష కృషి చేసి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థను అగ్రగామిగా నిలిపినందుకు ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్(సీబీఐపీ) జ్యూరీ అవార్డు దక్కింది. బుధవారం ఢిల్లీలో జరిగిన 90 వార్షికోత్సవ కార్యక్రమంలో కేంద్రమంత్రుల సమక్షంలో సీబీఐపీ అధ్యక్షుడు రవీంద్రకుమార్ వర్మ ప్రభాకర్‌రావుకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఉత్తర, దక్షిణాది గ్రిడ్‌ల అనుసంధానం, తెలంగాణలో తలసరి విద్యుత్ వినియోగం జాతీయ సగటును మించినప్పటికీ అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా వ్యవస్థను తీర్చిదిద్దడం వంటి అంశాలే ప్రాతిపదికగా ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. నీరు, విద్యుత్, సంప్రదాయేతర ఇంధన వనరుల రంగంలో ఏటా సీబీఐపీ పురస్కారాలను అందిస్తుంది. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్రమంత్రులు సత్యపాల్‌సింగ్, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, రాజ్‌కుమార్ సింగ్‌లు పాల్గొన్నారు.



ఢిల్లీలో కేంద్రమంత్రుల సమక్షంలో సీబీఐపీ అధ్యక్షుడు రవీంద్రకుమార్ వర్మ చేతుల మీదుగా అవార్డును అందుకున్న ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు



ఒకటో తేదీ నుంచి 15 వరకే రేషన్

హైదరాబాద్, జనవరి3(ఆంధ్రజ్యోతి) రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి నుంచి 15 వరకు సరుకుల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈపాస్ అమలవుతున్న 25 జిల్లాల్లో ఈ విధానం తక్షణం అమల్లోకి వస్తుందన్నారు. సరుకుల కోసం రేషన్ డీలర్లు ప్రతి నెలా 16 నుంచి 18వ తేదీలోపు మీసేవ కేంద్రాల ద్వారా డీడీలు చెల్లించాలన్నారు. అలాగే 16వ తేదీ నుంచే రేషన్ షాపులకు సరుకుల కేటాయింపులు ఉంటాయని ఆయన వివరించారు. ఈ నూతన విధానంపై జిల్లా జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కమిషనర్ సూచించారు.

ఎస్సీ యువతకు సబ్సిడీపై వాహనాలు

హైదరాబాద్, జనవరి3(ఆంధ్రజ్యోతి): దళిత యువతకు సబ్సిడీపై వాహనాలు అందించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ లచ్చిరాం భూక్య తెలిపారు. ప్రయోగాత్మకంగా మెట్రో కోసం 100 ఇన్నోవా, ఇతియోస్ వాహనాలను సమకూర్చుకునేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తంగా 500 మందికి శిక్షణ ఇచ్చి.. సబ్సిడీ రుణం ద్వారా వాహనాలు అందించనున్నారు.

మధ్యప్రదేశ్‌లో 6 నుంచి డీజీపీల సదస్సు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగే అన్ని రాష్ట్రాల డీజీపీల సదస్సు 6వ తేదీ నుంచి మూడు రోజులు జరగనుంది. సదస్సులో తెలంగాణలో పోలీసింగ్, కొత్తగా టెక్నాలజీ వాడకం తదితర అంశాలను డీజీపీ మహేందర్‌రెడ్డి వివరించనున్నారు.

'వెటర్నరీ' వెబ్ ఆప్షన్లకు 6 వరకు గడువు

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వెటర్నరీ అసిస్టెంట్ కేటగిరీ 4 పోస్టుల వెబ్‌ఆప్షన్ల గడువు 6వ తేదీ వరకు ఉంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులకు జిల్లాల ప్రాధాన్యం కోసం ఈ అవకాశం కల్పిస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ బుధవారం పేర్కొంది. ఆప్షన్లు ఇవ్వని వారికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ వాణి ప్రసాద్ తెలిపారు.

యూటీ నంబర్ 1327

చంచల్‌గూడ జైలు బ్యారక్‌లో గజల్ శ్రీనివాస్.. ఇతర ఖైదీలతో మాట్లాడకుండా ముభావం

- భోజనం చేయకుండా బిస్కెట్లు, బ్రెడ్, పండ్లతో సరి
- బెయిల్, కస్టడీ పిటిషన్‌లపై తీర్పు నేటికి వాయిదా
- బెయిల్ వస్తుందన్న ధీమా.. తీర్పు వాయిదాతో 'గజల్' నిరాశ
- ఆయన ఆకృత్యాలపై మరిన్ని వీడియోలు ఇచ్చిన బాధితురాలు
- సాక్ష్యాలు బలంగా ఉన్నాయంటున్న పోలీసులు



సైదాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల కేసులో అరెస్టయి.. చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న గజల్ శ్రీనివాస్‌కు జైలు అధికారులు యూటీ నంబరు 1327ను కేటాయించారు. మంగళవారం సాయంత్రం జైలుకొచ్చిన గజల్ శ్రీనివాస్‌ను బుధవారం ఉదయం వరకూ అడ్మిషన్ బ్యారక్‌లో ఉంచి.. అనంతరం వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని ఉంచిన మరో బ్యారక్‌కు తరలించారు. జైలులో ఆయన భోజనం చేయకుండా.. బిస్కెట్లు, బ్రెడ్, పండ్లు భుజించినట్లు సమాచారం. అలాగే, ఇతర ఖైదీలతో మాట్లాడకుండా ముభావంగా ఉంటున్నట్లు తెలిసింది. కాగా.. గజల్ శ్రీనివాస్ తరఫున ఆయన న్యాయవాది బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ వేయగా, ఆయన్ను వారం రోజులపాటు తమ కస్టడీకి అనుమతించాలంటూ పోలీసులూ పిటిషన్ దాఖలు చేశారు. శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరు చేయాలని అతడి తరఫు న్యాయవాది వాదించగా.. అతనికి బెయిల్ మంజూరు చేస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని, అతను మరికొంత మంది మహిళలను లైంగికంగా వేధించినట్లు తెలుస్తోందని కావున వారం రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని పోలీసులు వాదించారు. ఇరువురి వాదనలూ విన్న న్యాయస్థానం.. దాఖలైన రెండు పిటిషన్లపై తీర్పును గురువారానికి వాయిదా వేసింది. జైలుకు వచ్చినప్పటి నుంచి తనకు బెయిల్ వస్తుందని గజల్ శ్రీనివాస్ ధీమాతో ఉన్నారని, కానీ బెయిల్‌పై తీర్పు వాయిదా పడటం, పోలీసులు కస్టడీ పిటిషన్ వేయడంతో తీవ్ర నిరాశ చెందారని సమాచారం.

'సేవ్ టెంపుల్' అంబాసిడర్ హోదా తొలగింపు

లైంగిక వేధింపుల కేసులో అరెస్టైన గజల్ శ్రీనివాస్‌కు మరో షాక్ తగిలింది. ఏపీలో 'సేవ్ టెంపుల్' కార్యక్రమానికి అంబాసీడర్‌గా ఉన్న శ్రీనివాస్‌ను ఆ హోదా నుండి తొలగిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. తమ సంస్థలో స్త్రీలను దేవతలుగా భావిస్తామని, మహిళల పట్ల ఇంత నీచంగా ప్రవర్తించిన వ్యక్తికి అంబాసిడర్‌గా ఉండే అర్హత లేదని వెంటనే అతణ్ని తొలగిస్తున్నట్లు 'గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్' అధ్యక్షులు వెలగపూడి ప్రకాశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

మరిన్ని వీడియోలు..

గజల్ శ్రీనివాస్ వేధింపులను రెండునెలలపాటు భరించిన బాధిత మహిళ.. ఆయన రాసలీలలకు సంబంధించి గంటల కొద్ది నిడివిగల 20 వీడియోలను పోలీసులకు అందజేశారు. శ్రీనివాస్‌పై ఫిర్యాదు చేయడానికి ఒంటరిగా భయంతో పోలీస్టేషన్‌కు వెళ్లానని అక్కడ తనకు పోలీస్ అధికారులు పూర్తి భరోసా కల్పించి ధైర్యాన్నిచ్చారంటూ వారికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాగా.. బాధిత మహిళనే కాక, మరికొంత మంది స్త్రీలను కూడా శ్రీనివాస్ లైంగికంగా వేధించినట్లు తాజా వీడియోల్లో బలమైన ఆధారాలు లభించాయని పోలీసులు అంటున్నారు. బాధితులు ధైర్యంగా బయటకు వస్తే వారితో కూడా మాట్లాడి వివరాలు నమోదు చేస్తామంటున్నారు. ఇక, ఈ కేసులో రెండో ముద్దాయి అయిన గజల్ శ్రీనివాస్ పనిమనిషి పార్వతి ఇంకా పోలీసులకు చిక్కలేదు. ఆమెను ఏ క్షణంలోనైనా అదుపులోకి తీసుకొని, విచారించే అవకాశం ఉందని పోలీసులు అంటున్నారు.

గజల్ శ్రీనివాస్‌పై కేసులో కుట్రకోణం

- మంత్రి మాణిక్యాల అనుమానం



అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గజల్ శ్రీనివాస్‌పై లైంగిక వేధింపుల కేసులో కుట్ర దాగి ఉందని మంత్రి మాణిక్యాలరావు అభిప్రాయపడ్డారు. గజల్ శ్రీనివాస్ తనకు చిన్నప్పటినుంచీ తెలుసని, ఆయనది అమ్మాయిలను వేధించే నైజం కాదని తెలిపారు. బుధవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏ కుట్రా లేకుంటే సీసీ కెమెరాలు ఎందుకు పెట్టారని మంత్రి ప్రశ్నించారు.

మైనర్ బాలిక రేప్

- సెల్‌ఫోన్‌లో చిత్రీకరణ.. నెట్‌లో అప్‌లోడ్
- ఇద్దరు యువకుల ఘోరం

సుల్తానాబాద్, జనవరి 3: బాలికపై సామూహిక అత్యాచారం చేయడమే కాదు.. ఆ దారుణాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి నెట్‌లో అప్‌లోడ్ చేశారా దుర్మార్గులు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఆలస్యంగా వెలుగుచూసిందీ ఘోరం. నిందితులను కదంబాపూర్‌కు చెందిన బండి శ్రీనివాస్, బెద్ది నగేశ్‌గా గుర్తించారు. మార్కండేయ నగర్‌లో నివసిస్తున్న బాలికపై నెలక్రితం వీరిద్దరూ మాయమాటలు చెప్పి అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ వీడియోను నెట్‌లో అప్‌లోడ్ చేయడాన్ని గుర్తించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పెద్దపల్లి పోలీసులు నిందితులు ఎంతటి వారైనా వదలబోమని పేర్కొన్నారు.

సీఐ 'బెండి' తీసింది!

- యువతిపై పోలీసు అధికారి లైంగిక వేధింపులు
- వీడియో ఆధారంగా సీపీకి ఫిర్యాదు



సీఐ బెండి వెంకటరావు

విశాఖపట్నం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఓ కేసులో బాధితురాలిగా ఉన్న యువతిపై లైంగిక దాడికి యత్నించిన విశాఖ త్రీ టైన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బెండి వెంకటరావును నగర పోలీస్ కమిషనర్ యోగానంద్ సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. వారణాసికి చెందిన ఓ యువకుడు నగరంలోని ఫోర్‌పాయింట్స్ హోటల్‌లో పనిచేస్తున్నా డు. మలేషియాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రాష్ట్రానికి చెందిన యువతితో ప్రేమలో పడ్డాడు. ఆ యువతి మలేషియాలో తన ఉద్యోగం వదిలేసి అదే హోటల్లో చేరింది. ఏం జరిగిందో ఏమో.. ఆమెను వదిలేసి ఆ యువకుడు గత ఏడాది నవంబర్‌లో పరారయ్యాడు. దీనిపై ఆ యువతి నవంబర్ 18న త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. సీఐ వెంకటరావు కేసు నమోదు చేసి, యువకుడు పంజాబ్‌లో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నగరానికి తీసుకువచ్చి జైలుకు తరలించారు. అయితే సదరు యువతి తన ప్రియుడిని జైలుకు పంపిస్తే పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకోడేమోనని సీఐ వద్ద ఆందోళనను వెలిబుచ్చింది. దీన్ని ఆసరాగా తీసుకున్న సీఐ ఈనెల 28న ఆమె ఉంటోన్న హోటల్ గదికి వెళ్లి ఆమెపై లైంగికదాడికి యత్నించారు.ఆమె తెలివిగా వీడియో, ఫొటోలు తీసి నగర సీపీకి ఫిర్యాదు చేసింది. ప్రాథమిక విచారణలో ఆరోపణలు వాస్తవమేనని తేలడంతో సీఐని సస్పెండ్ చేశారు.

మెరుపు వెంటే పిడుగు!

(మొదటి పేజీ తరువాయి)

పెరిగితే.. అసలుకే మోసం వస్తుందని హెచ్చరిస్తున్నారు. నీటి వాడకం, ఆటోమేటిక్ స్టార్టర్ల కట్టడిపై రైతులకు అవగాహన కల్పించకపోతే భూగర్భ జలమట్టం గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉంటుందంటున్నారు. రైతులకు ఎంతో మేలు చేసే ఈ పథకంలో వారికీ భాగస్వామ్యం కల్పించేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని సూచిస్తున్నారు. రాష్ట్రంలో సాగు కోసం 24 గంటల విద్యుత్తు సరఫరా అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో కార్యాచరణ ప్రణాళికకు సంబంధించి భూగర్భ జల వనరుల శాఖ ప్రత్యేక పత్రాన్ని రూపొందించింది. త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించనున్న ఈ ప్రణాళికలో అనేక అంశాలను ప్రస్తావించింది. రాష్ట్రంలో ఏటా 473 టీఎంసీల భూ గర్భ జలం అందుబాటులో ఉంటుంది. అయితే ప్రస్తుతం 9 గంటల విద్యుత్తు వల్ల ఇందులో ప్రతి ఏడాది సుమారు 288 టీఎంసీల నీటిని పంటల సాగుకోసం బయటకు తోడుతున్నారు. అయితే, 24 గంటల విద్యుత్తు పథకం అమలులో రైతులు ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించకపోతే, నిరంతరంగా మోటార్లు నడవడంతో ఏడాదికి 685 టీఎంసీల స్థాయికి నీటి వాడకం పెరిగిపోతుందని, ఇదే జరిగితే మున్ముందు తీవ్ర పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో 80 శాతం పురాతనమైన కఠిన శిలలు విస్తరించి ఉన్నాయి. అందువల్ల నీటి వినియోగం ఉపరితల జల వనరుల ద్వారా ఏడాది పొడవునా అందుబాటులో ఉండదు. రాష్ట్రంలో భూగర్భ జలాలు మృదువైన, కఠిన శిలల్లోని రాతి పొరలలో నిక్షిప్తమై లభిస్తుంది. వీటిపై 70 శాతం ప్రజలు ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. నిత్యావసరాలకు, పరిశ్రమల అవసరాలకు వాడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించకపోతే.. 24 గంటల విద్యుత్తు సరఫరా లక్ష్యమే దెబ్బతింటుందని అంటున్నారు.

భూ గర్భ జల శాఖ రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలో ముఖ్యాంశాలు

వాస్తవ పరిస్థితులు..

- తెలంగాణలో భూగర్భ జలాల లభ్యత సంవత్సరానికి 4,73 టీఎంసీలు
- 9 గంటల పాటు బోర్ల ద్వారా పంపింగ్ చేయుడం వల్ల, రాష్ట్రంలో భూగర్భ జల వినియోగం సంవత్సరానికి 2,88 టీఎంసీలుగా ఉంది.
- అదే 24 గంటల కరెంట్ సరఫరాలో ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించకుండా 24 గంటల పాటు నీటిని పంపింగ్ చేస్తే... 6,85 టీఎంసీల భూగర్భ జలం వినియోగం అవుతుంది. ప్రస్తుతం వినియోగిస్తున్న దానికంటే 2 రెట్లు అధికం.
- 24 గంటల పాటు నీటి పంపింగ్ వల్ల భూగర్భ జల పరిణామంతో పాటుగా, నీటి నాణ్యత, భూగర్భ జల మట్టం 10 మీటర్ల నుంచి 20 మీటర్ల లోతుకు పడిపోయే ప్రమాదం ఉంది.

భూగర్భ జలాలను కాపాడడానికి తీసుకోవాల్సిన చర్యలు

- భూగర్భ జల వినియోగంలో రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలి
- నీటిని వృధా కానీవకుండా బయటకు తీసే నీటికి ప్రత్యామ్నాయంగా కృత్రిమ రీచార్జ్ నిర్మాణాలు నిర్మించి ప్రోత్సహించాలి
- భూగర్భజల వినియోగదారుల కమిటీలను తెలంగాణ రాష్ట్ర వాల్టా చట్టం అథారిటీ ద్వారా ఏర్పాటు చేయాలి. ఇందులో భూగర్భ జలాలను వినియోగిస్తున్న అనుబంధ శాఖలు, భూగర్భజలం వినియోగిస్తున్న పారిశ్రామికవేత్తలు, రైతులు ఎన్జీవోలతో గ్రామస్థాయి, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలి.
- తహసీల్దారు ఆధ్వర్యంలోని వాల్టా అథారిటీ ప్రకారం భూగర్భ జలాలను సక్రమంగా వినియోగించేందుకు కార్యాచరణను రూపొందించి ప్రజలను భాగస్వాముల్ని చేయాలి.
- అవగాహన కార్యక్రమాల ద్వారా తెలంగాణ వాల్టా చట్టాన్ని అమలు పరచాలి. రైతులు కొత్త బోరు వేయాలనుకుంటే, ఎమ్మార్వోకు దరఖాస్తును పెట్టుకోవాలి. తర్వాత పరిస్థితిని బట్టి అనుమతిని జారీ చేయాలి.
- బోర్ల ద్వారా రోజు 9 గంటల పాటు నీటిని తోడితే... మిగిలిన 15 గంటల కాల పరిధిలో రిక్యుపరేషన్ జరుగుతుంది. నీటి మట్టం తొందరగా పడిపోదు. అయితే, 24 గంటల పాటు బోర్లు పనిచేస్తే... బోర్లలోఉన్న నీటి కంటె 2 రెట్లు అధిక వినియోగం జరుగనుంది. దాంతో నీటి మట్టం గణనీయంగా పడిపోతుంది. అలాగే నీటి నాణ్యతలో కూడా మార్పు రానుంది.

లోకం తీరు



హలో ప్రధాని జీ... చాలా ఉగ్ర సంస్థల నుంచి ఆఫర్లు వస్తున్నాయి... వీటిని అమ్మి డబ్బులు తెచ్చుకుందాం లే!!


ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	7.0	29.4
రామగుండం	12.5	29.8
నిజామాబాద్	14.9	30.9
ఖమ్మం	15.0	31.0
హైదరాబాద్	16.9	29.2

ఆదిలాబాద్‌లో 7 డిగ్రీల ఉష్ణోగ్రత

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు చోట్ల సాధారణం కంటే తక్కువగా, మరికొన్ని చోట్ల ఎక్కువగా బుధవారం రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో 7 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదు కాగా.. మహబూబ్‌నగర్‌లో 19 డిగ్రీల మేర నమోదైంది. భద్రాచలంలో 4, ఖమ్మంలో 3, మెదక్, నల్లగొండల్లో 2, రామగుండంలో ఒక డిగ్రీ చొప్పున సాధారణం కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్, హన్మకొండలో 2, నిజామాబాద్‌లో ఒక డిగ్రీ మేరకు సాధారణం కంటే ఎక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ట్రాక్టర్ సేద్యం భూమికి హాని!



ట్రాక్టర్‌తో సేద్యం భూమికి హానికరం. ట్రాక్టర్ భూమిలో పది అంగుళాల లోతులో మట్టిని బయటకు తీస్తుంది. ఇలా ట్రాక్టర్‌తో దున్నడం వలన మొక్కలకు మేలు చేసే కొన్ని రకాల జీవరాశులు భూమి లోపలికి వెళ్లి.. గాలి లేక చనిపోతాయి. చెక్క నాగలి, రోటోవేటర్, ఇతర పరికరాల ద్వారా సేద్యం చేస్తే 4 అంగుళాల వరకే మట్టి బయటకు వస్తుంది. దీనివల్ల ఎలాంటి హానీ ఉండదు.

\-సుభాష్ పాలేకర్

జెరూసలేం అమ్మకానికి లేదు



జెరూసలేం... పాలస్తీనా శాశ్వత రాజధాని. అది బంగారానికో బిలియన్లకో అమ్మకానికి లేదు. మమ్మల్ని ఎవరూ బ్లాక్ మెయిల్ చేయలేరు. శాంతి, స్వేచ్ఛ, న్యాయం కోసం శోధిస్తున్న మమ్మల్ని అమెరికా వెన్నుపోటు పొడిచింది.

\- పాలస్తీనా అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.74.09	పాత ధర 64.99
పాత ధర రూ.74.09	పాత ధర 65.06
మార్పులేదు	పెరుగుదల : 7 పైసలు

భుక్తాయాసంతో మెదడు మొద్దుబారు!

మెల్‌బోర్న్, జనవరి 3: చక్కెర అతిగా తిన్నా, భుక్తాయాసం వచ్చేలా భోజనం చేసినా.. కాస్తంత మత్తుగా అనిపిస్తుంది. ఆ సమయంలో ఏ పనీ చేయాలనిపించదు. దీనికి కారణం తిన్న తర్వాత మెదడు పనితీరు మందగించడమేనని న్యూజిలాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఒటాగో శాస్త్రవేత్తలు తెలిపారు.

మధుమేహాన్ని నియంత్రించే 'ట్రాఫిక్'

న్యూయార్క్: మధుమేహంతో బాధపడే వారికి ఇన్సులిన్ ఇంజెక్షన్ల బెడద నుంచి విముక్తి కల్పించేందుకు అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పాలిమర్ దారానికి హైడ్రోజెల్‌తో ఐస్‌లెట్ కణాలను కోటింగ్ చేసి 'థ్రెడ్ రీఇన్‌ఫోర్స్‌డ్ అల్జినేట్ ఫైబర్ ఫర్ ఐస్‌లెట్స్ ఎన్‌క్యాప్సులేషన్(ట్రాఫిక్)' పరికరాన్ని తయారు చేశారు. దాన్ని శరీరంలోకి ఎక్కించి టైప్-1 మధుమేహాన్ని నియంత్రించవచ్చని పరిశోధకులు తెలిపారు.

హృద్రోగం, కేన్సర్‌ను నిర్ధారించే కృత్రిమ మేధ



లండన్: గుండె సంబంధిత వ్యాధులను, ఊపిరితిత్తుల కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తించే కృత్రిమ మేధస్సును యూకేలోని జాన్ రాడ్‌క్లిఫ్ హాస్పిటల్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ప్రస్తుతం వైద్యులు గుండె కొట్టుకునే వేగాన్ని బట్టి హృద్రోగాన్ని అంచనా వేస్తున్నారు. అందులో కచ్చితత్వం ఉండదు. ఆ సమస్యను అధిగమించేందుకు అత్యాధునిక సాంకేతికతతో ఈ కృత్రిమ మేధస్సును రూపొందించామని, గుండె పోటు వచ్చే అవకాశాన్ని దీని ద్వారా కచ్చితత్వంతో గుర్తించవచ్చని పరిశోధకులు తెలిపారు.

'మరుగుదొడ్డి' కోసం టవర్ ఎక్కిన సర్పంచ్



విద్యుత్ టవర్ ఎక్కిన సర్పంచు

పోలీసులు నిర్మాణాన్ని అడ్డుకోవడమే కారణం

మరుగుదొడ్ల నిర్మాణాలను పోలీసులు అడ్డుకోవడంతో ఆ గ్రామ సర్పంచ్ విద్యుత్ టవర్‌ను ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిన ఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురంలో బుధవారం జరిగింది. బస్టాండులో మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరైనా అధికారులు పనులు చేపట్టకపోవడంతో గ్రామ సర్పంచ్ సామ్యనాయక్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. కొద్ది సేపటికే అక్కడికి చేరుకున్న పోలీసులు పనులను అడ్డుకున్నారు. స్థానికంగా ఉన్న ఒక వర్గం వారు మరుగుదొడ్ల నిర్మాణాలకు అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఫిర్యాదు చేశారని చెప్పారు. గతంలో బస్టాండు ఆవరణలో మరుగుదొడ్లు ఉన్న స్థలంలోనే కొత్తగా నిర్మిస్తే వారికి అభ్యంతరం ఏంటని గ్రామస్థులు నిలదీశారు. ఈవిషయంలో సర్పంచ్‌తో సీఐ దురుసుగా వ్యవహరించారని గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించారు. ఇంతలో సర్పంచ్ విద్యుత్ టవర్ ఎక్కి పనులు కొనసాగించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. - ఖిల్లాఘనపురం

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' పిలుపే స్ఫూర్తిగా..



మంథనిలో పేపర్ కవర్లు తయారు చేసుకుంటున్న స్వాములు

ప్లాస్టిక్‌ను నిషేధించి 'స్వచ్ఛ శబరిమల'లో భాగస్వాములు కండి! అంటూ అయ్యప్ప స్వాములకు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఇచ్చిన పిలుపుతో ఆ స్వాములు స్ఫూర్తి పొందారు. మాటల్లో కాదు చేతల్లో నిరూపిస్తామంటూ ఇరుముడుల్లో పసుపు, కుంకుమ, విభూతి, గంధం, ఇతర వస్తువులు తీసుకెళ్లడానికి పేపర్ కవర్లు తయారు చేసుకుంటున్నారు పెద్దపల్లి జిల్లా మంథని శ్రీ అయ్యప్ప ఆలయంలోని దీక్షా స్వాములు. ఇక, స్వచ్ఛ శబరిమల కోసం మేము సైతం అంటూ వనపర్తి జిల్లా అమరచింతలో అయ్యప్ప స్వాములు ర్యాలీ నిర్వహించి, ఇరుముడిలో ప్లాస్టిక్ వాడబోమని ప్రతిజ్ఞ చేశారు. - మంథని, అమరచింత

పత్తికి గిట్టుబాటు కోసం రైతుల ధర్నా



బాదేపల్లి పత్తి మార్కెట్ ముందు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

గిట్టుబాటు ధర రాకపోవడంతో పత్తి రైతులు బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి పత్తి మార్కెట్‌లో ధర్నాకు దిగారు. పత్తి మార్కెట్ ప్రధాన ద్వారం మూసివేసి ఆందోళన చేశారు. వారం రోజుల్లోనే క్వింటాలుకు రూ.350 ధర తగ్గిందంటూ రైతులు నిరసన తెలిపారు. పత్తి కొనుగోలుదారులు కుమ్మక్కై ధరలు తగ్గించారని ఆరోపించారు. సంఘటనా స్థలానికి బాదేపల్లి మార్కెట్ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ శ్రీశైలంయాదవ్ చేరుకొని, రైతులను సముదాయించారు. పత్తి కొనుగోలుదారులను పిలిపించి, మాట్లాడి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. - జడ్చర్ల

అయ్యా.. గల్ఫ్ ఏజెంట్ల మోసాలకు బలైనం

- వాళ్లపై చర్యలు తీసుకోవాలి
- జగిత్యాలలో ఆరు జిల్లాల బాధితుల ధర్నా



జగిత్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న గల్ఫ్ బాధితులు

జగిత్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): 'ఉన్న ఊరిలో ఉపాధి లేక నాలుగు కాసులు సంపాదించుకుందామని కుటుంబాన్ని విడిచిపెట్టి దేశం కాని దేశం వెళ్లినం. గల్ఫ్‌కి వెళ్లినంక తెలిసింది.. ఏజెంట్ల చేతిలో మోసపోయామని. ఉపాధి లేక రోజుల తరబడి పస్తులున్నం. అష్ట కష్టాలు పడి ఎలాగోలా ఇంటికి చేరుకున్నం.' అంటూ గల్ఫ్ బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమను మోసం చేసిన ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలంటూ జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, మంచిర్యాలకు చెందిన దాదాపు 200 మంది గల్ఫ్ బాధితులు జగిత్యాల డీపీవో కార్యాయలం ఎదుట ఆందోళన చేపట్టారు. కోరుట్ల మండలం సర్ఫరాజ్‌పూర్ గ్రామానికి చెందిన సిమ్మల్ల మధు, రమేశ్ అనే ఇద్దరు ఏజెంట్లు సౌదీ అరేబియాలో పని ఇప్పిస్తామని వీసాలు ఇచ్చి తమను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ ఎస్‌ఎస్‌సీఎల్, జేఎంపీ కంపెనీలలో ప్లంబర్, డక్ ఫిట్టర్, ఎలక్ట్రికల్, కార్పెంటర్, లేబర్ ఉద్యోగాలు అనగానే జీతం బాగుంటుందని ఆశపడి, అప్పుచేసి రూ.3లక్షల చొప్పున ఏజెంట్లకు చెల్లించామని తెలిపారు. రెండేళ్లలోనే పని లేదంటూ స్వదేశానికి వెళ్లాలని కంపెనీలు పలు ఇబ్బందులు పెట్టాయని వెల్లడించారు. ఒక్కొక్కరికి 5 నుంచి 6 నెలల జీతం సుమారు రూ.3లక్షల నుంచి రూ.5లక్షలు చెల్లించలేదన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జిల్లా ఎస్పీ అనంతశర్మను కలిసి తమ బాధ వెల్లబోసుకున్నారు. ఏజెంట్ మోసంతోనే ఇదంతా జరిగిందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

'శ్రీ విజయ' పేరుతో నకిలీ ఎరువులు!

- అనుమతులు లేకుండా రైతులకు విక్రయం
- పోలీసుల అదుపులో విక్రయదారులు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు, ఎరువు వివరాలు లేని శ్రీ విజయ ఫర్టిలైజర్ బ్యాగు

పాపన్నపేట, జనవరి 3: పంటలకు దోమపోటు రాకుండా అరికడుతుందంటూ నకిలీ ఎరువులను రైతులకు అంటగడుతున్న ఓ కంపెనీ వ్యవహారం బట్టబయలైంది. తయారు చేసిన తేదీగానీ, లాట్‌నెంబర్ గానీ లేకుండా శ్రీ విజయ బయో ఫర్టిలైజర్ ఇండియా పేరుతో ఎరువులు, గుళికలు, పురుగుమందులను విక్రయిస్తున్న ముఠాను మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని మిన్‌పూర్ గ్రామస్థులు పట్టుకున్నారు. సదరు కంపెనీకి చెందిన వ్యక్తులు 15 రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు ఎరువులను సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగా మిన్‌పూర్‌లో సుమారు 70 సంచుల వరకు విక్రయించారు. కంపెనీ సేల్స్‌మెన్ గ్రామాలకు వచ్చి దోమపోటు రాకుండా ఈ మందులు ఉపయోగపడతాయని రైతులతో నమ్మబలికారు. గత ఖరీఫ్‌లో దోమపోటు బారిన పడి భారీగా నష్టపోయిన రైతాంగం.. వారు చెప్పిన మాటలు నమ్మి.. కొనుగోలు చేశారు. అయితే మిగతా ఎరువులతోపాటు శ్రీ విజయ బయో ఫర్టిలైజర్ ఎరువులను కూడా పొలంలో వేసిన రైతులకు.. ఈ గుళికలు నీటిలో కరగకపోవడంతో అనుమానం వచ్చింది. బుధవారం తిరిగి ఎరువులు అమ్మడానికి వచ్చిన సేల్స్‌మన్‌ను గ్రామస్థులు నిలదీయగా.. అతడిచ్చిన పొంతనలేని సమాధానం ఇచ్చాడు. దీంతో గ్రామస్థులు వ్యవసాయశాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాపన్నపేట ఇన్‌చార్జి ఏవో ప్రతాప్‌కుమార్, ఏఎస్‌ఐ నర్సింహులు గ్రామానికి చేరుకొని ఎరువులను పరిశీలించారు. ఎరువుల బస్తాలపై పోషకాల శాతం చూపే పట్టిక, లాట్‌నెంబర్, గడువు తేదీ లేకపోవడాన్ని గుర్తించారు. వ్యవసాయాధికారుల అనుమతి కూడా లేకుండానే సదరు కంపెనీ యథేచ్ఛగా నకిలీ ఎరువులను విక్రయిస్తున్నట్లు స్పష్టమైంది. మండలంలోని చాలా గ్రామాల్లో ఈ ఎరువులను విక్రయించినట్లు సేల్స్‌మన్ తెలిపారు. ఈ మేరకు వ్యవసాయాధికారి ప్రతాప్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

ముథోల్/సారంగాపూర్, జనవరి 3: అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన సింగేటి మల్లయ్య(32) 5 ఎకరాల్లో 4 బోర్లు వేశాడు. బోర్లు ఫెయిల్ అవడంతో పాటు రెండేళ్ల నుంచి ఆశించిన స్థాయిలో పంటలు పండలేదు. రూ.3 లక్షల అప్పు అయ్యింది. దీంతో మనస్థాపానికి గురై బుధవారం పురుగు మందు తాగాడు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన మహిపాల్(30) సాగులో నష్టపోయి రూ.5 లక్షలు అప్పులయ్యాడు. దీంతో మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో పురుగు మందుతాగాడు.

టమాట రైతు కంట తడి!



మూడు నెలల కష్టం.. విత్తు నాటి పండు పండే దాకా చిన్న రోగం కూడా రాకుండా కాపు కాస్తే.. చేతికి వచ్చేది కిలోకు రెండు రూపాయలు. ఇదీ! టమాట రైతన్న పరిస్థితి. టమాట ధర ఒక్కసారిగా పాతాళానికి పడిపోవడంతో రైతులు కుదేలయ్యారు. లాభం అన్న మాట అటుంచి రవాణా చార్జీలు కూడా జేబులోంచి పెట్టుకోవాల్సిన దుస్థితి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మల రామారం, బీబీనగర్, తుర్కపల్లి, భువనగిరి మండలాల్లోని రైతులు భారీగా టమాట పంటను వేశారు. అయితే, 25కిలోల పెట్టెకు రూ.60 నుంచి రూ.80 మాత్రమే దక్కుతుండడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, యాదాద్రి

కరెంట్ ఘనత మీదైతే ఎందుకివ్వలేదు?

జడ్చర్ల, జనవరి 3: వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఘనత తమదేనని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు అప్పట్లో ఎందుకు ఇవ్వలేదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మార్కెట్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అప్పట్లో విద్యుత్ సమృద్ధిగా లేదని ఒప్పుకోవాలని, లేకుంటే కాంగ్రెస్ నేతల చేతకానితనమేనని అంగీకరించాలన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతలను 95 శాతం పూర్తిచేశామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు మిగిలిన 5 శాతం పూర్తిచేయలేని దద్దమ్మలని విమర్శించారు.

'ఫ్లోరైడ్' బతుకులు మారలేదు

- మర్రిగూడ మండలాన్ని సందర్శించిన ఎన్ఆర్ఐ బృందం



ఫ్లోరైడ్ బాధితుడితో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐలు

మర్రిగూడ, జనవరి 3: రాష్ట్ర ప్రభుత్వం ఫ్లోరైడ్ బాధితుల కోసం రూ.వెయ్యి కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎన్ఆర్ఐ బృందం కోరింది. ప్రవాస భారతీయులు జలగం సుధీర్, ఏపీలోని చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తికి చెందిన మద్దాలి కిరణ్‌కుమార్, దేవ రమేష్ బుధవారం ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతమైన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడ, వట్టిపల్లి గ్రామాల్లో ఫ్లోరైడ్ బాధితులను కలిసి, వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ. 1000కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్, రూ. 100కోట్లతో ప్రత్యేక ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లయితే తెలంగాణ అభివృద్ధి ఫెడరేషన్ అమెరికా, తెలంగాణ అసోసియేషన్, ప్రవాస భారతీయ అసోసియేషన్ ద్వారా నిధులు వచ్చే విధంగా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ఫ్లోరైడ్ బాధితులు ఆర్థికంగా ఎదగడానికి పోషక పదార్థాలు రావడం లేదని, వైద్య సేవలు కూడ అందడం లేదని తాము గుర్తించామన్నారు. వీటన్నింటిని సీఎం కేసీఆర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫ్లోరైడ్ బాధితులు ఎన్ఆర్ఐ బృందాన్ని చూసి కంటతడి పెట్టారు. ప్రభుత్వం తమకు ఇస్తున్న రూ.1500 పింఛన్ చాలడం లేదని వాపోయారు. మండలానికి కృష్ణానీరు సరఫరా అవుతున్నప్పటికీ.. సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతుండటంతో ఫ్లోరైడ్ నీటినే తాగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన చెందారు.

నీటి బకెట్లో పడి చిన్నారి మృతి



యశ్వంత్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, జనవరి 3: నీటి బకెట్లో పడి 14 నెలల బాలుడు మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం మల్కారం గ్రామంలో బుధవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన కారుకొండ శ్రీకాంత్, లత దంపతుల పెద్ద కుమారుడు భాను(4), చిన్న కుమారుడు యశ్వంత్ ఇంటి ముందు ఆడుకుంటున్నారు. అయితే ప్రమాదవశాత్తు బాతురూం వద్ద ఉన్న నీటి బకెట్లో యశ్వంత్ పడి, ఊపిరాడక మృతి చెందాడు.

పాఠశాలపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

రెంజల్, జనవరి 3: నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల భవనం పైనుంచి దూకి ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన శ్వేత అనే విద్యార్థిని బడిలో 7వ తరగతి చదువుతోంది. బుధవారం పదకొండు గంటల విరామ సమయంలో భవనం పైకి ఎక్కిన శ్వేత కిందకు దూకే ప్రయత్నం చేస్తుండగా, తోటి విద్యార్థులు గమనించి, ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. వెంటనే బయటకు పరుగులు తీసిన ఉపాధ్యాయులు దూకకూడదంటూ చెబుతుండగానే.. విద్యార్థిని దూకేసింది. వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని అనారోగ్యంతో బాధపడుతూ ఈ అఘాయిత్యానికి పాల్పడిందని కొందరు ఉపాధ్యాయులు చెబుతుండగా.. ఆమెను ఇంటికి పంపకపోవడంతోనే ఇలా చేసిందని తోటి విద్యార్థినులు చెబుతున్నారు. కాగా, ఆత్మహత్యకు గల కారణాలు విద్యార్థినిని అడగ్గా.. ఎలాంటి సమాధానం చెప్పడం లేదు.

'పౌరసత్వం రద్దు ఉత్తర్వులను సస్పెండ్ చేయండి'

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. తన భారత పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్రం ఆగస్టులో జారీచేసిన ఉత్తర్వులను, దీనిపై పునర్విచారణ జరపాలంటూ తానిచ్చిన పిటిషన్‌పై ఇటీవల జారీ అయిన ఆదేశాలను కొట్టివేయాలని ఆయన తన వ్యాజ్యంలో కోరారు. హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా రివ్యూ పిటిషన్‌పై ఉత్తర్వులు జారీచేశారని, ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని తెలిపారు. తాను నిబంధనలకు విరుద్ధంగా పౌరసత్వం తీసుకున్నానంటూ తనపై పోటీ చేసి ఓడిపోయిన ఆది శ్రీనివాస్ నిరాధారంగా, రాజకీయ కక్షతో తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు.

రూ.70 లక్షల పోస్టల్ డిపాజిట్లు స్వాహా

డిండి, జనవరి 3: ప్రజల నుంచి సేకరించిన పోస్టల్ ఆర్డీలు రూ.70 లక్షలను ఓ ఏజెంటు స్వాహా చేశాడు. నల్లగొండ జిల్లా డిండి ఉప తపాల కార్యాలయంలో ఈ ఘటన బుధవారం వెలుగుచూసింది. పోస్టల్‌లో నెలసరి పొదుపు పథకాలు లాభసాటిగా ఉంటాయని ఏజెంట్ జూలూరి నరేందర్ పలువురికి ఆశచూపి, వారి నుంచి సేకరించిన డబ్బును కొన్ని నెలలు పోస్టాఫీస్‌లో జమచేశాడు. తరువాత నెలసరి వాయిదాల సొమ్మును సొంత అవసరాలకు వాడుకున్నాడు. పాస్‌బుకుల్లో వివరాలు నమోదు చేసి పోస్టల్ అధికారుల ప్రమేయం లేకుండానే కార్యాలయ ముద్రలు వేసి ఆ పుస్తకాలను తనవద్దే ఉంచుకున్నాడు. ఎవరైనా పాస్‌బుక్ కోసం ఒత్తిడి చేస్తే వాటిని ఇచ్చి, నేరుగా తపాల కార్యాలయంలో నగదు చెల్లిస్తే తన కమీషన్ రాదని నమ్మించి తానే నగదు వసూలు చేశాడు. 15 ఏళ్లుగా అతడు ఏజెంట్‌గా పనిచేస్తుండడంతో ఎవరికీ అనుమానం రాలేదు. ఓ ఖాతాదారుడు ఆర్డీ మెచ్యూరిటీ సమయం పూర్తికాగా ఉప తపాల కార్యాలయానికి వెళ్లాడు. అయితే అతడు పొదుపు చేసిన డబ్బు రెండున్నర లక్షలకు గానూ, రూ.40 వేలు చూపడంతో నిర్ఘాంతపోయాడు. విషయం వెలుగుచూడగా పలువురు ఖాతాదారులు కార్యాలయానికి వెళ్లి పరిశీలించగా పాస్‌బుక్‌లో ఉన్న మొత్తానికి, ఆన్‌లైన్‌లో ఉన్న మొత్తానికి తేడా ఉండటంతో సబ్‌పోస్ట్ మాస్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇలా మొత్తం రూ.70 లక్షల వరకు సదరు ఏజెంట్ స్వాహా చేసినట్టు సమాచారం. దీనిపై సబ్‌పోస్ట్ మాస్టర్ నర్సింహ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శాంతి సూచికలు

ప్రతి ఏటా క్షిపణిపరీక్షతో కొత్త సంవత్సరాన్ని స్వాగతించే ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్ ఉన్ ఈ మారు అందుకు భిన్నమైన వైఖరి చూపడం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తున్నది. జనవరి ఒకటిన ఆయన ప్రసంగంతో పాటు ధరించిన దుస్తులు కూడా భిన్నంగా ఉన్నందున కిమ్‌లో కొందరికి సమూలమైన మార్పు కనిపించింది. నన్ను చూసి వొణికిపోతున్నాడు, నెమ్మదిగా దిగివస్తున్నాడు అని అమెరికా డాంబికాలకు పోతున్నప్పటికీ, అమెరికా ఆయనను ఎంత లొంగదీసుకోగలిగిందో అందరికీ తెలిసిందే. ఉభయకొరియాల విలీనం దిశగా కిమ్ పావులు కదుపుతున్నాడని కొందరి అనుమానం. ఈ ఊహాగానాలన్నింటికీ కారణం ఆయన హఠాత్తుగా దక్షిణకొరియా విషయంలో సానుకూలంగా మాట్లాడటం. కిమ్ చూపిన చొరవను అందిపుచ్చుకొని దక్షిణకొరియా కూడా చర్చలకు సిద్ధపడటంతో ఈనెల 9వతేదీన ఉభయదేశాల సరిహద్దుల్లోని పన్‌ముంజామ్‌లో ఇరుదేశాలూ చర్చలు జరపబోతున్నాయి. ఈ చర్చల పరిధి స్వల్పమే కావచ్చును కానీ, ఏడాది కాలంగా ఉద్రిక్తతలు గడ్డకట్టుకుపోయి ఉన్న తరుణంలో రెండు దేశాలూ ఇలా ముందుకు రావడం విశేషం.

దక్షిణకొరియాకు స్నేహహస్తం అందిస్తూనే, కిమ్ తన ప్రసంగంలో యధావిధిగా అమెరికాను ఏకేశారు. తన టేబుల్ మీద ఉన్న న్యూక్లియర్ బటన్ నొక్కితే అమెరికా సర్వనాశనమైపోతుందని ఆయన చేసిన హెచ్చరికకు ప్రతిగా ట్రంప్ కూడా తన టేబుల్‌మీద మరింత పెద్ద బటన్ ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. పైగా తన దగ్గర ఉన్న బటన్ చక్కగా పనిచేస్తుందని కూడా ఎగతాళి చేశారు. ఇటువంటి పనికిరాని ప్రగల్భాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చే మీడియా ఈ బటన్ బాగోతాలమీద కూడా పుంఖానుపుంఖానులుగా కథనాలు రాస్తున్నది. కిమ్ అన్నట్టుగా ఆయన బటన్ నొక్కితే అణ్వాయుధాలు అడ్డూ ఆపూ లేకుండా దూసుకొస్తాయి కానీ, అమెరికా అధ్యక్షుడికి బటన్‌కు మాత్రం బోలెడు అడ్డంకులు ఉన్నాయంటూ అక్కడి మీడియా విశ్లేషిస్తున్నది. అణ్వాయుధ ప్రయోగానికి నిర్ణయించుకున్న పక్షంలో అమెరికా అధ్యక్షుడు పెంటగాన్‌కు వచ్చి కోడ్స్ అందించడం నుంచి, పాటించవలసిన పలు నియమాల వరకూ ఈ కథనాలు ఏకరువుపెడుతున్నాయి. కిమ్ ఏదో నోరుపారేసుకుంటే, అతడినీ, ఆ మాటలనూ బేఖాతరు చేయవలసిన అమెరికా అధ్యక్షుడు కూడా అంతకంటే దిగజారుడు వ్యాఖ్యలు చేయడమేమిటని కొందరు అమెరికన్ల బాధ. ఈ విషయంలో ట్రంప్, కిమ్‌ల మధ్య తేడా ఎప్పుడూ లేదు కానీ, ఇప్పుడు కిమ్ ఒక్కసారిగా దక్షిణకొరియా విషయంలో మంచిమాటలు మాట్లాడటమే ఆశ్చర్యం కలిగిస్తున్నది. కొరియా ద్వీపకల్పంలో ఏర్పడిన ఉద్రిక్తతలను చల్లార్చడానికి రెండు దేశాలూ కృషిచేయాలనీ, సమస్యల పరిష్కారానికి ఉభయదేశాల అధికారులు సాధ్యమైనంత వేగంగా సమావేశం ఏర్పాటు చేసుకోవాలని కిమ్ అన్నారు. ఫిబ్రవరిలో దక్షిణకొరియా తూర్పు రాష్ట్రమైన ప్యాంగ్‌చాంగ్‌లో జరిగే శీతాకాల ఒలింపిక్స్‌లో ఉత్తరకొరియా పాల్గొని దానిని విజయవంతం చేస్తుందని కిమ్ అనడంతో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఎక్కడ, ఎప్పుడు జరిపినా ఎటువంటి ముందస్తు డిమాండ్లూ లేకుండా చర్చలకు సిద్ధమని దక్షిణకొరియా చెప్పడంతో సమావేశం ఖరారైపోయింది. ఈ చర్చలు కనుక జరిగితే, రెండేళ్ళ తరువాత ఒక ఉన్నతస్థాయి సమావేశం రెండు దేశాల మధ్యా జరిగినట్టు. రెండు దేశాల మధ్యా 2016 ఫిబ్రవరిలో మూతబడిన హాట్‌లైన్‌లు బుధవారం తెరుచుకొని పరస్పరం సంభాషించుకోవడంతో క్షేత్రస్థాయిలో కదలిక కూడా ఆరంభమైంది.

ఉభయ కొరియాల చర్చల ప్రతిపాదనను చైనా స్వాగతించింది. అమెరికా వీటిని తేలికగా తీసిపారేయడం సహజమే. ఈ చర్చల కారణంగా ఉత్తరకొరియా విషయంలో తమ వైఖరిలో మార్పేమీ రాదనీ, కిమ్ తన దగ్గరున్న అణ్వాయుధాలను తుడిచిపెట్టేస్తే కానీ తాను దిగిరానని అమెరికా ప్రకటించింది. ఉత్తరకొరియా మరో క్షిపణి పరీక్షకు సిద్ధపడుతున్నదనీ, అదే కనుక జరిగితే దానిని వొదిలిపెట్టేది లేదంటూ ఐక్యరాజ్యసమితిలో అమెరికా ప్రతినిధి నిక్‌హాలీ ఇదే సందర్భంలో చేసిన వ్యాఖ్యలు నిఘా సమాచారంతో చేసినవో, చల్లారిన కిమ్‌ను రెచ్చగొట్టడానికి ఉద్దేశించినవో తెలియదు. దక్షిణకొరియాను తనకు దూరం చేసే కిమ్ కొత్త వ్యూహం అమెరికాకు సహజంగానే రుచించదు. కిమ్ ఇలా ఓ మంచిమాట అనగానే, దక్షిణకొరియా అధ్యక్షుడు ముందడుగువేయడమూ దానికి నచ్చలేదు. మూన్ జే ఇన్ అమెరికాతో సత్సంబంధాలు కొనసాగిస్తూనే కాస్తంత స్వతంత్ర వైఖరి ప్రదర్శిస్తున్నారు. ట్రంప్ కయ్యానికి కాలుదువ్వే నిర్ణయాలు చేసినప్పుడల్లా ఆయన తన అసమ్మతిని ప్రకటిస్తున్నారు. కిమ్‌ను రెచ్చగొట్టడం వల్ల అమెరికాకు పోయేదేమీ లేదనీ, తానూ జపాన్ మాత్రమే దెబ్బతింటామని ఆయన వాదన. ఉత్తరకొరియాతో సంబంధాల విషయంలో సానుకూలత ప్రదర్శిస్తున్న ఆయన గత పాలకుడి మాదిరిగా తాను ఎవరిచేతిలోనో కీలుబొమ్మను కాబోనని కూడా అంటూంటారు. పక్షం రోజులు క్రితమే చైనాలో నాలుగురోజులు పర్యటించివచ్చిన మూన్ ఇప్పటికప్పుడు అమెరికాను దూరంపెట్టగలిగే స్థితిలో లేకపోవచ్చు గానీ, ఉభయ కొరియాల మధ్య శాంతికి అవకాశం ఇచ్చే ఈ సందర్భాన్ని మాత్రం చేజార్చుకోవద్దని అనుకుంటున్నారు. తమ ఆటగాళ్ళకు భద్రత ఉండదన్న పేరిట శీతాకాల ఒలింపిక్స్ నుంచి అమెరికా తప్పుకోవాలని చూస్తున్న తరుణంలో కిమ్ చూపిన చొరవ రెండు దేశాల మధ్య సయోధ్యకు కాస్తంత అవకాశం ఇస్తున్నది. అమెరికా అనుమానిస్తున్నట్టుగా కిమ్ శాంతి సందేశంలో దుష్టతలంపులు, ఎత్తుగడలు, ప్రమాదకరమైన పన్నాగాలు ఉండవచ్చునేమో కానీ, దానివల్ల దక్షిణకొరియా తక్షణమే నష్టపోయేది ఏమీ ఉండదు.

జనవాక్యం

రజనీకాంత్ రాణిస్తారా?

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశంపై రెండు దశాబ్దాలుగా నెలకొనివున్న సందిగ్ధతకు ఎట్టకేలకు తెరపడింది. తమిళనాడులో రజనీకాంత్‌కు కోట్లాది అభిమానులున్నారు. అయితే అవినీతి, కుట్రలు, కుతంత్రాలు అధికంగాగల తమిళ రాజకీయాలలో రజనీ నిలదొక్కుకోగలరా? హీరోగా రజనీని అభిమానించే వాళ్లు ఆయనపై రాజకీయ నాయకునిగా అంత అభిమానం చూపుతారా? అన్నది అత్యంత కీలకం. మన తెలుగునాట మెగాస్టార్ రాజకీయ పార్టీ పెట్టి రాణించలేక పోయారు. రజనీ అలా వైఫల్యం చెందకుండా రాజకీయాలలో రాణించి ప్రజలకు మేలు చేస్తారని ఆశిద్దాం.

– కామిడి సతీష్‌రెడ్డి, పరకాల

అంధుల వెలుగు బ్రెయిలీ

ఫ్రెంచ్ విద్యావేత్త, ప్రపంచ అంధులకు చూపును, జ్ఞానాన్నీ ఇచ్చిన చిరస్మరణీయుడు లూయీ బ్రెయిలీ. 1809లో జన్మించిన బ్రెయిలీ బాల్యంలో ప్రమాదవశాత్తూ రెండు కళ్లను కోల్పోయి 4వ ఏట పూర్తిగా అంధుడయ్యాడు. అయినా అధైర్యపడలేదు. అప్పటికి అందుబాటులో ఉన్న 'లైన్ టైపు' పద్ధతిలో చదువుకుని 17 సంవత్సరాల వయస్సులోనే అదే స్కూలో అధ్యాపకుడయ్యాడు. పగలు విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ, రాత్రివేళ విద్యార్థులు సులభంగా చదవగలిగే లిపిని తయారుచేసేందుకు కృషిచేశాడు. ఈ నిరంతర శ్రమవల్ల క్షయ వ్యాధికి గురై 1851లో మరణించాడు. ఆయన మరణానంతరం ఆయన శిష్యుల ప్రభుత్వంతో పోరాడి బ్రెయిలీ లిపికి తగిన గుర్తింపు సాధించారు. చివరికి బ్రెయిలీ లిపికి అధికార గుర్తింపునిచ్చి ఆయన్ను తమ దేశపు ముద్దుబిడ్డగా ఫ్రాన్స్ కొనియాడింది.

(నేడు లూయీ బ్రెయిలీ జయంతి)

– సతీష్‌కుమార్, సంస్థాన్ నారాయణపురం

ఇదేం ప్రతిస్పందన?

తక్షణ తలాక్‌ని నిషేధిస్తూ కేంద్రం తెచ్చిన చట్టంపై ప్రధాన రాజకీయ పక్షాలతోసహా ఇతర ప్రాంతీయ పార్టీల ప్రతిస్పందన వారి నిజ నైజాన్ని ప్రతిబింబించింది. ఇన్నేళ్లుగా లౌకికవాదం ముసుగులో అనుసరించింది మైనారిటీ సంతుష్టీకరణవాదమనీ, ఓటు బ్యాంకు రాజకీయాలనీ స్పష్టమైంది. మహిళాసంఘాలు కూడా అందుకు మినహాయింపుకాదు. భారతీయ కుటుంబ వ్యవస్థని వ్యక్తి స్వేచ్ఛ ముసుగులో ఛిన్నాభిన్నం చేస్తున్న ఈ సంఘాలకు, రాజకీయ పక్షాలకు ముస్లిం సోదరీమణుల వ్యక్తిస్వేచ్ఛ, వారికి జరుగుతున్న తీరని అన్యాయమూ పట్టలేదు. ఇన్నాళ్ళూ రిజర్వేషన్లు, లౌకికవాదాల కోసమే రాజ్యాంగాన్ని ఎంతో గౌరవించిన ఈ కుహనా లౌకికవాదులకు, అదే రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు కనబడలేదా?

– వీరుభొట్ల పేరయ్య శాస్త్రి, విజయవాడ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్:
editpage@andhrajyothy.com

నిరుద్యోగులతో చెలగాటమా?

ఉద్యోగాలివ్వండి మహాప్రభో అంటూ గొంతెత్తి మొత్తుకుంటున్న విద్యార్థులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా నిర్బంధాలకు గురిచేస్తూ అణచివేతలకు పూనుకుంటున్నది. ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఊదరగొట్టిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తిగా విస్మరించి రాజకీయ కార్యకలాపాల్లో మునిగి తేలుతున్నారు.



నిధులు, నీళ్లు, నియామకాల కోసం మొదలైన తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడటానికి నాటి నిరుద్యోగ యువత, విద్యార్థి లోకమే కారణం. తెలంగాణ వస్తే చాలు తమకు ఉద్యోగాలు లభిస్తాయని ఆశించి నాడు ఉద్యమంలో పాల్గొన్న యువకుల ఆశలపై ప్రభుత్వం నీళ్ల చల్లింది. రాష్ట్రం ఏర్పాటై నాలుగేళ్లు కావొస్తున్నా ఉద్యోగ నియామకాల్లో ప్రభుత్వం నాలుగడుగులు కూడా వేయలేకపోయింది.

మలిదశ తెలంగాణ ఉద్యమం కీలక దశకు చేరుకోవడానికి ముందు కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వేలాది పోస్టుల భర్తీకి ప్రకటనలు జారీ చేసేందుకు సన్నద్ధమయ్యారు. అయితే 'మా పోస్టులు మేమే నింపుకుంటాం' అంటూ విడుదలకు సిద్ధంగా ఉన్న నోటిఫికేషన్లను నిలిపివేయించిన కేసీఆర్– అప్పుడు ఉద్యోగాలు భర్తీ చేయకుండా అడ్డుకోవడమే కాక, ఇప్పటికీ ఆ పోస్టులను మాత్రం నింపలేకపోయారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు సైతం నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. దౌర్భాగ్యం ఏమిటంటే– సొంత రాష్ట్రంలో కనీసం ఆ మోతాదులో కూడా ఉద్యోగ ప్రకటనలు విడుదల కాకపోవడం. ఉద్యమ సమయంలో లక్షల ఖాళీలను భర్తీ చేస్తామన్న కేసీఆర్ రాష్ట్రం ఏర్పడి నాలుగేళ్లు కావస్తున్నా, ఇప్పటి వరకు దాదాపు 20 వేల పోస్టులను మాత్రమే భర్తీ చేసినట్లు స్వయంగా టీఎస్పీఎస్సీ చైర్మనే ప్రకటించడాన్ని బట్టి చూస్తే నిరుద్యోగులకు ఎంత అన్యాయం జరుగుతుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న ఖాళీలు, ఆ తర్వాత పెరిగిన ఖాళీలు వెరసి దాదాపు 3 లక్షలకు పైనే అని అధికారుల అంచనా. అదే సమయంలో పది జిల్లాలుగా ఉన్న తెలంగాణ కాస్తా 31 జిల్లాలుగా విభజన కావడంతో అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ ఖాళీలు ఏర్పడ్డాయి. ఉన్న ఉద్యోగుల్ని కొత్త జిల్లాలకు పంపించిన తరుణంలో కొత్త, పాత రెండు జిల్లాల్లోనూ భారీ ఎత్తున ఉద్యోగులు కావాల్సి ఉంది. కొత్త జిల్లాల్లోని ఖాళీలను కలుపుకొంటే ఆ సంఖ్య మొత్తం దాదాపు మూడు లక్షలకు పైగానే ఉంటుందని ఉద్యోగ సంఘాలే స్పష్టం చేస్తున్నాయి. వీటన్నింటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులు ఏంటో అర్థం కావడం లేదు. కేవలం స్వార్థ రాజకీయాల కోసం కాలయాపన చేస్తున్నారన్న విమర్శలకు ఈప్రభుత్వ పాలకులు ఏం సమాధానం చెబుతారు?

మరోవైపు దాదాపు 200 ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. దీంతో అనేక మంది ఉన్నత విద్యావంతులు నిరుద్యోగులుగా మారారు. దీనికి తోడు ఇంజినీరింగ్ విద్యా సంస్థల్లో ప్రతి 15 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉండాలన్న నిబంధనను మార్చిన ఏఐసీటీఈ తాజాగా దాన్ని 20 మందికి సడలించింది. ఫలితంగా ఇంజినీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్న చాలామంది అధ్యాపకులు ఇంటిదారి పట్టక తప్పని పరిస్థితి తలెత్తింది. ఈ క్రమంలో, వచ్చే విద్యాసంవత్సరం నుంచి మరికొందరు ఉద్యోగాలు కోల్పోయి నిరుద్యోగులుగా మారి దుర్భర స్థితిలోకి వెళ్లే ప్రమాదం పొంచి ఉంది. అంటే ఒక ఇంజినీరింగ్ కాలేజీలో 240 మంది విద్యార్థులుంటే ప్రస్తుతం 16 మంది అధ్యాపకులు కావాలి. కానీ సడలించిన నిబంధన ప్రకారం, వచ్చే విద్యాసంవత్సరం నుంచి కేవలం 12 మంది సరిపోతారు. ఈ లెక్కన తెలంగాణలో దాదాపు 15000 మంది అధ్యాపకులు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో తెలంగాణలో ఇప్పటికే ఉన్న నిరుద్యోగ సమస్య మరింత జటిలం అయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఐదారేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదన్న ప్రశ్న తలెత్తుతున్నా.. పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఒక ఎమ్మెల్యే పదవి ఖాళీ అయితే కేవలం ఆరు నెలల్లో మళ్లీ ఎన్నికలు నిర్వహించి మరో ఎమ్మెల్యేను ఎన్నుకుంటారు. అలాంటిది రాష్ట్రంలో ఏళ్లకేళ్లుగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయరన్న ప్రశ్న నిరుద్యోగుల్లో పెల్లుబికుతున్నది. ప్రజల చేత ఎన్నుకోబడ్డ పాలకులకు ఒక నిబంధన, పౌరులకు మరో నిబంధనా? అంటూ నిరుద్యోగులు తీవ్ర నిరసన వెలిబుచ్చుతున్నారు.

చాలామంది తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఉన్నత భవిష్యత్‌ను అందించాలన్న తాపత్రయంతో అప్పులు చేసి మరీ పిల్లల్ని చదివిస్తున్నారు. డిగ్రీ, పీజీ పూర్తవగానే వేలకు వేల రూపాయలు వెచ్చించి కోచింగ్ సెంటర్లకు పంపిస్తున్నారు. ఈ రోజు కాకపోతే రేపైనా ఏదో ఒక నోటిఫికేషన్ రాకపోతుందా, ఉద్యోగం లభించకపోతుందా... అన్న ఆశతో లక్షల మంది నిరుద్యోగులు తమ విలువైన సమయాన్ని లైబ్రరీలు, కోచింగ్ సెంటర్లలో గడిపేస్తున్నారు. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ సర్కార్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న యువత ఎంతో సంయమనంతో పుస్తకాలతో కుస్తీ పడుతూ పోటీ పరీక్షల కోసం ప్రిపరేషన్‌ను కొనసాగిస్తున్నారు. బహుశా ఇలా మూడున్నర, నాలుగేళ్ల పాటు ఏ ఉద్యోగానికి ఎవరూ ప్రిపేర్ కారేమో! ఇంత వ్యయ ప్రయాసలకోర్చినా చివరికి అటు ఉద్యోగ ప్రకటనలు వెలువడక ఇటు ఏజ్ బార్ అవుతుండటంతో చాలామంది యువకులు, నిరుద్యోగులు దిక్కుతోచనిస్థితిలో మౌనంగా రోదిస్తున్నారు. ఉద్యోగాలివ్వండి మహాప్రభో అంటూ గొంతెత్తి మొత్తుకుంటున్న విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా నిర్బంధాలకు గురిచేస్తూ అణచివేతలకు పూనుకుంటున్నది. ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఊదరగొట్టిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తిగా విస్మరించి రాజకీయ కార్యకలాపాల్లో మునిగితేలుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎలాగూ ఉద్యోగాలు కల్పించడం లేదు. కనీసం కేంద్ర ప్రభుత్వ రంగంలోగల ఉద్యోగాలపై అయినా నిరుద్యోగులకు అవగాహన కల్పిస్తుందా అంటే.. అదీ లేదు. కేంద్ర ప్రభుత్వ రంగంలో ప్రతి ఏటా లక్షకు పైగా ఉద్యోగాలు భర్తీ అవుతుంటాయి. ఒక్క స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ద్వారానే వివిధ విభాగాల్లో దాదాపు 50 వేల ఉద్యోగాల వరకు భర్తీ అవుతాయి. ఇందులో కనీసం ఐదు శాతం ఉద్యోగాలు కూడా తెలంగాణ యువతకు దక్కడం లేదు. అవగాహనా రాహిత్యం, అపోహల కారణంగా ఇక్కడి నిరుద్యోగులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలపై దృష్టి సారించడం లేదు. 2014–15 లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా 57 వేల 542మంది ఎంపికైతే అందులో తెలంగాణ నుంచి ఉద్యోగాలు పొందినవారు కేవలం వెయ్యిలోపేనని ఒక అంచనా.

పేదలు, దళితులు, బడుగులు, మహిళలు ఉద్యోగార్థులుగానే ఉండకూడదన్న లక్ష్యంతో వారంతా ఉద్యోగాలిచ్చే స్థితికి చేరాలన్న ఉద్దేశంతో మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ముద్ర యోజన, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా లాంటి పథకాలు ప్రవేశపెట్టి ఆర్థిక చేయూతనిస్తుంది. వాటి ఫలితాలు తెలంగాణలోనే కాదు, దేశమంతా కనిపిస్తున్నాయి. ముద్రా కింద సుమారు 8కోట్ల 50లక్షల మందికి రుణాలు మంజూరు చేశారు. దాదాపు 3.5 లక్షల కోట్లు రుణ వితరణ చేశారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకే 67 శాతం రుణాలు లభించాయి. దీంతో చాలామందికి ఉపాధి లభించి ఆర్థికంగా ఎదుగుతున్నారు. దేశంలో పరిస్థితి ఇలా ఉంటే, మన రాష్ట్రంలో మాత్రం బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు మార్జిన్‌మనీ ఇవ్వలేని దుస్థితి ఉంది. బ్యాంకులు మంజూరు చేసినా, ప్రభుత్వ వాటా మాత్రం నెలల తరబడి కాళ్లరిగేలా తిరిగినా అందని దుస్థితి. ఎంబీసీలకు రూ.1000 కోట్లు అన్నారు. కానీ ఇంతవరకు చిల్లి గవ్వా ఇవ్వలేదు. అనేక మంది డిగ్రీలు, పీజీలు పూర్తి చేసుకుని రుణాల కోసం ఎదురు చూస్తున్నారు.

ఇప్పటికైనా జాగురూకతతో వ్యవహరించి రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్య తీవ్రతను గుర్తించాలి. ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు వెంటనే భారీ ఎత్తున ఉద్యోగ ప్రకటనలు విడుదల చేయాలి. స్వార్థ ప్రయోజనాలను పక్కన పెట్టి, రాష్ట్రంలో తీవ్రంగా ఉన్న నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వం తక్షణ కార్యాచరణకు శ్రీకారం చుట్టాలి. ఉద్యోగ ఖాళీల సమాచారాన్ని సేకరించి ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయాలి. ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయడంతోపాటు రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో బంధుప్రీతి, అవినీతి, ఆశ్రిత పక్షపాతానికి తావు లేకుండా కేవలం ప్రతిభా పాటవాలకే పట్టం కట్టేలా వ్యవహరించాలి. నిరుద్యోగ సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సమస్య పరిష్కారానికి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలి. పకడ్బందీ ప్రణాళిక రూపొందించి అమలుకు కార్యోన్ముఖులు కావాలి. లేకపోతే, జడలు విప్పిన నిరుద్యోగ సమస్యతో యావత్ యువత పెడదారి పట్టే ప్రమాదం ఉంది.

■ డాక్టర్ కె లక్ష్మణ్
బిజెపి రాష్ట్ర అధ్యక్షులు

సుజాతపై ఎందుకింత ఆగ్రహం?

కరీంనగర్ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.సూరేపల్లి సుజాతపై అఖిల భారత విద్యార్థి పరిషత్, దాని సహచర సంస్థలు 'డిసెంబర్ 25 మనుస్మృతి దహన దినం' సందర్భంగా ఆమె భారత మాత చిత్రపటాన్ని తగులపెట్టటానికి కుట్రపన్నారని ఫిర్యాదు చేశాయి. మనుస్మృతి దహనం, బాబా సాహెబ్ అంబేడ్కర్ భారత దేశంలో కుల, పితృస్వామ్య సంస్కృతిని పోగొట్టి ప్రజాస్వామ్య సంస్కృతిని ప్రవేశపెట్టే ప్రయత్నంలో భాగంగా 1927లో చేపట్టిన నిరసన పద్ధతి. ప్రజాస్వామ్యమంటే ఎన్నికలు మాత్రమే కాదని, రోజువారీ జీవితంలో సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ వున్నప్పుడే ఒక దేశంలో ప్రజాస్వామ్యం మనగలుగుతుందనీ ఆయన బలంగా నమ్మారు. డిసెంబరు 25న అనేక రకాల సంఘాలు, సంస్థలు తాము కుల పీడనని, మహిళల అణచివేతని వ్యతిరేకిస్తున్నామని చెపుతూ మనుస్మృతి ప్రతులను ఎప్పటినుండో బహిరంగంగా దహనం చేస్తూ వస్తున్నాయి. కెమెరాల ముందు జరిగే కార్యక్రమం కనుక, చేసేదే ప్రచారం కోసం కనుక పైకి ఒకటి చెప్పి, లోపల మరోది చేసే అవసరం నిరసనకారులకు ఉండదు.

ఫిర్యాదు చేసిన సంస్థల సభ్యులు తమకి ఈ కార్యక్రమం పట్ల అభ్యంతరం లేదంటూనే, కొన్ని అభ్యంతరాలను వివిధ రకాలుగా వ్యక్తంచేస్తున్నారు. క్లుప్తంగా వారి వాదన ఇది: భారత రాజ్యాంగం అందరినీ సమానులని ప్రకటించి రిపబ్లిక్‌గా అవతరించి 70 సంవత్సరాలు గడిచింది. గనుక 1500 ఏళ్ల క్రితం కులవ్యవస్థని సమర్థించే మనుస్మృతిని దహనం చెయ్యటం వల్ల సమాజంలో ప్రజల మధ్య కుల విభజనలని ప్రోత్సహిస్తున్నారన్నది ఫిర్యాదుదారుల అభియోగం. అయితే, కులం ఇలాంటి కార్యక్రమాల వల్లే బయటికొస్తుందని అనటం అసంబద్ధం. రాజ్యాంగ ప్రకటన మనం మనకి చేసుకున్న వాగ్దానం మాత్రమే. అదింకా వాస్తవ పరిస్థితులని క్షుణ్ణంగా మార్చలేదు. అసమానతలను నిర్మూలిస్తానన్న రాజ్యాంగ హామీని అమలు పరచాల్సిన పాలనా వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ ఆ స్ఫూర్తితో ఎంతమేరకు పని చేస్తున్నాయి? అవి సరిగా పనిచేస్తుంటే, ఇన్ని రకాల హింసాత్మక ఘటనలు ఎందుకు జరుగుతాయి? గత సంవత్సరం జరిగిన మంథని మధుకర్ హత్య కావచ్చు, అభంగపట్నంలో అగ్ర కుల నాయకుడు దళిత యువకులపై చేసిన హింస కావచ్చు– జరిగుండేవి కావుకదా? అగ్ర కుల సమాజం తమ ఆధిపత్యాన్ని వదులుకోవడానికి ఇంకా సిద్ధపడలేదన్నందుకు నిదర్శనంగా ప్రతి రోజూ అనేక దృష్టాంతాలు ఎదురవుతూనే వున్నాయి. అత్యాధునిక అపార్టుమెంట్లలో ఇప్పటికీ పని మనుషుల పట్ల అంటరానితనాన్ని పాటిస్తూ అతి తక్కువ వేతనాలు ఇచ్చి పని చేయించుకుంటున్నారు. పెద్దస్థాయి ప్రొఫెసర్ ఎడల కూడా కుల దురహంకారాన్ని ప్రదర్శించే అగ్రకుల అటెండర్లు ఇప్పటికీ ఉన్నారు. రాజ్యాంగపరంగా ఇవ్వాల్సిన సీట్లు తప్ప, 'జనరల్' సీట్లలో దళిత అభ్యర్థులకు సీట్లు ఇవ్వని పార్టీలను మనం చూస్తున్నాం. 'ఈరోజుల్లో కులమెక్కడుందండీ' అనే పెద్దమనుషులు అనేక మంది తమ రోజువారీ జీవితాల్లో దాన్ని పాటించటంలో నిష్ణాతులు. గణాంకాలు చూసుకున్నా సరే, ఈ దేశంలో డెబ్బై ఏళ్ల రాజ్యాంగ అమలు తరువాత కూడా దళితులు, ఆదివాసీలు నిరక్షరాస్యులుగా, భూమిలేనివారుగా కొనసాగుతున్న నేపథ్యంలో అప్రకటిత కుల శాసనాన్ని కాదని ప్రకటిత రాజ్యాంగం ఇంకా పూర్తిగా అమలు కావట్లేదని ఒప్పుకోవాలి. ఈ రకమైన అప్రకటిత కుల శాసనాన్ని సమర్థించే మనుస్మృతి వంటి శాస్త్రాలని తగులపెట్టటం రాజ్యాంగాన్ని బలపరిచే చర్యే తప్ప అడ్డుకట్ట వేసే చర్య కాదు.

మొత్తం హిందువులందరి కోసం అజెండాని కొంత మంది మాత్రమే ఎలా నిర్ణయించగలరు? అంతర్గత సమానత్వం లేకుండా ఇన్ని కులాల హిందువులందరు ఒక్కటి ఎలా అవుతారు? రాజ్యాంగం ఇచ్చిన హక్కు క్రిందే వారి కుల సంఘాలతో సహా, అన్ని కుల సంఘాలూ పనిచేస్తాయి. 1980ల నుండి ఇటువంటి సమీకరణాల వల్లే ప్రభుత్వాలు అణగారిన కులాల్ని పట్టించుకుంటున్నాయన్నది వాస్తవం.

దళిత, బహుజన సమూహాలు తమంతట తామే కుల ప్రాతిపదికన సమీకృతమయితే, కులాన్ని బలపరిచినట్లేనన్నది మరోవాదన. హిందువులని కులమనే అస్తిత్వం విభజిస్తుందని, కాబట్టి దాన్ని గురించికాక హిందువనే అస్తిత్వం గురించే మాత్రమే మాట్లాడాలని వీరి మరో వాదన. మరయితే, వీరెందుకు ప్రత్యేకంగా ఎస్.సి సెల్, మైనారిటీ సెల్‌లు నిర్వహిస్తున్నారు? అసలు, మొత్తం హిందువులందరి కోసం అజెండాని కొంతమంది మాత్రమే ఎలా నిర్ణయించగలరు? అంతర్గత సమానత్వం లేకుండా ఇన్ని కులాల హిందువులందరు ఒక్కటి ఎలా అవుతారు? వారి కులసంఘాలతో సహా, రాజ్యాంగం ఇచ్చిన హక్కు క్రిందే అన్ని కుల సంఘాలూ పనిచేస్తాయి. 1980ల నుండి ఇటువంటి సమీకరణాల వల్లే ప్రభుత్వాలు అణగారిన కులాలను పట్టించుకుంటున్నాయన్నది వాస్తవం.

సూరేపల్లి సుజాత ఇటువంటి రాజకీయ, సామాజిక సమీకరణాలతో అనుబంధం వున్న సామాజిక శాస్త్రవేత్త. రెండు దశాబ్దాల నుండి ప్రజా క్షేత్రంలో పని చేస్తూ ఎదిగిన నాయకురాలు. ఏ పార్టీతో సంబంధం పెట్టుకోకుండా పాలకుల ప్రజా వ్యతిరేక చర్యల గురించి నిలదీస్తూ అనేక నిరసనల్లో, ఉద్యమాలలో పాలు పంచుకుంటున్న వ్యక్తి. విద్యార్థుల పట్ల నిబద్ధతతో, సుహృద్భావంతో వ్యవహరించే అధ్యాపకురాలు. స్థానికంగా, దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా పేరున్న ఒక దళిత మహిళా మేధావి. జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా పని చేసింది. ఏ ముందు చూపున్న ప్రభుత్వం అయినా, ఇటువంటి ప్రభావశీల మేధావిని రాష్ట్రానికి, దేశానికి ఒక విలువైన వనరుగా భావిస్తుంది.

ఆమెపై కరీంనగర్‌లో ఫిర్యాదులు చేసిన సంస్థలు తమ భావజాలం దృష్ట్యా తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలో జరుగుతున్న దళిత బహుజన సమీకరణలలో ఆమె పోషించిన పాత్రకి ఈ విధంగా స్పందించటం ఆశ్చర్యకరమేం కాదు. తమ పార్టీ మనుగడ తప్ప ప్రాంత, దేశ భవిష్యత్తు గురించి పెద్దగా సోయిలేని ఈ రాజకీయ కార్యకర్తలు ఇలా తమ తమ పార్టీలు, ప్రభుత్వాలకి లొంగని మేధావులని మాట్లాడనియ్యకుండా చేస్తే తమ స్థానం బలపడుతుందని భావిస్తున్నారు. మరి ఇటువంటి ఒక ప్రభావశీల దళిత మహిళా మేధావిపై జరుపుతున్న అబద్ధపు ప్రచారాన్ని తెలంగాణ ప్రభుత్వం, సమాజం చూస్తూ ఊరుకుంటుందా?

■ ఎ. సునీత

రంగనాయకమ్మ గురి ఎటువైపు?

'మళ్ళీ అదే ప్రశ్న! జవాబేదీ?' పేరుతో రంగనాయకమ్మ గారు ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం (30–12–2017) ఒక వ్యాసం రాసారు. అక్టోబర్ విప్లవం శతవార్షికోత్సవ సభల సందర్భంగా కమ్యూనిస్టు పార్టీలు నిర్వహించిన సభలపై విమర్శలు గుప్పిస్తూ సాగిన వ్యాసమిది. ముందు ఆమె లేవనెత్తిన ప్రశ్నలకు జవాబిచ్చి తరువాత ఆమె విమర్శలను పరిశీలిద్దాం.

1) సోవియట్ యూనియన్‌లో సోషలిజం ఎందుకు కుప్పకూలిపోయింది. దానికి కారణాలను ఎందుకు పరిశీలించలేదు? అన్నది ఆమె ప్రశ్న. సోవియట్ యూనియన్‌లో 1991లో సోషలిస్టు రాజ్యం కుప్పకూలిపోయింది. కమ్యూనిస్టు పార్టీని అధికారం నుంచి తొలగించారు. దీనికి ముందు నాలుగైదేళ్ల నుండి పెరిస్ట్రోయికా, గ్లాస్‌నాస్త్ల పేరుతో నాటి సోవియట్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోర్బచేవ్ నూతన విధానాలకు తెరలేపారు. ఆనాటి నుండి ప్రతి పరిణామాన్ని భారతదేశంలో సి.పి.ఐ(ఎం) విమర్శనాత్మక దృష్టితో పరిశీలించి, ఎప్పటికప్పుడు ప్రకటనలు చేస్తూవస్తున్నది. 1992లో మద్రాస్‌లో జరిగిన 14వ అఖిల భారత మహాసభలో సోషలిజం కూలిపోవడానికి గల కారణాలను పరిశీలించి ప్రత్యేకంగా ఒక సైద్ధాంతిక తీర్మానాన్ని ఆమోదించింది. సోషలిజం బలహీన పడ్డాక ప్రపంచీకరణ విజృంభించింది. ఈ మార్పులన్నింటిని దృష్టిలో పెట్టుకొని సి.పి.ఐ.(ఎం) తన కార్యక్రమంలోనూ, నిర్మాణ చట్రంలోనూ కొన్ని మార్పులు, చేర్పులు చేసుకొంది. విప్లవ వార్షికోత్సవ సందర్భంగా పీపుల్స్ డెమోక్రసీ వరుసగా పలు వ్యాసాలు ప్రచురిస్తూ వచ్చింది. వాటిని తెలుగులోనూ మార్క్సిస్టు మాసపత్రికలో వేస్తూ వచ్చారు. బహుశా వీటిని రంగనాయకమ్మ గమనించి ఉండరు.

ఆమె దృష్టిలో లెనిన్ చనిపోవడంతోటే సోషలిజం కూడా చనిపోయింది. స్టాలిన్ ఒక ఫాసిస్టు. అక్కడ పెట్టుబడిదారీ విధానమే అమలయ్యింది. ఇదే ఆమె అవగాహన. ఈ లెక్క ప్రకారం సోషలిజం పుట్టినప్పుడే చచ్చిపోయి ఉంటే ఈ రోజు ఇన్ని ప్రశ్నలు వేసుకొని జవాబులు చెప్పుకోవలసిన అవసరమే ఉండదు. అది కూడా మరొక ప్యారిస్ కమ్యూన్ అయి ఉండేది.

2) సోవియట్ యూనియన్‌లో వర్గాలు పోయాయని సి.పి.ఐ(ఎం) ఏనాడు చెప్పలేదు. ఆ మాట చెప్పింది కృశ్చేవ్. దానిని కమ్యూనిస్టులందరికి అంటగట్టి మాట్లాడటం న్యాయసమ్మతం కాదు. సోషలిజంలో కూడా వర్గాలుంటాయని, వేరే రూపంలో వర్గసంఘర్షణ కూడా కొనసాగుతుందని లెనిన్, స్టాలిన్ పదే పదే చెప్పేవారు. ఆ మాట అన్నందుకే స్టాలిన్ మీద ఇప్పుడు రంగనాయకమ్మ దాడి చేస్తున్నారు. విప్లవం ఎక్కడ?అంటున్నారు. చరిత్రలో విప్లవమే కాదు ప్రతీఘాత విప్లవాలూ జరిగాయి. ప్రతీఘాత విప్లవం గెలిస్తే దాన్ని ఎలా ఓడించాలని ఆలోచించాలి తప్ప, విప్లవాన్నే తెగనాడటం సరికాదు.



3) "పార్టీలో జనరల్ సెక్రటరీలు మరణించేంత వరకూ ఉండటం ఏమిటి? ఈ ప్రశ్నకు మన కమ్యూనిస్టులలో చోటు ఉండదు" అంటూ దుమ్మెత్తి పోశారు. భారతదేశంలో ఏ నాయకుడైనా చచ్చిపోయేంతవరకూ జనరల్ సెక్రటరీగా కుర్చీపట్టుకుని కూర్చున్నాడని చెప్పగలరా? అనేక అను భవాల తర్వాత సి.పి.ఐ(ఎం) తన నిబంధనావళిని మార్చుకొంది. జనరల్ సెక్రటరీ మొదలుకొని, స్థానిక కార్యదర్శి వరకు మూడు విడతలకు (తొమ్మిది సంవత్సరాలు) మించి కొనసాగరాదని కఠినమైన నిబంధనను విధించుకొంది. ఈ విషయం రంగనాయకమ్మగారికి తెలిసి ఉండదు.

4) కమ్యూనిస్టులు వ్యక్తి పూజను ప్రోత్సహిస్తున్నారని, ఆమె మరో ఆరోపణ చేశారు. స్టాలిన్, మావో కాలాలలో జరిగిన వ్యక్తి పూజతో సి.పి.ఐ(ఎం) స్పష్టంగా విడగొట్టుకొంది. అలాంటి చేదు అనుభవం పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకొంది. పార్టీలో ఏ ప్రకటనైనా పొలిట్‌బ్యూరో పేరుతో వస్తుంది తప్ప జనరల్ సెక్రటరీ పేరుతో రాదని ఆమె గమనించాలి. పార్టీలో వ్యక్తికన్నా, సమిష్టి నిర్ణయమే గొప్పని పలు మార్లు సి.పి.ఐ(ఎం) రుజువు చేసింది. దానికి అతి పెద్ద ఉదాహరణ పార్టీలో అతిపెద్ద నాయకుడిగా ఉన్న జ్యోతిబసు ప్రధాని పదవిని చేపట్టే అవకాశం వచ్చినా తిరస్కరించడమే.

రంగనాయకమ్మ గారు గొప్ప రచయిత. అంతకుమించి అభ్యుదయ భావాలుగలవారు. ఏదైనా కమ్యూనిస్టు పార్టీలో ఆమె సభ్యురాలేమో నాకు తెలియదు. సభ్యురాలైనా, కాకపోయినా తనను తాను కమ్యూనిస్టుగా భావించుకొని రచనలు చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. అందుకే ఈ వ్యాసం చదివినప్పుడు అలాంటి రంగనాయకమ్మ గారేనా ఇది రాసింది అనే అనుమానం కలుగుతుంది. ఈ వ్యాసంలో ఆమె ఉపయోగించిన భాష చాలా అభ్యంతరకరమైనది. విమర్శలు, సూచనలు, సలహాలను కమ్యూనిస్టులు ఆహ్వానిస్తారు. తిట్లు, శాపనార్థాలు కాదు.

ఈ వ్యాసం చివరలో ఆమె చెప్పినట్లుగా "నాయకులుగా కనపడే ప్రతి వ్యక్తిని ప్రేమించదగ్గవారిగా భావించటం కాదు. పరిశీలనలు ఉండాలి" ఇదే భావంతో ఆమెను కొన్ని ప్రశ్నలు అడగదలుచుకొన్నాను. అక్టోబర్ మహావిప్లవం వందవ వార్షికోత్సవం సందర్భంగా కమ్యూనిస్టులు సభలు జరుపుకోవడమే, కాదు. కమ్యూనిస్టులపై విషపు దాడి కూడా జరుగుతోంది. దానిని ఖండిస్తూ ఆమె ఎక్కడైనా ఒక వ్యాసం రాశారా? 1917 అక్టోబర్ విప్లవం విప్లవమే కాదని, అదొక కుట్రని కమ్యూనిస్టు వ్యతిరేకులు, కార్పొరేట్ మీడియా ప్రచారం చేస్తున్నారు. 1917 ఫిబ్రవరిలో వచ్చిన విప్లవమే ప్రజాస్వామిక విప్లవమని, లెనిన్ ఆ ప్రజాస్వామ్యాన్ని కూల్చేసి నియంతృత్వం తెచ్చారని వారంటున్నారు. దీంతో మీరు ఏకీభవిస్తారా? విభేదిస్తే దానిపై ఏమన్నా వ్యాసం రాశారా? దానికి బదులుగా కమ్యూనిస్టులపై దాడి చేసి ఏమి సాధించదలచుకున్నారు. ఒక వేళ కమ్యూనిస్టులు తప్పులు చేస్తున్నారనుకుంటే సరిదిద్దే పద్ధతి ఇది కాదు. వీళ్లు కమ్యూనిస్టులే కాదు అని మీరు చెప్పదలచుకుంటే నేటి ప్రపంచంలో కమ్యూనిస్టులు ఎవరు అన్న విషయం చెప్పి ఉండాల్సింది. కమ్యూనిస్టులే లేరు కమ్యూనిస్టు పార్టీలు లేవన్నది మీ అవగాహన అయితే మీ ప్రత్యామ్నాయం ఏమిటి?

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. దాన్నెలాగైనా కాపాడాలనే తపనతో ట్రంప్, మోదీలాంటి మితవాద శక్తులు ప్రజలపై దాడి చేస్తున్నాయి. దీన్ని ప్రతిఘటించే శక్తులూ ముందుకొస్తున్నాయి. కార్మికోద్యమాలు, విద్యార్థి పోరాటాలు కొత్తరూపంలో ఊపిరిపోసుకుంటున్నాయి. ప్రత్యామ్నాయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. దానికి సోషలిజమే మార్గమని రంగనాయకమ్మ గారి లాంటి మేధావులు చెప్పాల్సిన సమయంలో దానినే తెగనాడటం సబబు కాదు.

స్టాలిన్ ఫాసిస్టు అని ఆయన సోషలిజాన్ని నిర్మించలేదని, విమర్శించే వారిని చంపేశాడని ఇలా సామ్రాజ్యవాదుల కన్నా దుర్మార్గంగా ఆరోపిస్తున్నారు. ఫాసిజానికి, ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో స్టాలిన్ పాత్రకు మధ్య తేడాను వారు గుర్తించలేక పోతున్నారు. సోషలిస్టు నిర్మాణంలో స్టాలిన్ తప్పులు చేసి ఉండవచ్చు. కానీ ఆయనను ఫాసిస్టు అని నిందించడం దురహంకారమవుతుంది. నేను చెప్పేదే మార్క్సిజం. నేను రాసిందే మీరు చదవాలి. నేను చెప్పేదే మీరు వినాలి అనే అహంకారం స్టాలిన్‌లో మనకు ఎక్కడా కనిపించదు. 1951లో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి వర్గంతో ఆయన జరిపిన చర్చలు చూస్తే తోటి విప్లవకారులకు ఆయన ఇచ్చే గౌరవం ఏమిటో అర్థమవుతుంది.

కమ్యూనిస్టు పార్టీలను హేళన చేయడం, నాయకత్వాన్ని కించపరచడం రంగనాయకమ్మ గారి లాంటి వ్యక్తిత్వం వున్న వారి నుండి ఆశించే లక్షణాలు కాదు. విమర్శలకు, పరిశీలనకు ఏదీ అతీతం కాదు. విమర్శలు హేతుబద్ధంగా ఉండాలి. తిట్లపురాణం దానికి ప్రత్యామ్నాయం కాదు. శత్రు సంహారం చేయాల్సిన ఆయుధాలతో మిత్రులను తెగనరకరు. అంతిమంగా అది ఎవరికి లాభిస్తుందో తెలియనిది కాదు.

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. దాన్నెలాగైనా కాపాడాలనే తపనతో ట్రంప్, మోదీలాంటి మితవాద శక్తులు ప్రజలపై దాడి చేస్తున్నాయి. దీన్ని ప్రతిఘటించే శక్తులూ ముందుకొస్తున్నాయి. కార్మికోద్యమాలు, విద్యార్థి పోరాటాలు కొత్తరూపంలో ఊపిరిపోసుకుంటున్నాయి. ప్రత్యామ్నాయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. దానికి సోషలిజమే మార్గమని రంగనాయకమ్మ గారి లాంటి మేధావులు చెప్పాల్సిన సమయంలో దానినే తెగనాడటం సబబు కాదు. ఈ రోజు యువతకు కావలసింది సోషలిజంపై విశ్వాసం కల్పించటం. దాని మంచి చెడుల గురించి చర్చించవచ్చు. అందుకు ఎవరైనా సిద్ధపడతారు. భారతదేశంలో గుజరాత్ మోడల్ పేరుతో మోదీ జనాన్ని మభ్య పెట్టగలిగాడు. మోదీపై యువతరంలో భ్రమలు తగ్గిపోతున్నాయి. ఈ సమయంలో మితవాద భావాలను ఎదుర్కొని పోరాడాలి. ఫాసిస్టు ధోరణులతో చెలరేగిపోతున్న ఆరెస్సెస్ దుష్ట శక్తులకు కళ్ళెం వేయాలి. పోరాట శక్తులకు ఊతమివ్వాలి. దానిని విస్మరించి కమ్యూనిస్టులనే ఫాసిస్టులుగా ముద్రవేస్తే అందరికన్నా ఎక్కువ సంతోషించేది ఆరెస్సెస్ వాళ్ళే. ఇప్పటికైనా రంగనాయకమ్మ గారు తన విల్లంబును మతోన్మాద ఫాసిస్టు శక్తులపై గురిపెడతారని ఆశిద్దాం.

■ వి. శ్రీనివాసరావు
కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు, సి.పి.ఎం



జలసౌధలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి హరీశ్

రానున్న ఎనిమిది నెలలే కీలకం

» సీఎం నమ్మకాన్ని నిలబెట్టాలి.. ఇరిగేషన్ ఇంజనీర్లతో హరీశ్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎనిమిది నెలల కాలం సాగునీటి పారుదల శాఖకు అత్యంత కీలకమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. జలసౌధలో బుధవారం తెలంగాణ నీటిపారుదలశాఖ-2018 క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడితే సాగు నీళ్లొస్తాయని ప్రజలు నమ్మారని, వారిని నిరాశకు గురి చేయొద్దన్నారు. సీఎం కేసీఆర్‌పై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టవలసిన బాధ్యత ప్రతి ఇంజనీరుపై ఉందన్నారు. కాళేశ్వరం పనులు జరుగుతున్న తీరును స్ఫూర్తిగా తీసుకొని మిగతా ప్రాజెక్టుల్లోనూ వేగం పెంచాలని సూచించారు. ఇదిలా ఉండగా, దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ధర్మసాగర్ పంప్ హౌస్‌కు అవసరమయ్యే విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం రూ.144 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రాజస్థాన్‌లో విప్‌ల కాన్ఫరెన్స్‌కు హరీశ్

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో 8, 9 తేదీల్లో అఖిలభారత విప్‌ల కాన్ఫరెన్స్ జరగనుంది. రెండు రోజులపాటు జరగనున్న ఈ సదస్సుకు తెలంగాణ నుంచి శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హరీశ్‌రావు, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, మండలిలో చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డితో పాటు అన్ని పార్టీల విప్‌లు హాజరు కానున్నారు.

వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్: పోచారం

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. వ్యవసాయశాఖ కమిషనరేట్‌లో బుధవారం తెలంగాణ అగ్రి డాక్టర్ల అసోసియేషన్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనం చేసే మంచి పనులు, సేవలే గుర్తింపు వస్తుందే తప్ప కులం వల్ల రాదని వ్యాఖ్యానించారు.

మేడారం రావాలని ఉపరాష్ట్రపతికి ఆహ్వానం

» జాతర విశేషాలను వివరించిన ఇంద్రకరణ్

న్యూఢిల్లీ, జనవరి3 (ఆంధ్రజ్యోతి) : మేడారం జాతరకు రావాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆహ్వానం పలికారు. అనంతరం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ మేడారం జాతర విశేషాలను ఉపరాష్ట్రపతికి వివరించినట్లు తెలిపారు.

తుంగభద్ర నీటి విడుదలకు ఉమ్మడి ఇండెంట్

» హరీశ్ ప్రతిపాదనకు ఏపీ మంత్రి ఓకే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గద్వాల/ హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : తుంగభద్ర డ్యాం నుంచి తెలంగాణ, ఏపీలకు రావాల్సిన 8.7 టీఎంసీల నీటి విడుదలకు మార్గం సుగమమైంది. ఉమ్మడి ఇండెంట్ సమర్పించడానికి రెండు తెలుగు రాష్ట్రాలూ అంగీకరించాయి. 'నీళ్లు మేమే వాడుకుంటాం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' మెయిన్ ఎడిషన్‌లో మంగళవారం ప్రచురితమైన కథనంపై మంత్రి హరీశ్‌రావు స్పందించారు. నీటి విడుదలకు సంబంధించిన ప్రతిపాదనలపై బుధవారం ఏపీ మంత్రి ఉమామహేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడారు. దీనిపై స్పందించిన మంత్రి రెండు రోజుల్లో తుంగభద్ర బోర్డుకు లేఖ పంపిస్తానని హామీ ఇచ్చారు.

మధ్యాహ్న భోజనంలో తృణధాన్యాలు

» 'అక్షయపాత్ర' సహకారంతో నేడు ప్రారంభించనున్న కడియం

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు తృణధాన్యాలను అందించేందుకు అక్షయపాత్ర ఫౌండేషన్ ముందుకొచ్చింది. రంగారెడ్డి జిల్లా నార్సింగిలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. నాలుగు జిల్లాల్లోని 880 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు లక్ష మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు తృణ ధాన్యాలను అందించనున్నారు.



ఢిల్లీలో కేంద్ర మంత్రి మహేశ్ శర్మను కలిసిన మంత్రి జోగు రామన్న

మిగతా కులాలను ఓబీసీ జాబితాలో చేర్చండి

» కేంద్ర మంత్రి గెహ్లాట్‌కు జోగు రామన్న విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో 113 బీసీ కులాలుంటే 85 మాత్రమే ఓబీసీ జాబితాలో ఉన్నాయని, మిగిలిన వాటిని అందులో చేర్చాలని కేంద్ర మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్‌ను మంత్రి జోగు రామన్న కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఆదిలాబాద్‌లో జంతు, పశు జీవ వైవిధ్య ప్రదర్శన శాల, కరీంనగర్‌లో సైన్స్ సెంటర్ కోసం కేంద్ర మంత్రి మహేశ్‌శర్మతో భేటీ అయినట్లు వెల్లడించారు. అలాగే, కేంద్ర మంత్రులు అల్ఫోన్స్, అనంత్‌గీతేను కలిసి పలు అంశాలపై చర్చించామని చెప్పారు.

మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా మహ్మద్ కమ్రుద్దీన్



హైదరాబాద్, హన్మకొండ టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా మహ్మద్ కమ్రుద్దీన్‌ను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్‌చైర్మన్‌గా రాజారపు ప్రతాప్, సభ్యులుగా మహ్మద్ అష్రఫ్ అలీ ఖాన్, డాక్టర్ విద్యాస్రవంతి, గుష్టి నొరియా, బొమ్మల కట్టయ్య, సురేందర్ సింగ్‌ను నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఛత్తీస్‌గఢ్ ప్రాజెక్టును అడ్డుకోండి: తెలంగాణ

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంద్రావతి నదిపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నిర్మిస్తున్న ప్రాజెక్టును అడ్డుకోవాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరనుంది. దీనిపై కేంద్ర జలసంఘానికి లేఖ రాయాలని తెలంగాణ అంతర్రాష్ట్ర జల విభాగం అధికారులు నిర్ణయించారు. ఇంద్రావతిపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం జౌవర్‌నాల ద్వారా పెద్దఎత్తున నీటిని మళ్లిస్తుందని తెలంగాణ ప్రభుత్వం గుర్తించింది. ఈమేరకు కేంద్రజల సంఘానికి లేఖ రాయాలని నిర్ణయించింది.

వర్గీకరణ వద్దంటూ మాలమహానాడు ధర్నా

న్యూఢిల్లీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేపట్టవద్దంటూ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య నేతృత్వంలో బుధవారం ఢిల్లీలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పును, జాతీయ ఎస్సీ కమిషన్ ఇచ్చిన నివేదికలను గౌరవించాలని సూచించారు.

ఐఏఎస్ నారాజ్

(మొదటి పేజీ తరువాయి)

మండిపడుతోంది. సీఎం కేసీఆర్ మంచి ఉద్దేశంతోనే బదిలీలు తలపెట్టినా రిటైర్డ్ ఐఏఎస్ సరైన సూచన చేయని కారణంగానే సమర్థత నిరూపించుకున్న అధికారులను కూడా అప్రాధాన్య పోస్టుల్లో పడేశారన్న అభిప్రాయం వ్యక్తమైంది. తమపై కక్ష సాధింపులకు పాల్పడ్డారన్న భావన వారిలో వ్యక్తమైంది. ఒకరిద్దరు సీనియర్లు విడివిడిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి మనోభావాలను ఆయనతో పంచుకున్నారు.

బదిలీల్లో కొందరికి మంచి పోస్టులే వచ్చాయి. వారంతా సమర్థిస్తున్నారు. అయితే, పాలన సౌలభ్యం కోసం ప్రభుత్వంలో బదిలీలు జరగడం సర్వసాధారణ విషయం. బదిలీలు ఇదే మొదటిసారి కాదు. చివరిసారీ కాదు. ప్రధాన, అప్రధాన పోస్టు అనేది చూసే కోణం, ఆ శాఖ ప్రాధాన్యతను బట్టి ఉంటుంది. ఎవరిని ఎక్కడ నియమించాలనేది ప్రభుత్వ ఇష్టం. అయితే కేడర్‌కు తగిన పోస్టులు ఇవ్వలేదని, ఈ విషయంలో సీఎంకు సరైన సూచన ఇవ్వలేదని సీనియరు ఐఏఎస్ అధికారులు కొందరు అంటున్నారు. ముఖ్యంగా సురేశ్ చంద, బి.ఆర్.మీనాకు ఇచ్చిన పోస్టులు వివాదానికి కారణమయ్యాయి. ఇద్దరూ కూడా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు. ఒకరు 1985 బ్యాచ్ కాగా మరొకరు 1986కు చెందినవారు. సురేశ్ చందను తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కమిషన్ సభ్య కార్యదర్శిగాను, మీనాను తెలంగాణ రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరివురి కేడర్‌కు తగిన పోస్టులు కావవి. కేడర్‌కు తగిన పోస్టు ఇవ్వాలనే విషయం అధికారులకే ఎక్కువ అవగాహన ఉంటుంది. అయినా ఈ విషయంలో సీఎంకు తగిన సలహా ఇవ్వకపోవడం వల్లనే పోస్టింగ్ ఆదేశాలు వెలువడ్డాయనే వాదన వినిపిస్తోంది. ఇక ఎక్సైజ్‌లో ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంచిన ఆర్.వి.చంద్రవదనను విపత్తుల నిర్వహణలో ఈవో కార్యదర్శిగా నియమించారు. తెలంగాణలో ఐఏఎస్‌ల కొరత ఉందని ఓ వైపు అంటూనే సీనియర్ల సేవలను ఉపయోగించుకోకుండా అప్రధాన పోస్టుల్లో వేయడం సీఎం మనోగతానికి విరుద్ధమన్నది సీనియర్ల భావన. పదవీ విరమణ చేసిన అధికారికి సన్నిహితుడైన ఐఏఎస్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించడానికే రూట్ క్లియర్‌లో భాగంగానే ఈ బదిలీలు జరిగాయన్న సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో అసమర్థులని నిరూపణ అయిన అధికారులకు కూడా తాజా బదిలీల్లో అదనపు శాఖలను కట్టబెట్టిన విషయాన్ని ప్రస్తావించాయి. తెలంగాణ వచ్చిన కొత్తలో సురేశ్ చందా ఇంధనశాఖలో ఉండగా... ఆ తర్వాత వైద్య ఆరోగ్యం, అక్కడి నుంచి పశు సంవర్థక శాఖకు, ప్రస్తుతం ఆర్థిక సంఘానికి బదిలీ చేశారు. ఇక బీఆర్‌మీనా తొలుత రెవెన్యూ శాఖలో ఉండగా... అక్కడి నుంచి అటవీశాఖకు, ఆ తర్వాత రెవెన్యూ, తాజాగా ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో పోస్టింగు ఇచ్చారు.

రాత్రికి రాత్రే చేయలేదు!

పాలనా సౌలభ్యం, రాష్ట్ర ప్రయోజనాల దృష్టిలోనే బదిలీలు జరిగాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. "వారం పాటు బదిలీ కసరత్తు జరిగింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తరువాతే నిర్ణయం జరిగింది. బదిలీలు జరగడానికి ముందు రోజు కూడా సీఎం కేసీఆర్ తన కార్యాలయ అధికారులతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు" అని గుర్తు చేశాయి. "ప్రజాప్రతినిధులు, అధికారులు జోడెద్దుల వంటి వారు. ఇరువురి మధ్య సమన్వయం ఉన్నపుడు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సమర్థంగా ప్రజలకు అందడానికి వీలుంటుంది. సమన్వయ లోపంలో తప్పు ఎవరిది అన్నది అలా ఉంచితే...చికాకులతో పాలన కుంటుపడే అవకాశముంది. దీనివల్ల ప్రజలకు మేలు జరగదు. కొందరు అధికారుల బదిలీ ఎప్పుడో జరగాల్సి ఉంది. ప్రభుత్వం వారి విషయంలో సహనం వహించింది. సమన్వయానికీ అవకాశం ఇచ్చింది. అయినా మార్పు రాని నేపథ్యంలోనే సాధారణ బదిలీల్లోనే వారికి స్థాన చలనం కలిగించింది. శిక్ష వేసినట్లుగా కాకుండా వారి సమర్థతను పరిగణనలోకి తీసుకొన్న తరువాతే పోస్టింగ్ ఇచ్చారనే విషయం ఓ కలెక్టర్ విషయంలో వెల్లడవుతోంది" అని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

వీరే కాదు... వారు కూడా

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జిల్లా ఏర్పడిన నాటి నుంచి ప్రజలతో మమేకం అవుతూ జిల్లాలో మంచిపేరు తెచ్చుకున్న ఎ.మురళి ఆవు, పంది మాంసం వ్యాఖ్యలతో వివాదాస్పదుడయ్యారు. తర్వాత మండల పరిషత్ అధికారులతో వివాదం కూడా ఆయన్ను పతాక శీర్షికలకు చేర్చింది. ఈ వివాదాల నేపథ్యంలో ఆయనకు స్టేట్ ఆర్కైవ్స్ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. వాస్తవానికి ఈ శాఖలో అడపాదడపా తప్ప మరే సందర్భంలోనూ ఐఏఎస్‌లు పనిచేసిన దాఖలాల్లేవు. ఇక సహచర అధికారితో వివాదం, డ్రగ్స్ వ్యవహారంలో దూకుడుతో ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఆర్వీ చంద్రవదన్ మళ్లీ బ్లాక్‌లిస్టుకు చేరారు. ఈయనకిచ్చిన పోస్టు వారం రోజుల కిందటి దాకా కేవలం డిప్యూటీ కలెక్టర్, అంతకు ముందు ఓ ఐఏఎస్ పనిచేశారు. డిప్యూటీ కలెక్టర్ లేదా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ చాలనుకునే ఈ పోస్టులో ఆర్వీ చంద్రవదన్‌కు పోస్టింగు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఇక మరో కీలక ఐఏఎస్ డాక్టర్ ఇలంబర్తికి కూడా అప్రాధాన్య పోస్టింగే ఇచ్చారు. పలువురు డిప్యూటీ కలెక్టర్లను ఆ పోస్టులో నియమించాలని చూడగా వారు తప్పుకున్నారు. ఎవరూ పని చేయడానికి ఇష్టపడని పోస్టులోకి ఇలంబర్తిని పంపించడం కూడా ఐఏఎస్‌లలో చర్చకు వచ్చింది.

ఏం సిగ్నల్ ఇస్తున్నారు?

అధికార పార్టీ నేతలతో విభేదాలున్న జిల్లా కలెక్టర్లను బదిలీ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నలుగురూ పనితీరు బాగుందని ప్రజల నుంచి ప్రశంసలు అందుకున్న వారే. అసలు వారిని సమర్థులుగా గుర్తించి, ప్రోత్సహించిందే రాష్ట్ర నాయకత్వం. ఇప్పుడు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కోసం వారిని బదిలీ చేస్తే ఎలాంటి సిగ్నల్స్ వెళతాయని ప్రశ్నిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే అసభ్యంగా ప్రవర్తిస్తే ఆయన్ను వదిలేసి ఆమెకు శిక్ష వేయడాన్ని అధికారులు ప్రశిస్తున్నారు. మరోవైపు కొన్నేళ్లుగా నియోజకవర్గాల్లో కలెక్టర్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం కూడా వారిలో ధిక్కార ధోరణికి బీజం వేసిందని అంటున్నారు.

నలుగురు ఐఏఎస్‌లకు పదోన్నతులు

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 2002 బ్యాచ్‌కు చెందిన నలుగురు ఐఏఎస్‌లకు కార్యదర్శులుగా పదోన్నతులు లభించాయి. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న రఘునందర్‌రావు, ఎస్సీ అభివృద్ధి శాఖలో పనిచేస్తున్న జ్యోతి బుద్ధప్రకాశ్, హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, కేంద్రరక్షణశాఖలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న సుదర్శన్‌రెడ్డిలకు కార్యదర్శులుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది.

పెద్దల దందా!

(మొదటి పేజీ తరువాయి)

బినామీలను నియమించుకుని స్వయంగా ఈ అక్రమ దందాను కొనసాగిస్తున్నట్టు సమాచారం. మంత్రులే కాదు.. అధికార పార్టీకి చెందిన చోటామోటా నాయకులతోపాటు నియోజకవర్గ స్థాయి నాయకుల వరకూ ఈ అక్రమ వ్యాపారంలో పాలుపంచుకుంటున్నట్టు తెలుస్తోంది. ఉదాహరణకు.. కరీంనగర్ జిల్లాలో మానేరు నదిపై రెండు క్వారీలను నడిపేవారు అధికారపార్టీలో ఒక ముఖ్య నేత బంధువులుగా జిల్లాలో ప్రచారం ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా మానేరు వాగు నుంచి ఇసుక రీచ్‌ల ద్వారా తరలిపోతున్న ఇసుక వ్యవహారంలోనూ.. ఒక ముఖ్య నేత సమీప బంధువు, ఆయన తనయుడి పరోక్ష ప్రమేయం, అధికార పార్టీకే చెందిన మరో కీలకనేత వ్యక్తిగత కార్యదర్శి జోక్యం ఉందనే ఆరోపణలున్నాయి. భూపాలపల్లి జిల్లాలోనూ ఇసుక దందా వెనుక అధికార, విపక్ష పార్టీలకు చెందిన నేతల హస్తం, ఏపీలో విపక్షానికి చెందిన నేతల జోక్యం ఉన్నట్లుగా తెలుస్తోంది. అటు సూర్యాపేట జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతంలో ఇసుక దందా జోరుగా నడుస్తోంది. ఎక్కువ శాతం అధికారపార్టీ నాయకుల కనుసన్నల్లోనే ట్రాక్టర్లపై ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ దందాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి పలువురు రాజకీయ నేతలను సంప్రదించగా.. "ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఇసుకను ఆదాయ వనరుగా పరిగణిస్తుంది. ఇసుకే కదండీ.. తవ్వితే మళ్లీ వస్తుంది" అనడం గమనార్హం. కానీ.. ఒక్క పొర ఇసుక ఏర్పడటానికి వేలాది ఏళ్లు పడుతుందని.. ఇసుకను అడ్డగోలుగా తవ్వేస్తే భూగర్భజలాలు అడుగంటిపోతాయని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఇసుకనూ వదలట్లేదు..

రైతు కంట్లో ఇసుక

రాష్ట్రంలో ఇసుక తవ్వకాలకు కొత్త విధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం.. పలు విధాల ఇసుక తవ్వకానికి అనుమతులను ఇస్తోంది. ఇందులో భాగంగా కమర్షియల్ అవసరాల కోసం ప్రత్యేక ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేశారు. ఈ రీచ్‌లను తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్ఎండీసీ) నిర్వహిస్తున్నది. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి గుర్తించిన ప్రత్యేక రీచ్‌లు రెవిన్యూ, హౌజింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. ఇరిగేషన్ ప్రాజెక్టుల అవసరాలకు కేటాయించిన రీచ్‌లను రెవెన్యూ, ఇరిగేషన్ శాఖాధికారులు నిర్వహిస్తున్నారు. ఈ మూడు రకాల అవసరాలకే కాక.. స్థానికుల అవసరాలకు అనుగుణంగా కూడా ఇసుకను అందించాలని పాలసీలో పొందుపరిచారు. దీని ప్రకారం.. స్థానిక అవసరాల నిమిత్తం వాగులు, వంకలు, చిన్న చిన్న నదుల్లో ఇసుక తవ్వకానికి అనుమతులను జారీ చేస్తున్నారు. ఈ ఇసుకను ఆ పరిధిలోని ప్రజలు వ్యక్తిగతంగా ఇళ్ల నిర్మాణానికి మాత్రమే ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. మరుగుదొడ్ల నిర్మాణాలకు కూడా వాడుకోవచ్చు. ఇలాంటి స్థానిక అవసరాలకు కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత ఎమ్మార్వోలు ఇసుక అనుమతులను జారీ చేస్తున్నారు. ఈ ఇసుకను ట్రాక్టర్ల ద్వారానే తరలించాల్సి ఉంటుంది. లోడింగ్‌లో ఏలాంటి యంత్రాలను ఉపయోగించకుండా, మనుషుల ద్వారానే ట్రాక్టర్‌లోకి ఇసుకను నింపాల్సి ఉంటుంది. దీనిని విక్రయించడానికి, ఇతర ప్రాంతాలకు తరలించడానికి అవకాశం లేదు. ఇంటి నిర్మాణానికి సంబంధించిన అనుమతి పత్రాన్ని ఆధారం చేసుకుని ఎన్ని ట్రాక్టర్ల ఇసుక అవసరం అవుతుందనే విషయాన్ని పరిగణలోకి తీసుకుని సంబంధిత ఎమ్మార్వో ప్రత్యేక కూపన్లను జారీ చేయాలి. ఆ కూపన్లలో ట్రాక్టర్ నంబర్‌తో పాటు మరికొన్ని వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. పద్ధతి పకడ్బందీగానే ఉన్నా.. ఆచరణలో మాత్రం జరుగుతున్నది వేరే! 'స్థానిక అవసరం' అనే వెసులుబాటును అక్రమార్కులు తమకు అనుకూలంగా మలచుకుని భారీగా ఇసుకను వాణిజ్య అవసరాలకు తరలిస్తున్నారు. దీనికి కొందరు అధికారులు అక్రమార్కులకు సహకరిస్తున్నారని.. బోగస్ ఇంటి పర్మిషన్ నంబర్ ఆధారంగా ఇసుక కూపన్లను జారీ చేస్తున్నారని ఆరోపణలున్నాయి. అలాగే ఒకే కూపన్‌పై 10-15 ట్రాక్టర్ల ఇసుకను తరలించడం సర్వసాధారణంగా మారింది. 'స్థానిక' అవసరాల నిమిత్తం ఇసుకను తవ్వేందుకు యంత్రాలను ఉపయోగించకూడదని నిబంధనలు చెబుతుంటే.. అందుకు విరుద్ధంగా ఇసుక లోడింగ్‌కు జేసీబీలను ఉపయోగిస్తున్నారు. ఈ అక్రమాలను దాచిపెట్టడానికి ఇసుకను రాత్రివేళలో తరలిస్తుండడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో గతంలో ఇలాగే రాత్రి వేళ ట్రాక్టర్‌లో ఇసుకను నింపి తరలిస్తుండగా ట్రాక్టర్ లోయలో పడి డ్రైవర్ మృతి చెందాడు. అలాంటి విషాదాలు జరగకుండా ఉండాలంటే ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి ఇసుక దందాకు చెక్ పెట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాజ్యసభ రేసులో నాయిని, స్పీకర్

(మొదటి పేజీ తరువాయి)

వరిస్తుందోననే చర్చ పార్టీ వర్గాల్లో జోరందుకుంది. పార్టీ తరపున అభ్యర్థిగా ఖరారైతే రాజ్యసభకు ఎన్నిక కావటం లాంఛనమే కావటంతో చాలా మంది ఆశావహులు టీఆర్ఎస్ చీఫ్, సీఎం కేసీఆర్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే.. మూడింటిలో ఒక స్థానాన్ని యాదవులకు ఇస్తామని ఆయన ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో.. ఆ స్థానం ఎవరిని వరిస్తుందనే ఉత్కంఠతోపాటు, మిగిలిన రెండు స్థానాల్లో రేసులో పలువురు ప్రముఖుల పేర్లు వినిపిస్తున్నాయి. పార్టీకి చెందిన యాదవ నేతల్లో రాష్ట్ర గొర్రెలు, మాంసం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కన్నెబోయిన రాజయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్మన్ తుల ఉమ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిద్దరిలో ఎవరో ఒకరికి రాజ్యసభ చాన్స్ దక్కవచ్చనే ప్రచారం జరుగుతోంది. మిగిలిన రెండు స్థానాల కోసం అభ్యర్థుల ఎంపిక అనూహ్యంగా ఉంటుందనే చర్చ పార్టీ ముఖ్యుల్లో జరుగుతోంది. రాష్ట్ర హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌కుమార్ పేర్లు ప్రస్తుతానికి అందరి నోళ్లలో నానుతున్నాయి.



లోగడ రాజ్యసభ ఎన్నికల సమయంలో టీఆర్ఎస్ తరపున పార్టీ మాజీ కోశాధికారి దీవికొండ దామోదర్‌రావుకు అవకాశం దక్కుతుందని ప్రచారం జరిగింది. కానీ, ఈసారి ఆయన పేరు పరిశీలనలో లేదని తెలుస్తోంది. తాజాగా రేసులో ఉన్నారని చెబుతున్న మంత్రి నాయిని నర్సింహారెడ్డి, స్పీకర్ మధుసూదనాచారిలకు రాజ్యసభ బెర్త్ ఖరారు చేస్తే, మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు అనివార్యం కానున్నాయి. అసెంబ్లీకి కొత్త స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. 2014 సాధారణ ఎన్నికలకు దూరంగా ఉన్న నాయిని నర్సింహారెడ్డి జూన్ 2, 2014న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన పదవీ కాలం 2020 వరకు ఉండగా.. ఎమ్మెల్యేగా మధుసూదనాచారి పదవీ కాలం 2019 వరకు ఉంది. ఒకవేళ నాయిని నర్సింహారెడ్డిని రాజ్యసభకు పంపిస్తే, ఆయన రాజీనామా వల్ల ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ స్థానం మిగిలిన పదవీ కాలానికి మరొకరిని నామినేటెడ్ చేయాల్సి ఉంటుంది. సిరికొండతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించి, రాజ్యసభకు పంపిస్తే.. ఆయన ప్రాతినిధ్యం వహించే భూపాలపల్లి అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక వచ్చే అవకాశాలు స్వల్పమే. ఎందుకంటే, అప్పటికి షెడ్యూల్ ప్రకారం సాధారణ ఎన్నికలకు ఏడాది మాత్రమే గడువు ఉంటుంది. ఉప ఎన్నిక అంశం ఎన్నికల సంఘం నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

రాష్ట్ర మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణ, పార్టీకి సంబంధించి రాబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని నాయిని నర్సింహారెడ్డి, సిరికొండ మధుసూదనాచారి పేర్లు రాజ్యసభ బెర్త్ కోసం పరిశీలనలో ఉన్నట్లు పార్టీ ముఖ్యుల్లో ప్రచారం జరుగుతోంది. అయితే టీఆర్ఎస్ పార్టీకి ఇప్పటికే ఉన్న ముగ్గురు రాజ్యసభ సభ్యుల్లో కె.కేశవరావు, డి.శ్రీనివాస్..ఇద్దరూ బీసీలు.. ఒకే సామాజిక వర్గానికి (మున్నూరు కాపు) చెందిన వారు. మళ్లీ ఇప్పుడు పార్టీకి దక్కే మూడు స్థానాల్లో ఒకటి యాదవులకు (బీసీ) ఇస్తామని సీఎం ప్రకటించారు. సిరికొండ కూడా బీసీనే. ఈ కోణంలో మాత్రం ఆయన పేరు పరిశీలనకు రాకపోవచ్చని తెలుస్తోంది. ఒకవేళ సీఎం కేసీఆర్ బీసీలకు పెద్దపీట వేయాలని భావిస్తే చెప్పలేమని పార్టీ ముఖ్యులు చెబుతున్నారు. అదే సమయంలో పార్టీ ఆవిర్భావం నుంచి రాత్రి, పగలనే తేడా లేకుండా కేసీఆర్ వెన్నంటి ఉంటూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తెర వెనుక క్రియాశీలక పాత్ర పోషించిన జోగినపల్లి సంతోష్‌కుమార్ పేరు టీఆర్ఎస్ శ్రేణుల చర్చల్లో ప్రస్తావనకు వస్తోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే నాటికి పార్టీకి చెందిన మరికొందరి పేర్లు తెరపైకి రావొచ్చనే అంచనాలు ఉన్నాయి. అయితే పార్టీ తరఫున రాజ్యసభ బెర్త్‌ల ఖరారుపై అధినేత కేసీఆర్ మదిలో ఏముందో ఇప్పుడే చెప్పలేమని, రాజ్యసభ ఎన్నికల ప్రక్రియ చివరి దశకు చేరాకే స్పష్టత వస్తుందని టీఆర్ఎస్ ముఖ్యులు అభిప్రాయపడుతున్నారు.



'కరెంటుపై కేసీఆర్ అబద్ధాలు-విద్యుత్ వాస్తవాలు' అంశంపై గాంధీభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న శ్రవణ్

కాంగ్రెస్ వల్లే మిగులు విద్యుత్

కేసీఆర్ ఒక్క యూనిటైనా ఉత్పత్తి చేశారా?.. టీఆర్ఎస్ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటు

- » ప్రైవేటు విద్యుత్ కొనుగోళ్లన్నీ కుంభకోణాలే: ఉత్తమ్
- » గాంధీభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- » 8వేల మెగావాట్లు ఎక్కడి నుంచి వచ్చింది?: షబ్బీర్
- » జెన్‌కోను నిర్వీర్యం చేస్తున్న సర్కారు: దాసోజు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు 24 గంటల విద్యుత్ తన ఘనతేనని చెప్పుకొంటున్న సీఎం కేసీఆర్.. ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క యూనిట్ విద్యుత్తునైనా ఉత్పత్తి చేశారా? అని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రారంభించిన విద్యుత్ ప్రాజెక్టుల నుంచి తట్టెడు మట్టి అయినా ఎత్తారా? కనీసం వచ్చే ఎన్నికల నాటికైనా వాటిని పూర్తి చేస్తారా? అని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత మిగులు విద్యుత్‌కు కాంగ్రెస్ హయాంలో ప్రారంభించి కొనసాగించిన ప్రాజెక్టులే కారణమని తెలిపారు. కేసీఆర్ అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. 'కరెంటుపై కేసీఆర్ అబద్ధాలు-విద్యుత్ వాస్తవాలు' పేరిట బుధవారం గాంధీభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. శాసన మండలి విపక్ష నేత షబ్బీర్ అలీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రావణ్ దీనిని రూపొందించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 6వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉండగా.. స్థాపిత సామర్థ్యం 14 వేల మెగావాట్ల వరకు ఉందని చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ఛత్తీస్‌గఢ్ విదుత్ కొనుగోలు ఒప్పందం పెద్ద కుంభకోణమని ఆరోపించారు. కేసీఆర్ సర్కారు ప్రారంభించిన యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్రాజెక్టుల్లో సబ్ క్రిటికల్ టెక్నాలజీ కారణంగా వందల కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 6570 మెగావాట్ల విద్యుత్ ఉంటే ప్రకటనల్లో మాత్రం 14,930 మెగావాట్ల విద్యుత్ ఉన్నట్లు పేర్కొన్నారని, అదనపు 8వేల మెగావాట్ల విద్యుత్ ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. డిస్కంలకు బకాయిలు ఎలా చెల్లిస్తారని అడిగారు.

దొడ్డదారిన టీఆర్ఎస్ గృహప్రవేశం

విద్యుదుత్పత్తి విషయంలో కాంగ్రెస్ ఇసుకేసి, ఇటుకేసి ఇల్లు కడితే దొడ్డిదారిన గృహప్రవేశం చేసి టీఆర్ఎస్ సర్కారు ఇల్లు నాదేనంటున్న చందంగా తయారయిందని దాసోజు శ్రావణ్ అన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ.. 1952లో 2000 మిలియన్ యూనిట్లు ఉన్న విద్యుత్ సామర్థ్యాన్ని 2014 నాటికి 2,84,000 మిలియన్ యూనిట్లకు తీసుకువెళ్లిన చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. 2017-18 నాటికి అదనపు విద్యుత్ 9.8 శాతంగా ఉంటుందనే అంచనా ఉందని, తెలంగాణలో ఇది 6.3 శాతంగా ఉంటుందని తెలిపారు. 2014 జూలై 2 నాటికి రాష్ట్రంలో 6574 మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉంటే అది 2017 అక్టోబరు 1 నాటికి 14138 మెగావాట్లు అయిందని, ఈ అదనపు 7564 మెగావాట్ల విద్యుత్ వివిధ రకాల విద్యుత్ ఒప్పందాల వల్ల సమకూరిందని అన్నారు. దానిని స్థాపిత విద్యుత్‌గా ప్రకటనల్లో చెప్పుకోవడం టీఆర్ఎస్ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. ప్రైవేటు విద్యుత్ సంస్థల నుంచి విద్యుత్ కొనుగోలు వెనక మతలబు ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో నేతలు వి.హనుమంతరావు, మల్లు రవి, సునితా లక్ష్మారెడ్డి, రేవంత్‌రెడ్డి, బొల్లు కిషన్, నేరెళ్ల శారద, బండ కార్తీకారెడ్డి పాల్గొన్నారు.

పిపెట్, బ్యూరెట్ తెల్వదు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ తప్పనిసరి. అయితే ప్రాక్టికల్స్ అనే మాట విద్యా కేలండర్‌లో మాత్రమే కనిపిస్తోంది. ప్రాక్టికల్స్‌ను ప్రాధాన్యం లేని సబ్జెక్టుగా గుర్తిస్తున్నారు. దీంతో విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో పూర్తిగా నాలెడ్జి లేకుండా పోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌లో పిపెట్, బ్యూరెట్‌లు ప్రాథమిక పరికరాలు. రసాయన ప్రయోగాలకు ఈ రెండింటి వినియోగమే ఎక్కువగా ఉంటుంది. అయితే, విద్యార్థులను ప్రాక్టికల్స్‌కు దూరం పెడుతుండడంతో వారికి పిపెట్, బ్యూరెట్ అంటే ఏమిటో కూడా తెలియకుండా పోతోంది. వచ్చే నెలలో ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. కానీ చాలా కాలేజీల్లో విద్యార్థులను ప్రయోగాలకు సిద్ధం చేయలేదు. ప్రాక్టికల్స్ విషయంలో కార్పొరేట్ కాలేజీలైతే మరీ దారుణం. ఒకరకంగా ఆ కాలేజీల్లో ప్రాక్టికల్స్ అనే మాట నిషిద్ధ పదం అయిపోయింది. విద్యార్థులకు కాలేజీలో అసలు ప్రయోగశాల ఎక్కడ ఉంటుందో తెలియని స్థితి ఉందంటే అతిశయోక్తి కాదు. ఈ కాలేజీల్లో ఏడాదిలో ఒకసారైనా విద్యార్థులు ల్యాబ్ గడపతొక్కని పరిస్థితి ఉంది. ప్రాక్టికల్స్‌ను పూర్తిగా పక్కనబెడుతున్న కాలేజీలు ఆ సమయాన్ని జేఈఈ, నీట్ జాతీయ ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడానికి వినియోగిస్తున్నాయి. ప్రాక్టికల్స్‌పై దృష్టి పెట్టొద్దని, ఆ విషయం తాము చూసుకుంటామని విద్యార్థులకు అధ్యాపకులే నేరుగా చెబుతున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ కోసం ఎంపీసీ విద్యార్థులకు 60 మార్కులు(ఫిజిక్స్, కెమిస్ట్రీ 30 చొప్పున) మార్కులు కేటాయిస్తారు. బైపీసీ విద్యార్థులకు 120 మార్కులు(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీకి 30 మార్కుల చొప్పున) కేటాయిస్తారు. ఈ మార్కులు వార్షిక పరీక్షల్లో వచ్చే మొత్తం మార్కుల శాతాన్ని ప్రభావితం చేస్తాయి. దీంతో విద్యార్థులు సహజంగానే ప్రాక్టికల్స్ మార్కులపై ఎక్కువ దృష్టి పెడతారు. కానీ విద్యార్థులు ఏ విధమైనా ప్రాక్టికల్స్ చేయకుండానే పరీక్ష పరిశీలకులు(ఎక్స్‌టర్నల్స్) వారికి మార్కులు ఇస్తున్నారు. విద్యార్థి ప్రాక్టికల్ సామర్థ్యంతో సంబంధం లేకుండా అడ్డగోలుగా మార్కులు వేస్తున్నారు. తరగతిలో దాదాపు 70-80శాతం విద్యార్థులకు 100 శాతం మార్కులు వేస్తుండడం గమనార్హం. మిగతా 20 శాతం విద్యార్థులకు ఒక్కో సబ్జెక్టులో 2-5 మార్కులు తక్కువగా వేస్తుంటారు. విద్యార్థులకు థియరీ నాలెడ్జి తప్ప ప్రాక్టికల్ నాలెడ్జి ఉండడం లేదని.. దీంతో కెరీర్‌లో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ల్యాబ్‌లే కరువు

కార్పొరేట్ కాలేజీల్లో అసలు ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు కావాల్సిన ప్రయోగశాలలే లేకపోవడం గమనార్హం. రెండు మూడు బ్రాంచులకు కలిపి ఒకచోట చిన్న ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయం ఇటీవల ఇంటర్‌బోర్డు అధికారుల తనిఖీల్లోనూ తేలింది. మెజారిటీ కాలేజీల్లో ల్యాబ్‌లే లేవని అధికారులే స్వయంగా తెలపడం గమనార్హం. చిన్న ప్రైవేటు కాలేజీల్లో ల్యాబ్‌లు ఉన్నప్పటికీ సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రాష్ట్రంలోని దాదాపు 1500 ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో 70-80 శాతం కాలేజీల్లో ల్యాబ్ సౌకర్యాలు అధ్వాన్నంగా ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వ కాలేజీల్లోనూ అదే పరిస్థితి నెలకొంది.

నా అణు బటన్ మీ కంటే పెద్దది



- అత్యంత శక్తిమంతం.. బాగా పనిచేస్తుంది కూడా
- కిమ్‌కు ట్రంప్ హెచ్చరిక.. 'హాట్‌లైన్'కు ఉభయకొరియాల నిర్ణయం

వాషింగ్టన్, జనవరి 3: తమ అణ్వస్త్రాలు అమెరికాలో ఎక్కడైనా దాడిచేయగలవని, అణు బటన్ తన టేబుల్‌పై ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఉత్తరకొరియా పాలకుడు కిమ్ జోంగ్-ఉన్ కొత్త సంవత్సరం రోజు చేసిన హెచ్చరికపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. తన వద్ద ఉన్న అణు బటన్ కిమ్ కంటే పెద్దదని బుధవారం ట్విట్టర్‌లో ప్రతిహెచ్చరిక జారీచేశారు. 'నా వద్ద కూడా బటన్ ఉందని, అది కిమ్ బటన్ కంటే పెద్దదని.. ఎంతో శక్తిమంతమైనదని, పైపెచ్చు చాలా బాగా పనిచేస్తుందని ఆయన ప్రభుత్వంలోని వారెవరైనా చెబితే బాగుంటుంది' అని పేర్కొన్నారు. ఉత్తరకొరియా ప్రపంచానికే ముప్పని, ప్రపంచ దేశాలన్నీ దానిపై ఒత్తిడి తేవాలని వైట్‌హౌస్ పిలుపిచ్చింది. సంక్షోభ పరిష్కారానికి అన్ని మార్గాలను పరిశీలిస్తున్నట్లు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ సారా శాండర్స్ తెలిపారు. ఇంకోవైపు.. దక్షిణ కొరియాతో చర్చలకు హాట్‌లైన్‌ను పునరుద్ధరిస్తామని కిమ్ ప్రకటించారు. ఈ ఏడాది ప్యోంగ్‌చాంగ్ నగరంలో జరిగే వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొంటామని కూడా వెల్లడించింది. దక్షిణ కొరియా తక్షణమే సానుకూలంగా స్పందించింది. ఉత్తరకొరియా యంత్రాంగంతో ఉన్నత స్థాయి చర్చలకు సంసిద్ధత తెలిపింది. ఇది సానుకూల పరిణామమని సారా తెలిపారు. మరోవైపు, ఇజ్రాయెల్‌తో శాంతి చర్చలను పునరుద్ధరించకుంటే పాలస్తీనాకు ఆర్థిక సాయంలో కోత విధిస్తానని ట్రంప్ హెచ్చరించారు.

ఇది కొరియా మంచు క్షిపణి

ప్యాంగ్యాంగ్, జనవరి 3: క్షిపణి ప్రయోగాలతో ప్రపంచానికి- ముఖ్యంగా అమెరికాకు వెన్నులో వణుకు పుట్టిస్తున్న ఉత్తర కొరియా- ప్రతీ సందర్భాన్నీ అందుకోసమే ఉపయోగిస్తోంది. మొన్నటికి మొన్న- అణు బటన్ నా టేబుల్ మీదే ఉంటుందని చెప్పాడు అధినేత కిమ్ జాంగ్ ఉన్.. ఇపుడు- క్షిపణి దాడులు మొదలుపెడితే శత్రువు అంతుచూసే దాకా కొనసాగుతాయని మరోమారు చెప్పాడు. ఇంతేకాదు, దేశ ప్రజలనూ అందుకు సన్నద్ధం చేస్తున్నాడు. ఇందుకు ఓ ఉదాహరణ ఏంటంటే- ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్ లో ప్రతీ కొత్త సంవత్సరం వేళా ఓ మంచు ఉత్సవం జరుగుతుంది. మంచుతో వివిధాకృతులను మలిచి అందులో ప్రదర్శనకు ఉంచుతారు. వేలాది మంది దాన్ని చూడ్డానికి వెళతారు. సాధారణంగా కొరియా సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే ఆకృతులే ఉంటాయి. ఇపుడు -కొరియా చాలా ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి- హుయాసాంగ్-15ను మంచుతో మలిచి ఆ ఉత్సవంలో ప్రదర్శిస్తున్నారు. దీనితో అమెరికాను బుగ్గి చేయవచ్చని అంటూ సగర్వంగా దీన్ని సమర్పిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకొంది. అనేక ఇతర క్షిపణులు, జలాంతర్గాములు, యుద్ధట్యాంకులు, ఆయుధ సామగ్రిని మంచుతో రూపొందించి ఆ శిల్పాలను ప్రదర్శిస్తున్నారు. వాటి ముందు సెల్ఫీలు దిగుతున్న ప్రజల ఫోటోలను ప్రచురించింది అధికార వార్తాపత్రిక- రొడాంగ్ సిన్మున్. అంతేకాదు... ఈ బాలిస్టిక్ క్షిపణితో ఓ స్మారక స్టాంపును కూడా కొరియా ప్రభుత్వం విడుదల చేసింది.





చైనా అమ్ములపొదిలో హైపర్‌సానిక్ క్షిపణి

- భారత్, అమెరికాలే లక్ష్యం

బీజింగ్, జనవరి 3: కేవలం ఒక గంట వ్యవధిలో భారత్‌లోని లక్ష్యాలను తాకి నాశనం చేయగల కొత్త హైపర్‌సానిక్ క్షిపణి - డీఎఫ్-17 చైనా అమ్ముల పొదిలో చేరింది. నవంబరు 1న తొలిసారి, ఓ వారం తర్వాత రెండోసారి దీన్ని విజయవంతంగా పరీక్షించారు. 2020 కల్లా దీన్ని సైన్యావసరాలకు వినియోగిస్తారని డిప్లమేట్ పత్రిక వెల్లడించింది. విశేషమేమంటే- ఈ హైపర్‌సానిక్ గ్లైడెడ్ వెహికల్ (హెచ్‌జీవీ)- అమెరికాలోని నగరాలను, జపాన్‌లోని కొన్ని కీలక ప్రాంతాలను కూడా టార్గెట్ చేయగలదు. మంగోలియాలోని జియాక్యువాన్ ప్రాంతంలో ప్రయోగ పరీక్షలు జరిగాయని, మామూలు ఖండాంతర క్షిపణుల కంటే చాలా ఎక్కువ వేగంతో, తక్కువ ఎత్తులో, నిఘా విమానాలకు అందని రీతిలో ఇవి ప్రయాణిస్తాయని, ప్రయోగ పరీక్షలో ఇవి 1400 కిలోమీటర్ల దూరం వెళ్లాయని డిప్లమాట్ మేగజైన్ కథనం పేర్కొంటోంది. "ఈ హెచ్‌జీవీ టెక్నాలజీ ప్రపంచంలోని మూడు అతిపెద్ద అణ్వస్త్ర శక్తులు- అమెరికా, రష్యా, చైనా మధ్య అణువ్యూహంలో ఎప్పుడో భాగమయ్యాయి. ఈ టెక్నాలజీ తో రూపొందిన క్షిపణి ఖచ్చితంగా భారత్, జపాన్‌లకు ఆందోళనకారకం. గతంలోని క్షిపణుల కంటే సూటిగా, వేగంగా ఇది లక్ష్యాలను తాకగలదు. భారత్‌లోని ఏ ప్రాంతాన్నైనా, భారత అణు కేంద్రాలు, రియాక్టర్లనైనా ఇది ధ్వంసం చేయగలదు. ఈ క్షిపణి చాలా వేగంగా వెళుతుంది. ఏ ఇంటర్‌సెప్టర్ మిసైల్ కూడా దీన్ని మధ్యలో అడ్డుకోలేదు" అని బీజింగ్‌లోని సైనిక విశ్లేషకుడు చౌ చెన్మింగ్ చెప్పారు.

'తలాక్'పై మెలిక!

రాజ్యసభలో బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్.. సెలక్ట్ కమిటీకి పంపాలని పట్టు.. మద్దతు తెలిపిన తృణమూల్, ఎస్పీ

న్యూఢిల్లీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తక్షణ తలాక్ రద్దు బిల్లుపై కాంగ్రెస్ మెలిక పెట్టింది. లోక్‌సభలో బిల్లుకు ఆమోదం తెలిపిన కాంగ్రెస్, పెద్దల సభలో మాత్రం బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని పట్టుబట్టింది. బుధవారం ఈ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్‌సహా విపక్షాలు బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేస్తూ సభాకార్యక్రమాలను స్తంభింప చేశాయి. చివరికి సెలక్ట్ కమిటీకి పంపాలా.. వద్దా అన్న దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే సభ గురువారానికి వాయిదా పడింది. బుధవారం ఉదయం రాజ్యసభ ప్రారంభమైన వెంటనే మహారాష్ట్రలో అల్లర్లపై పెద్ద ఎత్తున రగడ చోటుచేసుకుంది. దీంతో సభ మూడుసార్లు వాయిదా పడింది. మధ్యాహ్నం 3 గంటలకు సభ తిరిగి సమావేశమైన తర్వాత డిప్యూటీ చైర్మన్ కురియన్ చర్చకు అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వవద్దని విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. గందరగోళ పరిస్థితుల నడుమే రవిశంకర్ ప్రసాద్ మాట్లాడారు. 'లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన తర్వాత కూడా ట్రిపుల్ తలాక్ సంప్రదాయం ఆగలేదు. వరకట్నం ఇవ్వలేదన్న కారణంతో మొరాదాబాద్‌లో ఓ మహిళకు తన భర్త ట్రిపుల్ తలాక్ ద్వారా విడాకులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో బిల్లు చట్ట రూపం దాల్చడం అత్యవసరం' అని తెలిపారు. ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ మాట్లాడుతూ.. రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యలను ఖండించారు. తమ పార్టీ బిల్లుకు వ్యతిరేకం కాదని, కానీ బిల్లులోని అంశాలను పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అదే సమయంలో బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలంటూ రాజ్యసభలో కాంగ్రెస్ ఉపనేత ఆనంద్ శర్మ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తృణమూల్ ఎంపీ డెరిక్ ఓ బ్రెయిన్ కూడా మరో తీర్మానం పెట్టారు. సెలక్ట్ కమిటీలో విపక్ష పార్టీల తరపున సభ్యులతో కూడిన ఓ జాబితాను సభ ముందుంచారు. దీనిపై అధికారపక్షం తీవ్ర అభ్యంతరం తెలిపింది. కాంగ్రెస్, తృణమూల్ సభ్యుల తీర్మానాలు చెల్లవని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. బిల్లును సెలక్ట్ కమిటీకి పంపలేమని స్పష్టం చేశారు. దీంతో విపక్ష సభ్యులు జైట్లీ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. అయినా ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించారు. 'సుప్రీంకోర్టు జడ్జీలు గత ఏడాది ఆగస్టు 22న ట్రిపుల్ తలాక్‌ను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది. ఇద్దరు జడ్జీలు తమ అసాధారణ అధికారాన్ని ఉపయోగించి ఆరు నెలల పాటు ట్రిపుల్ తలాక్‌పై నిషేధం విధించారు. ఆ నిషేధం గడువు ఫిబ్రవరి 22తో ముగుస్తుంది. ఈలోగా ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేస్తూ చట్టాన్ని తీసుకురావాల్సి ఉంది' అని జైట్లీ వివరించారు. మీ వైఖరిని ప్రపంచమంతా చూస్తోందని వ్యాఖ్యానించారు. తక్షణ తలాక్ రద్దు బిల్లును రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ పరోక్షంగా అడ్డుకుంటోందని విమర్శించారు.



రాజ్యసభ గ్యాలరీలో ముస్లిం మహిళలు

రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఈ చారిత్రక ఘట్టాన్ని వీక్షించేందుకు కొంత మంది ముస్లిం మహిళలు రాజ్యసభకు వచ్చారు. పాత ఢిల్లీ నుంచి వచ్చిన వారు పబ్లిక్ గ్యాలరీలో కూర్చొని సభా కార్యక్రమాలను వీక్షించారు. కాగా, వారంతా ముస్లిం మహిళలు కాదని, కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన బీజేపీకి చెందిన మోసగాళ్లంటూ సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ నరేష్ అగర్వాల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.


లోక్‌సభకు సవరించిన ఓబీసీ బిల్లు

ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగహోదా కల్పించే బిల్లుకు రాజ్యసభలో కాంగ్రెస్‌తోసహా విపక్ష పార్టీలు సవరణలు సూచించిన నేపథ్యంలో మరోసారి ఆ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాలు సూచించిన సవరణలతో బిల్లును బుధవారం కేంద్ర సామాజిక న్యాయ మంత్రి తవర్ చంద్ గెహ్లాట్ లోక్‌సభ ముందు ఉంచారు.

తీర్మానాలు చెల్లుతాయి

తీర్మానం ప్రవేశపెట్టడానికి సంబంధించి ముందుగానే నోటీసు ఇవ్వడం వంటి సాంకేతిక అంశాలను చైర్మన్ వెంకయ్య నాయుడు పరిగణలోకి తీసుకోలేదని, కాబట్టి ఇద్దరు సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాలు చెల్లుతాయని డిప్యూటీ చైర్మన్ కురియన్ స్పష్టం చేశారు. దీంతో బీజేపీ సభ్యులు వెల్‌లోకి రావడానికి ప్రయత్నించారు. ప్రతిగా విపక్ష సభ్యులు తమ స్థానాల్లో ఉండి ఆందోళన చేపట్టారు. ఈ గందరగోళం నడుమ సభను గురువారానికి వాయిదా వేస్తున్న కురియన్ ప్రకటించారు. బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలన్న విపక్షాల తీర్మానంపై ఎలాంటి రూలింగ్ ఇవ్వకుండానే ఆయన సభను వాయిదా వేశారు.

కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి: జైట్లీ



తక్షణ తలాక్ రద్దు బిల్లుపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభలో బిల్లుకు ఆమోదం తెలిపి, రాజ్యసభలో బిల్లును అడ్డుకోవడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఈ భేటీలో ప్రధాని మోదీ, బీజేపీ చీఫ్ అమిత్‌షా కూడా పాల్గొన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ మాట్లాడుతూ.. తక్షణ తలాక్ రద్దు బిల్లును రాజ్యసభలో అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. బిల్లును ఆమోదింప చేసుకునేందుకు కాంగ్రెస్‌తోసహా ఇతర పార్టీలతో మాట్లాడుతున్నామని చెప్పారు.

మైనారిటీలపై కుట్ర: సురవరం

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మైనారిటీలపై మోదీ సర్కారు కక్ష సాధింపు ధోరణికి ట్రిపుల్ తలాక్ బిల్లు అద్దం పడుతోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. తాము ఈ చట్టానికి వ్యతిరేకం కాదని, అయితే మూడేళ్ల జైలుశిక్ష విషయంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నామన్నారు. మగ్దూం భవన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ మైనారిటీల విషయంలోనే కాకుండా.. చట్ట విరుద్ధంగా విడాకులిచ్చే అన్ని మ తాల వారినీ శిక్షించాలన్నారు. తలాక్ బిల్లులో బాధిత మహిళలకు నష్టపరిహారం ఇచ్చే అంశాన్నీ చేర్చాలన్నారు.

ఆ పార్టీలకు కృతజ్ఞతలు: ఏఐఎంపీఎల్‌బీ

తక్షణ తలాక్ రద్దు బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని కోరుతున్న పార్టీలకు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు(ఏఐఎంపీఎల్‌బీ) కృతజ్ఞతలు తెలిపింది. ఆ పార్టీలన్నీ చివరి దాకా తమ వైఖరికి కట్టుబడి ఉంటాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. ఈ బిల్లు రాజ్యాంగానికే కాక, సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధమని ఏఐఎంపీఎల్‌బీ అధికార ప్రతినిధి మౌలానాఖలీఉర్ రెహ్మాన్ నోమానీ పేర్కొన్నారు.

ఎమ్మెస్ సుబ్బులక్ష్మి కుమార్తె కన్నుమూత



చెన్నై/ బెంగళూరు, జనవరి 3: అమర గాయకురాలు, భారతరత్న ఎమ్మెస్ సుబ్బులక్ష్మి కుమార్తె, ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు రాధా విశ్వనాథన్(84) బెంగళూరులో కన్నుమూశారు. శ్వాసకోశ సంబంధ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆమె మంగళవారం రాత్రి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. దేశ, విదేశాల్లో నిర్వహించిన ఎన్నో సంగీత ప్రదర్శనలు, భక్తిగీతాల రికార్డింగుల్లో తన తల్లి ఎమ్మెస్‌కు రాధా విశ్వనాథన్ ఐదు దశాబ్దాల పాటు గాత్ర సహకారం అందించారు. తమిళనాడులోని గోపిచెట్టి పాళయంలో 1934లో టి.సదాశివం, ఆయన మొదటి భార్య అపిత కుచంబాళ్ అలియాస్ పార్వతికి రాధ జన్మించారు. కుచంబాళ్ మరణానంతరం ఎమ్మెస్ సుబ్బులక్ష్మిని సదాశివం వివాహం చేసుకున్నారు. రాధను ఆమె సొంత తల్లిలా పెంచి పెద్దచేశారు. ఎమ్మెస్ పాడిన ప్రఖ్యాత కృతుల్లో ఒకటైన 'శ్రీమన్ నారాయణ'ను మనవరాలు ఐశ్వర్య ఆలపిస్తుండగా, వాటిని వింటూ తుదిశ్వాస విడిచినట్లు ఆమె కుమారుడు వి.శ్రీనివాసన్ వివరించారు. రాధ అంత్యక్రియలు బుధవారం బెంగళూరులో జరిగాయి.

త్వరలో శృంగేరి మఠానికి రాహుల్

బెంగళూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని శృంగేరి మఠాన్ని రాహుల్‌గాంధీ సందర్శించనున్నారు. ఈ మఠాన్ని మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ కూడా ఎన్నికల సమయంలో సందర్శించారు. ఇక్కడి పీఠాధిపతి ఆశీస్సులు పొందిన అనంతరం వారికి ఘన విజయాలు సిద్ధించాయనే నమ్మకంతో రాహుల్ ఈ పీఠాన్ని దర్శించుకోనున్నారు. కాగా, కార్యక్రమం ఖరారు కావాల్సి ఉందని కేపీసీసీ అధ్యక్షుడు పరమేశ్వర చెప్పారు.

అతిపెద్ద సొరంగ మార్గానికి కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 3: జమ్మూకశ్మీరులోని జోజిలా పాస్ సొరంగ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. శ్రీనగర్, లేహ్‌ల మధ్య రూ.6,089 కోట్లతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు బుధవారం కేబినెట్ ఆమోదం తెలిపింది. శ్రీనగర్, లేహ్ మధ్య ప్రయాణ సమయం ప్రస్తుతం మూడున్నర గంటల నుంచి పావుగంటకు తగ్గిపోతుంది. రెండు దిక్కుల ప్రయాణించే వీలున్న 14.2 కిలోమీటర్ల ఈ సొరంగ మార్గం ఆసియాలో అత్యంత పొడుగైనది.

సావిత్రీబాయి పూలేకు మోదీ నివాళి

న్యూఢిల్లీ, జనవరి 3: సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆమెకు నివాళులర్పించారు. అణగారిన వర్గాల ఉద్ధరణకు సావిత్రీబాయి చూపిన మార్గంలో తమ ప్రభుత్వం కృషి చేస్తోందని బుధవారం ఆయన ట్వీట్ చేశారు.


పాక్‌కు సాయమంతా ఆపేస్తాం: అమెరికా

న్యూయార్క్, జనవరి 3: ఉగ్రవాదంపై పోరులో పాకిస్థాన్ ఆడుతున్న డబుల్‌గేమ్‌ను సహించేది లేదని అమెరికా తెగేసి చెప్పింది. ఉగ్రవాదులకు మద్దతిస్తూ వారికి ఆశ్రయమివ్వడాన్ని నిలుపుదల చేయాల్సిందేనని.. లేదంటే అన్ని రకాల సాయాన్ని ఆపేస్తామని, అధ్యక్షుడు ట్రంప్ ఈ విషయంలో ఎంత దూరమైనా వెళ్తారని ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ బుధవారం విస్పష్టంగా చెప్పారు. పాక్‌కు సైనిక సాయం నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడం.. 25.5 కోట్ల డాలర్ల సాయాన్ని అమెరికా నిలిపివేసిన దరిమిలా హేలీ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. న్యూయార్క్‌లో ఐరాస ప్రధాన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. 'ఓపక్క అమెరికాతో పాక్ కలిసి పనిచేస్తూనే.. ఇంకోపక్క ఆఫ్ఘనిస్థాన్‌లో మా సైనికులపై దాడిచేస్తున్న ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తోంది. ఏళ్ల తరబడి ఈ నాటకమాడుతోంది. ట్రంప్ యంత్రాంగం ఇక ఈ డబుల్‌గేమ్‌ను అంగీకరించదు' అని తెలిపారు. కాగా.. పాక్ తమకు కీలక భాగస్వామి అని, అయితే ఉగ్రవాదంపై పోరులో ఆ దేశం చేయాల్సింది చాలా ఉందని వైట్‌హౌస్ పునరుద్ఘాటించింది. కాగా.. అంతర్జాతీయ ఉగ్రవాది హఫీజ్ సయీద్ ఆధ్వర్యంలోని జమాతుద్ దవా, ఫలాహ్-ఇ-ఇన్సానియత్ ఫౌండేషన్‌పై తాము చర్యలు తీసుకోవడానికి అమెరికా ఒత్తిడి కారణం కాదని పాక్ రక్షణ మంత్రి ఖుర్రం దస్తగిర్ ఖాన్ స్పష్టం చేశారు. ఉగ్రవాదుల అణచివేతకు తమ ఆర్మీ ఆపరేషన్ రదుల్ ఫసాద్‌ను ప్రారంభించిందని, చర్చల అనంతరం సయీద్ సంస్థలపై నిషేధం విధించామన్నారు.

ఘర్ వాపసీ

(మొదటిపేజీ తరువాయి)

మించి -మరిక పొడిగింపు ఇవ్వరాదని నిర్ణయిస్తే వీరంతా వెనక్కి వెళ్ళిపోవాల్సిందే.. అమెరికా చరిత్రలో ఇంత భారీ స్థాయిలో భారతీయ ఉద్యోగులను వెనక్కి పంపేయడం ఇదే ప్రథమం కాగలదు" అని ఇమిగ్రేషన్ వ్యవహారాలు చూసే ఓ సంస్థ అధికారి చెప్పారు. వీసా పొడిగింపు అనేది మూడేళ్ళ నుంచి ఆరేళ్ళ కాలపరిమితి దాకానే ఉంటుంది. అమెరికా పౌరసత్వ, ఇమిగ్రేషన్ సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) మాత్రం తాజా నిబంధనలపై నోరు మెదపట్లేదు. ట్రంప్ సర్కారు జారీ చేసిన- "బై అమెరికన్- హైర్ అమెరికన్" ఆదేశాల అమలుకు తగిన మార్గాలను అన్వేషిస్తున్నామని, అనేక అంశాలు పరిశీలనలో ఉన్నాయని, దేనిపైనా నిర్ణయం తీసుకోలేదని- యూఎస్‌సీఐఎస్ మీడియా సలహాదారు జొనాథన్ వితింగ్టన్ చెప్పారు. ఈ సామూహిక వేటుపై భారత సర్కార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై ట్రంప్ ప్రభుత్వంతో చర్చించి- ఆందోళన తెలియపర్చాలని ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ నిర్ణయించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఒక అంచనా ప్రకారం 10 లక్షల మంది వీసా హోల్డ ర్లు గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో సింహభాగం భారతీయులే. ఇందులో పదేళ్ళనుంచీ ఎదురు చూస్తున్నవారూ ఉన్నారు. ఉపాధి-ఆధారిత-గ్రీన్‌కార్డ్ వ్యవస్థ నిబంధనల ప్రకారం ఒక దేశానికి ఏడాదిలో 7% కంటే ఎక్కువ గ్రీన్‌కార్డులు మంజూరు చేయరు. ఇంతవరకూ (కంపెనీలకు) హెచ్-1బీ, ఎల్1 వీసాలపై మాత్రం ఏ పరిమితులూ లేవు. ఒక కంపెనీ 70% మందిని పనిలోకి తీసుకోవచ్చు.. అయితే మొత్తం వీసాల పరిమితి మాత్రం 85,000 మాత్ర మే. ఇన్నాళ్ళూ అమెరికా సరళీకృత వీసా విధానాలను అవలంబించింది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, ఇతర తయారీ రంగాలకు సంబంధించినంతవరకూ ఎలాంటి ఆంక్షలూ విధించలేదు. దీని వల్లే సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ళ, ఇంద్రా నూ యి, ఎడోబ్ ఛీఫ్ శంతను నారాయణ్, మాస్టర్ కార్డ్ సీఈఓ అజయ్ పాల్ సింగ్ బంగా, నెట్‌ఏప్ సీఈఓ జార్జ్ కురియన్, హర్మాన్ ఇంటర్నేషనల్ సీఈఓ దినేష్ పాలీవాల్, గ్లోబల్ ఫౌండ్రీస్ సీఈఓ సంజయ్ ఝా ఇన్నేళ్ళూ ఏ ఇబ్బందులూ లేకుండా ఉండగలిగారు.. అందరికీ గ్రీన్‌కార్డులు కూడా వచ్చాయి. ఈ ఆంక్షలు ఓ పదేళ్ల కిందట వచ్చి ఉండుంటే- వీరంతా కూడా ఇపుడు వెనక్కి తిరిగి రావల్సిన పరిస్థితి ఉండేది.



'మహా' బంద్ హింసాత్మకం

సిటీ బస్సులు ధ్వంసం.. ముంబైలో నిలిచిన లోకల్ రైళ్లు.. స్తంభించిన పౌర జీవనం.. ఆందోళన విరమణ

ముంబై/న్యూఢిల్లీ, జనవరి 3: మహారాష్ట్ర బంద్ హింసాత్మకంగా ముగిసింది. బుధవారం నాటి బంద్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పౌరజీవనం స్తంభించిపోయింది. భీమా-కోరెగావ్ యుద్ధం 200వ వార్షికోత్సవం సందర్భంగా రెండురోజుల క్రితం నిర్వహించిన కార్యక్రమంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం, దీనికి నిరసనగా భరిపా బహుజన్ మహాసంఘ్ నాయకుడు, అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్ రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ బంద్‌కు 250 దళితసంఘాలు మద్దతు తెలిపాయి. బంద్ సందర్భంగా ముంబైసహా పలు నగరాల్లో ఆందోళనకారులు సిటీ బస్సులను అడ్డుకుని దాడి చేశారు. దుకాణాలను ధ్వంసం చేశారు. ముంబైలో 13 బస్సులు, పుణెలో 12 బస్సులు ధ్వంసమయ్యాయి. రైల్‌రోకో నిర్వహించడంతో లోకల్ ట్రైన్లు నిలిచిపోయాయి. 40 వేల స్కూల్ బస్సులు తిరగలేదు. ట్యాక్సీ సర్వీసులు కూడా నిలిచిపోయాయి. ఈస్టర్న్ ఎక్స్‌ప్రెస్‌వే, వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్‌వేలపై పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. హింసాత్మక ఘటనలకు సంబంధించి ముంబై పోలీసులు 9 కేసులు నమోదు చేశారు. హింసాత్మక ఘటనల నేపథ్యంలో బుధవారం సాయంత్రం బంద్‌ను విరమిస్తున్నట్లు ప్రకాశ్ అంబేడ్కర్ ప్రకటించారు. గుజరాత్ ఎమ్మెల్యే, దళిత నాయకుడు జిగ్నేష్ మేవాని, ఢిల్లీ జేఎన్‌యూ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖలీద్‌లు డిసెంబరు 31న పుణెలో ఆందోళనకారులను రెచ్చగొట్టేలా ప్రసంగించడమే హింసకు కారణమని ఫిర్యాదు అందినట్లు పుణె పోలీసులు తెలిపారు. మరోవైపు, మహారాష్ట్ర అల్లర్లపై పార్లమెంట్ ఉభయసభలూ బుధవారం అట్టుడికాయి. ఈ అంశంపై చర్చకు కాంగ్రెస్, బీఎస్పీ సహ ఇతర విపక్షాలు పట్టుబట్టడంతో లోక్‌సభ, రాజ్యసభ పలుమార్లు వాయిదా పడ్డాయి. అల్లర్ల వెనుక ఆర్‌ఎస్‌ఎస్‌తో పాటు కొన్ని హిందుత్వ శక్తులున్నాయని లోక్‌సభ కాంగ్రెస్‌పక్ష నేత మల్లికార్జునఖర్గే ఆరోపించారు. ఈ అంశంపై స్పందించకుండా ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఈ వాఖ్యలపై బీజేపీ ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అగ్నికి ఆజ్యం పోసేలా కాంగ్రెస్ ప్రవర్తిస్తోందని, దీనిని సహించబోమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ అన్నా రు. రాజ్యసభలోనూ మహారాష్ట్ర అల్లర్లపై చర్చించాలని కాంగ్రెస్, బీఎస్పీ డిమాండ్ చేశాయి.



ముంబైలోని విక్రోలిలో బైక్‌ను తగులబెట్టిన ఆందోళనకారులు

ఆ ఘటనలు బాధాకరం: ఆర్‌ఎస్‌ఎస్

మహారాష్ట్రలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు హేయం, బాధాకరమని ఆర్‌ఎస్‌ఎస్ పేర్కొంది. ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ మన్మోహన్ వైద్య వాటిని తీవ్రంగా ఖండించారు. ఇందుకు బాధ్యులైన వారిని శిక్షించాలని ఓ ప్రకటనలో కోరారు. కొన్ని శక్తులు కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు యత్నిస్తున్నాయని, ప్రజలు ఆ ఉచ్చులో పడరాదన్నారు.



కరుణతో మాట్లాడుతున్న రజనీ, పక్కన స్టాలిన్

కరుణ ఆశీస్సులందుకున్నా.. పరామర్శించా: రజనీ

- ఆధ్యాత్మిక రాజకీయాలకు తావులేదు: స్టాలిన్

చెన్నై, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత అవసరముందంటూ రాజకీయాల్లోకి వస్తున్న తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ డీఎంకే అధినేత కరుణానిధి ఆశీస్సులందుకున్నారు. స్థానిక గోపాలపురంలోని కరుణానిధి నివాసానికి బుధవారం వెళ్లిన రజనీని డీఎంకే కార్యాచరణ అధ్యక్షుడు స్టాలిన్ సాదరంగా స్వాగతించారు. కరుణతో పావుగంట సేపు భేటీ అయిన రజనీ.. ఆయన ఆశీస్సులు పొందారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కరుణానిధికి ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపానని, ఆయన ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నానని చెప్పారు. తర్వాత స్టాలిన్ మాట్లాడుతూ రజనీకాంత్ ఎవరి ప్రోద్బలంతోనో ఆధ్యాత్మిక రాజకీయాలంటూ ముందుకు వస్తున్నారని, ద్రవిడ భూమిపై ఆధ్యాత్మిక రాజకీయాలకు తావులేదని చురకలంటించారు. రజనీ పార్టీతో పొత్తుపై ఎన్నికల సమయంలో మాట్లాడతామన్నారు. కాగా, రజనీకాంత్ ఆధ్యాత్మిక రాజకీయాల్లోకి రావడాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. ఇదిలావుంటే, రజనీ పార్టీకి నటుడు, దర్శకుడు రాఘవలారెన్స్, '2.ఓ' చిత్రాన్ని నిర్మిస్తున్న లైకా ప్రొడక్షన్స్ సీఈవో రాజుమహాలింగం మద్దతు ప్రకటించారు.






నౌకా దళ విమానంలో మంటలు

రన్‌వేను దాటి వెళ్లడంతో ప్రమాదం

పణజీ, జనవరి 3: భారత నౌకా రంగానికి చెందిన మిగ్29కే యుద్ధ విమానంలో మంటలు చెలరేగడం తీవ్ర కలకలం రేపింది. గోవా ఎయిర్‌పోర్టులో బుధవారం టేకాఫ్ తీసుకుంటున్న సమయంలో రన్‌వేపై నుంచి కిందకు దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం సంభవించింది. మంటలు చెలరేగడం గమనించిన ట్రైనీ పైలట్ సంబంధిత అధికారులకు సమాచారం అందించాడు. దీంతో రంగంలోకి దిగిన ఎమర్జన్సీ టీమ్ మంటలను అదుపుచేసింది. ఈ ప్రమాదం నుంచి ట్రైనీ పైలట్ సురక్షితంగా బయటపడ్డారు. దీంతో గోవా ఎయిర్‌పోర్టులో సర్వీసులను గంటపాటు నిలిపివేశారు. రష్యా తయారు చేసిన ఈ యుద్ధ విమానం ఇలా ప్రమాదానికి గురికావడం ఇదే తొలిసారి.



చైనాలో అంతరించిపోతున్న పూలమొక్కల జాతుల్లో ఇదొకటి. దీని పేరు ప్రిముల ఝుయి. చైనీయులు మాత్రం ఝు హయి బౌచున్‌గా వ్యవహరిస్తారు. పరిశోధకులు యున్నాన్ ప్రావిన్స్‌లో క్షేత్రస్థాయి సర్వే చేస్తుండగా.. ఈ మొక్క వారి కంటపడింది.

శ్రీ శక్తి

మామూలు మధ్యతరగతి కుటుంబంలో పుట్టిందా అమ్మాయి. అతి చిన్న వయసులోనే కంప్యూటర్‌లో ఆరితేరింది. నాలుగో తరగతిలోనే సొంత కంపెనీ పెట్టి, ఇప్పటికి 40కి పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సాధించింది. ఇంకా కాలేజీలో చదువుతూనే, ఔత్సాహిక వ్యాపారవేత్తగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న ఓ టీనేజీ సంచలన విజయగాథ ఇది...



శ్రీలక్ష్మీ సురేశ్... పసి వయసులోనే డిజిటల్ ప్రపంచంతో పరిచయమైన అమ్మాయి. తొమ్మిదేళ్ళ క్రితం పట్టుమని పదేళ్ళ వయసులోనే ఏకంగా తన కంటూ ఒక కంపెనీ (ఇ-డిజైన్ టెక్నాలజీస్) స్థాపించిన ఔత్సాహికురాలు. ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలైన సి.ఇ.ఓలలో ఒకరిగా రికార్డుల్లోకెక్కిన అమ్మాయి. ఇప్పుడు ఏకంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 300 మందికి పైగా క్లయింట్లకు ఆమె కంపెనీ సేవలు అందిస్తోంది. ఒక్కమాటలో ఇవాళ్టి డిజిటల్ ఇండియాకు ఆమే ముఖచిత్రం అనవచ్చు.

వెబ్ డిజైనింగ్‌లో... టీనేజ్ సంచలనం

కేరళలోని కోళిక్కోడ్ ప్రాంతానికి చెందిన శ్రీలక్ష్మీ సురేశ్ ఇంకా డిగ్రీ కూడా పూర్తి చేయని కాలేజీ విద్యార్థిని. స్థానిక సెయింట్ జోసెఫ్స్ కాలేజీలో బి.బి.ఎ. ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఈ 19 ఏళ్ల టీనేజ్ అమ్మాయి కథ వయసుతో సంబంధం లేకుండా ఎవరికైనా ఉత్సాహం, ఉత్తేజం నింపే విషయమే. వెబ్ డిజైనింగ్ నాకు తరగని ఆసక్తిగా మొదలైంది.

"నాలుగేళ్ళ వయసప్పుడు నేను కంప్యూటర్లు ఆపరేట్ చేయడం మొదలుపెట్టానట. నోట్ ప్యాడ్‌లో టైప్ చేయడం ద్వారా నేను అక్షరాలు నేర్చుకున్నానట. అప్పట్లోనే మైక్రోసాఫ్ట్ పెయింట్ అప్లికేషన్‌లో బొమ్మలు గీసేదాన్నని మా అమ్మా నాన్న (విజు సురేశ్, సురేశ్ మీనన్) ఇప్పటికీ చెబుతుంటారు. మొదటి సారిగా నాకు ఓ వెబ్ సైట్‌ను చూపించినప్పుడు దాన్ని కూడా ఓ కళాచిత్రం లానే చూసేదాన్ని. కాకపోతే, దాని మీద నుంచి నా దృష్టిని మరల్చేదాన్ని కాదు. క్రమంగా వెబ్ డిజైనింగ్ నేర్చుకున్నా. అలా మొదలైంది నా ప్రయాణం. తీరా ఎనిమిదేళ్ళ వయసు వచ్చేసరికల్లా వెబ్ డిజైనింగ్‌లో నేను నిపుణురాలినైపోయానంటే నమ్మండి" అని శ్రీలక్ష్మి చెప్పుకొచ్చారు.

> **పేరు :** శ్రీలక్ష్మీ సురేశ్
> **వయసు:** పట్టుమని 19 ఏళ్లు
> **ఏం చేస్తోంది:** బి.బి.ఎ. ఫైనల్ ఇయర్ స్టూడెంట్
> **స్థాపించిన సంస్థ:** ఇ-డిజైన్ టెక్నాలజీస్ వ్యవస్థాపకురాలు, సి.ఇ.ఓ
> **అక్కడేం చేస్తారు:** వెబ్ డిజైనింగ్, వెబ్ సైట్ మెయిన్‌టెనెన్స్
> **ఘనత:** ప్రపంచంలోని అతి పిన్న వయసు సి.ఇ.ఓ.ల్లో ఒకరు. ఆమె సంస్థకు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 300 మందికి పైగా క్లయింట్లున్నారు.
> **సేద తీరేదెలా:** సంగీతం, పాటలు బాగా వింటా. కథలు చదువుతా. అలాగే, ఐ.టి, వ్యాపార రంగాలకు సంబంధించిన వ్యాసాలు కూడా చదవడం మిస్సవను.
> **జీవన మంత్రం:** మీరు మనస్ఫూర్తిగా ఇష్టపడిన పని చేయండి. ఈ కలలు నిజం చేసుకోవడానికి ప్రయత్నిస్తే, ఏదో ఒక రోజున మిగతా అందరినీ అధిగమించి, ముందుకు దూసుకుపోతారు.

నాలుగో తరగతి చదివే సమయంలోనే ఆమె తన స్కూల్ వెబ్ సైట్ డిజైన్ చేశారు. అదే ఆమె డిజైన్ చేసిన తొలి వెబ్ సైట్. "ఆ వయసులో మా స్కూల్ వెబ్ సైట్ డిజైన్ చేసే అవకాశం రావడం నా అదృష్టం. అది నాకు దక్కిన పెద్ద గుర్తింపు కూడా! అప్పటి నుంచి మా టీచర్లు, నా స్నేహితులు ఈ రంగంలో ముందుకు వెళ్ళేలా నన్ను ప్రోత్సహించారు. పత్రికల్లో కూడా వార్తలు రావడంతో బోలెడన్ని వెబ్ సైట్లకు డిజైన్ చేయాలంటూ ఆఫర్లు వచ్చాయి" అని అప్పటి సంగతులు ఆమె గుర్తు చేసుకున్నారు.

ఆ తరువాత ఏడాది తిరిగేసరికల్లా 2008లో శ్రీలక్ష్మికి నేషనల్ చైల్డ్ అవార్డ్ ఫర్ ఎక్సెప్షనల్ ఎచీవ్‌మెంట్ వచ్చింది. ఢిల్లీలో సోనియా గాంధీ చేతుల మీదుగా ఆ అవార్డు అందుకుంది. "జీవితంలో ఎప్పటికప్పుడు నేను మెరుగ్గా ముందుకు సాగడానికి మా అమ్మానాన్నలు నాకు స్ఫూర్తినిచ్చారు. వాళ్లెప్పుడూ నన్ను నిరుత్సాహపరచలేదు. అది నిజంగా నా అదృష్టం. పదేళ్ళ వయసులో నేను ఓ కంపెనీ ప్రారంభించాలని అనుకుంటున్నట్లు మా అమ్మానాన్నకు చెప్పాను. వాళ్ళు వెంటనే ఓకే చెప్పేశారు. నిజానికి, ఓ కంపెనీ నడపడంలోని కష్టనష్టాలేమిటో అప్పటికి నాకు ఏమీ తెలియదు. అయినా సరే ఓ ప్రయత్నం చేద్దామనుకున్నా...చేశా" అని నవ్వుతూ అంటారు శ్రీలక్ష్మి.

అలా కంపెనీ మొదలుపెట్టిన ఈ చిన్నారి కొద్దికాలంలోనే తన సత్తా చాటారు. "స్కూల్లో చదువుకుంటూ ఉండడంతో, అప్పట్లో నాకు తగినంత తీరిక కూడా దొరికేది కాదు. స్కూల్లో క్లాసులన్నీ అయిపోయి, ఇంటికొచ్చాక అప్పుడు వెబ్ డిజైనింగ్ మీద కూర్చొనేదాన్ని. అప్పట్లో వరుసగా రకరకాల క్లబ్బులు, అసోసియేషన్లు, చిన్న చిన్న కంపెనీల నుంచి వెబ్ డిజైన్ చేయమంటూ నాకు అభ్యర్థనలు వచ్చేవి. అవన్నీ చేస్తూ వచ్చా. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రశంసలు నాలో మరింత ఉత్సాహం నింపాయి. దాంతో, వెబ్ డిజైనింగ్ రంగంలో పోనుపోనూ మరింత నేర్చుకున్నా. క్రమంగా పైకి వచ్చా" అని ఆమె చెప్పారు.



అవార్డు అందుకుంటూ...

"ప్రస్తుతం నాకు వచ్చిన ఆర్డర్ల నుంచి ముఖ్యమైనవి ఆచితూచి ఎంచుకుంటున్నా. ప్రస్తుతం నా దృష్టి అంతా వెబ్ సైట్ డిజైనింగ్, సైట్ మెయిన్‌టెనెన్స్ మీదే! నా పాత క్లయింట్ల దగ్గర నుంచి కూడా బోలెడన్ని ప్రాజెక్టులు వస్తుంటాయి. ఇప్పుడు నేను డిజైన్ చేస్తున్న స్టేట్ ఆఫ్ కేరళ డాట్ ఇన్ వెబ్ సైట్ అయితే, కేరళ రాష్ట్రం గురించి ఒక చిన్న విజ్ఞాన సర్వస్వం లాంటిదనుకోండి" అని శ్రీలక్ష్మి తెలిపారు. ఇప్పటికీ ఓ పక్క బి.బి.ఎ. క్లాసులకు వెళుతూనే, మరోపక్క ఈ డిజైనింగ్‌తో ఆమె బిజీగా గడుపుతున్నారు. పరీక్షల టైమ్‌లో మాత్రం వెబ్ సైట్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి కష్టమవుతున్నా, ఒక పక్క చదువు, మరోపక్క పని... రెంటి మధ్య సమతూకం పాటిస్తున్నారు. సగటున రోజుకు మూడు, నాలుగు గంటలు కంపెనీ పని మీద కూర్చుంటారు. చాలాకాలంగా శ్రీలక్ష్మి చేస్తున్న ఈ కృషికి బాగానే గుర్తింపు వచ్చింది. వెబ్ డిజైనింగ్‌లో చూపిన ప్రతిభకు గాను అమెరికన్ వెబ్ మాస్టర్స్ అసోసియేషన్ వారు ఇచ్చే అత్యున్నత గోల్డ్ వెబ్ అవార్డు ఆమెకు దక్కింది. ఆ అసోసియేషన్‌లో 18 ఏళ్ల కన్నా తక్కువ వయసులో సభ్యురాలైంది ఆమె ఒక్కరే. "ఏ రంగంలోనైనా ఉన్నతస్థాయికి చేరాలంటే పట్టుదల, కఠోరశ్రమ అవసరం. కృతనిశ్చయంతో, కలల సాకారానికి కృషి చేస్తే ఏదైనా సాధ్యమే. మీరు మనస్ఫూర్తిగా ఏదైతే చేయాలనుకుంటున్నారో అది చేస్తే చాలు... అదే నా జీవన మంత్ర" అని చెప్పుకొచ్చిందీ టీనేజర్.



చిన్నారి శ్రీలక్ష్మి

వెబ్ డిజైనింగ్, వెబ్‌సైట్ మెయిన్‌టెనెన్స్ వ్యాపార రంగంలో ఇవాళ అందరూ చెప్పుకొనే స్థాయికి చేరిన శ్రీలక్ష్మి ప్రస్తుతం బార్ కౌన్సిల్ ఆఫ్ కేరళ, వి.పి.కె. ఫుడ్ ప్రొడక్ట్స్ జెనిసిస్ మాంటిస్సోరీ, ఏంజెల్స్ ఇంటర్నేషనల్ లాంటి ప్రాజెక్టులకు పని చేస్తున్నారు. ఒక్క బార్ కౌన్సిల్ ఆఫ్ కేరళ వెబ్‌సైట్‌లోనే ఆ రాష్ట్రంలోని దాదాపు 40 వేల మంది ప్రాక్టీసింగ్ వకీళ్ళ వివరాలన్నీ నమోదై ఉంటాయి. దేశ విదేశాల్లోని పలు సంస్థల వెబ్ సైట్లను కూడా ఆమె నిర్వహిస్తున్నారు.

చిన్న వయసులోనే ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా మారిన ఈ అమ్మాయికి ఇప్పుడు ఓ కంపెనీని ఎలా నడపాలో వెన్నతో పెట్టిన విద్య అయిపోయింది. కంపెనీ ఆర్థిక వివరాలు చెప్పడానికి సున్నితంగా నిరాకరించే ఈ టీనేజర్ చెప్పే మాట ఒకటే... "ఈ రంగంలో బోలెడంత పోటీ ఉంది. అందుకే, నేను వీలైనంత తక్కువ ఛార్జ్ చేస్తూ, పని చేస్తుంటా. అయితే, ఎంత మొత్తం తీసుకున్నామనే దానికన్నా అప్పగించిన పని పూర్తి చేయాలని చూస్తా"నన్నారు. కంపెనీ నిర్వహణ కోసం ఇప్పటి దాకా ఆట్టే నిధులు సమకూర్చుకోవాల్సిన అవసరం కూడా శ్రీలక్ష్మికి రాలేదు. అదే సమయంలో కంపెనీ ప్రచారం కోసం కూడా ఆమె ఒక్క పైసా ఖర్చుపెట్టలేదు. "నా పనితనం గురించి ఒకరి నుంచి మరొకరు ఆ నోటా ఈ నోటా విని ఆర్డర్లు ఇస్తుంటారు" అని నవ్వేసింది.

> ### విద్యార్థులకు ఆయనో ప్రేరణ!
> నాకు బాగా ఇష్టమైన సి.ఇ.ఓ. అంటే ఎలన్ మస్కన్ ఆయన తనకు తానుగా నేర్చుకుంటూ పైకి వచ్చిన విధానం ఇవాళ ప్రతి ఒక్క విద్యార్థికీ ప్రేరణ అని నా అభిప్రాయం. ప్రపంచంలో మార్పు తీసుకురావడం కోసం ఆయన రాకెట్ సైన్స్ చదివారు. ప్రస్తుతం ఆయన ప్రపంచమంతా సులభంగా చుట్టి రావడానికి వీలుగా ఉండేలా రాకెట్ తయారు చేసే పనిలో ఉన్నారు.

చిన్న వయసులోనే ఇంత సాధించినా, ఆమె కొత్త కలలు కనడం మానలేదు. మైక్రోసాఫ్ట్ విండోస్‌కు భిన్నమైన మరో యూజర్ ఫ్రెండ్లీ ఆపరేటింగ్ సిస్టమ్‌ను రూపొందించాలన్నది శ్రీలక్ష్మికి ఉన్న అతి పెద్ద కల. "ఏదో ఒక రోజుకు ఆ కల నిజం చేసుకుంటా" అని ఆమె గుండెల నిండా ఆత్మవిశ్వాసంతో చెబుతారు. ఎంచుకున్న ఏ రంగంలోనైనా పురోగమించడానికి కావాల్సింది ఆ నమ్మకమేనని శ్రీలక్ష్మి మాటలు, చేతలు కూడా నిరూపిస్తున్నాయి.

చైల్డ్ కేర్

పసిపిల్లలకు నీళ్లు తాగిస్తున్నారా?

పసిపిల్లలకు అదేపనిగా స్పూన్‌తో నీళ్లు తాగిస్తున్నారా? అది చాలా ప్రమాదకరమని తాజా పరిశోధనల్లో తేలింది. పసిపిల్లలు గుక్కపట్టి ఏడ్చినా, సంతోషంగా కేరింతలు కొడుతున్నా కొందరు తల్లులు వెంటనే నీళ్లు పడతారు. అలాగే ఉగ్గు తినిపించిన తర్వాత కూడా మోతాదుకు



మించి నీళ్లు తాగిస్తారు. అలాచేస్తే ఆ అలవాటు పిల్లలపాలిట ప్రమాదకరంగా మారుతుందని అంటున్నారు. శిశువులు పుట్టిన ఆరునెలల్లోపు కూడా తల్లిపాలే తాగుతారు. ఆ పాలల్లో 88 శాతం నీళ్లే ఉంటాయట. దాంతో పిల్లలు డీహైడ్రేట్ అయ్యే అవకాశం ఉండదని, అవి వార ఆరోగ్యానికి సరిపోతాయట. నీళ్లు అధికంగా తాగించడం వల్ల పసిపిల్లల శరీరంలోని సోడియం లెవల్స్ దెబ్బతిని కోమాలోకి వేళ్లే ప్రమాదం ఉందని పెడియాట్రిక్ పరిశోధనల్లో తేలింది. సో... తల్లిపాలల్లోనే పిల్లలకు కావాల్సిన నీటితో పాటు, కేలరీలు కూడా అందుతాయి.

బ్యూటీ

వింటర్‌కేర్ ఇలా..!

మిగతా కాలాల కన్నా చలికాలంలో చర్మ సంబంధమైన సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. ముఖ్యంగా బ్యూటీకి సంబంధించి మహిళలు చికాకు పడకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించాలంటున్నారు డైటీషియన్స్, కాస్మొటిక్ ఫిజీషియన్స్.



- బెస్ట్ స్కిన్ డైట్ ఏమిటంటే... ఆహారంలో తప్పకుండా కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. రోజుకు ఒకసారైనా ఏదో ఒక జ్యూస్ తాగాలి.
- ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ చర్మాన్ని బలోపేతం చేస్తాయి. సోయాబీన్స్, వాల్‌నట్స్‌లలో ఇది అధికంగా లభిస్తుంది.
- విటమిన్ సి లభించే స్ట్రాబెర్రీస్, నిమ్మజాతి పళ్లు, బ్రొకోలి వంటివి తీసుకోవాలి.
- యాంటీ ఆక్సిడెంట్స్ ఉండే విటమిన్ ఏ, ఇ కోసం చిలకడదుంప, క్యారెట్లను విరివిగా వాడాలి.
- వీటితో పాటు ఆలోవెరా జ్యూస్, గోధుమ గడ్డి, దానిమ్మ, నీళ్ల తాగడం వల్ల కూడా చర్మం మృదువుగా ఉంటుంది.
- రెగ్యులర్ ఫేస్‌వాస్‌లు, క్లిన్సర్లు కాకుండా, సల్ఫేట్స్ లేని నాన్ ఫోమింగ్ క్లిన్సర్లు వాడాలి.
- వేసవి కన్నా చలికాలంలోనే సూర్య కిరణాలు తీక్షణంగా ఉంటాయి కాబట్టి కనీసం 30 ఎస్‌పిఎఫ్, యువిఎ రక్షణ ఉన్న సన్‌స్క్రీన్ లోషన్లను చర్మానికి రాసుకుంటే నల్లబడకుండా ఉంటుంది.

చీమలు, బొద్దింకలు, బల్లుల భరతం పడదాం!

బొద్దింకలు, బల్లులు, ఈగలు, దోమలు వంటి పురుగులు తమ సొంతిల్లన్నట్టు సంచరిస్తూ ఇంటిని గబ్బు పట్టిస్తాయి. ఎన్ని ప్రయత్నాలు చేసినా పోయినట్టే పోయి మళ్లీ వస్తాయి. ఇల్లాలకి వీటితో నిత్యమూ యుద్ధమే. అందుకే అస్త్రాల్లాంటి చిట్కాలివి.

దోసముక్కలతో చీమల మందు

- చేదు దోస లేదా మామూలు దోసను చిన్న చిన్న ముక్కలుగా కోసి వంటగదిలో చీమలు వచ్చే మార్గంలో ఉంచటం ద్వారా లోపలికి ప్రవేశించకుండా వాటి మార్గాన్ని అడ్డుకోవచ్చు. బాగా నలిపిన పుదీనా ఆకులు, పుదీనా టీ బ్యాగులు కూడా వాడొచ్చు.
- సబ్బు నీళ్లను లేదా ఆపిల్ ద్రావకానికి బోరిక్ యాసిడ్‌ను కలిపి చీమలపై పిచికారీ చేసి నిర్మూలించవచ్చు.
- గోడల పగుళ్లలో లవంగాలను ఉంచటం, సబ్బు నీటిని పోయటం ద్వారా చీమలను నివారించవచ్చు.

బొద్దింకలను భయపెట్టండిలా...

- గాఢత కలిగిన సబ్బు ద్రావకంతో గదిని కడగాలి.
- ప్రవేశ మార్గాల్లో దోసముక్కలను ఉంచాలి.
- సబ్బు ద్రావణాన్ని నేరుగా బొద్దింకల పైన పోసి చంపవచ్చు.
- బోరిక్ యాసిడ్, చక్కెరపొడి, మొక్కజొన్న పిండిలను సమాన పరిమాణంలో కలిపి అవి తరుచూ తిరిగే ప్రాంతంలో ఉంచితే తిని చనిపోతాయి.
- సీలింగ్, అలమరాలు, సన్‌సైడ్‌లు వంటి ప్రదేశాల్లో బోరిక్ పౌడర్‌ను ఉంచితే బొద్దింకలు ఇన్‌ఫక్షన్‌కు గురై చనిపోతాయి.



ముత్యాల ముగ్గులు





జి.రేణుకా దేవి
నర్సాపూర్,
ప.గో.జిల్లా

22 చుక్కలు 6 వరుసలు
చుక్క విడిచి చుక్క
6 వచ్చే వరకు





కె. కృష్ణకుమారి
నరసారావు పేట,
గుంటూరు జిల్లా


23 చుక్కలు
9 వరుసలు
9 వరకు





ఎన్.వి.సి.ఉమ
సింగరాయకొండ,
ప్రకాశం జిల్లా


17 చుక్కలు
1 వరకు
సరిచుక్క





దీపిక
కాగజ్‌నగర్,
కుమురం భీం జిల్లా

15 చుక్కలు
మధ్య చుక్క
8 వచ్చే వరకు



గిఫ్ట్ హ్యాంపర్ విజేత



ఎం.జ్యోతిశ్రీ
మేడవాక్కం, చెన్నై

17 చుక్కలు
సందు చుక్కలు
9 వరకు



ప్రతిరోజూ విజేతలకు **టాటా-జెమినీ టీ** వారి నుంచి గిఫ్ట్ హ్యాంపర్ అందుతుంది.

మా చిరునామా: నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
navya@andhrajyothy.com

టూరిజం

ఇప్పుడంతా..ఇలా!



కొత్త సంవత్సరం వచ్చేసింది. ముందున్న పన్నెండు నెలల్లో సరికొత్త యాత్రానుభవాల కోసం మనలో చాలామంది ఎదురుచూస్తూ ఉంటాం. ప్రయాణాల్ని ఎలా ప్లాన్ చేసుకోవాలన్న ఆలోచనలు చేసేస్తూ ఉంటాం. ఇలా ప్లాన్ చేసుకొనే వాళ్ళ ధోరణులు ఈ ఏడాది ఎలా ఉండబోతున్నాయి?

టూరిస్టుల అభిరుచులూ, ఆలోచనల్లో కాలానుగుణంగా మార్పులు వస్తున్నాయి. ఆ క్రమంలోనే యాత్రలకు ప్లాన్ చేసుకొనే తీరు కూడా మారుతోంది. కొత్త సంవత్సరంలో ట్రావెల్ ట్రెండ్స్ గురించి పర్యాటక, యాత్రా రంగ నిపుణులు చేసిన అధ్యయన వివరాలివి. మనకు కూడా ఇవి కొత్త దారులు చూపిస్తాయనడంలో సందేహం లేదు.

'మనం' ట్రైప్!

కలసి ఉంటే కలదు సుఖం, అలాగే కలసి ప్రయాణిస్తే మనసులు దగ్గరవుతాయి. నిజానికి రెండు మూడు తరాలవారు కలిసి యాత్రలు చెయ్యడం గతంలో సర్వసాధారణం. కాలక్రమేణా ఉద్యోగాలూ, చదువుల పేరుతో ఉన్న ఊళ్ళకు దూరం కావడం...



'ఒంటరి' మార్కు!



సాహస 'విలాసం'

యువ జంటలు హనీమూన్ కోసం బీచ్‌లూ, సాహసాలు చేయడానికి ఆస్కారం ఉన్న ప్రదేశాలను ఎంచుకొనే ధోరణి బాగా పెరుగుతోంది. అడ్వంచరస్, బీచ్ డెస్టినేషన్లకు...



రెండూ, అంతకు మించి!



స్టార్ వెకేషన్



'ఆనంద' విహారం

చదరంగంలో మొదటి ఇండియన్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తన మేధకు పదును తగ్గలేదని ఈ మధ్య ప్రపంచ ర్యాపిడ్ చెస్ టోర్నీతో నిరూపించుకున్నాడు. దరిమిలా బ్లిజ్ టోర్నీలో కాంస్య పతకం సాధించాడు. తీరిక దొరికితే విహారయాత్రలకు బయల్దేరే ఈ చదరంగ చక్రవర్తి తనకు ఇష్టమైన ప్రదేశాల గురించి ఏం చెబుతున్నారంటే...

ఇష్టమైన పర్యాటక ప్రదేశం: ఐస్‌లాండ్


ఎందుకంటే?: సాటిలేని అనుభూతి కావాలంటే ఐస్‌లాండ్ వెళ్ళాల్సిందే. అద్భుతమైన ప్రకృతి సౌందర్యానికి అది నెలవు. జస్ట్... మీ కిటికీ తలుపు తీసుకొని కూర్చుంటే చాలు, కళ్ళ ముందు అద్భుతాలు కనిపిస్తాయి. బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా కూడా నా ఫేవరెట్స్. ఇండియాలో అయితే కేరళ అంటే మహా ఇష్టం.

రిసెర్చ్ చేస్తా: నా భార్యతో కలిసి ప్రతి సంవత్సరం ఒక పెద్ద వెకేషన్‌కో, రెండు చిన్న వెకేషన్లకో వెళ్తూ ఉంటాను. ఇలాంటి ట్రిప్స్ ప్లాన్ చెయ్యడం నాకు బాగా ఇష్టం. ఎక్కడికి వెళ్ళాలో ఎంచుకోవడం, దాని గురించి పరిశోధన చెయ్యడం, ఎక్కడ ఏం చూడాలో జాబితా రాసుకోవడం, హోటల్స్‌లో గదులు బుక్ చేసుకోవడం... ఇదంతా భలేగా ఉంటుంది.

ఫోన్, మెయిల్ బంద్: విహారయాత్రల్లో ఉన్నప్పుడు నా ఫోన్ స్విచాఫ్ చేస్తాను. మెయిల్ కూడా చెక్ చేసుకోను. తిరిగొచ్చిన తరువాత నా మనసు ప్రశాంతంగా ఉంటుంది. మెదడు గొప్పగా పని చేస్తుంది. మీకు తెలుసా... నేను గెలిచిన బెస్ట్ గేమ్స్‌లో కొన్ని ఇలా వెకేషన్స్ నుంచి వచ్చిన తరువాత ఆడినవే!

ట్రావెల్ టిప్స్: ఏ ప్రదేశాన్నయినా బాగా ఆస్వాదించాలంటే నడుస్తూ తిరగడం బెస్ట్. ముఖ్యంగా ఓల్డ్ టౌన్ ప్రాంతాలకు వెళ్తే ఆ ఊరు తాలూకు అసలు ఆత్మ మీకు కనిపిస్తుంది.

ఒక కల: అండమాన్‌లో ఏనుగులతో కలిసి ఈత కొట్టాలని!



మీకు తెలుసా?



నీళ్ళలో పోస్ట్ బాక్స్!

ప్రపంచంలో అతి లోతైన అండర్‌వాటర్ పోస్ట్ బాక్స్ జపాన్‌లోని వాకయామా ప్రాంతంలో ఉన్న 'సుసామీ బే'లో ఉంది. ఉపరితలానికి సుమారు పది మీటర్ల లోతులో ఉన్న ఈ పోస్ట్ బాక్స్ గిన్నిస్ బుక్‌లో కూడా చోటు సంపాదించుకుంది. ప్రపంచంలో మొట్టమొదట (1999లో) సముద్ర జలాల్లో ఏర్పాటు చేసిన పోస్ట్ బాక్స్ కూడా ఇదే. పర్యాటకుల్ని ఆకర్షించడానికి తోషిహికో మసుమోటో అనే పోస్ట్ మాస్టర్ ఈ ఐడియా ఇచ్చారట.

ఎక్కడికెళ్ళినా ఇంటి వంట!

ట్రై చేయండి

కులూమనాలి, సిమ్లా. ఇలా ప్రపంచంలో ఏ ప్రదేశానికైనా వెళ్ళే ఛాన్స్ మన చేతిలోనే ఉంటుంది. కానీ మనకు నచ్చిన ఆహారం తినే ఛాన్స్ ఉంటుందా? అంటే క్వశ్చన్ మార్క్ ఫేస్ పెట్టాల్సిందే. ఎక్కడికి వెళ్ళినా అక్కడి రుచులు ఆస్వాదించాలి గానీ, నచ్చిన వంటకాలు తినే వీలుంటే ఎంత బాగుంటుంది? అని అనుకునేవాళ్ళు ఎంతోమంది. అలాంటివారి కోసమే ఈ ట్రావెల్ కుక్కర్. చిన్న చిన్న వంటకాలు వండుకొని, హాయిగా తినొచ్చు. రోడ్ ట్రిప్స్, బస్ ట్రిప్స్, ట్రెక్కింగ్ చేసే వాళ్ళకు ఇది బాగా ఉపయోగపడుతుంది. బ్యాగ్‌లోనే పట్టేంత చిన్న పరిమాణంలో ఉంటుంది. ముఖ్యంగా తక్కువ సంఖ్యలో వెళ్ళే వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్‌లో దీని ధర సుమారు రూ. 2,600.



అధిక సంపన్నవతీ భవ!

కొత్త సంవత్సరం వచ్చేసింది. కొత్త నిర్ణయాలు కూడా చాలా తీసుకొంటున్నాం. మరి, ఆరోగ్యంగా, సంపన్నంగా ఉండాలంటే ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి. నిపుణులు చెబుతున్న వాటిలో కొన్ని....

ఇలా చేద్దాం!



ఆరోగ్యం కోసం..

కొత్త ఏడాది రాగానే అందరూ మళ్ళీ అందం, ఆరోగ్యం మీద దృష్టి పెడతారు. అది సహజం. మరి వాటి కోసం ఏం చేయాలంటే... రోజూ మరింత వ్యాయామం చేద్దాం. ఆరోగ్యకరమైన ఆహారమే తీసుకుందాం. వ్యక్తిగత ఆరోగ్యం, భద్రత మీద ఎక్కువ సమయం వెచ్చిద్దాం. పొగతాగడం, మద్యం సేవించడం మానేద్దాం.

అధిక సంపద కోసం..

ఆరోగ్యకరమైన జీవన విధానం పాటించాలంటే, సహజంగానే అందుకు ఖర్చు కూడా ఎక్కువే అవుతుంది. జిమ్‌లో చేరడం దగ్గర నుంచి షుగర్ ఫ్రీ ఐటమ్స్, ఫ్రూట్ సలాడ్ దాకా కాస్తంత ఖరీదైనవే. కాబట్టి, ఇవన్నీ పాటించాలంటే, రాబడిని పెంచుకోవడం కీలకం.
ఈ ఏడాది ఆదాయం పెంచుకొని, పన్ను భారం తగ్గించుకోవాలి. అనవసరపు వ్యయం తగ్గించుకొని, ఎక్కువ ఆదా చేయాలి. అత్యవసరాల కోసం ప్రత్యేకంగా కొంత డబ్బుతో నిధిని ఏర్పాటు చేసుకోవాలి.

ఇలా చేస్తే... కోటీశ్వరులే!

...

సిప్ చేస్తే... సౌ బెటరు!

... సిప్‌ను ఎంచుకోవడం వల్ల మెరుగ్గా మేనేజ్ చేసుకోవచ్చు.
అతిగా అంచనాలు పెట్టుకొని, అసహనంతో ఊగిపోవద్దు. దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేసి ఉండడం వల్ల ఉపయోగం.

కాలంతో పరిగెట్టే ఫ్యాషన్‌ను వెంటాడి పట్టుకోవడంలో యూత్‌ది సెపరేట్ స్టయిల్. ఎలాంటి ప్రయోగాలు చేయాలన్నా కుర్రతనమే కరెక్ట్. ఎవరూ వేలెత్తి చూపించే అవకాశం ఉండదు. కానీ ఎలాపడితే అలా రెడీ అయితే స్టయిల్ కాస్త ట్రాజెడీ కావడం ఖాయం. మరి మీ లుక్ ట్రెండీగా ఉండాలంటే అబ్బాయిలకు కొన్ని సూచనలు!

నవ్య సకల

కిరాక్ స్టయిల్ కోసం!

బ్రాండ్ ముఖ్యమే కానీ!

- ఫ్యాషన్ అంటే సృజనాత్మకతతో ముడిపడిన అంశం. ఎవరో స్టయిల్‌ను మనం అనుసరించడంలో తప్పు లేదు. కానీ అది పూర్తిగా మన బాడీ లాంగ్వేజ్‌కు సెట్ అవుతుందో లేదో అనే అవగాహన ఉండాలి. బ్రాండింగ్‌ను అనుసరిస్తున్నారు. అలాగని బ్రాండెడ్ కానివి మంచివి కాదు అని చెప్పడం లేదు. ఎప్పుడైనా సరే మన్నిక ముఖ్యం.

ఫిట్‌గా ఉండండి!

- బాడీ ఫిట్‌గా ఉంటే మనం ఎంచుకునే దుస్తులు కూడా సరైన సైజ్‌లో ఉంటాయి. కొంత మంది చాలా వదులుగా దుస్తులు ధరిస్తారు. సౌకర్యవంతంగా ఉండే మాట నిజమే. కానీ స్టయిలిష్ లుక్‌కు దూరమైపోతాం.

లోగోలు వద్దు!

- టీషర్ట్స్ అంటే ఎక్కువ మంది డిజైన్ ఉన్నవి సెలక్ట్ చేసుకుంటారు. అయితే అన్ని సందర్భాలకు ఇలాంటి టీషర్ట్స్ సెట్ కావు. వాటి మీద మాత్రం లోగోలు లేకుండా ఉన్నవి కొనుక్కోవడం బెటర్.
- జీన్స్ ట్రౌజర్స్‌లో కూడా రకాలు ఉంటాయి. అందులో బ్యాగీ జీన్స్ జోలికి మాత్రం వెళ్ళద్దు. ఇవి చాలా వదులుగా ఉండటంతో ఏ మాత్రం స్టయిల్‌గా ఉండదు. జీన్స్ మీద ఏ లోగో లేకుండా చాలా సింపుల్‌గా ఉండే జీన్స్‌ను కొనుగోలు చేయండి. ఉదాహరణకు డార్క్ స్ట్రయిట్ లెగ్ జీన్స్ అయితే అందరికీ సెట్ అవుతుంది.

ఇవీ ముఖ్యమే!

- చేతికి వాచ్ ఉందా? టైం చూసుకోవడానికే కాదు. స్టయిల్ కోసం కూడా. కొంత మందికి వాచ్ పెట్టుకునే అలవాటు ఉండదు. అప్పుడు బ్రాస్లెట్ అయినా ధరించండి. ... ఉంచుకోండి.
- ఎంత ... సెట్ అయ్యే ... దెబ్బతింటుం... ఉంటుంది. ... లేటెస్ట్ ట్రెండ్... షూస్‌ను కూ... ఎక్కడికెళ్ళినా ... మాయిశ్చరైజ... లేదా డియో... పాటు ... మంచిది.

ఫ్యాషన్



మనోళ్లు 'స్మార్ట్' గురూ!

సర్వే సారం



రాజేష్, అరుణ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. ఈ మధ్యే వారికి పెళ్లయింది. వీకెండ్‌లో సరదాగా ట్రిప్ వేద్దామనుకున్నారు. వెంటనే స్మార్ట్ ఫోన్ తీసి తనకు కావాల్సిన యాప్‌లో తాము వెళ్లబోయే ప్లేస్ కోసం రివ్యూలు చూశాడు. తెలిసిన వాళ్లను అడిగాడు. మొత్తం వివరాలను ఆరా తీశాడు. ఆన్‌లైన్‌లో యాప్స్‌లో ఉన్న సమాచారాన్ని జల్లెడ పట్టాడు. మొత్తానికి ట్రిప్ కన్‌ఫర్మ్ అయింది. ఇదంతా అతను ఎక్కడికి వెళ్లకుండానే స్మార్ట్‌ఫోన్‌లోనే అన్నీ జరిగిపోయాయి. ప్రపంచమంతా నడుస్తున్న ట్రెండ్ ఇదే. కొత్తగా చెప్పేదేం లేదు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో మనోళ్లు హై'టెక్'గా ఉన్నారని ట్రావెల్‌పోర్ట్ అనే సంస్థ చేసిన సర్వేలో తేలింది. ఏకంగా అమెరికా లాంటి అగ్రరాజ్యాన్ని వెనక్కి నెట్టి భారత్ మొదటిస్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 11,000 మంది ట్రావెలర్స్ నుంచి ఆ సంస్థ వివరాలు సేకరించింది. సుమారు 1000 మంది భారతీయులు ఈ సర్వేలో పాల్గొన్నారు.

ఈ-టిక్కెట్లే సౌ బెటరు!

...

వెళ్లిన రెస్టారెంట్ లేదా హోటల్ ఎలా ఉందో ఆన్‌లైన్‌లోనే అప్పటికప్పుడు పోస్ట్ చేస్తున్నారట. ఇలాంటివారు 92 శాతంమంది ఉన్నారు. చాలా మంది ...

ఫ్రీ వైఫై కావాల్సిందే!

...

సమీక్షల్లో కూడా ఫస్ట్!

...

ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్



ఎగిరిపోతే.. ఎంత బాగుంటుంది!

వేల రంగుల్లో, వేవేల రూపాల్లో ఆకాశానికి ఎగరడానికి పోటీ పడుతున్న పతంగులను చూసి ముగ్ధులు కానివారెవరుంటారు? సంక్రాంతి దగ్గరకొస్తోందంటే అందరికీ గుర్తొచ్చేది గాలిపటాలే! ఇల్లిల్లూ గాలిపటాలకు విడిదై, పిన్నా పెద్దా తేడా లేకుండా పొద్దు పొడిచిన దగ్గర్నించీ రాత్రయ్యేదాకా తనివితీరకుండా చేసుకొనే సంబరం అహ్మదాబాద్‌లోని అంతర్జాతీయ పతంగుల ఉత్సవం. ప్రధానంగా అహ్మదాబాద్ ఈ వేడుకకు వేదికైనా, గుజరాత్‌లోని ప్రతి నగరం, పట్టణం, పల్లె ఉత్సాహంగా పాల్గొనే పండగ ఇది. నింగికీ, నేలకీ మధ్య గాలిపటాలతో పందిరేసినట్టు కనిపిస్తుంది. అనేక దేశాల నుంచి తరలివచ్చే గాలిపటాల ప్రియులు రూపొందించే అత్యద్భుతమైన ఆకృతులకూ, వారి సృజనాత్మకతకూ ఆకాశమే హద్దు.

ఎక్కడ జరుగుతుంది?: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో

ఎప్పుడు?: జనవరి ఏడో తేదీ నుంచి పదిహేను వరకూ

ఎలా వెళ్ళాలి?: దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాల నుంచీ అహ్మదాబాద్‌కు రోడ్డు, రైలు, విమాన మార్గాల్లో చేరుకోవచ్చు.

బస ఎక్కడ?: అన్ని రకాల బడ్జెట్లలోనూ అహ్మదాబాద్‌లో అనువైన వసతి సదుపాయాలున్నాయి.

సందర్భం ఏమిటి?: ఉత్తరాయణ పుణ్యకాలాన్ని (మన ప్రాంతంలో అయితే సంక్రాంతి రోజును) ఆహ్వానిస్తూ గుజరాత్‌లో చేసుకునే వేడుక ఇది. అందుకే దీన్ని 'ఉత్తరాయణ్' అని కూడా అంటారు. ఆ రాష్ట్రంలో పల్లెల్లో, పట్నాల్లో ఉత్సాహంగా గాలిపటాలు ఎగరేస్తారు. ఈ వేడుకల్లో ప్రతి ఇల్లూ తెల్లారుజామున మేలుకుంటుంది. పిల్లలూ, పెద్దలూ మేడల మీద, వీధుల్లో గాలిపటాలు ఎగరేస్తారు. ఇది సాయంత్రం వరకూ సాగుతుంది. ఇరుగుపొరుగువారి మధ్య గాలిపటాల పోటీలుంటాయి. పక్కవాళ్ళ గాలిపటాలను తెంచేసి నేల కూల్చడానికి ఎత్తులూ పైయెత్తులూ ఉంటాయి. ఇదంతా క్రీడాస్ఫూర్తితో నడిచే వినోదం. పతంగుల దుకాణాలు రోజంతా తెరిచే ఉంటాయి.

ఇవీ ప్రత్యేకతలు: 1989 నుంచీ 'ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్'కు అహ్మదాబాద్ ఆతిథ్యం ఇస్తోంది. గుజరాత్, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచే కాదు, ఇంగ్లండ్, కెనడా, ఆస్ట్రేలియా, ఇండోనేసియా, అమెరికా, ఫ్రాన్స్, చైనా, సింగపూర్, ఇటలీ, జపాన్, కెనడా, బ్రెజిల్... ఇలా అనేక దేశాల నుంచి ఈ ఉత్సవాల్లో పాల్గొనడానికీ, తిలకించడానికీ సందర్శకులు తరలివస్తారు. రాజకీయ నేతలూ, బాలీవుడ్ సెలబ్రిటీల సంగతి సరేసరి. మలేసియా వారి వా-బలాంగ్ పతంగులు, అమెరికా వారి భారీ బ్యానర్లతో కట్టిన గాలిపటాలు, జపాన్ వారి రొక్కకూ ఫైటింగ్ కైట్స్, ఇటాలియన్ శిల్పకళ ఉట్టిపడేవీ, చైనా ఫ్లయింగ్ డ్రాగన్స్, ఇండోనేసియా వారి ఇల్లయాంగ్-ఇల్లయాంగ్‌హేవ్ గాలిపటాలు... ఇలా సంప్రదాయానికి ఆధునికతను కలగలిపి రూపొందించే గాలిపటాలు చూపరుల్ని కళ్ళు తిప్పుకోనివ్వవు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, నోరూరించే ఫుడ్ స్టాల్స్, షాపింగ్ ప్రియుల కోసం దుకాణాలు ఉండనే ఉంటాయి.

ఈ-జీ ట్రావెల్

విమానం టిక్కెట్ ధరలు ఎప్పుడు తగ్గుతాయా? అని వేయికళ్లతో ఎదురుచూస్తున్న వాళ్లు ఉంటారు. ఎందుకంటే వాటి ధరల్లో ఎప్పుడు హెచ్చుతగ్గులు ఉంటాయో ఎవరికీ తెలీదు. ప్రతిసారీ చెక్ చేసుకుంటూనే ఉండాలి. లేదంటే ఏదో ఒకసారి పెట్టే ఆఫర్లను ఎప్పటికప్పుడు కనిపెట్టుకుంటూ ఉండటం కష్టమే. అందుకే ఈ యాప్ ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. చాలా తక్కువ ధరలో

తక్కువ రేటుకే!



విమానం టిక్కెట్ పొందవచ్చు. ఆ యాప్ పేరే 'హాపర్'. మొదట ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలో వివరాలను ఎంటర్ చేసి, ఆ తర్వాత తేదీని సెలక్ట్ చేసుకోవాలి. అప్పుడు ఓ క్యాలెండర్ ఓపెన్ అవుతుంది. రెడ్, గ్రీన్, ఆరెంజ్ కలర్స్‌లో తేదీలు మార్క్ చేసి ఉంటాయి.

- రెడ్ కలర్‌లో మార్క్ చేసి ఉన్న తేదీలో విమానం ధరలు ఎక్కువగా ఉన్నట్టు లెక్క.
- గ్రీన్ కలర్‌లో ఉంటే ధర తక్కువ అని అర్థం. ఇక దాని బట్టి తక్కువ రేట్‌కే టికెట్ బుక్ చేసుకోవచ్చు.

సెల్ఫ్ డ్రైవింగ్‌దే ఫ్యూచర్



ఎక్కడికైనా వెళ్లాలంటే ట్రైనో, బస్సో బుక్ చేస్తాం. కానీ ఇప్పుడు సెల్ఫ్ డ్రైవ్‌దే భవిష్యత్తు అంటున్నారు నిపుణులు. దీనికి కారణం 'హోమ్ స్టే'లే. కొందరు పర్యాటకుల కోసమే తమ ఇళ్లను అద్దెకిస్తూ ఉంటారు. గోవా, కేరళ, కూర్గ్, పాండిచ్చేరిల్లో వీటికి మంచి డిమాండ్. దాంతో యూత్ ట్రావెలర్స్ రయ్‌మంటూ తమకు నచ్చిన చోటికి దూసుకెళిపోతున్నారు. ఈ విషయంలో గోవా నంబర్ వన్.

అబ్బాయిల్లో ఎమోషన్ తక్కువే!

మన అనుకున్నవారికి ఏదైనా కీడు జరిగితే అమ్మాయిలు విలవిల్లాడిపోతారు. కన్నీళ్ల కట్టలు తెంచుకుంటాయి. అనుబంధాలు, ఆప్యాయతల కోసం అమ్మాయిలు పడే తాపత్రయం అలా కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. కానీ ప్రేమ, జాలి, బాధ, సానుభూతి లాంటి భావోద్వేగాల పాలు అమ్మాయిలతో పోలిస్తే, అబ్బాయిల్లో తక్కువనీ, ఏం జరిగినా అబ్బాయిలు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటారనీ, అమ్మాయిలుకున్నంత పట్టింపు అబ్బాయిలకు ఉండదని సాధారణంగా భావిస్తారు. స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తలు కూడా ఇది నిజమేనంటున్నారు. దీనికి గల కారణాలపై వారు పరిశోధన జరిపారు. అబ్బాయిల మెదడు నిర్మాణమే దీనికి కారణమని తేల్చారు. మెదడులోని బూడిదరంగు పదార్థం (యాంటేరియర్ ఇన్సులా) పరిమాణంపైనే ఇతరుల భావోద్వేగాలను గుర్తించి సానుభూతి చూపటం ఆధారపడి ఉంటుంది. ఇది అమ్మాయిల్లో కన్నా అబ్బాయిల్లో చాలా ఎక్కువగా ఉందని వారు కనుగొన్నారు. అందువల్లే అబ్బాయిలు 'ఐ డోంట్ కేర్' అన్నట్టు ఉండి మొద్దబ్బాయిలుగా గుర్తింపు పొందుతున్నారని శాస్త్రవేత్తలు తేల్చారు.

లైఫ్ లైన్



డైలీ సుడోకు - 68

1		7				4		
6	4				5	9		
			2		4			
			7			6	9	
5	7		4	9	3		2	8
	8	4			1			
			8		7			
		5	9				4	7
		1				3		6

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 67 సమాధానం

[illegible]



ప్రభాస్

హిందీ యాసపై వర్క్ చేస్తున్నా

ఓ హీరో ఒకే ఒక్క సినిమాకు ఐదేళ్లు రాసిచ్చేయడం మాటలు కాదు. కానీ, 'బాహుబలి'కి ఐదేళ్లు కేటాయించి పెద్ద సాహసమే చేశారు ప్రభాస్. ఇప్పుడు ఇంకో సినిమాకు అదే విధంగా ఐదేళ్ల కేటాయిస్తారా? అనడిగితే... 'నో' అంటున్నారాయన. ఒక ఆంగ్ల న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రభాస్ పలు అంశాల గురించి ముచ్చటించారు. ఆయన చెప్పిన విశేషాలు...

❖ హీరోలకూ తక్కువ టైమే ఉంటుంది (కెరీర్ పరంగా!). మళ్లీ ఇప్పుడు మరో సినిమాకు ఐదేళ్ల ఇవ్వలేను. నా కెరీర్‌కు అదంత మంచిది కాదు. ఒకవేళ ఐదేళ్లు ఇచ్చినా... దాంతో పాటు వేరే సినిమాలు కూడా చేస్తా. ఎందుకంటే... వయసునూ దృష్టిలో పెట్టుకోవాలి కదా!

❖ 'బాహుబలి' వంటి ఛాన్స్ లైఫ్‌లో ఒక్కసారే వస్తుంది. అదెంత భారీ చిత్రమో తెలిసే చేశా. 'బాహుబలి' విజయంపై నా కెరీర్‌ను నిర్మించుకోవాలనుకుంటున్నా. ఇకపై చేసే సినిమాల్లో యూనివర్శల్ అప్పీల్ ఉండేలా చూసుకుంటా. ప్రాంతీయ చిత్రాలు, కథలు వేరు. దేశవ్యాప్తంగా ఉన్న నా అభిమానులను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు కథలు ఎంపిక చేసుకుంటున్నా. ప్రేక్షకులందరికీ నచ్చే కథలే చేస్తా.

❖ హిందీ చిత్రాలు చేయాలనే ఆసక్తి నాలోనూ ఉంది. ఒక్క హిందీలోనే కాదు... పంజాబీ సహ దేశంలో ఎక్కడైనా, ఏ భాషలోనైనా చిత్రాలు చేస్తా. మంచి కథ కుదరాలంతే. ప్రాంతం, భాష... నాకు పెద్ద సమస్యే కాదు. నా చిత్రాలు ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలనుకుంటా. అంటే... కామెడీ అని కాదు. సంథింగ్ డిఫరెంట్‌గా, గ్రిప్పింగ్‌గా ఉండాలి. హిందీ నుంచి చాలా అవకాశాలు వస్తున్నాయి. మూడేళ్ల క్రితమే అక్కడ ఓ ప్రేమకథను అంగీకరించా. 'సాహో' తర్వాత ఆ కథలో నటిస్తా.

❖ హిందీలో డబ్బింగ్ చెప్పుకోవడం నాకు పెద్ద టాస్క్. హిందీ చదవడమూ, రాయడమూ వచ్చు. అయితే... నేను రెగ్యులర్‌గా మాట్లాడను. ఇప్పటికీ నా యాస దక్షిణాది వ్యక్తిలానే ఉంటుంది. హిందీ ప్రేక్షకులు నా డైలాగులు విని, వాళ్లలా మాట్లాడుతున్నాననుకోవాలి. అది ముఖ్యం. అందుకే, నా హిందీ యాసపై వర్క్ చేస్తున్నా.

❖ హాలీవుడ్‌లో 'బాట్‌మ్యాన్', 'సూపర్‌మ్యాన్' పాత్రలు చేసిన హీరోలు, ఆ తర్వాత సాధారణ పాత్రల్లో నటిస్తారు. మన దగ్గర గత సినిమాలో హీరో సూపర్‌మ్యాన్‌గా కనిపిస్తే, తర్వాత మామూలు పాత్ర చేస్తే అంతగా వర్కౌట్ కాదంటుంటారు. నా దృష్టిలో అది తప్పు. ప్రపంచంలో గొప్ప గొప్ప నటులందరూ ప్రయోగాలు చేయాలనుకుంటున్నారు. మనమెందుకు చేయకూడదు. నేను చాలా యాక్షన్ సినిమాలు చేశా. ప్రేక్షకులు ఆదరించారు. ఆ తర్వాత చిన్న ప్రేమకథ (డార్లింగ్!) చేశా. మంచి కథ, హిట్టయ్యింది. సినిమా ఫ్లాపయితే.. కథ వల్ల ఆడలేదంటారు. 'కథ వల్ల కాదు. కథలో, అందులో పాత్రలో హీరో సెట్ కాకపోవడం వల్ల సినిమా ఆడలేదేమో!' అని నేనంటాను

❖ ఇప్పటివరకూ 50 రోజులు 'సాహో' షూటింగ్ చేశాం. త్వరలో దుబాయ్‌లో ప్రారంభం కానున్న షెడ్యూల్‌లో పాల్గొంటాను.


మేఘాల్లో మహేశ్...



మహేశ్



అభిమానుల గుండెల్లో మహేశ్ స్థానం ఎప్పుడూ ఆకాశమంత ఎత్తులో, ఆల్మోస్ట్ మేఘాల్లోనే ఉంటుంది. అయితే మంగళవారం మహేశ్ నిజంగానే మేఘాల్లోకి వెళ్లారు. గతేడాది చివర్లో అరబ్ దేశాలకు ఫ్యామిలీతో కలసి హాలిడే ట్రిప్‌కి వెళ్లిన మహేశ్, ఇప్పుడు ఒమన్‌లో ఉన్నారు. అక్కడ పారాగ్లైడింగ్ చేశారాయన. కాసేపు మేఘాల్లో షికారు చేసొచ్చారు. మహేశ్ తనయుడు గౌతమ్ కృష్ణ కూడా పారాగ్లైడింగ్ చేశారు. ఈ ఫోటోలనూ ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో పంచుకున్న మహేశ్ సతీమణి నమ్రత "నా సూపర్ హీరోలు. తండ్రిలానే కొడుకు కూడా! గౌతమ్ తొలిసారి పారాగ్లైడింగ్ చేశాడు. నా చిన్నారి పెద్దోడయ్యాడు" అని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే హైదరాబాద్‌కు తిరిగొచ్చిన తర్వాత అంటే ఈ నెల ఏడు నుంచి 'భరత్ అనే నేను' చిత్రం షూటింగ్‌లో పాల్గొంటారు మహేశ్. 13 వరకూ వర్క్ చేసి, సంక్రాంతి పండగ కోసం ఓ మూడు రోజులు బ్రేక్ ఇచ్చి, ఆ తర్వాత మళ్లీ షూటింగ్‌కి హాజరవుతారు.



మనకన్నా ముందు అమెరికాలో...

పవన్‌కల్యాణ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మించిన సినిమా 'అజ్ఞాతవాసి'. సంక్రాంతి కానుకగా ఈ నెల 10న విడుదలవుతోన్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సో... సంక్రాంతి సందడికి అంతా రెడీ అయినట్లే! త్వరలో సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నారట! కీర్తి సురేశ్, అనూ ఇమ్మాన్యుయేల్ కథానాయికలుగా, ఖుష్బూ కీలక పాత్రలో నటించిన ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ స్వరకర్త. అన్నట్టు... అమెరికాలో 9వ తేదీనే ఈ సినిమా ప్రీమియర్ షోలు వేస్తున్నారు.

చిలుకూరు బాలాజీ... విశేషాలెన్నో!



అల్లాణి శ్రీధర్

"భగవంతుడి సన్నిధికి భక్తుడు చేరుకోలేకపోయినప్పుడు, అతని భక్తిని మెచ్చి కొండ దిగి కోనేటిరాయుడే స్వయానా వచ్చి వెలసిన చోటు చిలుకూరు. అక్కడి మూర్తి బాలాజీ గురించి 'చిలుకూరు బాలాజీ' చిత్రాన్ని తెరకెక్కించాం. శుక్రవారం విడుదల కానుంది" అని ఆ చిత్ర దర్శకుడు అల్లాణి శ్రీధర్ అన్నారు. సాయికుమార్, భానుశ్రీ మెహ్రా, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం కీలక పాత్రధారులు. ఈ సినిమా గురించి అల్లాణి శ్రీధర్ 'చిత్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడుతూ "తెలంగాణలో 22, ఆంధ్రప్రదేశ్‌లో 38 థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఇటీవల దిల్‌రాజుగారు సినిమా చూశారు. ఆయనకు బాగా నచ్చింది. వెంటనే విడుదల చేయడానికి మాకు సహకరించారు. ధనుర్మాసంలో విడుదల చేయమని సలహా ఇచ్చింది కూడా ఆయనే. చిలుకూరు బాలాజీ గుడి కట్టడానికి మాధవ రెడ్డి అనే రైతు ఎలాంటి ఇబ్బందులు పడ్డాడు. ఆచార్యుని సహకారం వల్ల అతను చేసింది ఏంటి? ఏడుకొండలవాడి సన్నిధిలో తప్ప మరెక్కడా గళం విప్పని తిరుమలదాసుకు చిలుకూరులో కనిపించిన విశేషం ఏంటి? వంటి అంశాలతో చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ సినిమాకు అర్జున్ సంగీతం బాగా చేశారు. స్క్రీన్‌ప్లే అజయ్‌శాంతి చేశారు. కథ అద్భుతంగా కుదిరింది. కె.వి.రమణాచారిగారికి, చిలుకూరి ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పాలి. చిన్నపిల్లలు హనుమంతుడిని ఇష్టపడ్డట్టే, యువకులు చిలుకూరు బాలాజీ ని అమితంగా పూజిస్తుంటారు. పర్వదినాల్లో ఆ క్షేత్రంలో 50వేల మందికి తక్కువ కాకుండా యువతను చూడవచ్చు. అందువల్ల మా సినిమా యువత మెచ్చే సినిమా అవుతుంది. తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది." అని తెలిపారు.



పూజా హెగ్డే



పద్మావతా? అలివేలు మంగమ్మా?

ఏడు కొండల శ్రీనివాసుడికి ఇద్దరు సతీమణులు ఉన్నారు. ఒకరు... పద్మావతీ దేవి. ఇంకొకరు... అలివేలు మంగమ్మ. నితిన్ హీరోగా సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న సినిమా 'శ్రీనివాస కల్యాణం'. ఇందులోనూ హీరోకి జోడీగా ఇద్దరమ్మాయిలు నటిస్తున్నారు. ఇద్దరిలో ఒకరిగా 'దువ్వాడ జగన్నాథమ్' ఫేమ్ పూజా హెగ్డేని ఎంపిక చేసినట్టు సమాచారం. మరి, ఈ 'శ్రీనివాస కల్యాణం'లో పూజ పాత్ర ఎలా ఉండబోతుందో?? 'పద్మావతి దేవి' తరహాలోనా... 'అలివేలు మంగమ్మ' తరహాలోనా... తెలియాలంటే కొన్ని రోజులు ఎదురు చూడాల్సిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై 'దిల్' రాజు నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ మార్చిలో మొదలు కానుంది. జాతీయ పురస్కారం సాధించిన 'శతమానం భవతి' తర్వాత సతీశ్ వేగేశ్న దర్శకత్వం వహించనున్న చిత్రమిది. ఇది కాకుండా ప్రస్తుతం పూజా హెగ్డే చేతిలో రెండు సినిమాలున్నాయి. రామ్‌చరణ్ 'రంగస్థలం'లో ప్రత్యేక గీతంలోనూ, బెల్లంకొండ 'సాక్ష్యం'లో కథానాయికగానూ నటిస్తున్నారు.

మావయ్యే ఎక్కువ సంతోషించారు

\- సుమంత్



"మనసుతో చేసిన సినిమా 'మళ్లీ రావా'. ప్రేక్షకులూ మనసు పెట్టి చూశారు. మంచి విజయాన్ని అందించారు. చాలా హ్యాపీగా ఉంది. నాగార్జున మావయ్య కొంచెం బిజీగా ఉండడం వల్ల ఇంకా సినిమాను చూడలేదు. కానీ, ప్రేక్షకుల స్పందన తెలుసుకుని అందరి కన్నా ఆయనే ఎక్కువ సంతోషించారు" అన్నారు సుమంత్. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఆయన హీరోగా నటించిన 'మళ్లీ రావా' మంచి టాక్‌తో ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ "హిట్టూఫ్లాపులను సమానంగా స్వీకరించడం, ఒకేలా (బ్యాలెన్స్‌డ్‌గా) రియాక్ట్ కావడం ఎప్పుడో అలవాటు అయ్యింది. అయితే... అందరికీ సినిమా నచ్చడంతో సంతోషంగా ఉంది. 'గౌరి', 'ధన 51' వంటి మాస్ హిట్స్‌లో పాటు 'సత్యం', 'గోదావరి', 'మళ్లీ రావా' వంటి క్లాస్ హిట్స్ నా కెరీర్‌లో ఉన్నాయి. ఇకపై కూడా అన్ని రకాల సినిమాలు చేయాలనుకుంటున్నా. ఇప్పుడు శ్రీనివాస్ అవసరాల అసోసియేట్ అనీల్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా. 'మళ్లీ రావా'లో పాత్రతో పోలిస్తే కంప్లీట్ డిఫరెంట్ క్యారెక్టర్. యాంటీ-హీరో (నెగిటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్)గా చేస్తున్నా. అదొక థ్రిల్లర్ సిన్మా. 15 రోజులు షూటింగ్ చేశాం. త్వరలో కొత్త షెడ్యూల్ మొదలవుతుంది" అన్నారు.



త్రిష

ఏమో... గుర్రం మళ్లీ ఎగరావచ్చు!!

"ప్రేమలో ఉన్నప్పుడు ప్రతిదీ బాగుంటుంది. ఎదుటివ్యక్తి చేసే ప్రతి పనీ నచ్చుతుంది. ఇకవేళ చిన్న చిన్న తప్పులు చేసినా క్షమించేస్తాం. ప్రేమ లేనప్పుడు... మీరు ప్రేమలో లేనప్పుడు... మనసు గది తలుపుల నుంచి ఎదుటివ్యక్తిని బయటకు పంపేమంటుంది. ఆ వ్యక్తికి బయటకు దారి చూపిస్తుంది" అంటున్నారు త్రిష. ఎప్పుడో విడుదలైన సినిమా గురించి మళ్లీ ఇప్పుడు మాట్లాడడమంటే... సంథింగ్ ఏదో ఉన్నట్టేనంటున్నారు చెన్నై కోడంబాకమ్ వర్గాలు. తమిళ నిర్మాత వరుణ్ మణియన్‌తో త్రిష ప్రేమ ప్రయాణం పెళ్లి పీటల వరకూ వెళ్లి పల్టీ కొట్టిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ప్రేమ అనే టాపిక్ గురించి త్రిష ఎక్కువగా మాట్లాడింది లేదు. ఇప్పుడు 'ప్రేమలో ఉన్నప్పుడు... లేనప్పుడు' అంటూ కొత్త కొత్త అర్థాలు చెబుతుంటే... తమిళ సినిమా జనాలుకు ఏవేవో సందేహాలు వస్తున్నాయి. మళ్లీ ఎవరితోనైనా త్రిష ప్రేమలో పడ్డారంటారా?? ఏమో... గుర్రం మళ్లీ ఎగరావచ్చు!! అయితే... త్రిష మాత్రం ప్రస్తుతానికి తన దృష్టంతా సినిమాలపైనే అని చెబుతున్నారు.

మీరిద్దరూ అలాగే ఉండండి!

\- కరణ్‌జోహార్



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని 'ధడక్' జంట జాహ్నవి కపూర్, ఇషాన్ ఖట్టర్‌ను ఉద్దేశించి కరణ్ జోహార్ ఓ లవ్‌నోట్ రాసి చదివారు. 104.8ఇష్క్ ఎఫ్.ఎం. షోలో కరణ్ ఆ లవ్‌నోట్‌ను చదివారు. "ఇది కొత్త ఏడాది. అంటే కొత్త ప్రారంభోత్సవాలకు అనువైన సమయం. ప్రియమైన జాహ్నవి, ఇషాన్.. మీరిద్దరూ ఈ ఏడాది స్టార్‌డమ్ వైపు ప్రయాణం చేస్తున్నారు. 2018లో ప్రమోషన్స్ నుంచి లింకప్‌ల నుంచి, ఫేమ్, గెలుపు ఓటముల వరకు చాలా చూడాల్సి ఉంటుంది. అయితే నేనిక్కడ చెప్పొచ్చేదేమిటంటే దేని గురించీ అతిగా ఆలోచించవద్దు. ప్రతి కొత్త అనుభవాన్ని ఆస్వాదించండి. ఎందుకంటే కెరీర్లో తొలి రోజులు మరలా రమ్మన్నా రావు" అని అన్నారు.

ఐఐఎఫ్‌టి విద్యార్థులకు కోటి ఆఫర్

న్యూఢిల్లీ: కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టి)లో జరిగిన ప్రాంగణ నియామకాల ప్రక్రియలో పలు టాప్ కంపెనీలు పాల్గొన్నాయి. నలుగురు విద్యార్థులైతే ఏకంగా లక్షన్నర డాలర్ల (రూ.95 లక్షలు) వార్షిక ప్యాకేజీతో ఆఫర్ లెటర్లు అందుకున్నారు. మరో ఏడుగురికి 80 వేల డాలర్ల ప్యాకేజీ లభించిందని ఐఐఎఫ్‌టి వెల్లడించింది. ఈ ఏడాది మొత్తం 31 మందికి విదేశాల్లో పనిచేసేందుకు అవకాశం లభించిందని తెలిపింది. ఐఐఎఫ్‌టి క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో పాల్గొన్న కంపెనీల్లో బ్రిటిష్ టెలికాం, డిబిఎస్, గోద్రేజ్, హీరో మోటోకార్ప్, మదర్ డైరీ, షాపూర్‌జీ పల్లోంజీ, టెట్రా ప్యాక్, టీవీఎస్ మోటార్స్ ఉన్నాయి.

భారత్ బయో టైఫాయిడ్ వ్యాక్సిన్‌కు
డబ్ల్యుహెచ్ఒ ఆమోదం

▸ 60-70 దేశాలకు ఎగుమతి చేసే అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ ఎల్లా, సుచిత్ర ఎల్లా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయంగా వ్యాక్సిన్లను ఉత్పత్తి చేస్తున్న భారత్ బయోటెక్ మరో ఘన విజయం సాధించింది. విష జ్వరాల (టైఫాయిడ్) నియంత్రణ కోసం ప్రపంచంలో తొలిసారిగా కంపెనీ అభివృద్ధి చేసిన టైప్‌బార్ టిసివి వ్యాక్సిన్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ముందస్తు అర్హత (ప్రీక్వాలిఫైడ్) సాధించింది. బుధవారం విలేకరుల సమావేశంలో కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ ఎల్లా ఈ విషయం చెప్పారు. 'ఈ గుర్తింపుతో యునిసెఫ్, పాన్ అమెరికన్ హెల్త్ ఆర్గనైజేషన్ (పిఎహెచ్ఒ), గ్లోబల్ అలయన్స్ ఫర్ వ్యాక్సిన్స్ అండ్ ఇమ్యునైజేషన్ (గవి) నిధులతో నడిచే అంతర్జాతీయ ప్రాజెక్టులకు టైప్‌బార్ టిసివి వ్యాక్సిన్ సరఫరా చేసేందుకు అవకాశం ఏర్పడింది' ఆయన అన్నారు. ప్రస్తుతం వర్ధమాన దేశాల్లో టైఫాయిడ్ నియంత్రణ పెద్ద సమస్యగా మారింది. దీని నియంత్రణకు అవసరమైన వ్యాక్సిన్ల సరఫరా కోసం 2019-20 సంవత్సరానికి గవి సంస్థ ఇప్పటికే 8.5 కోట్ల డాలర్లు (సుమారు రూ.544 కోట్లు) కేటాయించింది. ఇందులో సగం నిధులను బంగ్లాదేశ్, నేపాల్, మలావి, కెన్యా దేశాల కోసం ఖర్చు చేయబోతోంది.

డోసు ధర రూ.1,500

భారత్ బయోటెక్ గత మూడేళ్ల నుంచి టైప్‌బార్ టిసివి వ్యాక్సిన్‌ను దేశీ మార్కెట్లో విక్రయిస్తోంది. యాంటీ బయాటిక్ మందులకు కూడా లొంగని టైఫాయిడ్ జ్వరాల నుంచి కూడా టైప్‌బార్ టిసివి వ్యాక్సిన్ రక్షణ కల్పిస్తుందని కృష్ణ ఎల్లా చెప్పారు. ప్రస్తుతం డోసు రూ.1,500 ధరతో ఈ వ్యాక్సిన్‌ను విక్రయిస్తోంది. ఒక వ్యక్తికి ఒక డోసు వ్యాక్సిన్‌తోనే టైఫాయిడ్ జ్వరాలు అదుపులోకి వస్తుంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వస్తే మరింత తక్కువ ధరకే ఈ వ్యాక్సిన్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు కృష్ణ ఎల్లా తెలిపారు. ఆరు నెలల బాలల నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు ఎవరైనా ఈ వ్యాక్సిన్ ద్వారా టైఫాయిడ్ జ్వరాల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఈ వినూత్నమైన వ్యాక్సిన్ అభివృద్ధి కోసం 2001 నుంచి కంపెనీ దాదాపు రూ.150 కోట్ల సొంత నిధులు ఖర్చు చేసింది.

2013లో ఈ వ్యాక్సిన్ ఉత్పత్తికి కంపెనీకి ప్రభుత్వం నుంచి లైసెన్సు లభించింది. గత మూడేళ్లుగా దేశీయ మార్కెట్‌తో పాటు, పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్ వంటి దేశాలకు సరఫరా చేస్తోంది. ప్రస్తుతం దేశంలో అమ్ముడయ్యే టాప్-10 వ్యాక్సిన్లలో టైప్‌బార్ టిసివి వ్యాక్సిన్ ఒకటి. డబ్ల్యుహెచ్ఒ నుంచి తాజాగా లభించిన గుర్తింపుతో వచ్చే రెండు మూడేళ్లలో 60-70 దేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఏర్పడిందని కృష్ణ ఎల్లా చెప్పారు.

ఆరు బ్యాంకులకు రూ.7,577 కోట్లు



న్యూఢిల్లీ: బలహీనంగా ఉన్న అరడజను ప్రభుత్వరంగ (పిఎస్‌యు) బ్యాంకులకు సర్కారు నుంచి ఆర్థిక దన్ను లభించనుంది. ఈ బ్యాంకులకు 7,577 కోట్ల రూపాయలు ఇవ్వాలన్న ప్రభుత్వ ప్రతిపాదనకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. పునః మూలధనీకరణ ప్రణాళికలో భాగంగా ఈ బ్యాంకులకు ప్రభుత్వం నిధులు అందించనుంది. ఈ నిధులను పొందే బ్యాంకులు భవిష్యత్‌లో మెరుగైన వృద్ధిని సాధించేందుకుగాను దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇంద్రధనుష్ ప్రణాళికలో భాగంగా 2019 మార్చితో ముగిసే నాలుగేళ్లకాలంలో బ్యాంకులకు 70,000 కోట్ల రూపాయలు ఇవ్వనున్నట్టు ప్రభుత్వం ఇంతకు ముందు ప్రకటించింది. ఇందులో భాగంగానే బ్యాంకులకు నిధులను సమకూర్చుతోంది.

ప్రభుత్వం నుంచి నిధులను పొందే బ్యాంకుల్లో బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడిబిఐ బ్యాంక్, యుకో బ్యాంకులు ఉన్నాయి. ఈ బ్యాంకులు వాటాదారుల నుంచి తగిన అనుమతులు పొందిన తర్వాత వచ్చే కొన్ని వారాల్లో నిధులను పొందడానికి ఆస్కారం ఉంది. యుకో బ్యాంకు 1,375 కోట్ల రూపాయలు ప్రభుత్వంనుంచి పొందితే అందుకు బదులుగా ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన ఈక్విటీ షేర్లను జారీ చేసేందుకు బోర్డు అనుమతిని పొందింది. ప్రభుత్వానికి 3.88 కోట్ల షేర్లను ఒక్కోటి 83.15 రూపాయల (విలువ రూ.323 కోట్లు) చొప్పున కేటాయించాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బోర్డు నిర్ణయించింది. బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 2,257 కోట్ల రూపాయలు, ఐడిబిఐ బ్యాంకుకు 2,729 కోట్ల రూపాయలు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు 650 కోట్ల రూపాయలు, దేనా బ్యాంకుకు 243 కోట్ల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మొండిపద్దుల కారణంగా తీవ్ర ఒత్తిడులను ఎదుర్కొంటున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేసేందుకు వచ్చే రెండేళ్ల కాలంలో 2.11 లక్షల కోట్ల రూపాయల నిధులు అందించనున్నట్టు ఇంతకు ముందు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించిన విషయం తెలిసిందే.

మొండి బకాయిల(ఎన్‌పిఎ)తో సతమతమవుతున్న బ్యాంకింగ్ రంగానికి మరో కొత్త సమస్య వచ్చిపడింది. ప్రభుత్వ రుణ పత్రాలపై వడ్డీ రేట్లు పెరగడంతో బ్యాంకింగ్ రంగ ట్రెజరీ ఆదాయానికి గండిపడుతోంది. బ్యాంకులు తమ నిధుల్లో కొంత భాగాన్ని విధిగా ప్రభుత్వ రుణ పత్రాల్లో (ట్రెజరీ బాండ్స్) మదుపు చేయాలి. వడ్డీ రేట్లు పెరిగినప్పుడల్లా వీటిపై వచ్చే రాబడి తగ్గుతుంటుంది. ప్రభుత్వ రుణ సేకరణ పెరగడం, చమురు సెగతో ఇటీవల ద్రవ్యోల్బణం మళ్లీ సెగలు కక్కుతోంది. దీంతో ప్రభుత్వ రుణ పత్రాలపై వడ్డీ రేట్లు పెరుగుతున్నాయి. గత మూడు నెలల్లోనే ఈ బాండ్లపై

బ్యాంకులకు రూ.15,000 కోట్ల నష్టం!

వడ్డీ రేట్లు 67 బేసిస్ పాయింట్లు (0.67 శాతం) పెరిగాయి. వడ్డీ రేట్లు పెరగడంతో ఇప్పటికే ఈ బాండ్లు కలిగి ఉన్న బ్యాంకులు, వ్యక్తులు నిర్ణీత గడువుకంటే ముందే బాండ్లను అమ్మేయడం పెరిగింది. ఫలితంగా వీటిపై వచ్చే రాబడులూ తగ్గుముఖం పట్టాయి. వడ్డీ రేట్ల పెరుగుదలతో ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో దేశంలోని బ్యాంకులు ట్రెజరీ బాండ్లపై రూ.15,000 కోట్ల ఆదాయం కోల్పోతాయని ఇక్రా రేటింగ్స్ సంస్థ తెలిపింది. ఇందులో ప్రభుత్వరంగ బ్యాంకుల వాటా 80 శాతం వరకు ఉంటుందని అంచనా. దీంతో ప్రభుత్వ రంగ బ్యాంకుల(పిఎస్‌బి) మూలధన పునర్ వ్యవస్థీకరణ కోసం ప్రభుత్వం మరిన్ని నిధులు సమకూర్చాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఇక్రా పేర్కొంది.

ఈ ఏడాది వృద్ధి 7 శాతం కన్నా తక్కువే...

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక రంగంలో వృద్ధి రేటు ఈ ఏడాది 7 శాతం కంటే తక్కువగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి ప్రభావం ఆర్థిక వృద్ధిపై ఉంటుందని వారి అంచనా. 2016-17లో ఆర్థిక వృద్ధి రేటు 7.1 శాతం ఉంది. అంతకుముందు ఏడాది 8 శాతం ఉన్న వృద్ధి రేటును పెద్దనోట్ల రద్దు దెబ్బతీసింది. శుక్రవారం సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ 2017-18కి సంబంధించి జాతీయ ఆదాయ ముందస్తు అంచనాలను విడుదల చేయనుంది. ప్రభుత్వం ప్రతిపాదికను మార్చితే తప్ప జిడిపి ఈ ఏడాది 7 శాతాన్ని దాటడం కష్టమేనని నిపుణులు అంటున్నారు. ఈ ఏడాది ఆఖరు రెండు త్రైమాసికాల్లో ఆర్థిక వృద్ధిలో ఉత్తేజం కనిపిస్తుందని వారి అంచనా. గతేడాదితో పోలిస్తే జిడిపి వృద్ధి ఈ ఏడాది 6.5 శాతం పెరిగే అవకాశం ఉందని ఎస్‌బిఐ రీసెర్చ్ చీఫ్ ఎకనామిస్ట్ కాంతి ఘోష్ చెప్పారు. 7 శాతం మించిన వృద్ధి రేటును చూపించాలంటే, గతేడాది జిడిపిని దిగువముఖంగా సవరించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. మరికొందరు ఆర్థికవేత్తలు కూడా ఇదేరకమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వృద్ధి రేటు 6.3 శాతం మించకపోవచ్చని పూర్వ ప్రణాళికా సంఘం డిప్యూటీ చైర్మన్‌గా పనిచేసిన మాంటెక్ సింగ్ అహ్లువాలియా అన్నారు. యాక్సిస్ బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త సుగతో భట్టాచార్య మాటల్లో చెప్పాలంటే, గ్రాస్ వాల్యు యాడెడ్ (జివిఎ) ఈ ఏడాది 6.6 నుంచి 6.8 శాతం ఉంటుంది. భారీగా పన్నుల వసూళ్లు పెరిగితే వృద్ధి రేటు మరింత ఎక్కువగా ఉంటుందని ఆయన అన్నారు. మాజీ సీనియర్ ఎకనామిస్ట్ అభిజిత్ సేన్ కూడా ఈ ఏడాది వృద్ధి రేటు 6-6.5 శాతం మించకపోవచ్చని అన్నారు. జిఎస్‌టి వల్ల పన్నుల వసూళ్లు తగ్గుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎపిజివిబి శాఖల్లో డెస్క్‌టాప్ ఎటిఎంలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కస్టమర్లు సులభంగా నగదును ఉపసంహరించుకునేందుకు దోహదపడే డెస్క్ టాప్ ఎటిఎంను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఎపిజివిబి) అందుబాటులోకి తెచ్చింది. వరంగల్‌లోని కాశిబుగ్గ శాఖలో ఏర్పాటు చేసిన ఈ ఎటిఎంను బ్యాంకు చైర్మన్ వి నరసి రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఎటిఎం ద్వారా ఇతర బ్యాంకుల కస్టమర్లు కూడా నగదును ఉపసంహరించుకోవచ్చని ఆయన తెలిపారు. రానున్న కాలంలో మరో వంద డెస్క్ టాప్ ఎటిఎంలను తమ శాఖల్లో ఏర్పాటు చేయాలన్న యోచనలో ఉన్నామని, ఇందులో 60 తెలంగాణలో 40 ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటి వరకు బ్యాంకు వ్యాపారం 27,092 కోట్ల రూపాయలకు చేరుకుందని, దేశంలోని ఆర్ఆర్‌బిల్లో తమ బ్యాంకే అధిక లాభాన్ని నమోదు చేసుకుందని ఆయన తెలిపారు. ఈ సంవత్సరంలోనూ అధిక లాభాలను ఆర్జిస్తామన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

బుద్వేల్‌లో ఐటి క్లస్టర్

ఐదేళ్లలో పూర్తిస్థాయిలో అభివృద్ధి.. కంపెనీల ఏర్పాటుకు 30 సంస్థలు సిద్ధం

స్థలాలను పరిశీలించిన ఐటి మంత్రి కె తారక రామారావు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): ఐటి క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదిస్తున్న బుద్వేల్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో బుధవారం ఐటి మంత్రి కెటి రామారావు పర్యటించారు. క్లస్టర్ అభివృద్ధి కోసం సేకరించనున్న పలు స్థలాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. బుద్వేల్ ఐటి క్లస్టర్ ఏర్పాటును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చెప్పారు. బుద్వేల్ ఐటి క్లస్టర్ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. బుద్వేల్ ఐటి క్లస్టర్‌లో యూనిట్లు ఏర్పాటు చేసేందుకు సుముఖంగా ఉన్న 30కి పైగా సంస్థలు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్టు వివరించారు. ఇందులో ఐటి రంగంలో పేరు గడించిన దేశీయ కంపెనీలతో పాటు అంతర్జాతీయ స్థాయి కంపెనీలున్నాయన్నారు. అయితే కంపెనీల వివరాలను మాత్రం ఆయన చెప్పలేదు. త్వరలోనే ఆయా కంపెనీలతో పరిశ్రమల స్థాపనకు లాంఛనంగా ఒప్పందాలు చేసుకోనున్నట్టు తెలిపారు. ఒకే ప్రాంతంపై ఒత్తిడి పెరగకుండా ఐటి పరిశ్రమను నగరం నలు మూలలకు విస్తరించాలనే దీర్ఘకాలిక లక్ష్యం మేరకు కార్యచరణ రూపొందించుకుని ముందుకుపోతున్నట్టు చెప్పారు. బుద్వేల్ ఐటి క్లస్టర్‌లో అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి తారక రామారావు టిఎస్ఐఐసి అధికారులను ఆదేశించారు. ఇందుకుగానూ అత్యుత్తమ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని సూచించారు.

ఈ క్లస్టర్ వల్ల సుమారు లక్షా పాతికవేల మందికి నూతనంగా ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాజేంద్రనగర్ పరిసరాల్లో ఉన్న కొన్ని ప్రభుత్వ సంస్థలు తమ భూములను క్లస్టర్ డెవలప్‌మెంట్‌కు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయన్నారు. వాటి భూయజమాన్య మార్పులను త్వరలోనేపూర్తి చేయనున్నట్టు తారకరామారావు చెప్పారు. బుద్వేల్ ఐటి క్లస్టర్ అభివృద్ధి పనులు వేగంగా చేపట్టి పూర్తి చేయడానికై త్వరలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆద్వర్యంలో ఐటీ శాఖ, రెవెన్యూ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, టిఎస్ఐఐసి ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నారని తెలిపారు.

నార సంచుల్లో మూటగట్టాల్సిందే!

ఆహార ధాన్యాలు, చక్కెర తప్పనిసరి ప్యాకేజింగ్ నిబంధన గడువు పొడిగింపు



న్యూఢిల్లీ: జనపనార పండించే రైతులు, వాటి మిల్లుల్లో పనిచేసే కార్మికుల ప్రయోజనాల కోసం కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జూట్ ప్యాకేజింగ్ మెటీరియల్ (జెపిఎం) యాక్ట్-1987లో భాగంగా ఆహార ధాన్యాలు, చక్కెరను తప్పనిసరిగా జనపనార సంచుల్లో మూటగట్టాలన్న నిబంధనను జూన్ 2018తో ముగిసే సాగు సంవత్సరం వరకు పొడిగిస్తున్నట్లు ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షక కేంద్ర కేబినెట్ కమిటీ (సిసిఇఎ) ప్రకటించింది. ఈ నిర్ణయంతో 90 శాతం ఆహార ధాన్యాలు, 20 శాతం చక్కెర ఉత్పత్తులు జనపనార సంచుల్లో (జూట్ బ్యాగ్స్) ప్యాక్ చేయాల్సి ఉంటుందని, ఫలితంగా 40 లక్షల రైతులు, దాదాపు 3.7 లక్షల కార్మికులకు లబ్ధి చేకూరనుందని కేంద్ర జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీ ట్వీట్ చేశారు.

ప్రభుత్వంపైనే ఆధారం

సిసిఇఎ తాజా నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఒడిశా, అస్సాం, పశ్చిమ బెంగాల్, బీహార్, మేఘాలయ, త్రిపుర ఇంకా ఇతర రాష్ట్రాల్లోని జనపనార రైతులు, కార్మికుల జీవనోపాధికి మద్దతివ్వడంతోపాటు దేశంలో జనపనార, దాని అనుబంధ వ్యాపారాల డిమాండ్‌కు దోహదపడనుంది. ఎందుకంటే, జూట్ ఇండస్ట్రీ ప్రధానంగా ప్రభుత్వంపైనే ఆధారపడి ఉంది. ఏటా ప్రభుత్వం రూ.5,500 కోట్ల జనపనార ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంటుంది. దేశీయ జనపనార పరిశ్రమ ప్రయోజనాలను రక్షించేందుకు బంగ్లాదేశ్, నేపాల్ నుంచి జూట్ ఉత్పత్తులపై యాంటీ డంపింగ్ డ్యూటీ విధిస్తూ గత ఏడాది జనవరి 5న కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో దేశీయ మార్కెట్లో మరో 2 లక్షల మిలియన్ టన్నుల మేర అదనపు డిమాండ్‌కు అవకాశం ఏర్పడింది.

డబ్ల్యుటిఒలో భారత్ వాదనకు కేబినెట్ సమ్మతి

గత ఏడాది అర్జెంటీనాలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) సభ్య దేశాల మంత్రుల 11వ సమావేశంలో భారత్ వాదనకు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఎక్స్-పోస్ట్ ఫ్యాక్టో అప్రూవల్ ఇచ్చింది. ఆహార ధాన్యాల సేకరణకు సంబంధించి ప్రభుత్వాలపై పరిమితుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డబ్ల్యుటిఒ సమావేశాల్లో భారత్ పట్టుబట్టింది. కానీ అగ్రరాజ్య అమెరికా మోకాలడ్డటంతో చర్చలు విఫలమయ్యాయి.

పోర్టుల్లో పిపిపి ప్రాజెక్టుల ఒప్పంద సవరణలకు ఆమోదం

ప్రధాన నౌకాశ్రయాల్లో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య (పిపిపి) పద్ధతిన చేపట్టిన ఒప్పందాలకు సంబంధించి సవరణలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. పెట్టుబడిదారులకు మరింత సానుకూల వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇకపై హైవే కాంట్రాక్టుల మాదిరిగానే ఏదేని పిపిపి పోర్టు ప్రాజెక్టు డెవలపర్లకు (ప్రైవేట్ భాగస్వామి) కూడా వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమైననాటి నుంచి రెండేళ్ల తర్వాత తమ 100 శాతం వాటాను విక్రయించుకునే అవకాశం లభించనుంది.

ఫిబ్రవరి నుంచే కియా నియామకాలు

▸ వెల్లడించిన కంపెనీ కొత్త ఎండి, సిఇఒ షిమ్

▸ అనంత కలెక్టర్‌తో కలిసి ప్రాజెక్టు పనుల సమీక్ష



హైదరాబాద్/పెనుగొండ (ఆంధ్రజ్యోతి): కియా మోటార్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒగా నియమితులైన కూఖ్యున్ షిమ్ బుధవారం అనంతపురం వచ్చారు. దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం కియా మోటార్స్ భారత్‌లో తొలిసారిగా తన ఉత్పత్తి కేంద్రాన్ని అనంతపురం జిల్లా పెనుగొండ మండలం, అమ్మవారిపల్లి వద్ద ఏర్పాటు చేస్తోన్న విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్‌తో కలిసి ప్రాజెక్ట్ సైట్‌ను షిమ్ సందర్శించారు. నిర్మాణ పనులను సమీక్షించారు. మౌలికవసతుల కల్పన, ఇతర పనులకు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. వచ్చే ఫిబ్రవరీ నుంచే ఈ ప్రాజెక్టుకు అవసరమైన సిబ్బంది నియామకాలు ప్రారంభించనున్నట్టు ఈ సందర్భంగా షిమ్ తెలిపారు. స్కిల్డ్, అన్‌స్కిల్డ్ అభ్యర్థులను వివిధ విభాగాల్లో అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ వీరపాండ్యన్ చెప్పారు. ప్రాజెక్టు స్థలంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఇంటర్నల్ రోడ్స్, సర్వీసు రోడ్స్, కెనాల్స్ పనులను వేగవంతం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించినట్టు వెల్లడించారు.

మూడు దశాబ్దాల అనుభవం...

కియా మోటార్స్ ఇండియా చీఫ్‌గా నియమితులైన షిమ్‌కు ఆటోమొబైల్ రంగంలో మూడుదశాబ్దాల అనుభవం ఉంది. కియా మోటార్స్ భారత్‌లో దాదాపు 110 కోట్ల డాలర్లను ఇన్వెస్ట్ చేస్తోంది. అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న కార్లఫ్యాక్టరీ పనులను షిమ్ స్వయంగా పర్యవేక్షిస్తారని కియామోటార్స్ వెల్లడించింది. జార్జియా, స్లొవేకియాల్లో కియా ఉత్పత్తి కేంద్రాలను పర్యవేక్షించిన అనుభవం షిమ్‌కు ఉంది. సకాలంలో ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా ఆయన చూస్తారని కియా మోటార్స్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ హన్ వూ పార్క్ పేర్కొన్నారు. భారతీయ మార్కెట్లో కియా పట్టు సంపాదించేందుకు షిమ్ మార్గదర్శనం చేస్తారని ఆయన వెల్లడించారు. భారత్‌కు సంబంధించి తమకు భారీ ప్రణాళికలు ఉన్నట్టు షిమ్ తెలిపారు. 2021నాటికి ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్న భారత మార్కెట్లో పనిచేయడం తనకు ఉద్వేగంగా ఉందన్నారు.

మీ స్పందనే మాకు స్ఫూర్తి

డెల్‌ఎక్సెల్ ఫార్మా సిఇఒ రఘుపతితో కెటిఆర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవర్గాల నుంచి వచ్చే సానుకూల స్పందనలు తమ కృషికి స్ఫూర్తినిస్తుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి కె తారకరామారావు అన్నారు. పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ద్వారా ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యం దిశగా కృషి కొనసాగించేందుకు ఇది దోహదం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. టీఎస్ఐపాస్ పనితీరుపైన కెటిఆర్‌కు డెల్ ఎక్సెల్‌ఫార్మా సిఇఒ రఘుపతి కందారపు బుధవారం ఒక సందేశాన్ని పంపుతూ అభినందనలు చెప్పారు. గతంలో పలు కంపెనీల్లో పని చేసిన రఘుపతి సొంతంగా పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు చేసిన ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం, ప్రభుత్వ విధానాలతో తన అనుభవాన్ని మంత్రితో పంచుకున్నారు. తనకు ఇంతటి సులభమైన, పారదర్శకమైన అనుభవం ఎప్పుడూ కలుగలేదన్నారు. వేగంగా అనుమతులిచ్చిన అధికారులకు, ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వానికి రఘుపతి ధన్యవాదాలు తెలిపారు. ఈ మార్పునకు కారణమైన ప్రభుత్వం ఇదేతీరుగా ముందుకు సాగాలని కోరారు. రఘుపతి పంపిన సందేశానికి మంత్రి కెటిఆర్ ధన్యవాదాలు తెలిపారు.

మళ్లీ తెరపైకి విశాఖ ఉక్కు ఐపిఒ

▸ 10 శాతం వాటా విక్రయానికి సన్నాహాలు

▸ కేంద్ర మంత్రి విష్ణు దేవసహాయ



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్-ఆర్ఐఎన్ఎల్) పెట్టుబడుల ఉపసంహరణ తప్పదని కేంద్ర ప్రభుత్వం బుధవారం స్పష్టం చేసింది. సంస్థ ఈక్విటీలో పది శాతం వాటాలను ఐపిఒ ద్వారా విక్రయించేందుకు ఎప్పుడో ఏర్పాట్లు చేసినా మార్కెట్ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆ ప్రతిపాదన వాయిదా పడినట్టు తెలిపింది. ఆర్ఐఎన్ఎల్‌లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదన నిజమేనా? అని రాజ్యసభలో వైఎస్ఆర్‌సిపి ఎంపి విజయ సాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి విష్ణు దేవ సహాయ ఈ విషయం చెప్పారు. పనితీరు సరిగా లేని ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణకు చర్యలు చేపడుతున్నట్టు ఇటీవల ప్రభుత్వ రంగ సంస్థల శాఖ (డిపిఇ) ప్రకటించింది. అందులో భాగంగానే విశాఖపట్నం కేంద్రంగా పనిచేసే డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డిసిఐ)ను పూర్తిగా ప్రైవేటీకరించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిని వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు ఈ ప్రైవేటీకరణ డిసిఐతో ఆగదని, ఆర్ఐఎన్ఎల్‌లో వాటాలు కూడా అమ్మేస్తారని తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. దేశంలో సముద్ర తీర ప్రాంతంలో ఉన్న ఏకైక ఉక్కు కర్మాగారం ఆర్ఐఎన్ఎల్ ఒక్కటే. ఇతర సంస్థలతో పోల్చుకుంటే లాజిస్టిక్స్ పరంగా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. వీటికి తోడు విశాఖ ఉక్కుకు వేల ఎకరాల భూములున్నాయి. కేవలం సొంత ఉక్కు గనులు లేవనే సాకుతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో ప్రభుత్వ వాటా కొంత విక్రయించాలని నిర్ణయించడాన్ని తప్పు పడుతున్నారు.

పరిస్థితి బాగోలేదనే.....

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ వాటాల విక్రయంపై కేంద్ర ప్రభుత్వం వాదన మరో విధంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఉక్కు మార్కెట్ మందగమనంలో ఉందని, విశాఖ ఉక్కు ఉత్పత్తులకు లాభదాయకత లేదని, బొగ్గు దిగుమతుల ధరలు బాగా పెరిగిపోయాయని అంటోంది. అందువల్లనే వాటాల విక్రయానికి నిర్ణయించామని తెలిపింది. కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ 2012లోనే ఇందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని ఉక్కు శాఖ సహాయ మంత్రి విష్ణు దేవసహాయ రాజ్యసభలో బుధవారం వెల్లడించారు.

బిట్‌కాయిన్‌లో ఆర్‌బిఐ జోక్యముండదు

▸ నల్లధనాన్ని మార్చుకోవడం చాలా సులభం

▸ ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి) : "ఒక అధికారి అవినీతికి పాల్పడి లక్ష రూపాయలు సంపాదిస్తే దాన్ని ప్రభుత్వం నల్లధనం అంటోంది. ఆ డబ్బుతోనే ఏదో ఓ ఆస్తి కొనడమో లేదా తన పిల్లల విద్య కోసమో ఖర్చు చేస్తాడు. మరి అది తెల్లధనమైపోయినట్టేగా. అప్పుడు నల్లధనం ఎక్కడుంది? నల్లధనం లక్ష్యంగానే పెద్దనోట్ల రద్దును చేపట్టారంటున్నారు. అసలు నల్లధనానికి నిర్వచనమేంటో ఎవరైనా చెప్పగలరా..? అని భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ప్రశ్నించారు. బుధవారం ఆయన రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డి-పిఆర్)లో "రోజువారీ జీవితంపై ఆర్‌బిఐ ప్రభావం" అంశంపై ఎస్ ఆర్ శంకరన్ స్మారక ఉపన్యాసమిచ్చారు. ఈ సందర్భంగా దువ్వూరి మాట్లాడుతూ.. అవినీతి, డ్రగ్స్, అక్రమరవాణా లాంటి వాటి ద్వారా సంపాదించిన కోట్లాది రూపాయలనే నల్లధనం అంటే దాన్ని తెల్లధనంగా (బ్లాక్ టు వైట్) మార్చుకోవడం చాలా సులభమన్నారు. ఆర్థిక అభివృద్ధికి నోట్ల రద్దు పెద్ద దెబ్బ అన్నారు. నోట్ల రద్దుతో అనేక మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ ప్రజలు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టలేదు. సరైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదనే విమర్శించారన్నారు. దేశం మొత్తం ప్రభావం చూపిన ఈ నిర్ణయంతో రానున్న 3-5 సంవత్సరాల్లో సానుకూల పరిణామాలు కన్పించవచ్చన్నారు. మనదేశంలో పదిహేనేళ్ల క్రితమే ప్లాస్టిక్ పది రూపాయల నోట్లను ప్రవేశపెట్టాలని భావించి తర్వాత వాయిదా వేశామని సుబ్బారావు అన్నారు. కాగితం నోటుతో పోలిస్తే ప్లాస్టిక్ నోట్ ఎక్కువకాలం మన్నుతుందన్నారు. భవిష్యత్తులో ప్లాస్టిక్ కరెన్సీ వచ్చే అవకాశాలున్నాయన్నారు. బిట్ కాయిన్‌లపై ఇప్పుడు ప్రత్యేకంగా చర్చ జరుగుతుందని, ఆర్‌బిఐ గవర్నర్‌గా తాను ఉన్న సమయంలోనే ఈ విషయంపై అంతర్జాతీయ గవర్నర్ల సమావేశంలో చర్చ జరిగిందని ఆయన గుర్తుచేశారు. బిట్‌కాయిన్ విషయంలో ఆర్‌బిఐ జోక్యం ఉండదన్నారు. బిట్‌కాయిన్‌లపై చర్యలు తీసుకునేందుకు ఇది సమయం కాదని, కానీ పరిణామాలను మాత్రం గమనిస్తూ ఉండాలన్నారు.

సిమెంట్ డిమాండ్ అంతంతే



- జోరుగా పెరగనున్న డిమాండ్
- ఇక్రా రేటింగ్స్ అంచనా

ముంబై : డిమాండ్ పరంగా ఈ ఆర్థిక సంవత్సరం (2017-18) సిమెంట్ కంపెనీలకు నిరాశ తప్పదని పరపతి రేటింగ్ సంస్థ ఇక్రా తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం డిమాండ్ వృద్ధి రేటు ఒకటి లేదా రెండు శాతం మించి పెరగకపోవచ్చని అంచనా వేసింది. ఇసుక కొరత, రియల్టీ మార్కెట్ మందగించడం, దక్షిణ భారత మార్కెట్లో నెలకొన్న మందగమనం, రెరా చట్టం, జిఎస్‌టితో తలెత్తిన పరిణామాలు ఇందుకు కారణమని తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఏడు నెలల్లోనూ దేశంలో సిమెంట్ డిమాండ్ అంతంత మాత్రంగానే ఉన్న విషయాన్ని ఇక్రా గుర్తు చేసింది.

వచ్చే ఏడాది ఆశాజనకం: వచ్చే ఆర్థిక సంవత్సరం మాత్రం సిమెంట్ పరిశ్రమకు బాగానే ఉంటుందని ఇక్రా అంచనా వేసింది. రహదారులు, నీటిపారుదల ప్రాజెక్టుల వంటి మౌలిక ప్రాజెక్టులతోపాటు గ్రామీణ గృహ నిర్మాణం, అందుబాటు ధరల్లో గృహ నిర్మాణ ప్రాజెక్టులతో 2018-19లో సిమెంట్ డిమాండ్ 4 నుంచి 5 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. డిమాండ్ పుంజుకున్నా కంపెనీలు తమ ఉత్పత్తి సామర్థ్యంలో 60 నుంచి 65 శాతానికి మించి వినియోగించుకోలేకపోవచ్చని పేర్కొంది.

లాభాలపై ఒత్తిడి : బొగ్గు, పెట్‌కోక్, డీజిల్ ధరల పెరుగుదలతో వచ్చే కొద్ది త్రైమాసికాల్లో, సిమెంట్ కంపెనీల లాభాలు, అమ్మకాలపై ఒత్తిడి తప్పదని ఇక్రా సంస్థ అంచనా వేసింది. వీటి ధరల పెరుగుదలతో ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఇప్పటికే సిమెంట్ కంపెనీల ఇంధన, రవాణా ఖర్చులు పెరిగిపోయిన విషయాన్ని గుర్తు చేసింది. దీంతో పెరిగిన ఈ భారాన్ని దక్షిణాదికి చెందిన కొన్ని పెద్ద కంపెనీలు తప్ప అన్ని కంపెనీలు వినియోగదారులకు బదిలీ చేశాయి. 'ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో పెట్‌కోక్ ధర 32 శాతం, బొగ్గు ధర 44 శాతం, డీజిల్ ధర ఏడు శాతం పెరిగాయి. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం సిమెంట్ కంపెనీల నిర్వహణ లాభాలపై ఒత్తిడి తప్పదు' అని ఇక్రా రేటింగ్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్రూప్ హెడ్ సవ్యసాచి మజుందార్ చెప్పారు.

హెటిరో నుంచి రుమటైడ్ ఆర్థ్రయిటిస్ ఔషధం

HETERO

న్యూఢిల్లీ : హైదరాబాద్‌కు చెందిన హెటిరో గ్రూప్ 'అడలిమ్యుమాబ్' అనే బయోసిమిలర్ ఔషధాన్ని మార్కెట్లోకి విడుదల చేసింది. రుమటైడ్ ఆర్థ్రయిటిస్, ఆటో ఇమ్యూన్ డిజార్డర్ చికిత్సలో ఈ ఔషధాన్ని ఉపయోగిస్తారు. 'ముబూర' పేరుతో ఈ ఔషధాన్ని విడుదల చేసినట్టు తెలిపింది. హైదరాబాద్ సమీపంలోని హెటిరో బయోలాజిక్స్ ప్లాంట్‌లో కంపెనీ ఈ ఔషధాన్ని తయారు చేస్తోంది. అబ్‌వీ కంపెనీ మార్కెట్ చేస్తున్న 'హమీరా' అనే ఔషధానికి ఇది బయోసిమిలర్ వెర్షన్. హెటిరో హెల్త్‌కేర్ ద్వారా కంపెనీ 'ముబూర' ఔషధాన్ని దేశంలో మార్కెట్ చేస్తోంది.

ఇకార్ట్ లాజిస్టిక్స్ రూ.1,632 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ : ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన లాజిస్టిక్స్ అనుబంధ సంస్థ ఇకార్ట్ లాజిస్టిక్స్, క్లిక్2షాప్ నుంచి 1,632.8 కోట్ల రూపాయల నిధులు సమీకరించింది. మూడు విడతల్లో ఈ నిధులు క్లిక్2షాప్ నుంచి పొందినట్టు ఇకార్ట్ లాజిస్టిక్స్ తెలిపింది.

అదే బాటలో ఐటి



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో దేశంలోని అగ్రస్థాయి ఐటి కంపెనీల రాబడుల్లో వృద్ధి అంతంత మాత్రమే ఉండే అవకాశం ఉందని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ నివేదిక అంచనా వేస్తోంది. అయితే మధ్యస్థాయి కంపెనీలు మాత్రం మెరుగైన పనితీరును కనబరచడానికి ఆస్కారం ఉందని పేర్కొంది. అమెరికా ప్రభుత్వం వీసాలకు సంబంధించి విధిస్తున్న నిబంధనలు ఐటి కంపెనీల మెడపై కత్తిలా వేలాడుతున్నాయి. అయినప్పటికీ డిమాండ్, రాబడిలో వృద్ధి విషయంలో ఆశాజనక సంకేతాలు కనిపిస్తున్నట్టు తెలిపింది. బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసులు, ఉత్తర అమెరికాలో వ్యాపారం అంతంత మాత్రంగా ఉన్న నేపథ్యంలో అగ్రస్థాయి ఐటి కంపెనీల వృద్ధి ఆదే స్థాయిలో ఉండనుందని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తన పరిశోధనా పత్రంలో పేర్కొంది. బిఎఫ్ఎస్ రంగంలో వృద్ధి లేకపోవడం, అమెరికా హెల్త్‌కేర్‌కు సంబంధించిన రెగ్యులేటరీ అంశాలు, రిటైల్ వెర్టికల్‌లో సవాళ్ల ఫలితంగా 2017 క్యాలెండర్ సంవత్సరంలో భారత ఐటి కంపెనీల రాబడిలో వృద్ధి తగ్గిపోయింది. క్లయింట్ సోర్సింగ్ వ్యూహాల్లో మార్పులు, డిజిటల్ రంగంలో పురోగతి నెమ్మదిగా ఉండటం కూడా దేశీయ ఐటి కంపెనీల రాబడిలో వృద్ధిపై ప్రభావం చూపుతోంది. కొత్త సంవత్సరంలోకి ప్రవేశించిన నేపథ్యంలో ఈ ఏడాదిలో ఐటి బడ్జెట్లు, డిమాండ్ ఔట్‌లుక్, డిజిటల్ వ్యయాల్లో పురోగతి, డిజిటల్ సర్వీసుల పారిశ్రామికీకరణ వంటి అంశాలపై ఇన్వెస్టర్లు ప్రధానంగా దృష్టిసారించే అవకాశం ఉంది.

ఈ ఏడాది నీరసమే

- మార్కెట్ల తీరుపై బ్రోకరేజ్ సంస్థల అంచనా
- 34500 పాయింట్లతోనే సెన్సెక్స్ సరి

న్యూఢిల్లీ/ముంబై : ఈ ఏడాది దేశీ స్టాక్ మార్కెట్లో సానుకూల పవనాలు కొనసాగవచ్చని పలువురు బ్రోకరేజ్ సంస్థల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. రానున్న కాలంలో ఎనిమిది రాష్ట్రాల ఎన్నికలతోపాటు కేంద్ర బడ్జెట్, రుతుపవనాలు, అంతర్జాతీయ విపణిలో క్రూడాయిల్ ధరలే మార్కెట్ గతిని నిర్దేశిస్తాయనివారన్నారు. అయితే గత ఏడాది ప్రదర్శించినంత జోరు ఉండకపోవచ్చనే అభిప్రాయం వారు సెన్సెక్స్ నిఫ్టీలకు ఇచ్చిన టార్గెట్‌ను బట్టి ఏర్పడుతోంది. ఈ ఏడాది సెన్సెక్స్ 34500, నిఫ్టీ 10800 వరకు వెళ్లే ఆస్కారం ఉన్నదని సెంట్రమ్ బ్రోకింగ్ రీసెర్చ్ అనలిస్ట్ పాయల్ పాండ్యా అన్నారు. గత ఏడాది మొత్తం మీద సెన్సెక్స్ 7430 పాయింట్లు లాభపడి డిసెంబరు 27 34138 పాయింట్ల చారిత్రక గరిష్ఠ స్థాయిని నమోదు చేసిన నేపథ్యంలో ఆమె కొత్త ఏడాదికి ఇచ్చిన అంచనా నిరాశాజనకంగానే ఉన్నదనక తప్పదు. ఈ ఏడాది ఫార్మా, టెక్స్‌టైల్స్ రంగాలు మెరుగైన పనితీరు ప్రదర్శించవచ్చునని ఆమె అభిప్రాయపడ్డారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో దక్షిణాదిన కర్ణాటకతో పాటుగా ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి ఒకటిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించే కేంద్ర బడ్జెట్ ఆధారంగా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలుంటాయని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ విభాగం అధిపతి దీపక్ జసాని అన్నారు. అంతర్జాతీయ విపణిలో ఆయిల్ ధరలు, ఇతర కమోడిటీ ధరలు, ప్రపంచ దేశాల విధానాలు, వడ్డీరేట్లు స్థిరంగా ఉంటే పాజిటివ్ సెంటిమెంట్ కొనసాగుతుందని, ఏమాత్రం తేడా వచ్చినా మార్కెట్లు తీవ్రంగా ప్రభావితం అవుతాయని అరిహంత్ క్యాపిటల్ హోల్ టైమ్ డైరెక్టర్ అనితా గాంధీ అన్నారు. ద్రవ్యోల్బణం కాస్తంత ఎగబాకుతున్నట్టు కనిపించినా ప్రస్తుతానికి స్థూల ఆర్థికాంశాలు సానుకూలంగానే ఉన్నాయన్న అభిప్రాయం కొందరు ప్రకటించారు. పసిఫిక్ సముద్రంపై లానినా పరిస్థితులు కనిపిస్తున్నప్పటికీ ఈ ఏడాది రుతుపవనాలు



ఎలా ఉంటాయన్నది అంచనా వేయడం తొందరపాటే అవుతుందంటున్నారు. రుతుపవనాలు సానుకూలంగా ఉంటే పంట దిగుబడులు బాగుండి గ్రామీణ వినియోగం పెరుగుతుందని యాక్సిస్ సెక్యూరిటీస్ ఎండి, సిఇఒ అరుణ్ తుక్రాల్ అన్నారు. ప్రస్తుత వాతావరణంలో ఇన్వెస్టర్లు సెక్టార్, స్టాక్‌ల వారీ ధోరణి ప్రదర్శించవచ్చునని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం హెడ్ వినోద్ నాయర్ అభిప్రాయపడ్డారు.

ఎగిసి చప్పబడిన మార్కెట్

దేశీ స్టాక్ మార్కెట్లు బుధవారం ఉదయం పరుగులు తీసినా చివర్లో లాభాల స్వీకరణతో చప్పగా ముగిశాయి. క్యూ3 కార్పొరేట్ ఫలితాల సీజన్ ప్రారంభం కానుండడంతో ఇన్వెస్టర్లు ఆచితూచి అడుగేసే ధోరణి అనుసరించారు. ఆటో, ఐటి, ఆయిల్ అండ్ గ్యాస్, టెక్, హెల్త్‌కేర్ విభాగాల్లో లాభాల స్వీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 33998.37 పాయింట్ల వరకు వెళ్లినా చివరికి 18.88 పాయింట్ల నష్టంతో 33793.38 వద్ద ముగిసింది. అయితే నిఫ్టీ మాత్రం ఒకే ఒక్క పాయింటు లాభంతో 10443.20 పాయింట్ల వద్ద క్లోజయింది.

డాక్టర్ రెడ్డీస్ మరో 3 శాతం డౌన్

సెన్సెక్స్ షేర్లలో ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ 3 శాతం నష్టంతో భారీగా నష్టపోయిన షేరుగా అగ్రస్థానంలో నిలిచింది. బిఎస్ఇలో 2.97 శాతం నష్టపోయి 2336.20 రూపాయల వద్ద క్లోజ్ కాగా ఎన్ఎస్ఇలో 2.91 శాతం నష్టపోయి 2339 రూపాయల వద్ద క్లోజయింది. డాక్టర్ రెడ్డీస్ షేరు నష్టాల్లో ఉండడం ఇది వరుసగా నాలుగో రోజు. నాలుగు రోజుల్లోనూ ఈ షేరు నాలుగు శాతం మేరకు నష్టపోయింది. విశాఖ సమీపంలోని దువ్వాడ ప్లాంట్‌పై ఇఐఆర్‌లో ప్రస్తావించిన అంశాలకు స్పందనగానే షేరు కదలికలున్నాయని జరుగుతున్న ప్రచారంపై బిఎస్ఇ వివరణ కోరింది. షేరు కదలికలు మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులకు లోబడి ఉన్నందు వల్ల షేరు కదలికలపై తాము మాట్లాడేదేమీ లేదని బిఎస్ఇకి కంపెనీ తెలిపింది.

డిసిబి బ్యాంకు రూ.150 కోట్ల సమీకరణ

ప్రైవేటు రంగంలోని డిసిబి బ్యాంకు ప్రైవేట్ ప్లేస్‌మెంట్ విధానంలో బాండ్ల జారీ ద్వారా 150 కోట్ల రూపాయలు సమీకరించనున్నట్టు ప్రకటించింది. టయర్ 2 నిధుల సమీకరణకు డైరెక్టర్ల బోర్డు, షేర్‌హోల్డర్ల అనుమతి ఇప్పటికే పొందినట్టు బ్యాంకు తెలిపింది.


లక్ష్మీవిలాస్ బ్యాంకు రైట్స్ ఇష్యూ

రైట్స్ ఇష్యూ జారీ చేయడం ద్వారా 780 కోట్ల రూపాయలు సమీకరించనున్నట్టు ప్రైవేటు రంగంలోని లక్ష్మీవిలాస్ బ్యాంకు ప్రకటించింది. బుధవారం జరిగిన పెట్టుబడుల సమీకరణ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజిలకు పంపిన సమాచారంలో తెలిపింది.

నాస్‌డాక్ రికార్డు

టెక్నాలజీ ఇండస్ట్రీ బుల్లిష్‌గా ఉండడంతో అమెరికాకు చెందిన టెక్నాలజీ ఇండెక్స్ నాస్‌డాక్ తొలిసారిగా 7000 పాయింట్ల పైన ముగిసింది. ఇండెక్స్ 1.5 శాతం వృద్ధితో 7006.90 పాయింట్ల వద్ద క్లోజయింది. కేవలం ఎనిమిది నెలల కాలంలోనే ఇండెక్స్ వెయ్యి పాయింట్లు పెరిగిందని, టెక్నాలజీ బూమ్‌లో కూడా ఇంత జోరు లేదని వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలిపింది.

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	30,490	30,500	30,530	30,400	29,600
క్రితం ముగింపు	30,420	30,400	30,460	30,330	29,570
22 క్యారెట్లు	28,230	28,300	28,080	28,200	28,190
క్రితం ముగింపు	28,160	28,300	28,020	28,180	28,160
వెండి (కిలో)	39,800	40,200	39,900	39,900	42,000
క్రితం ముగింపు	39,800	40,200	39,800	39,900	41,900

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.45 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	383.00	చిత్తూరు	388.00
వరంగల్	385.00	చెన్నై	395.00
విజయవాడ	385.00	నమక్కల్	375.00
గోదావరి	385.00	బెంగళూరు	380.00
విశాఖపట్నం	390.00	ముంబై	425.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90.00	విజయవాడ	86.00
కరీంనగర్	92.00	గుంటూరు	86.00
వరంగల్	90.00	ఒంగోలు	88.00
మహబూబ్‌నగర్	90.00	చిత్తూరు	78.00
కర్నూలు	90.00	నెల్లూరు	88.00
విశాఖపట్నం	87.00	అనంతపురం	88.00
గోదావరి	84.00		

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	57.81	67.03
పౌండ్	78.61	91.15
యూరో	69.63	80.76
ఆస్ట్రేలియా డాలర్	45.14	52.25
బహ్రెయిన్ దినార్	156.56	179.41
కువైట్ దినార్	174.29	217.04
ఒమని రియాల్	153.31	175.40
సౌదీ రియాల్	15.37	18.22
సింగపూర్ డాలర్	43.45	51.47
యుఎఇ దిరమ్	15.73	18.39

10400 దిగువన బలహీనం

గురువారం స్థాయిలివే...

నిరోధం : 10500 మద్దతు : 10400

టెక్ వ్యూ

నిఫ్టీ ప్రారంభంలో 10500 కన్నా పైకి వెళ్లినా నిలదొక్కుకోలేక రియాక్షన్‌లో పడి డే కనిష్ఠ స్థాయిలో ముగిసింది. మైనర్ అప్రమత్త ట్రెండ్‌కు ఇది సంకేతం. రెండు రోజుల పుల్‌బ్యాక్ రికవరీలో 10500 వద్ద విఫలమవుతూ వస్తున్నందు వల్ల తక్షణ అప్‌ట్రెండ్‌ను సూచించలేకపోతోంది. ప్రధాన ట్రెండ్ పాజిటివ్‌గానే ఉన్నా మైనర్ కరెక్షన్ ధోరణి కనిపిస్తోంది. 10 డిఎంఎకన్నా స్వల్పంగా దిగువకు వచ్చిన ఇండెక్స్ 20 డిఎంఎ వద్ద పరీక్షకు గురికానుంది.

- మరింత బలహీనత ప్రదర్శించి 10400కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ ముప్పు ఎదుర్కొంటుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 10200, 10000.
- రికవరీ బాట పడితే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం 10500 కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి.

సూచన : స్వల్పకాలిక ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి.

■ వి.సుందర్ రాజా

ఉదయం మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : పుష్య బహుళ తదియ **నక్షత్రం :** ఆశ్లేష

కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ నక్షత్ర జాతకులు, సింహ, ధనుస్సు రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10443.20 (+1)

ట్రెండ్ మార్పు వేళలు : 11.29

ధోరణి : గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 12 గంటల వరకు అదే ధోరణిని ప్రదర్శిస్తూ 12.10 నుంచి 1.40 మధ్యలో నిస్తేజంగా ఉండి 2.45 నుంచి చివరి వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.15 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 1.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.45 తర్వాత ఎటిపి కన్నా తిరిగి పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవచ్చు. ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10485, 10520

మద్దతు స్థాయిలు : 10400, 10365

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 9.85(9.8)101935
ADITYA SPIN. 8.51(8.81)80
AGRO TECH FO 713.7(699.7)1269
AISHWARYA TE 7.5(7.47)43050
ALPHAGEO (I) 910.5(906.4)3489
ALU FLUORIDE 135.9(135.45)14995
AMAR RAJA BA 846.1(829.5)48173
ANDHRA BANK 57.35(57.35)127354
ANDHRA CEMEN 13.75(13.67)85346
ANDHRA PETRO 58.3(60.95)132898
ANJANI PORTL 238.2(233.3)1778
ASTRA MICRO 120.9(118.25)117676
AUROB.PHARMA 666.5(671.85)129509
AVANTEL LTD 484.85(467.45)19598
AVANTI FEEDS 2563.25(2587.5)7190
B.N.RATHI SE 55.1(53.75)16415
BALAJI AMINE 623.6(622.55)8163
BAMBINO AGRO 325(327)3225
BARTRONICSIN 15.17(15.06)21400
BHAGIRA.CHEM 314.75(323.65)4243
BHAGYA INL 51.15(51.25)46930
BHARATFIN 992.4(993.3)33540
BNR UDYOG 30.05(28.65)701
CAMBRIDGE 83(81.4)1615
CAT TECHN. 1.2(1.15)7559
CCHHL 20.85(19.75)632212
CCL PRODUCTS 298.65(298.85)4176
CELESTIAL 21.7(21.9)87953
CIL SECURITS 37.3(36.7)8701
COROM INTER 568.7(542)27798
CUBEX TUBING 28.5(28.1)7747
CYBERMATE 3.49(3.5)121240
CYIENT 576.65(573.25)3952
DANLAW TECH. 76.85(73.5)40397
DECAN CEMENT 564.6(560)495
DHAN ROTO SP 42.85(41.3)6862
DIAMONPOWER 23.75(22.4)1140712
DIVI'S LAB. 1098.2(1079.2)56760
DIVYA.GRANIT 101.1(104.9)1133
DQ ENT 19.3(18.6)21601
DR.REDDY'S 2336.2(2407.7)76717
EMPEE SUGARS 5.59(5.33)44381
EVEREST ORG. 136.5(137)75
FACOR ALLOYS 3.96(3.78)1017437
FIRSTOBJ 15.85(15.8)4899
GATI LTD. 135.4(133.25)255894
GAYATRI PROJ 228.1(227.25)17021
GENNEX LAB 6.1(6.15)324241
GMR INFRASTR 21.8(21.65)4410096
GODAVARI DRU 42.8(42.55)7075
GOLDST INFRA 199.7(201.85)17069
GOLDSTONE EN 15.35(16.15)32048
GRANULES (I) 134.75(134.3)74832
GVK POWERINF 19.25(18.6)1031330
HBL P SYS 73.05(73.05)180596
HERITGFOOD 803.35(803.1)1507
HINDUSTN BIO .39(.38)500
I.C.S.A. IND 4.67(4.25)356039
INCAP LTD. 120.65(114.95)8650
IPAPPM 332(317.95)45147
IVRCL LTD 6.85(7.33)1777422
KAKATIYA CEM 395.6(396.3)11560
KAKATIYA TEX 3(3)702
KALLAM SPG. 25.7(23.6)95544
KAVERI SEED 536.35(539.3)74727
KCP LTD 147.2(143.85)77579
KERNEX MICRO 46.45(45.4)13114
KNR CONST 312.95(308.85)7969
KREBS BIOCHM 161.4(153.75)4287
LANCO INFRA 1.55(1.48)4167009
LOKESH MACH 77.65(71.95)171514
MADHUCON PRJ 35.7(35.8)63142
MOLD-TEK TEC 75(75.5)5232
MOSCHIP SEMI 39.7(39.35)95022
MSR INDIA 34.95(34.7)2862
N C L IND. 265.7(251.3)20494
NACLIND 62.2(59.65)214597
NATCO PHARM 973.75(967.6)21616
NCC 130(130.45)526779
NEHA INTER. 10.25(9.94)109263
NETTLINX LTD 81.85(80.7)60077
NEULAND LAB. 875.05(886.35)2669
NIHAR INFO 14.3(14.8)3541
NILE LTD. 910.05(895.65)4109
NTL 4.9(4.84)15861
OIL COUNTRY 64.2(54.75)261243
PADMALAYA TE 5.83(5.76)34124
PALRED 93(93.3)9862
PANYAM CEMEN 62.3(60.7)26408
PENNAR STEEL 67.55(67.2)74772
PFL INFOTECH 8.4(8.4)5856
PHYTOCHEM I. 74.4(75.8)24329
PITTI LAMIN. 104.95(102)33644
POKARNA LTD 220.9(218.8)9844
PRAJAY ENGS. 15.97(15.21)48160
PREMIER EXPL 431.8(430.25)2994
PRISM CEMENT 115.4(115.5)22691
RAIN 438.95(400.05)2421212
RAJ PACKAGIN 37.2(39.4)43020
REG.CERAMIC 9.49(9.37)11682
RESTILE CER. 9.47(9.85)47446
SAGAR CEM. 1011(912.75)33360
SAMKRG PIST. 346.45(347.6)12526
SAMPRE NUTRI 90.4(95.15)51468
SANGHI IND. 139.6(135.5)125226
SATVAH.ISPAT 34.2(33.85)23761
SAVEN TECHNO 24.5(25.3)10258
SMPL 1.75(1.82)80140
SMS PHARMACE 102(101.9)8430
SREE RAYALA 217.7(216.4)2888
STEEL EXCH 48.65(46.35)195689
SUJANA INDUS .9(.88)110211
SURANATP 6.24(6.27)35121
SURYACHAKRA 1.36(1.3)25120
SURYAMBA SP 72.85(70.85)3793
SURYLAK.COTT 95.95(95.1)10359
SUVEN LIFE S 202.3(202.4)26937
TAJ GVK HOTL 178.2(178.3)4247
TANLA 40.7(38.55)268198
TCI INDUS. 1080(1070)25
TRANSCORP IN 58.7(57.95)31102
TRANSGENE BI 2.37(2.3)15767
TRANSPORT CO 290.4(287.2)2649
USHER AGRO 8.79(8.59)14938
VICEROY HOTE 20.45(18.3)832621
VIJAY TEXTIL 43.9(43.75)5800
VIMTA LABS 170.45(167.75)8515
VIRAT CRANE 44.75(45)17975
VIRINCHI 126.45(125.35)74006
VISAKA IND. 662.05(647.75)7668
VISTA PHARMA 41.5(40.65)26659
VIVIMED LABS 104.35(105)150411
VST INDUS. 3201.95(3157.8)41
WATERBASE 400.95(401.7)431319
XLENERGY 3.9(4)6642
YBRANTDIGI 5.98(6.13)2587807
ZEN TECH 149.15(147.95)99678
ZENOTECH 47(47)13539

ఎన్ఎస్ఇ-500 NSE

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 708(636.35)249242
AARTIIND 1151.85(1132.9)111132
ABAN 205.05(205.45)1399871
ABB 1414.45(1400.2)57470
ABFRL 171.8(171.2)1653907
ABGSHIP 13.7(13.65)27731
ACC 1774.6(1743.2)194666
ADANIENT 176.2(163.9)21268697
ADANIPORTS 407.65(397.4)4679468
ADANIPOWER 44.25(43.35)36109485
ADANITRANS 212(210.5)900926
AEGISCHEM 286.4(282.5)259998
AHLUCONT 378.8(378.7)41307
AIAENG 1539.75(1525.4)72857
AJANTPHARM 1461.95(1472.5)163928
AKZOINDIA 1849(1846.45)3379
ALBK 72.2(72.15)1381266
ALLCARGO 210.6(205.3)697982
ALOKTEXT 4.1(4.25)5639439
AMARAJABAT 846.3(829.7)755541
AMBUJACEM 272.6(268.15)1906004
AMTEKAUTO 28.95(29.3)402094
ANANTRAJ 71.35(70.85)1996959
ANDHRABANK 57.3(57.35)1944803
APARINDS 823.25(795.6)78724
APLLTD 524.05(526.45)14042
APOLLOHOSP 1176.5(1191.95)261936
APOLLOTYRE 269.95(267.55)1504749
ARVIND 443.5(440.55)770441
ASHIANA 182.4(182.1)249597
ASHOKA 250.9(243.35)330623
ASHOKLEY 124.5(123.35)22686568
ASIANPAINT 1141.9(1142.75)593809
ASTRAL 818.4(829.65)17678
ASTRAZEN 1231.95(1187.75)28650
ATUL 2738.65(2716.5)6046
AUROPHARMA 665.55(671.4)1716552
AVANTIFEED 2561.75(2591.25)34868
AXISBANK 560.45(559.5)3990149
BAJAJ-AUTO 3241.05(3294.75)372267
BAJAJCORP 486.15(488.85)50639
BAJAJELEC 533.45(489.8)1599056
BAJAJFINSV 5099.45(5101.1)119413
BAJAJHIND 17.4(17.9)13371821
BAJAJHLDNG 2843.55(2839.8)4207
BALKRISIND 1189.05(1173.25)249791
BALLARPUR 18.85(18.35)5998560
BALMLAWRIE 270.75(267.8)114566
BALRAMCHIN 137.25(135.55)2104490
BANKBARODA 157.85(157.95)8271671
BANKINDIA 168.35(167.3)2542967
BASF 2119.45(2094.2)5189
BATAINDIA 772.4(753.9)1333787
BBTC 1628.55(1629.2)107151
BEML 1523.9(1575)1546419
BERGEPAINT 263.2(264.25)807043
BFUTILITIE 510.95(496.55)1425997
BGRENERGY 138.9(138.7)113441
BHARATFIN 993.4(993.6)555594
BHARATFORG 733.1(728.05)1073961
BHARTIARTL 518.2(516.55)5707905
BHEL 98.55(98.2)13637110
BHUSANSTL 67.3(67.3)1651903
BIOCON 541.85(541.7)1038802
BIRLACORPN 1226.15(1229.9)60598
BLISSGVS 206.55(209.2)593717
BLUEDART 4598.05(4587.25)2387
BLUESTARCO 818.2(817.8)67916
BOMDYEING 279.5(280.6)2065149
BOSCHLTD 19692.95(19721.75)12104
BPCL 494.9(499.8)3870814
BRFL 106.3(111.85)82904
BRIGADE 307.95(307.35)68539
BRITANNIA 4680.95(4656.05)83023
CADILAHC 428.5(428.3)472672
CANBK 352.8(352.05)1386224
CAPF 721.4(698.3)1322807
CARERATING 1330.7(1321.4)111613
CASTEXTECH 7.2(7.75)3421906
CASTROLIND 191.25(191.25)1145436
CCL 298.45(299.65)42044
CEATLTD 1945.55(1919.65)344906
CENTRALBK 75.9(74.95)1984589
CENTURYPLY 342.65(338.85)436257
CENTURYTEX 1409.35(1406.55)436771
CERA 3728.6(3774.85)7852
CESC 1058(1052.05)462724
CHAMBLFERT 160.2(157.65)1537454
CHENNPETRO 426.15(430.05)335065
CHOLAFIN 1309.35(1296.4)255824
CIPLA 606.8(607.8)771828
CLNINDIA 611(614.85)32476
COALINDIA 271.85(270.05)9240120
COLPAL 1098.35(1100.75)351927
CONCOR 1370.05(1352.7)125692
COROMANDEL 568.45(542.65)223908
CORPBANK 40.15(39.65)215788
COX&KINGS 268.1(276.8)186789
CRISIL 1855.6(1886.6)24476
CUB 178.4(177.35)382064
CUMMINSIND 931.35(922.3)414585
CYIENT 576.9(575.3)47916
DABUR 354.65(349.05)1819175
DALMIABHA 3103.75(3113.1)30144
DBCORP 353.4(356.1)46604
DBREALTY 67.85(70)3838377
DCBBANK 191.85(193.75)1147744
DCMSHRIRAM 549.65(535.9)193628
DEEPAKFERT 425.9(420.35)342807
DELTACORP 300.8(298.8)1362726
DEN 108.35(108.45)298315
DENABANK 25.4(25.4)1342446
DHANUKA 764.1(747.3)36935
DHFL 587.65(583.4)921001
DISHTV 85.05(85)6189845
DIVISLAB 1099.4(1080.9)768114
DLF 258.3(253.9)7342607
DREDGECORP 857.9(822.35)2686986
DRREDDY 2339(2409.2)886002
DYNAMATECH 2274.85(2197.05)11356
ECLERX 1552.2(1564.7)56021
EDELWEISS 282.45(285.5)1458966
EICHERMOT 28814.35(28670.15)47088
EIDPARRY 382.55(380.8)85790
EIHOTEL 149.2(146.4)184049
ELECTCAST 42.15(37.1)5914863
ELGIEQUIP 303.85(300.95)25190
EMAMILTD 1321.95(1310.25)129344
ENGINERSIN 199.45(194.25)2548956
EROSMEDIA 220.65(223.55)2524188
ESCORTS 772.95(772.75)991960
ESSDEE 60(60.9)17427
ESSELPACK 289.6(291.1)105903
EVEREADY 438.75(439)32638
EXIDEIND 223.35(221.7)2078634
FCONSUMER 74.65(74.15)3483517
FDC 245.3(243.5)53761
FEDERALBNK 107.7(107.6)2894282
FINCABLES 689.05(688.1)25878
FINPIPE 659.95(655.35)16503
FLFL 360.35(351.65)103658
FORTIS 163.25(154.75)25657824
FSL 40.25(40.25)1906332
GAIL 490.1(494.35)2205711
GATI 135.7(133.45)921597
GDL 234.15(233.75)64288
GEPIL 736.45(727.5)8965
GESHIP 404.9(401.05)94826
GET&D 435.3(438.75)23301
GILLETTE 6746.1(6762.95)29198
GLAXO 2459.3(2466)16057
GLENMARK 591.85(592.8)349314
GLOBOFFS 41.9(40.65)76004
GMDCLTD 171.65(168.15)580353
GMRINFRA 21.8(21.65)46683517
GODFRYPHLP 986.35(986.05)40933
GODREJCP 986.4(981.55)293077
GODREJIND 607.8(601.7)234920
GODREJPROP 710.75(703.65)91452
GPPL 137.95(138.55)2729805
GRANULES 134.95(134.15)1318176
GREAVESCOT 139.8(139.25)1480590
GREENPLY 359.9(357.9)81881
GRINDWELL 547.15(540.4)14820
GRUH 499.1(496.85)62084
GSFC 150.45(146.9)3381768
GSKCONS 6414.35(6464.5)8055
GSPL 220.7(222.7)578274
GUJFLUORO 890.45(893.15)45432
GUJGASLTD 873.2(847)56724
GULFOILLUB 997.1(1003.05)66352
GVKPIL 19.05(18.4)2487906
HATHWAY 39.8(39.45)203186
HAVELLS 555.65(549.25)968648
HCC 40.3(41.05)10006301
HCL-INSYS 59.65(59)5119493
HCLTECH 897.3(892.8)1291953
HDFC 1700.8(1703.25)2133332
HDFCBANK 1852.65(1872.35)1132822
HDFCBANK 1880(1886)313995
HDIL 62.65(61.85)15472607
HEIDELBERG 157.35(152.35)413845
HEROMOTOCO 3755.2(3743.85)274963
HEXAWARE 350.4(341.1)1735291
HFCL 33.3(32.15)19032192
HIMATSEIDE 395.95(394.8)60089
HINDALCO 276.5(271.9)7285874
HINDCOPPER 100.1(97.8)5905956
HINDPETRO 410.95(406.4)3006953
HINDUNILVR 1350.35(1338.6)832810
HINDZINC 312(309.4)882982
HMT 43.65(42.15)43495
HMVL 254.8(257.1)17098
HONAUT 18800.1(18854.75)15396
HOTELEELA 23.55(22.5)2973986
HSIL 498.8(497)24574
HTMEDIA 102.45(102.35)1409486
IBREALEST 216(215.5)4382554
IBULHSGFIN 1185.65(1183.55)704273
ICICIBANK 315(309.7)8898342
ICRA 3964.95(3978.65)5883
IDBI 59.5(59.4)1775812
IDEA 102.7(100.7)10968592
IDFC 61.7(61.6)3375751
IFBIND 1307.25(1328.4)12423
IFCI 29.25(28.7)20007093
IGARASHI 849.85(844.4)14087
IIFL 644.45(647.75)37421
IL&FSTRANS 93.05(81.55)6687838
INDHOTEL 121.35(118.5)1708368
INDIACEM 186.4(180.1)4763679
INDIANB 373.2(375.55)813917
INDOCO 280.95(280.55)33287
INDUSINDBK 1630.25(1643.95)1120860
INEOSSTYRO 1071.6(1044.3)13100
INFRATEL 378.65(378.8)2009516
INFY 1021.3(1029.7)3423276
INGERRAND 859.5(854.5)42661
INOXLEISUR 281(280.85)54529
INOXWIND 145.2(145)87800
INTELLECT 167.6(160.9)924349
IOB 22.5(22.35)1002936
IOC 386.3(386.4)2613904
IPAPPM 331.85(317.45)313294
IPCALAB 584.7(587.55)421258
IRB 236.1(228.95)2128151
ITC 261.15(260.75)11018996
J&KBANK 82.05(81.55)524631
JAGRAN 179.95(179.95)80909
JAICORPLTD 207.15(204.55)6889823
JBCHEPHARM 329.75(328.75)44354
JBFIND 229.75(226.85)82243
JCHAC 2619.5(2655.8)8968
JETAIRWAYS 870.6(831.4)4889426
JINDALPOLY 420.1(408.45)164506
JINDALSTEL 219.55(203.4)21696089
JISLJALEQS 128.75(128.7)4724195
JKCEMENT 1114(1114.2)23591
JKIL 316(307.85)114450
JKLAKSHMI 441.9(440.8)32446
JKTYRE 148.8(144.65)1122164
JMFINANCIL 155.05(156.05)727129
JPASSOCIAT 24.25(23.9)98155395
JPINFRATEC 23.15(22.55)5646775
JPPOWER 8.5(8.5)14414955
JSWENERGY 90.3(89.85)5812909
JSWHL 1781.65(1797.35)6025
JUBILANT 763.05(756.65)184921
JUBLFOOD 1850.55(1792.35)1275474
JUSTDIAL 515.4(517.2)1161976
JYOTHYLAB 379.05(379.55)309765
KALPATPOWR 482.9(475.7)72286
KANSAINER 562.2(563.6)52910
KEC 372.8(381.4)499822
KESORAMIND 140.7(135.6)845589
KIRLOSENG 383.55(382.75)19204
KITEX 307.05(306.5)86366
KOLTEPATIL 357.45(358.55)219218
KOTAKBANK 1000.1(1003.2)884021
KPIT 198.6(190.15)4054972
KRBL 605.25(600.2)264709
KSCL 536.75(539.45)670407
KSK 14.8(14.1)4517521
KTKBANK 153.15(153.85)1405256
KWALITY 111.55(111.3)979946
L&TFH 170.05(170.75)3621694
LAKSHVILAS 148.55(149.85)522995
LAOPALA 651.25(602.1)94685
LAXMIMACH 5803.55(5804.6)1158
LICHSGFIN 566.85(562.75)928381
LITL 1.5(1.45)947071
LT 1275.3(1249.75)2720736
LUPIN 878.95(875.15)3960088
M&M 754.9(752.9)2256643
M&MFIN 464.6(462.8)688247
MAGMA 167.6(163.55)66997
MAHINDCIE 250.1(250.55)341028
MAHLIFE 462.75(465)31357
MANAPPURAM 119.4(119.25)5974354
MANPASAND 473.8(462.05)247998
MARICO 320.85(325.7)1160639
MARKSANS 40.05(39.65)3121155
MARUTI 9416.6(9554.05)658281
MAYURUNIQ 514.95(503.6)67544
MCDOWELL-N 3598.15(3592)195740
MCLEODRUSS 198.7(198.95)191684
MERCK 1320.25(1305.3)39498
MHRIL 334.7(333.9)34654
MINDACORP 211.55(212.85)365502
MINDTREE 599.3(605.05)853218
MMTC 71.5(71.05)3309857
MOIL 239.45(236.9)458091
MONSANTO 2485.55(2492.75)8570
MOTHERSUMI 373.9(378.8)1303688
MOTILALOFS 1479.3(1454.35)132346
MPHASIS 720.05(734.65)58527
MRF 71173.35(71246.1)9083
MRPL 126.35(125.35)1351955
MTNL 29.75(30.25)9326728
MUTHOOTFIN 457.35(458.9)346999
NATCOPHARM 974.15(966.95)130867
NATIONALUM 86.3(85.5)5485226
NAUKRI 1358.35(1345)28424
NAVKARCORP 203.05(188.95)8385044
NCC 130.05(130.45)4593780
NETWORK18 58.85(58.95)1132059
NHPC 32.7(31.85)12168282
NIITTECH 645.95(642.55)310252
NITINFIRE 7.5(7.65)418912
NLCINDIA 108.8(108.75)1878916
NMDC 149.25(148.6)9219947
NTPC 177.05(178.9)10341665
OBEROIRLTY 479.6(480.4)243441
OFSS 4163.05(4000.25)98373
OIL 376.9(374.25)753373
OMAXE 228.85(228.55)672267
ONGC 193.45(196.85)8032715
ORIENTBANK 119.7(120)1315928
ORIENTCEM 169.45(166.6)112390
ORISSAMINE 2037.5(2065.75)12638
PAGEIND 24680.45(24411.45)14920
PARSVNATH 30.55(29.3)272264
PCJEWELLER 475.8(466.3)2178523
PEL 2850.05(2848.45)75514
PERSISTENT 696(709.15)53701
PETRONET 253.6(252.75)1846460
PFC 123.75(123.65)3126273
PFIZER 2017.15(2049.5)45745
PFS 37.5(37.5)1043621
PGHH 9412.85(9388.75)6981
PHOENIXLTD 618.25(635.2)812631
PIDILITIND 913.95(889.2)552174
PIIND 955.95(942.2)98499
PNB 166.6(166.4)8534233
POLARIS 386.3(387.1)75216
POWERGRID 201.65(200.75)4605412
PRAJIND 109.25(109)838419
PRESTIGE 321(321.5)137588
PRISMCEM 115.7(115.35)230521
PTC 118.8(119.25)1279869
PUNJLLOYD 26.5(26.6)6789068
PURVA 166.15(160.85)585771
PVR 1401.8(1402.8)143604
RADICO 297.8(292.15)1477942
RAIN 438.3(399.3)14571898
RAJESHEXPO 809.75(816.25)1124425
RALLIS 269.55(265.35)814998
RAMCOCEM 793.8(775.5)296293
RAMCOSYS 562.35(559.85)85591
RATNAMANI 1093.25(1090.85)29586
RAYMOND 1055.9(1045.8)406824
RCF 100.95(95.65)20607582
RCOM 30.55(32.4)233379852
RECLTD 157.85(157.65)2593130
REDINGTON 184.25(185.5)961236
RELAXO 686(670.9)7709
RELCAPITAL 599.8(596.75)6894223
RELIANCE 914.8(911.15)6175312
RELINFRA 562.55(563.4)3690364
RENUKA 16.85(17.05)3722046
REPCOHOME 692.75(687.25)81858
RIIL 639.9(659.75)2052300
RKFORGE 859.55(866.15)17975
RNAVAL 58.6(59.7)46763305
ROLTA 70.8(71.2)7155838
RPOWER 56.95(56.85)54258958
RTNPOWER 7.8(7.85)21756753
RUCHISOYA 19.65(18.85)8998236
SADBHAV 417.2(426.9)200920
SADBHIN 143.5(143.25)111721
SAIL 93.8(91.85)15846529
SANOFI 4661.85(4676.15)1748
SBIN 302.85(303.25)13857373
SCHAEFFLER 5747.6(5749.7)2117
SCHNEIDER 129.65(129)201708
SCI 96.05(93.8)2372906
SHARDACROP 453.35(455.35)8943
SHILPAMED 610.4(614.7)31895
SHK 294(287)124894
SHOPERSTOP 533.25(536.05)38862
SHREECEM 18099.55(18000.35)16576
SHRIRAMCIT 2095.4(2109.8)5840
SIEMENS 1258.15(1258.9)138470
SIMPLEXINF 582.55(576.85)15198
SINTEX 26.65(26.65)4787668
SITINET 25.8(25.75)150310
SJVN 34.45(33.7)1399717
SKFINDIA 1857.7(1853.2)3350
SMLISUZU 910.8(904.65)50344
SNOWMAN 59.45(59.6)1436095
SOBHA 603.25(589.55)479584
SOMANYCERA 934.25(910.5)24554
SONATSOFTW 267.3(273.85)161097
SOUTHBANK 31.15(31.15)6245319
SPARC 500.3(490.95)356522
SREINFRA 98.35(98.85)1411266
SRF 1921.4(1945.5)204284
SRTRANSFIN 1452.1(1463.35)497431
STAR 818.5(816.8)283354
STCINDIA 181.5(179.8)12343
SUNDARMFIN 1850.95(1854.1)11745
SUNDRMFAST 573.65(574.7)72372
SUNPHARMA 569.05(572.15)2182632
SUNTV 1004.7(995.2)779309
SUPREMEIND 1294.9(1300.25)15833
SUVEN 202.75(202.65)313688
SUZLON 15.75(15.85)33251247
SWANENERGY 193.85(194.9)499328
SYMPHONY 1717.1(1693.45)12714
SYNDIBANK 79.4(78.65)2239604
SYNGENE 566.55(560.2)240819
TAKE 168.45(164.6)481554
TATACHEM 755.9(730.1)3451560
TATACOFFEE 165.7(165)519006
TATACOMM 668.65(670.75)430050
TATAELXSI 994.05(977.85)1303199
TATAGLOBAL 311.2(311.15)2073353
TATAMOTORS 433.9(439.3)9794953
TATAMTRDVR 255.15(253.1)3644585
TATAPOWER 100.8(99.7)23056832
TATASPONGE 992.95(997.75)176803
TATASTEEL 734.95(729.3)2634779
TBZ 122(122.15)470725
TCS 2638.65(2631.2)628560
TECHM 519.45(513.95)2288877
TECHNO 399.35(400.6)36376
TEXRAIL 113.8(112.45)770526
THERMAX 1238.15(1209.75)51198
THOMASCOOK 250.8(251.3)202036
TIDEWATER 7071.95(7004.75)4365
TIMKEN 897.35(874.8)42707
TITAN 856.3(845.15)2606556
TNPL 442.8(439.25)80281
TORNTPHARM 1378.55(1395.1)120264
TORNTPOWER 278.25(277.85)895484
TREEHOUSE 15(14.95)72723
TRIDENT 89.2(88.4)719010
TRITURBINE 129.85(129.45)103006
TTKPRESTIG 7748.35(7770.65)4371
TTML 7.05(7.2)659557
TV18BRDCST 60.5(59.95)7653850
TVSMOTOR 769.85(774.85)663896
TVSSRICHAK 3803.85(3826.95)4160
TVTODAY 430.05(428.5)65531
UBL 1077.55(1030.7)540133
UCOBANK 30.4(30.3)1272634
UFLEX 480.35(481.5)127900
ULTRACEMCO 4301.95(4252.3)166916
UNICHEMLAB 332.6(324.9)322472
UNIONBANK 143.15(141.95)2243525
UNITECH 10.55(10.7)90775127
UPL 775.8(773.45)1914605
VAIBHAVGBL 708.7(713.7)10297
VAKRANGEE 417.65(420.15)1336139
VEDL 332.5(327.75)8171980
VIDEOIND 22.6(21.55)657402
VIJAYABANK 66.8(68.15)1978777
VINATIORGA 995.6(993.5)14980
VIPIND 344.6(347.15)269677
VOLTAS 643.6(647.4)798896
VRLLOG 424.05(427.6)34355
VSTIND 3171(3174.1)159
VTL 1486.55(1427.4)129127
WABAG 629.95(622.95)83938
WABCOINDIA 7492.85(7213)25402
WELCORP 142.3(135.95)917062
WELSPUNIND 71.4(71.7)1207970
WHIRLPOOL 1572.65(1599.6)20343
WIPRO 309.95(318.7)2197677
WOCKPHARMA 933.75(903.3)1755488
WONDERLA 361.7(360.85)20686
ZEEL 579.75(578.15)1207540
ZEELEARN 45.85(44.05)1252064
ZENSARTECH 867.05(857.4)5991
ZYDUSWELL 1022(1017.35)3265



ఆమే ఒక సైన్యం





అలీసా మిలానో

మద గజం రెచ్చిపోతుంటే సహించాలా? కాళ్లు పట్టుకుని పడి ఉండాలా? లైంగిక హింసను మౌనంగా భరించాలా? సాగినన్నాళ్లు సాగింది. ఇక భరించే ప్రశ్నే లేదంటోంది మహిళా లోకం! తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న తాజా ఉదంతమే ఇందుకు ఉదాహరణ. లైంగిక వేధింపులపై పోరాటంగా 2017లో మొదలైన 'మీ టూ' ఉద్యమ స్ఫూర్తి ఇప్పుడు ప్రపంచమంతా వ్యాపించింది. హాలీవుడ్ మొఘలైనా.. అమెరికా అధ్యక్షుడైనా సరే..స్త్రీని సెక్స్ యంత్రంలా చూసే కామాంధులను కోర్టు కీడ్చడానికి 'టైమ్ ఈజ్ అప్' ఆందోళన మొదలైంది. 'లైంగిక వేధింపులు ఎదుర్కొన్న ప్రతి బాధితురాలికీ న్యాయం జరిగే వరకూ పోరాడతాం! అందుకు ఎన్ని మిలియన్ డాలర్ల నిధులైనా సమీకరిస్తాం' అంటూ 300మంది హాలీవుడ్ తారలు చేసిన ప్రకటన యావత్ మహిళా లోకంలో ఉత్తేజాన్ని నింపింది.

ఇప్పుడు పురుష దురహంకారంపై 'ఆమె' ఒక సైన్యంలా కదులుతోంది..! 'లైంగిక దాడులను, అత్యాచారాలను మౌనంగా భరించకండి. దాచేస్తే అవి ఆగిపోవు. మరెంతోమంది మహిళల జీవితాలను నాశనం చేస్తాయి. అందుకే లైంగిక హింసను ప్రతిఘటించండి. 'మీ టూ' స్ఫూర్తితో తెలివిగా, ధైర్యంగా పెద్దల ముసుగులోని నీచుల బండారం బయటపెట్టండి. మీకు పౌర సమాజం, ప్రభుత్వం అండగా నిలుస్తాయి' అని బాధిత మహిళలకు పిలుపునిస్తోంది!

-సెంట్రల్ డెస్క్

గజానికో మద గజం



సినీగీత రచయిత శ్రేష్ఠ

మహిళా గీత రచయితకు వేధింపులు!

పెళ్లి చూపులు, అర్జున్‌రెడ్డి సినిమాల్లో పాటలు రాసిన శ్రేష్ఠ ఇప్పటికే 'మీ టూ' ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. మహిళా గీత రచయితగా తెలుగు సినీ పరిశ్రమలో తాను కూడా వేధింపులు ఎదుర్కొన్నానన్న ఆమె మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గోవాలో జరిగిన ఓ పార్టీకి తాను రావాలంటూ ఓ దర్శకురాలు బలవంతం చేసిందనీ, ఓ వ్యక్తిని పరిచయం చేసి అతను నిన్ను ప్రేమిస్తున్నాడని చెప్పిందన్నారు. కానీ అదే వ్యక్తి తనకు ఫోన్ చేసి..ఆ దర్శకురాలు నీ గురించి ఇంకోలా చెప్పిందని చీప్‌గా మాట్లాడటంతో షాక్ అయ్యానని వెల్లడించారు. ఆ దర్శకురాలిని చెప్పుతో కొట్టాలనిపించిందనీ..ఇండస్ట్రీకి కొత్తగా వచ్చిన అమ్మాయిలను వేధింపులకు గురిచేసేవారిలో మహిళలు కూడా ఉంటారన్న శ్రేష్ఠ మాటలు కలకలం రేపాయి.

చాన్స్ కావాలంటే చాన్సివ్వాల్సిందే!



వీన్‌స్టీన్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన హాలీవుడ్ నటీమణులు

ప్రముఖ హాలీవుడ్ నిర్మాత హార్వే వీన్‌స్టీన్‌పై నటి అలిసా మిలానో లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం సంచలనం సృష్టించింది. సామాజిక కార్యకర్త తరానా బర్కేతో కలిసి ఆమె 'మీ టూ' ఉద్యమాన్ని ప్రారంభించారు. వారి స్ఫూర్తితో లైంగిక వేధింపులు ఎదుర్కొన్న ఎందరో తారలు మీడియా ముందుకు వచ్చి..వీన్ స్టీన్ బండారం బయటపెట్టారు. హార్వే వీన్‌స్టీన్‌పై డజన్ల లైంగిక వేధింపుల కేసులు నమోదయ్యాయి. తాజాగా రెండు కేసులు లాస్‌ఏంజెలిస్ కోర్టులో విచారణకు వచ్చాయి. వందలాది అమ్మాయిల జీవితాలతో ఆడుకున్నాడని పాశ్చాత్య మీడియాలో ఆయనపై కథనాలు వెలువడ్డాయి. 'వీన్ స్టీన్ నామీద పడ్డాడు. నాకు ఇష్టం లేదని చెప్పాను. కానీ వాడో పంది. నన్ను రేప్ చేశాడు' అంటూ హాలీవుడ్ నటి..డి లా హ్యార్టా చేసిన వ్యాఖ్యలు ప్రకంపనలు సృష్టించాయి. బాలీవుడ్ నటి ఐశ్వర్యారాయ్‌ని కూడా వీన్‌స్టీన్ వేధించాడని ఇటీవల ఆమె పూర్వ మేనేజర్ షిఫీల్డ్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. హాలీవుడ్ నటుడు స్పేసీ, హాస్యనటుడు లూయిస్ సీకే కూడా వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్నారు.

సమయం లేదు మిత్రమా!

లైంగిక వేధింపులపై హాలీవుడ్ పోరు..

బాధితులకు అండగా 300మంది తారలు

వీన్‌స్టీన్ లైంగిక వేధింపుల వ్యవహారం నేపథ్యంలో హాలీవుడ్ తారలంతా ఏకమయ్యారు. మహిళలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేశారు. దాదాపు 300మందికిపైగా నటీమణులు, మహిళా రచయితలు, దర్శకులు, నిర్మాతలు, ఎంటర్‌టైన్మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు కలిసి 'టైమ్ ఈజ్ అప్' అనే ఉద్యమాన్ని ప్రారంభించారు. సినీ పరిశ్రమతోబాటు పనిచేసే అన్ని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. బాధిత మహిళల పక్షాన నిలిచి.. న్యాయ పోరాటంలో వారికి అండగా నిలవడానికి 15 మిలియన్ డాలర్ల నిధులు సేకరించాలని లక్ష్యంతో పనిచేస్తున్నారు. హాలీవుడ్ తారలు పోర్ట్‌మాన్, విదర్‌స్పూన్, బ్లాంచెట్ తదితరులు ఇప్పటికే 13 మిలియన్ డాలర్ల నిధులు సమకూర్చారు. ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు, రైతులు, సహాయకులు, హోటల్ సిబ్బంది.. ఇలా సమాజంలో ఏ రంగానికి చెందిన మహిళ వేధింపులకు గురైనా.. వారు కోర్టుల్లో పోరాడటానికి ఈ నిధులను ఉపయోగిస్తారు.

▸▸ టైమ్ ఈజ్ అప్



ట్రంప్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన సమ్మర్ జెర్వోస్ (కుడి)

50 ఏళ్లు పడుతుందేమో!

నాకు అనిపిస్తూ ఉంటుంది..బాలీవుడ్ డర్టీసీక్రెట్స్ ఎప్పటికైనా బయటకు వస్తాయా అని! హాలీవుడ్‌లో లైంగిక వేధింపులపై హీరోయిన్లు గళమెత్తడానికి 25 సంవత్సరాలు పట్టింది. బాలీవుడ్ డర్టీ పిక్చర్ బయటపడాలంటే మరో 50 ఏళ్లు పడుతుందేమో!

-శృతి సేథ్, నటి, టెలివిజన్ వీజే



మన చుట్టూ మదోన్మాదులే

రెచ్చిపోతున్న కామాంధులు.. సామాజిక మాధ్యమాల్లో గోడు వెళ్లబోసుకుంటున్న అతివలు



హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలోని ఓల్డ్ మలక్‌పేటకు చెందిన ఓ యువతి అదే ప్రాంతంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తోంది. అదే పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలెట్టాడు. రోజూ ఏదో ఒక సమస్యతో ఆమెను ఇబ్బందిపెట్టేవాడు. కొద్ది రోజుల తర్వాత ఆమెను లొంగదీసుకోవడానికి ప్రయత్నించాడు. సదరు యువతికి ఉద్యోగం ముఖ్యం కావడమే ఆమె పాలిట శాపంగా మారింది. ఇదే అదనుగా భావించిన ఆ కామాంధుడు నిత్యం ఆమెకు అశ్లీల సందేశాలు, వీడియో క్లిప్పింగ్స్ పంపిచేవాడు. తనకు తెలిసిన వారితో ఆ యువతి చెప్పుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. చివరికి ఓపిక నశించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్, ఆర్కిటెక్చరల్ యూనివర్సిటీలో ఒక ప్రొఫెసర్ 18 ఏళ్లుగా రిసెర్చ్ స్కాలర్స్‌ను వేధిస్తున్నట్లు తేలింది. ఇలా ఒకటా రెండా! నిత్యం ఎన్నో లైంగిక వేధింపుల కేసులు వెలుగుచూస్తున్నాయి. బయటికి రానివి ఇంకా మరెన్నో!! మన చుట్టూనే మగోన్మాదులు తమ అకృత్యాలను కొనసాగిస్తున్నారు. వారి వేధింపులను పంటిబిగువున భరిస్తున్న వారు కొందరైతే.. బయటకు చెప్పుకొంటే తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందోనేమోనని జంకుతున్న వారు మరికొందరు. ఇల్లు, గుడి, బడి, పనిచేసే చోటు, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు.. ఎక్కడ చూసినా మదోన్మాదులు రెచ్చిపోతున్నారు. అయితే, ఇన్నాళ్లూ మౌనంగా భరిస్తున్న బాధితులు మహిళలు.. 'మీ టూ' ఉద్యమం పుణ్యమాని తమ ఆవేదనను ట్విట్టర్, ఫేస్‌బుక్, లాంటివాటి ద్వారా వెల్లడిస్తున్నారు.

ఉపయోగం ఉందా?

లైంగిక వేధింపుల గురించి మహిళలు 'మీటూ' హ్యాష్ ట్యాగ్‌తో ఆన్‌లైన్‌లో పెట్టడం వల్ల ఏమైనా ఉపయోగం ఉంటుందా? అంటే.. ఉంటుందనే అంటున్నారు పాత్రికేయురాలు రాజేశ్వరి కల్యాణం. ఈ ఉద్యమం బలపడాలని అభిలషిస్తున్నారు. అడిషనల్ సీపీ-క్రైమ్ స్వాతి లక్రాదీ అదే మాట. బాధితులు భయపడొద్దని, చట్టాలు బలంగా ఉన్నాయని, స్త్రీలను వేధించేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

కమిటీల ఏర్పాటుపై శ్రద్ధ ఏదీ?

పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను నిరోధించడానికి, బాధితులకు అండగా నిలవడానికి.. చట్టప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలి. సంస్థల్లో సంబంధిత శాఖ ఉన్నతాధికారి కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆరుగురు సభ్యులు ఉంటారు. వారిలో కచ్చితంగా ఇద్దరికి మించి మహిళా ఉద్యోగులు ఉండాలి. అయితే చాలావరకు కంపెనీలు కమిటీలను ఏర్పాటు చేయడం లేదు.

ఇదీ చట్టం..!

ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం మహిళలపై ఏయే చర్యలు ఏయే సెక్షన్ల కిందికి వస్తాయంటే...

294(ఎ) (బి):	అశ్లీల చేష్టలు, పాటలు
292:	అశ్లీల పుస్తకాలు, బొమ్మలు మహిళలకు చూపడం
509:	వెకిలి చేష్టలు, అసభ్య ప్రవర్తన, బూతు కామెంట్లు చేయడం
354:	లైంగిక దాడి
375, 376:	అత్యాచారం (రేప్)
498(ఎ):	మహిళల పట్ల ఆమె భర్త, భర్త తాలూకు బంధువులు క్రూరంగా ప్రవర్తించడం

వేధింపులు- కేసులు (తెలంగాణలో)

ఇటీవల ఎన్‌సీఆర్‌బీ విడుదల చేసిన రిపోర్టులో అత్యాచారం కేసుల్లో హైదరాబాద్ నాలుగోస్థానంలో ఉంది. తెలంగాణవ్యాప్తంగా గత నాలుగేళ్లుగా దాఖలైన ఫిర్యాదులు, నమోదైన కేసుల సంఖ్య ఇలా ఉంది..

ఏడాది	ఫిర్యాదులు	కేసులు
2014	316	60
2015	267	78
2016	401	87
2017	267	67 (ఆగస్టు వరకు)

"మనదేశంలో మహిళలపై లైంగిక హింస పెరిగిపోవడానికి కారణమేమిటి? లింగ నిష్పత్తి తగ్గిపోవడమా? లేక సంప్రదాయ, మత, నైతిక పరమైన నిషేధాల కారణంగా పురుషుల లైంగిక లాలస తీరకపోవడమా? లేక.. ఇంటర్‌నెట్, స్మార్ట్‌ఫోన్ల ద్వారా విస్తృతంగా అందుబాటులోకి వస్తున్న నీలిచిత్రాలా?"

..ఇటీవల ఒక కేసు విచారణలో భాగంగా మద్రాసు హైకోర్టు కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు, జాతీయ మహిళా కమిషన్‌కు సంధించిన ప్రశ్నలివి. ఈ ప్రశ్నలకు జనవరి 10లోపు సమాధానం ఇవ్వాలని న్యాయమూర్తి కేంద్రాన్ని, మహిళా కమిషన్‌ను ఆదేశించారు. నిజమే! అత్యాచారాలకు కారణమేమిటి? రేప్ ఎందుకు చేస్తారు? సామాజిక కారణాలా? మానసిక కారణాలా లేక మరేమైనా ఉన్నాయా?

లైంగిక లాలసే కారణమా?

హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో పెరుగుతున్న అత్యాచారాలపై యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో సోషియాలజీ లెక్చరర్‌గా చేస్తున్న వాణి ఎస్ కులకర్ణి తన బృందంతో చేసిన అధ్యయనంలో ఆసక్తికర విషయాలను కనుగొన్నారు. ఆర్థిక, సామాజిక కారణాలు.. పోలీస్, న్యాయవ్యవస్థ తీరు, మాస్ మీడియా ఎక్స్‌పోజర్.. అత్యాచారాల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా తేల్చారు. వారి అధ్యయనం ప్రకారం జనాభా లింగనిష్పత్తిలో అసమానతలు ఎక్కువగా ఉన్నచోట అత్యాచార కేసులు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. ఆల్కహాలిజం కూడా అత్యాచారాలకు ఓ ప్రధాన కారణమవుతోందని వారి అధ్యయనంలో తేలింది. మహిళల వస్త్రధారణ లేదా ప్రవర్తన తమను పురికొల్పుతున్నాయని కొందరు రేపిస్టులు చెబుతున్నారని ఈ అధ్యయనం వివరించింది. అలాగే, 'హైపోమానియా'.. అంటే ఉత్సాహం, ఉల్లాసం, మంచి మూడ్ ఉన్న హైపర్‌యాక్టివ్ స్థితిలో ఉన్నవారు అత్యాచారానికి పాల్పడే అవకాశం ఎక్కువట. మనోవైకల్య (స్కిజోఫ్రీనియా) రోగులు.. ఎలాంటి మానసిక వైకల్యం లేనివారితో పోలిస్తే నాలుగు రెట్లు అధికంగా లైంగిక నేరాలకు పాల్పడే అవకాశాలున్నాయి. ఆరు నెలలకు పైబడి తీవ్రమైన లైంగిక కోర్కెలతో ఇబ్బంది పడుతుండటం, లైంగిక ఉద్రేకాన్ని కలిగించే ఆలోచనలతో గడుపుతుండటం అత్యాచారాలకు పురికొల్పుతాయి.

నేటి సంతోషం ముఖ్యం అనే భావనే కారణం

డ్రగ్స్ వినియోగం పెరగడం, సినిమాలు, అరచేతిలో అశ్లీలం అందుబాటులోకి రావడం వంటివి యువకుల ప్రవర్తనలో మార్పు తెస్తున్నాయి. ఈ రోజు సంతోషంగా ఉంటే చాలు.. రేపు ఏమైనా ఫర్వాలేదన్న ధోరణి పెరిగిపోతోంది. ఆ భావనే వారిని క్రైమ్ వైపు నడిపిస్తోంది. అలాగే పర్సనాలిటీ సమస్యలు అత్యాచారాలకు కారణమవుతాయి. అలాంటివారు సంఘ వ్యతిరేక భావాలతో ఉంటారు. ఆ తరహా ఆలోచనలున్నవారిని చిన్నప్పుడే గుర్తించి కౌన్సెలింగ్‌తో మార్చవచ్చు.

-డాక్టర్ శేఖర్ రెడ్డి, సైకియాట్రిస్ట్, కిమ్స్ హాస్పిటల్

న్యాయం ఎంతో దూరం!

మన చట్టాలు ఎంత కఠినంగా ఉంటాయో అన్ని లొసుగులూ వాటిలో ఉన్నాయి. కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య వల్ల తీర్పులు ఆలస్యమవుతున్నాయి. నిర్భయ కేసుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుచేస్తేనే తీర్పు కోసం దాదాపు రెండేళ్లు ఎదురు చూడాల్సి వచ్చింది. రేపిస్టులకు చట్టాలు, శిక్షల పట్ల భయం లేకుండా పోవడానికి ఇలాంటి అంశాలే కారణమవుతున్నాయంటున్నారు విశ్వ అనే లాయర్.

సామాజిక కారణాలు చాలా తక్కువ

మానసిక, లైంగిక కారణాలతోనే రేప్‌లు ఎక్కువగా జరుగుతాయి. సామాజిక కారణాలతో జరిగేవి చాలా తక్కువ. మరీ ముఖ్యంగా.. మానసిక సమస్యలు, పర్సనాలిటీ డిజార్డర్లు అత్యాచారాలకు ప్రధాన కారణమని చెప్పొచ్చు.

-డాక్టర్ జి.సమరం, సెక్సాలజిస్ట్

2 రాష్ట్రాల్లో 2 వేల రేప్‌లు

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో -2016 రికార్డుల ప్రకారం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో రెండు వేలకు పైగా రేప్ కేసులు నమోదయ్యాయి. ఒక్క తెలంగాణాలోనే 1278 కేసులు నమోదు కావడం గమనార్హం. ఎన్సీఆర్‌బీ నివేదిక ప్రకారం.. గతంతో పోలిస్తే మహిళలపై నేరాల సంఖ్య స్వల్పంగా తగ్గినప్పటికీ అత్యాచారాలు మాత్రం గణనీయంగా పెరిగాయి. లైంగిక వేధింపులు, భార్యలను వేధిస్తున్న భర్తలు, కుటుంబసభ్యులు వంటి కేసులు 1311 నమోదై ఢిల్లీ తరువాత స్థానాన్ని హైదరాబాద్ ఆక్రమించింది. నిజానికి 67-84% అత్యాచార కేసులు పోలీసుస్టేషన్ మొహమే చూడడం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి.

ఎక్కడో చెయ్యి వేస్తాడు

అప్పటి అధ్యక్షుడు



అమెరికా మాజీ అధ్యక్షుడు సీనియర్ బుష్ తమతో అసభ్యంగా ప్రవర్తించారని ఏడుగురు మహిళలు ఆరోపించారు. ఆయనతో ఫొటో తీయించుకునే సమయంలో తమ పిరుదులను తడిమారని మీడియాకి వెల్లడించారు. సీనియర్ బుష్ తనతో అసభ్యంగా ప్రవర్తించారని నటి హెదర్ లిండ్ తొలుత ఆరోపించారు. గత ఏడాది హ్యూస్టన్‌లో జరిగిన ఓ టెలివిజన్ సిరీస్ స్క్రీనింగ్‌లో..బుష్‌తో కలిసి ఫొటో తీయించుకున్న సమయంలో..ఆయన తనను వెనుక నుంచి తడిమారనీ, ఓ డర్టీ జోక్ కూడా వేశారని ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె చేసిన పోస్ట్ అమెరికన్లను షాక్‌కు గురిచేసింది. జోర్డానా గ్రోల్‌నిక్ అనే నటి కూడా ఇదే తరహాలో ఆరోపణలు చేశారు. పదహారేళ్ల వయసులో బుష్‌తో ఫొటో తీయించుకోవడానికి వెళ్లినప్పుడు ఆయన అసభ్యంగా ప్రవర్తించారని రోస్లిన్ కారిగాన్ అనే మహిళ పత్రికలకు వెల్లడించారు.

స్త్రీలోల్డ్ ట్రంప్

ఇప్పటి అధ్యక్షుడు



డోనాల్డ్ ట్రంప్.. అమెరికా అధ్యక్షుడు! అంతకు ముందు.. పేరుమోసిన రియల్ ఎస్టేట్ వ్యాపార దిగ్గజం. ఆయనకు ఇంకో పేరు కూడా ఉంది.. 'స్త్రీలోలుడు' అని. ట్రంప్ తమను లైంగికంగా వేధించాడంటూ.. ఆయన మొదటి భార్య ఇవానా, రియాలిటీ స్టార్ జెర్వోస్ సహా 16 మంది ఆరోపించారు. బయటికి రాని వారి సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందన్న ఆరోపణలూ ఉన్నాయి. లైంగిక వేధింపులంటే.. అనుచితంగా తాకడం నుంచి ఎంగిలి ముద్దులు పెట్టడం, రేప్ దాకా అన్ని రకాల ఆరోపణలూ ఉన్నాయి ఆ ఆరోపణలన్నీ అబద్ధాలేనని ట్రంప్ ప్రకటించారు.

ఎగ్జామ్ గైడ్

బిట్స్‌లో ప్రవేశానికి సిద్ధమవ్వండిలా



ఇంజనీరింగ్ విద్యనభ్యసించడానికి ఐఐటీల తరవాత విద్యార్థులు అత్యంత ఆసక్తిని కనబరిచే సంస్థ.. బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్). ఈ సంస్థ పిలానీ, హైదరాబాద్, గోవా, దుబాయ్‌ల్లో క్యాంపస్‌లను నిర్వహిస్తోంది. ప్రపంచ స్థాయి సదుపాయాలు, ఉత్తమ బోధన, అత్యుత్తమ ఫ్యాకల్టీ, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వెరసి బిట్స్‌ను ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థగా మార్చాయి. 2018-19 విద్యా సంవత్సరానికి బిట్స్‌లో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలను తెలుసుకుందాం..

ప్రస్తుత నోటిఫికేషన్ ద్వారా బిట్స్ ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ కోర్సులను ఆఫర్ చేస్తుంది. ఇందులో బీఈ, బీఫార్మసీ, ఎంఎస్సీ ప్రోగ్రామ్స్ ఉన్నాయి. పిలానీ, హైదరాబాద్, గోవా క్యాంపస్‌లు అందిస్తున్న కోర్సుల పూర్తి వివరాలను మే 1న వెబ్‌సైట్ ద్వారా వెల్లడిస్తారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి దేశ వ్యాప్తంగా బిట్స్ అడ్మిషన్ టెస్ట్‌ను నిర్వహిస్తుంది. తెలుగు విద్యార్థులు ఎక్కువగా రాసే ఈ పరీక్ష ప్రిపరేషన్ వ్యూహాలను చూద్దాం.

పూర్తిగా ఆన్‌లైన్‌లోనే

బిట్స్ ప్రవేశ పరీక్షను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తారు. ఎన్‌సీఈఆర్‌టీ 11, 12 తరగతుల సిలబస్ ఆధారంగా ప్రశ్నలను రూపొందిస్తారు. ఇందులో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 3 మార్కులు. నెగెటివ్ మార్కింగ్ కూడా ఉంటుంది. ప్రతి తప్పునకు ఒక మార్కు కోత విధిస్తారు.

విభాగం	సబ్జెక్ట్	ప్రశ్నలు
పార్టు 1	ఫిజిక్స్	40
పార్టు 2	కెమిస్ట్రీ	40
పార్టు 3	(ఎ) ఇంగ్లీష్	15
	(బి) రీజనింగ్	10
పార్టు 4	గణితం/ బయాలజీ	45
	మొత్తం	150

- ఫార్మసీ కోర్సును ఎంచుకున్న విద్యార్థులకు మ్యాథమెటిక్స్ స్థానంలో బయాలజీ నుంచి ప్రశ్నలు వస్తాయి.

టాపర్లకు నేరుగా

రాష్ట్ర స్థాయి లేదా సెంట్రల్ బోర్డ్ స్థాయిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు ఎలాంటి రాత పరీక్ష లేకుండానే నేరుగా బిట్స్‌లో ప్రవేశం కల్పిస్తారు. ఈ పరీక్షలో ఉన్న మరో విశేషం.. ప్రశ్నలన్నింటికీ సమాధానాలు గుర్తించిన తరవాత సమయం మిగిలినట్లయితే మరికొన్ని అదనపు ప్రశ్నలకు కూడా సమాధానాలు రాయవచ్చు. వీటి మార్కులను కూడా మొత్తం మార్కులకు కలుపుతారు.

- **సన్నాహాలు:** గత ప్రశ్నపత్రాలను విశ్లేషిసే సీబీఎస్ఈ, రాష్ట్ర స్థాయి సిలబస్ పుస్తకాల్లోని అంశాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నట్లు తెలుస్తోంది. కాబట్టి ఆయా అంశాల మీద పూర్తిపట్టు సాధిస్తే ఎక్కువ మార్కులు తెచ్చుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **అర్హత:** బీఈ కోర్సుకు... 75 శాతం మార్కులతో 10+2 / తత్సమాన (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) పరీక్షలో 2017లో ఉత్తీర్ణత లేదా 2018లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు. బీఫార్మసీ కోర్సుకు... 75 శాతం మార్కులతో 10+2 / తత్సమాన (బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ) పరీక్షలో 2017లో ఉత్తీర్ణత లేదా 2018లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులు.
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 13, 2018
- ఆన్‌లైన్ టెస్ట్‌లు: మే 16-31 వరకు
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి.
- వెబ్‌సైట్: www.bitsadmission.com

కటాఫ్ వివరాలు

పిలానీ క్యాంపస్

ప్రోగ్రామ్	2017	2016	2015	2014
కెమికల్	306	319	315	326
సివిల్	294	314	312	322
ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్	355	362	362	359
మెకానికల్	334	346	345	351
మాన్యుఫ్యాక్చరింగ్	288	311	308	311
కంప్యూటర్ సైన్స్	382	384	378	375
ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్	332	345	340	346

గోవా క్యాంపస్

ప్రోగ్రామ్	2017	2016	2015	2014
కెమికల్	246	301	298	295
ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్	320	331	327	315
మెకానికల్	304	322	319	312
కంప్యూటర్ సైన్స్	350	358	351	339
ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్	301	312	311	305

హైదరాబాద్ క్యాంపస్

ప్రోగ్రామ్	2017	2016	2015	2014
కెమికల్	272	298	296	294
సివిల్	273	303	303	300
ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్	310	324	318	311
మెకానికల్	297	316	315	308
కంప్యూటర్ సైన్స్	339	347	339	329
ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్	320	332	326	317
ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్	298	313	311	307
మాన్యుఫాక్చరింగ్	269	298	296	293


లాజికల్ రీజనింగ్

- లాజికల్ రీజనింగ్‌లో వెర్బల్, నాన్ వెర్బల్ రీజనింగ్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఈ క్రమంలో వెర్బల్ రీజనింగ్‌లో సిరీస్, అనాలజీ, క్లాసిఫికేషన్, కోడింగ్, డి కోడింగ్, లాజికల్ వెన్ డయాగ్రమ్స్, డిక్షనరి టెస్ట్, మిస్సింగ్ క్యారెక్టర్, కౌంటింగ్ ఫిగర్స్, క్లాక్స్ & క్యాలెండర్స్, క్యూబ్స్, డైస్, ప్రాబ్లమ్ సాల్వింగ్, లాజికల్ డిడక్షన్స్, డాటా ఇంటర్‌ప్రిటేషన్ వంటి అంశాలపై పట్టు సాధించాలి. నాన్ వెర్బల్ రీజనింగ్‌లో పేపర్ కట్టింగ్, ఫిగర్ మాట్రిక్స్, ఫిగర్ కంప్లీషన్ వంటి వాటిపై దృష్టి సారించాలి. ముఖ్యమైన అంశాలు: ఎంబెడెడ్ ఫిగర్స్, రూల్ డిటెక్షన్, డాట్ సిచ్యువేషన్
- **ఇంగ్లీష్:** ఈ విభాగంలో ఒక ప్యాసేజ్ ఇస్తారు. దీనికి సంబంధించి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఇచ్చిన డైరెక్షన్స్ ప్రకారం సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది.

- రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం, వెలాసిటి విద్యా సంస్థలు, హైదరాబాద్.


సబ్జెక్టుల వారీగా కీలక అంశాలు

మ్యాథమెటిక్స్



- **ఆల్జీబ్రా:** మ్యాట్రిసెస్‌లో ఆర్డర్, ఇన్వర్స్, సొల్యూషన్ ప్రాబ్లమ్స్, డిటర్మినెంట్స్ ప్రాబ్లమ్స్, సిమెట్రిక్ & స్క్యూ సిమెట్రిక్ ప్రాబ్లమ్స్; కాంప్లెక్స్ నెంబర్స్‌లో ఆర్గ్యుమెంట్, మాడ్యులస్, కాంజ్యుగేట్ ప్రాబ్లమ్స్; పర్మిటేషన్స్ & కాంబినేషన్స్‌లో ర్యాంక్ ప్రాబ్లమ్స్, ప్రాబబిలిటీలో బేయిస్ థీరమ్ ప్రాబ్లమ్స్, ఎడిషన్, మల్టిప్లికేషన్ థీరమ్స్ ప్రాబ్లమ్స్, బైనామియల్ థీరమ్‌లో బైనామియల్ కొయెఫిషియంట్ ప్రాబ్లెమ్స్.
- **క్యాలిక్యులస్:** ఫంక్షన్స్‌లో బైజక్షన్, ఇన్వర్స్, కాంపోజిట్, ఈవెన్, ఆడ్ ఫంక్షన్స్ ప్రాబ్లమ్స్, లిమిట్స్ (ఎల్ - హాస్పిటల్ రూల్), కంటిన్యుటి, డిఫరెన్సియబిలిటి, డిఫరెన్షియేషన్, అప్లికేషన్ ఆఫ్ డెరివేటివ్స్, డెఫినెట్ ఇంటెగ్రల్స్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్‌లో ఆర్డర్, డిగ్రీ, టైప్స్ ఆఫ్ డిఇ ప్రాబ్లమ్స్, ఏరియాస్.
- **జ్యామెట్రీ:** స్ట్రెయిట్‌లైన్స్‌లో ఫుట్ ఆఫ్ ది పర్పెండిక్యులర్, ఇమేజ్ థీరమ్స్, ఇంటర్‌సెప్ట్, లోకస్ ప్రాబ్లమ్స్; యాంగిల్ బిట్వీన్ పెయిర్ ఆఫ్ లైన్స్, హోమోజినైషన్ ప్రాబ్లమ్స్, డిస్టెన్స్ బిట్వీన్ పార్లల్ లైన్స్, డిస్టెన్స్ బిట్వీన్ 2 పాయింట్స్; సర్కిల్స్‌లో టాంజెంట్స్, నార్మల్స్, సెంటర్, రేడియస్ ప్రాబ్లమ్స్, రిలేటివ్ పొజిషన్ ఆఫ్ 2 సర్కిల్స్, రాడికల్ యాక్సిస్, ఈక్వేషన్ ఆఫ్ కార్డ్; కోనిక్స్‌లో ఎసెంట్రిసిటీ ప్రాబ్లమ్స్, టాంజెంట్స్ & నార్మల్స్.
- **ట్రిగొనామెట్రీ:** ప్రాపర్టీస్ ఆఫ్ ట్రయాంగిల్స్‌లో సైన్ రూల్, కొసైన్ రూల్, టాంజెంట్ రూల్స్, ట్రిగొనామెట్రిక్ ఈక్వేషన్స్, ఇన్వర్ ట్రిగొనామెట్రిక్ ఫంక్షన్స్.
- **వెక్టార్స్ & 3డి:** డాట్, క్రాస్ ప్రాడక్ట్, 3డిలో స్ట్రెయిట్ లైన్స్, ప్లేన్స్ ప్రాబ్లమ్స్.

ఫిజిక్స్



- **కరెంట్ ఎలక్ట్రిసిటి:** ఓమ్స్‌లా, కాంబినేషన్ ఆఫ్ సెల్స్/ రెసిస్టెన్సెస్, కిర్కాఫ్ లా, ఎలక్ట్రికల్ మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్
- **లాస్ ఆఫ్ మోషన్:** ఎఫ్‌బిడి, న్యూటన్ సెకండ్ లా & ఇట్స్ అప్లికేషన్స్
- **ఇఎంఐ:** ఫారడే లా, లెన్జ్ లా, సెల్ఫ్ & మ్యూచువల్ ఇండక్షన్, ఎనర్జీ & కరెంట్ కాలిక్యులేషన్స్ ఇన్ ఇండక్షన్
- **హీట్ & థర్మో డైనమిక్స్:** ఫస్ట్ లా & సెకండ్ లా ఆఫ్ థర్మోడైనమిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్ (కండక్షన్), హీట్ ఇంజనిన్స్, కిర్కాఫ్ లా, న్యూటన్ లా ఆఫ్ కూలింగ్, వెన్స్ డిస్‌ప్లేస్‌మెంట్‌లో లా, గాస్ లాస్
- **మ్యాగ్నెటిక్ ఎఫెక్ట్స్ ఆఫ్ కరెంట్ & మాగ్నెటిజం:** బయోట్ - సవర్ట్ & ఆంపియర్స్ సర్క్యుటల్ లా అప్లికేషన్స్, మోషన్ ఆఫ్ చార్జెడ్ పార్టికల్ ఇన్ ఎలక్ట్రిడ్ & మాగ్నెటిక్ ఫీల్డ్, ఎర్త్ మేగ్నటిజం & మేగ్నటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ మెటీరియల్స్
- **రే ఆప్టిక్స్:** ఆప్టికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, లెన్స్ థియరీ& ఇట్స్ అప్లికేషన్స్, స్ఫెరికల్ మిర్రర్స్
- **వేవ్ ఆప్టిక్స్:** వైడిఎస్ఇ, పోలరైసేషన్ (మాలుస్ లా)
- **వేవ్ మోషన్:** రెఫ్లాక్షన్ & ట్రాన్స్‌మిషన్ ఆఫ్ వేవ్స్, ప్రోగ్రెసివ్ వేవ్స్, సౌండ్ వేవ్స్, డాప్లర్ ఎఫెక్ట్, వైబ్రేషన్స్ ఆఫ్ స్ట్రెచ్డ్ స్ట్రింగ్& ఏర్‌కాలమ్స్ ఇన్ ఆర్గాన్ సైన్స్
- **ఎలక్ట్రోస్టాటిక్స్:** కూలోంబిక్ లా, ఎలక్ట్రిక్ ఫీల్డ్, పొటెన్షల్, పొటెన్షల్ ఎనర్జీ, గాస్ లా, డైపోల్ ఇన్ యూనిఫాం & నాన్ యూనిఫామ్ ఎలక్ట్రిక్ ఫీల్డ్, యూనిఫామ్& నాన్ యూనిఫామ్ చార్జ్ డిస్ట్రిబ్యూషన్
- **మోడ్రన్ ఫిజిక్స్:** ఫోటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్, ఎక్స్ - రేస్, ఆటమిక్ ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్
- **వర్క్, ఎనర్జీ & పవర్:** కన్జర్వేషన్ ఆఫ్ ఎనర్జీ, డబ్లు ఇ థీరమ్, పవర్
- **రొటేషనల్ మోషన్:** మూమెంట్ ఆఫ్ ఇనర్షియా, వర్క్ & రొటేషనల్ కెఇ, టార్క్, రోలింగ్ ఆన్ రొటేషనల్
- **గ్రావిటేషన్:** ప్లానెటరీ మోషన్& శాటిలైట్స్, పొటెన్షియల్ ఎనర్జీ, ఎస్కేప్ వెలాసిటీ
- **ఇఎం వేవ్స్:** డిస్‌ప్లేస్‌మెంట్ కరెంట్, మాక్స్‌వెల్ ఈక్వేషన్స్, ప్రాపర్టీస్ ఆఫ్ ఇఎం వేవ్స్
- **ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్:** లాజిక్ గేట్స్, డయోడ్స్ (ఫార్వర్డ్ & రివర్స్ బయోస్), ట్రాన్సిస్టర్, మోడ్స్ ఆఫ్ కమ్యూనికేషన్

కెమిస్ట్రీ



- కెమిస్ట్రీలో కొన్ని అధ్యాయాలను అకాడమీ పుస్తకాల నుంచి నేర్చుకోవాలి. బయో మాలిక్యూల్స్, పాలిమర్స్, నిత్యజీవితంలో కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ, సర్ఫేస్ కెమిస్ట్రీలను ఉదాహరణలతో సహ నేర్చుకోవాలి. ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎలక్ట్రానిక్ ఎఫెక్ట్స్, ఐసోమెరిజమ్స్, ఐయుపిఎసి నేమింగ్‌లను గురించి చదువుకోవాలి.
- ఏరోమాటిసిటీ, ఇఎస్ మెకానిజమ్స్ గురించి అవగాహన చేసుకోవాలి. ముఖ్యంగా నేమ్ రియాక్షన్స్‌ను మెకానిజమ్‌తో సహ ప్రాక్టీస్ చేయాలి. ఉర్ట్జ్, ఫ్రీడల్ క్రాఫ్ట్, కోల్బ్, కెనిజారో - టీమన్, గాటర్‌మాన్, కోచ్ వంటి ముఖ్యమైన చర్యల గురించి ఉదాహరణలతో సహ నేర్చుకోవాలి. ఇవి కాక ఓజోనాలిసిస్, డీ హైడ్రేషన్, డీకార్బాక్సిలేషన్‌ల ప్రాడక్ట్స్‌ను గుర్తుపట్టగలగాలి. ముఖ్యంగా ఆర్గానిక్ కెమిస్ట్రీలో కొన్ని కెమికల్స్‌ని గుర్తించే పరీక్షల గురించి తెలుసుకోవాలి.
- టోలెన్, స్కిఫ్, బెనెడిక్ట్, ఫెహలింగ్, ఐడోఫారం, కార్బైల్ ఎమైన్, లూకాస్, బేయర్, బ్రోమిన్ వాటర్ పరీక్షల గురించి అనేకసార్లు బిట్‌శాట్ పరీక్షలో అడిగారు. ముఖ్యమైన ఆక్సిడేషన్, రిడక్షన్ కారకాలను గురించి చదువుకోవాలి. క్లెమెన్‌సన్, ఉల్ఫ్‌కిష్నర్, రోజన్‌మండ్ రిడక్షన్‌లను, ఆక్సిడేషన్‌ల గురించి తెలుసుకోవాలి. ఫంక్షనల్ గ్రూప్ రియాక్షన్స్ అన్నింటిని ప్రాక్టీస్ చేయాలి. ఫిజికల్ కెమిస్ట్రీలో కింది అధ్యాయాలను తప్పనిసరిగా చదువుకోవాలి.
- **అటామిక్ స్ట్రక్చర్:** బోర్ - రేడియస్, ఎనర్జీ, హైడ్రోజన్ స్పెక్ట్రమ్, ఫోటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్, డీ బ్రోలీ, హైజన్ బర్గ్ సంబంధిత లెక్కలు, ష్రోడింగర్ ఈక్వేషన్ ఆధారిత ప్రశ్నలు
- **కెమికల్ బాండింగ్:** విఎస్ఇపిఆర్ హైబ్రిడైజేషన్, పోలార్ కోవలెంట్ బాండ్, హైడ్రోజన్ బాండ్, బంధ కోణాలు, దూరాలు
- **స్టాయిక్యోమెట్రీ:** ఆక్సిడేషన్, రిడక్షన్, రెడాక్స్ బ్యాలెన్సింగ్, ఎంపెరికల్, మాలిక్యులర్ లెక్కలు, ఆక్సిడేషన్ స్టేట్, ఈక్వివేలంట్ భారాలు
- **స్టేట్స్ ఆఫ్ మేటర్:** PV = nRT, PV = 1/3 mnc^2, KE లెక్కలు, వాండర్‌వాల్ సమీకరణం
- **థర్మోడైనమిక్స్:** ప్రథమ, ద్వితీయ నియమాలు, హెస్ నియమ లెక్కలు, సంబంధాలు
- **కెమికల్ ఈక్విలిబ్రియం:** K_c, K_p లెక్కలు, లీషాట్లియర్ సూత్రం, ఉపయోగాలు
- **అయానిక సమతాస్థితి:** పిహెచ్ లెక్కలు, సాల్ట్ హైడ్రాలిసిస్, బఫర్‌లు, బలహీన యాసిడ్‌లు, క్షారాలు, ఆస్వాల్డ్ నియమం
- **కెమికల్ కైనెటిక్స్:** అర్హీనియస్ సమీకరణం, కొల్లిజన్ థియరీ, ఇచ్చిన కెమికల్ డేటా ఆధారంగా ఆర్డర్ కనుక్కోవడం, ఫస్ట్ ఆర్డర్ రియక్షన్ లెక్కలు
- **ఉపరితల శాస్త్రం:** పూర్తిగా ఎన్‌సిఇఆర్‌టి పుస్తకం నుంచి ఉదాహరణలు నేర్చుకోవాలి.
- **సాలిడ్ స్టేట్ కెమిస్ట్రీ:** ఏడు రకాల స్ఫటిక వ్యవస్థలు, నాలుగు రకాల స్ఫటికాలు, వాటి నిర్మాణాలు, లోపాలు
- **ఎలక్ట్రో కెమిస్ట్రీ:** ఫారడే, కాల్ రాష్, నెర్నెస్ట్ సమీకరణాల ఆధారిత లెక్కలు, ఎలక్ట్రాలిసిస్ ప్రోడక్ట్స్
- ఫిజికల్ కెమిస్ట్రీలో ఉండే అనేక ఫార్ములాల ఆధారంగా గ్రాఫ్‌లు నేర్చుకోవాలి.
- **ఇనార్గానిక్ కెమిస్ట్రీ:** ఎస్ బ్లాక్‌లో హైడ్రాక్సైడ్‌లు, ఆక్సైడ్‌లు, కార్బొనేట్, బై కార్బొనేట్, హైడ్రాక్సైడ్‌లకు సంబంధించిన వివరాలు, భౌతిక ధర్మాల పోలికలు, ఉంటాయి క్రమాలు.
- పి బ్లాక్‌లో హైడ్రేడ్‌డు, హైలైడ్‌లు, ఆక్సైడ్‌లు, ఆక్సీ ఆమ్లాల లక్షణాలు, మార్పులు; అమ్మోనియా నైట్రోజన్, ఫాస్ఫరస్, నైట్రిక్ యాసిడ్, సల్ఫ్యూరిక్ యాసిడ్, ఓజోన్, హైపో, తయారీ, ధర్మాలు; బోరాన్, సిలికాన్, కెమిస్ట్రీ
- డి, ఎఫ్ బ్లాక్స్‌లో $K_2Cr_2O_7$, $KMnO_4$ ప్రిపరేషన్, ప్రాపర్టీస్; కో ఆర్డినేషన్ సమ్మేళనాల్లో ఐయుపిఎసి నామకరణం, విబిటి, సిఎఫ్‌టి లు, ఐసోమెరిజమ్‌లు
- లోహ రసాయన శాస్త్రంలో లోహాల రిడక్షన్ పద్ధతులను నేర్చుకోవాలి.

మార్కులు - విద్యార్థులు

గత ఆరేళ్ల బిట్‌శాట్ మార్కుల విశ్లేషణ

బిట్‌శాట్ స్కోర్	2011	2012	2013	2014	2015	2016	2017
మార్కులు ≥ 400	70	46	162	256	246	304	381
మార్కులు ≥ 350	761	706	1316	1926	2097	2319	2773
మార్కులు ≥ 300	3997	4119	5860	7171	8184	8789	9290
మార్కులు ≥ 250	13326	13984	17044	19341	21821	22441	23458
మార్కులు ≥ 225	20339	21805	25617	28720	31882	32565	33633

జాబ్ కార్నర్

భారత్ ఎలక్ట్రానిక్స్

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ శాశ్వత / కాంట్రాక్ట్ ప్రతిపాదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

భారత ఇలెక్ట్రానిక్స BHARAT ELECTRONICS

- మొత్తం ఖాళీలు: **35**
- శాశ్వత పోస్టులు: డిప్యూటీ మేనేజర్ 2, సీనియర్ ఇంజనీర్ 4, డిప్యూటీ ఇంజనీర్ 2
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్/ఎంఎస్/ పిహెచ్‌డి ఉత్తీర్ణతతోపాటు నిర్దేశించిన విధంగా ఏడాది నుంచి ఎనిమిదేళ్ల అనుభవం ఉండాలి.
- వయసు: డిసెంబరు 1 నాటికి 28 నుంచి 36 ఏళ్ల మధ్య ఉండాలి.

కాంట్రాక్ట్ ఇంజనీర్స్:

- ఖాళీలు: 27
- విభాగాలవారీ ఖాళీలు: ఎలక్ట్రానిక్స్ 9, డిజైన్ 6, మెటీరియల్ మేనేజ్‌మెంట్ 2, కంప్యూటర్ సైన్స్ 5, ఆప్టిక్స్ 3, లేజర్ 2
- అర్హత: సంబంధిత విభాగంలో బిఇ/ బిటెక్ /ఎంటెక్/ ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: డిసెంబరు 1 నాటికి 25 ఏళ్లలోపు ఉండాలి
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: 2018 జనవరి 20
- వెబ్‌సైట్: www.bel-india.com

నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్

నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ (ఎన్‌పిసి)- కన్సల్టెంట్స్, ప్రాజెక్ట్ అసోసియేట్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **39**
- పోస్టులు: కన్సల్టెంట్స్ (అగ్రికల్చర్ 10, సోషల్ సైన్స్ 3), ప్రాజెక్ట్ అసోసియేట్స్ (అగ్రికల్చర్ 20, సోషల్ సైన్స్ 6)
- అర్హత: పీజీ (అగ్రికల్చర్/ సోషల్ సైన్స్) పూర్తిచేసి ఉండాలి. సంబంధిత రంగంలో అయిదు నుంచి పదేళ్ల అనుభవం ఉండాలి. పిహెచ్‌డి అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
- వేతనం: కన్సల్టెంట్స్‌కు నెలకు రూ.40,000, ప్రాజెక్ట్ అసోసియేట్స్‌కు నెలకు రూ.25,000
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: 2018 జనవరి 8
- వెబ్‌సైట్: www.npcindia.gov.in

టీచింగ్ ఫ్యాకల్టీ

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **37**
- పోస్టులు: టీచింగ్ ఫ్యాకల్టీ 12 (ప్రొఫెసర్ 5, అసోసియేట్ ప్రొఫెసర్ 6, అసిస్టెంట్ ప్రొఫెసర్ 1), అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ 25
- వయసు: 45 నుంచి 56 ఏళ్ల మధ్య ఉండాలి
- అర్హత: డిగ్రీ/ ఎండి/ ఎంఎస్/ పిహెచ్‌డి ఉత్తీర్ణులై ఉండాలి.
- వెబ్‌సైట్: www.aiia.co.in/

ఇండియన్ ఎయిర్ ఫోర్స్



ఇండియన్ ఎయిర్ ఫోర్స్ - డైరెక్ట్ ప్రాతిపదికన గ్రూప్ సి సివిలియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **36**
- పోస్టులు: హౌస్ కీపింగ్ స్టాఫ్ 12, ఎంటిఎస్ 12, మెస్ స్టాఫ్ 3, కుక్ 6, హిందీ టైపిస్ట్ 1, కార్పెంటర్ 1, లేడీ హెల్త్ విజిటర్ 1
- వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి
- అర్హత: పోస్టును అనుసరించి పదోతరగతి/ ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 21
- వెబ్‌సైట్: www.indianairforce.nic.in

ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ

బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎడిఏ) తాత్కాలిక ఫెలోషిప్ బేసిస్ కింద ప్రాజెక్ట్ అసిస్టెంట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఖాళీలు: **24**
- విభాగాలు: ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్, మెటలర్జీ, కంప్యూటర్ సైన్స్
- కాలవ్యవధి: రెండేళ్లు
- స్టయిపెండ్: నెలకు రూ.25,000 తోపాటు హెచ్‌ఆర్‌ఏ చెల్లిస్తారు.
- అర్హత: సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో బిఇ/బిటెక్ ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ గేట్ 2016/2017 స్కోరు పొంది ఉండాలి.
- వయసు: దరఖాస్తు నాటికి 28 ఏళ్లలోపు ఉండాలి.
- ఎంపిక: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: 2018 జనవరి 10
- వెబ్‌సైట్: www.ada.gov.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్- షిప్ డ్రాఫ్ట్‌మన్ ట్రైనీస్ నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **14**
- విభాగాలవారీ ఖాళీలు: మెకానికల్ 1, ఎలక్ట్రికల్ 13
- అర్హత: 60 శాతం మార్కులతో మూడేళ్ల డిప్లొమా (మెకానికల్/ ఎలక్ట్రికల్) ఉత్తీర్ణతతోపాటు డ్రాఫ్ట్‌మన్‌షిప్, క్యాడ్ పరిజ్ఞానం ఉండాలి.
- వయసు: 25 ఏళ్లు మించరాదు
- ట్రైనింగ్: రెండేళ్లు
- స్టయిపెండ్: మొదటి ఏడాది నెలకు రూ.8500, రెండో ఏడాది నెలకు రూ.8900 ఇస్తారు. అదనపు పనిగంటల నిమిత్తం నెలకు రూ.4200 చెల్లిస్తారు.
- ఎంపిక: రాత పరీక్ష, ప్రాక్టికల్ టెస్ట్ ద్వారా
- పరీక్ష కేంద్రం: కొచ్చి
- దరఖాస్తు ఫీజు: రూ.100
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 15
- వెబ్‌సైట్: www.cochinshipyard.com

గ్రీన్ గ్యాస్ లిమిటెడ్

గెయిల్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలోని గ్రీన్ గ్యాస్ లిమిటెడ్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఖాళీలు: **8**
- పోస్టులు: ఆఫీసర్ (ఎంఐఎస్ & ప్లానింగ్ 1, ఫైనాన్స్ 1), అసిస్టెంట్ మేనేజర్ - కంపెనీ సెక్రటరీ 1, మేనేజర్(ఫైర్ & సేఫ్టీ 1, ప్రాజెక్ట్స్, ఆపరేషన్స్ & మెయింటెనెన్స్ 1), చీఫ్ మేనేజర్(ఫైనాన్స్) 1, ఎజిఎం(మార్కెటింగ్ 1, ఫైనాన్స్ 1)
- అర్హత: పోస్టును అనుసరించి బిఇ/ బిటెక్/ సిఏ/ ఐసిడబ్ల్యుఏ/ ఎంబిఏ/ పిజిడిఎం ఉత్తీర్ణులై ఉండాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 17
- వెబ్‌సైట్: www.gglonline.net

ఆ రెండు రోజులు మ్యాచ్‌లుండవు

ఇండోర్: దేశవాళీ క్రికెటర్లకు శుభవార్త. ఈ ఏడాది నుంచి డిసెంబరు 31, జనవరి 1 తేదీల్లో ఎలాంటి క్రికెట్ మ్యాచ్‌లూ ఉండబోవని బీసీసీఐ ప్రకటించింది. ఈసారి రంజీ సీజన్‌లో ఏ పిచ్‌పైనా ఎలాంటి ఫిర్యాదు అందలేదని బోర్డు తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా తెలిపాడు. ఈసారి జోన్ల వారీగా 'బెస్ట్ పిచ్' అవార్డును బీసీసీఐ ప్రవేశపెట్టింది. ఈ అవార్డు కింద రూ. 10 లక్షలు అందజేయనుంది.

విదర్భ క్రికెటర్లకు ఐపీఎల్ ధమాకా!

తొలిసారి రంజీ టైటిల్ గెలిచి కొత్త ఏడాదికి ఘన స్వాగతం పలికిన విదర్భ జట్టులో కొందరు క్రికెటర్లకు 2018 మరింత సంతోషం నింపనుంది. రంజీ ఫైనల్లో హ్యాట్రిక్‌తోపాటు నాకౌట్ మ్యాచ్‌లన్నింటిలో ఐదేసి వికెట్లు తీసి సంచలనం సృష్టించిన విదర్భ పేస్ బౌలర్ రజనీష్ గుర్బానీ ఈసారి ఐపీఎల్ వేలంలో 'హాట్' క్రికెటర్‌గా కనిపిస్తున్నాడు. ఇతడితోపాటు ఆదిత్య సర్వాతే, ఆదిత్య ఠాక్రేలు ఐపీఎల్‌కు ఎంపికయ్యే అవకాశాలున్నాయి. ఈ ముగ్గురు ఆటగాళ్లు ముంబై ఇండియన్స్ ట్రయల్స్‌కు హాజరైనట్టు సమాచారం.

ధోనీకి టాప్ కాంట్రాక్టు లేనట్టే!



న్యూఢిల్లీ: టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన మహేంద్ర సింగ్ ధోనీకి బీసీసీఐ టాప్ కాంట్రాక్ట్‌కు దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆటగాళ్ల కాంట్రాక్ట్‌లను కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీవోఏ).. ఎ+, ఎ, బి, సిగా విభజించింది. అన్ని ఫార్మాట్లలో కొనసాగుతున్న వారు టాప్ కాంట్రాక్ట్‌కు అర్హులు. జీతాలు పెంచే విషయమై కోహ్లీ, ధోనీ, శాస్త్రితో సమావేశం తర్వాత సరికొత్త ఫార్ములాకు సీవోఏ ఆమోదముద్ర వేసింది. దీని ప్రకారం అన్ని ఫార్మాట్లు ఆడుతున్న వారికి ఎ+ కాంట్రాక్ట్ ఇచ్చే అవకాశం ఉంది. అయితే టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంతో టాప్ కాంట్రాక్ట్‌కు ధోనీ అనర్హుడు కానున్నాడని సమాచారం.

అంధుల జట్టు రేపటిదాకా ఆగాల్సిందే!

బెంగళూరు: పాకిస్థాన్‌లో ఈనెల 7 నుంచి 21వరకు జరిగే అంధుల క్రికెట్ ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రయాణంపై నెలకొన్ని అనిశ్చితి ఇంకా తొలగిపోలేదు. పాక్‌కు వెళ్లి ఆడాలంటే కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరనీ, ఈ విషయంపై కేంద్రం ఈనెల 5న తన నిర్ణయాన్ని ప్రకటించే అవకాశముందని భారత అంధుల క్రికెట్ సంఘం చీఫ్ జీకే మహంతేశ్ తెలిపారు. పాక్, దుబాయ్ వేదికలుగా ఈ టోర్నీ జరగనుంది. కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే, 6వ తేదీన ఢిల్లీ నుంచి నేరుగా వాఘా సరిహద్దుకు భారత జట్టు వెళ్తుందన్న మహంతేశ్.. అనుమతి లేకపోతే అదేరోజు ఢిల్లీ నుంచి దుబాయ్ వెళ్లి అక్కడ పాక్‌తో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుందన్నారు.

భువీయే స్ట్రయిక్ బౌలర్




న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా టూర్‌లో పేసర్ భువనేశ్వర్ కుమార్ ఎంతో కీలక ఆటగాడని మాజీ పేసర్ జవగళ్ శ్రీనాథ్ అన్నాడు. 'గత కొన్ని నెలలుగా భువీ అద్భుత ప్రదర్శన చేస్తున్నాడు. టీమిండియా అమ్ముల పొదిలో అతడు ప్రధానాస్త్రమని భావిస్తున్నా. కానీ భువీ సేవలను షార్ట్ స్పెల్స్‌లో పొదుపుగా వినియోగించుకోవాలి' అని శ్రీనాథ్ సూచించాడు. పేస్‌తోపాటు బంతిని నియంత్రణతో స్వింగ్ చేయడం భువీ ప్లస్ పాయింట్ అని చెప్పాడు. అయితే అతడు అలసిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత టీమ్ మేనేజ్‌మెంట్‌పై ఉందని శ్రీనాథ్ గుర్తుచేశాడు.

'టాప్' అథ్లెట్లకు రూ.3.14 కోట్లు



న్యూఢిల్లీ: టార్గెట్ ఒలింపిక్ పోడియమ్ (టాప్) పథకంలోని 175 మంది అథ్లెట్లకు పాకెట్ అలవెన్స్ కింద రూ. 3.14 కోట్లు విడుదల చేసినట్టు కేంద్ర క్రీడా శాఖ మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ వెల్లడించారు. 2017 చివరి త్రైమాసికానికి సంబంధించిన ఈ మొత్తాన్ని జాతీయ క్రీడా అభివృద్ధి పథకం కింద అందజేసినట్టు బుధవారం రాజ్యసభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు.

ఇప్పుడున్నదే బెస్ట్ బౌలింగ్



న్యూఢిల్లీ: గత 60-70 ఏళ్లలో టీమిండియాకు ప్రస్తుతం ఉన్న బౌలింగ్ విభాగమే అత్యుత్తమమైనదని భారత స్పిన్ దిగ్గజం ఎరాపల్లి ప్రసన్న అన్నాడు. ఏడుగురు సభ్యులతో కూడిన ప్రస్తుత భారత బౌలింగ్ దళంలో ఐదుగురు పేసర్లున్నారన్న ప్రసన్న.. వీరిలో నలుగురు గంటకు 140 కి.మీ. వేగంతో నిలకడగా బంతులు వేయగలరని గుర్తు చేశాడు. అందుకే సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌లో ఐదుగురు బౌలర్లతో బరిలో దిగాలని కెప్టెన్ కోహ్లీకి సూచించాడు.

2022 జాతీయ క్రీడలు మేఘాలయలో

షిల్లాంగ్: 2022 జాతీయ క్రీడలకు మేఘాలయ రాష్ట్రం ఆతిథ్యం ఇవ్వనుంది. ఈమేరకు ఐవోఏ, మేఘాలయ ఒలింపిక్ అసోసియేషన్, ఆ రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది.

ఓడినా.. 'టాప్' పదిలమే!

దుబాయ్: దక్షిణాఫ్రికాతో మూడు టెస్టుల సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైనా టీమిండియా టాప్ ర్యాంక్‌కు ప్రమాదమేమీ లేదు. అయితే సఫారీలు కూడా స్వల్ప తేడాతో అగ్రస్థానానికి చేరుకుంటారు. ప్రస్తుతం ర్యాంకింగ్ పాయింట్లలో భారత్ (124), సౌతాఫ్రికా మధ్య 13 పాయింట్ల అంతరం ఉంది. సఫారీలు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తే అప్పుడు రెండు జట్లూ సమంగా 118 పాయింట్లతో ఉంటాయి. అయినా కూడా.. 0.47 తేడాతో భారత్ టాప్ ర్యాంక్‌లోనే కొనసాగనుంది. దక్షిణాఫ్రికా రెండో స్థానంలో ఉంటుందని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే కోహ్లీ సేన సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తే భారత్ పాయింట్ల మొత్తం 128కు చేరుకోనుండగా.. సఫారీ టీమ్ 107 పాయింట్లకు పడిపోతుంది. ఇక టెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా రెండో స్థానంలో ఉన్న కోహ్లీ (893) ఈ సిరీస్‌లో అదరగొడితే 900 పాయింట్ల క్లబ్‌లో చేరే అవకాశం ఉంది. పుజారా మూడో ర్యాంకులో ఉన్నాడు.



ఫ్రీడమ్ సిరీస్ ట్రోఫీతో కోహ్లీ-డుప్లెసిస్

హనీమూన్ అయిపోయింది కెప్టెన్!

విరాట్ కోహ్లీ 'హనీమూన్' పూర్తయిపోయింది. మనం మాట్లాడుతున్నది టీమిండియా కెప్టెన్, నవవధువు అనుష్కతో కలిసి యూరప్‌లో సాగించిన విహార యాత్ర గురించి కాదు. టెస్ట్ జట్టు సారథిగా అతని మూడేళ్ల హనీమూన్ పీరియడ్‌కు సంబంధించిన ప్రస్తావన అది. అతని నాయకత్వ ప్రస్థానానికి అలాంటి ముద్దు పేరు పెట్టడానికి కారణం ఈ మూడేళ్లూ కోహ్లీకి ఆడింది ఆటగా, పాడింది పాటగా హంస నావలాగ హాయిగా సాగడమే. 2015 జనవరిలో టెస్ట్ జట్టుకు పూర్తి స్థాయి కెప్టెన్‌గా పగ్గాలు చేపట్టిన కోహ్లీ ఇప్పటివరకు ఒక్క టెస్ట్ సిరీస్ కూడా ఓడిపోలేదు. (2014-15 ఆస్ట్రేలియా సిరీస్‌లో ధోనీ, కోహ్లీ చెరి రెండు టెస్టులకు సారథ్యం వహించారు కా బట్టి అది లెక్కలోనికి రాదు). అజేయంగా కొనసాగడమే కాదు, ఇంటా బయటా వరుసగా తొమ్మిది టెస్ట్ సిరీస్‌లు గెలిచి రికా ర్డులు తిరగరాశాడు. అతని హయాంలో టెస్ట్ ర్యాంకింగ్స్‌లో కూడా మన జట్టు మళ్ళీ నంబర్ వన్ స్థానానికి ఎగబాక గలిగింది. 32 టెస్టుల్లో నాయకత్వం వహిస్తే వాటిలో మూడే మూడింటిలో ఓటమి చవిచూశాడు. అంతే కాదు కెప్టెన్సీ బాధ్యత అతని బ్యాటింగ్ మరింత పదునెక్కేలా చేసింది. మొత్తంగా అతని బ్యాటింగ్ సగటు 53.75 ఉంటే కెప్టెన్‌గా ఆడిన మ్యాచుల్లో 67.44గా ఉంది. ఈ గణాంకాలన్నీ చూస్తే కోహ్లీని మించిన కెప్టెన్ లేడనిపిస్తుంది. కానీ అంకెలు చెప్పని అసలు కథ ఇంకొకటుంది. తొమ్మిది వరుస సిరీస్ విజయాల్లో మూడు మాత్రమే ఇండియా బయట వచ్చాయి. అవి కూడా శ్రీలంక, వెస్టిండీస్ పర్యటనల్లో వచ్చినవే. ప్రస్తుతం ఆ రెండూ నాసిరకం జట్లేనని చెప్పడంలో సందేహాలు ఎవరికీ ఉండవు. స్వదేశంలో ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఇంగ్లండ్ లాంటి అతిరథ మహారథులపై సిరీస్‌లు నెగ్గిన మాట వాస్తవమే కానీ సొంత గడ్డ మీద మన స్థాన బలం (దీన్ని స్పిన్ బలం అని కూడా అనొచ్చు) ఎంత బాగా ఉపయోగపడుతున్నదన్నది ప్రత్యేకంగా చెప్పకనక్కర్లేదు. అందుకే ఈ మూడేళ్ల విరాటపర్వంలోని వరస విజయాలను పెద్ద సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఇప్పటి వరకూ మనం చూసింది ట్రైలర్ మాత్రమే, అసలు సినిమా ఈ కొత్త సంవత్సరంలో మొదలవ్వబోతున్నది.. షారుఖ్‌ఖాన్ భాషలో చెప్పాలంటే పిక్చర్ అభీ బాకీ హై మేరే దోస్త్!

2018 సంవత్సరంలో కోహ్లీ సేన మూడు ముఖ్యమైన టెస్ట్ సిరీస్‌లు ఆడబోతున్నది. దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలతో ఈ మూడు సిరీస్‌లు ఆయా దేశాల్లోనే జరగనున్నాయి. ఇంట గెలిచిన విరాటుడు ఇప్పుడు రచ్చ గెలిచి తన సత్తా నిరూపించుకోవాల్సి ఉంది. కెప్టెన్‌గానే కాదు, బ్యాట్స్‌మన్‌గా కూడా ఈ మూడు సిరీస్‌లు అతనికి లిట్మస్ టెస్ట్ లాంటివి. ఇప్పటి దక్షిణాఫ్రికా పర్యటన విషయానికొస్తే ఆ గడ్డపై నెగ్గడానికి పాతికేళ్లుగా విఫల ప్రయత్నం చేస్తూనే ఉన్నాం. 2010-11 నాటి డ్రా మినహా సౌతాఫ్రికాలో ఆడిన మిగతా ఐదు టెస్ట్ సిరీసుల్లో మన జట్టుకు ఓటమి తప్పలేదు. ఆ దేశంలో ఆడిన 17 టెస్టుల్లో ఎనిమిదింటిలో ఓడిపోయి రెండు మాత్రమే నెగ్గగలిగాం. మరి కొరకరాని కొయ్యలాగ ఉన్న ఆఫ్రికన్ సఫారీలో ఈసారైనా మన రాత మార్చడం కోహ్లీ చేతనవుతుందా?

ఈ ఏడాది ఐపీఎల్ తర్వాత మన జట్టు ఇంగ్లండ్‌లో ఐదు టెస్టుల సిరీస్ ఆడబోతున్నది. అక్కడ మన రికార్డు మరీ దక్షిణాఫ్రికాలో ఉన్నంత దారుణంగానైతే లేదు కానీ చివరి రెండు ఇంగ్లండ్ టూర్లలో మాత్రం టీమిండియా ఘోర పరాజయం చవిచూసింది. 2011లో 0-4 తేడాతో, 2014లో 1-3 తేడాతో మన జట్టు చిత్తుగా ఓడింది. ఇక ఈ ఏడాది చివరిలోని ఆస్ట్రేలియా పర్యటన మరింత క్లిష్టమైనది. అక్కడ జరిపిన 11 గజనీ దండయాత్రల్లో ఒక్క టెస్ట్ సిరీస్ కూడా ఇండియా గెలవలేకపోయింది. పెను సవాలుగా ఉన్న ఈ మూడు టూర్లలో కనీసం రెండు సిరీస్‌లు గెలిస్తే అది కెప్టెన్ కోహ్లీకి గొప్ప విజయమే అవుతుంది.

నాయకుడిగానే కాదు జట్టులో అతిముఖ్యుడైన బ్యాట్స్‌మన్‌గా కూడా కోహ్లీకి ఈ మూడు టూర్లు చాలా ముఖ్యం. అతను ఇప్పటివరకు దక్షిణాఫ్రికాలో ఆడినవి రెండే రెండు టెస్టులు కాగా వాటిలో మంచి స్కోర్లే సాధించి 60కి పైగా బ్యాటింగ్ సగటు నమోదు చేసుకున్నాడు. కానీ ఇంగ్లండ్‌లో మాత్రం ఆడిన ఐదు టెస్టుల్లోనూ ఘోరంగా విఫలమయ్యాడు. ఆ ఐదింటిలో అతని బ్యాటింగ్ సగటు 13 మాత్రమే (అత్యధిక స్కోరు 39!). ఆఫ్ స్టంప్ అవతల పడే స్వింగింగ్ బంతుల్ని ఎదుర్కోవడంలో అతనికి కొన్ని ఇబ్బందులనున్నట్టు ఆ ఇంగ్లండ్ సిరీస్ బయట పెట్టింది. ఇక ఆస్ట్రేలియాలో ఇప్పటివరకు ఆడిన 8 టెస్టుల్లో 5 సెంచరీలు, 62 సగటుతో బాగా రాణించాడు. అయితే కెప్టెన్సీ భారంతో పాటు పెద్దగా అనుభవంలేని బ్యాటింగ్ లైనప్‌ను ముందుండి నడిపించాల్సిన బాధ్యత కూడా అతనిపై ఉంది. ఇప్పటి జట్టులో పుజారా, ధవన్, రాహుల్, రోహిత్ శర్మ లాంటివారు ఫాస్ట్ పిచ్‌లపై బాగా ఆడగలుగుతారా అన్నది సందేహాస్పదమే. అందుకే అలాంటి సమస్యలన్నీ దాటుకుని ఈ మూడు సిరీస్‌ల 'టెస్టు' పాసైతే కోహ్లీకి ఇక తిరుగుండదు. కోహ్లీ గట్టివాడని, పట్టుబడితే సాధించి తీరతాడని ఈపాటికే మనకు అర్థమయింది. పైగా ఇప్పటి మన జట్టు కూడా ఫాస్ట్ బౌలింగ్‌తో సహా అన్ని విభాగాలలో బలంగా కనిపిస్తున్నది. అందుకే విరాట్ మనకు ట్రైలర్ కన్నా మంచి సినిమా చూపిస్తాడని ఆశ పెట్టుకోవడంలో తప్పులేదేమో.

- సి. వెంకటేష్

మళ్లీ మున్రో మోత

టీ-20ల్లో మూడో సెంచరీతో కొలిన్ రికార్డు

119 రన్స్‌తో కివీస్ విజయం

వెస్టిండీస్‌తో సిరీస్ 2-0తో కైవసం



కొలిన్ మున్రో

మౌంట్ మాంగనుయ్: న్యూజిలాండ్ విధ్వంసకర వీరుడు కొలిన్ మున్రో మరోసారి రెచ్చిపోయాడు. అంతర్జాతీయ టీ-20ల్లో మూడో సెంచరీ చేసి ఆ ఘనత సాధించిన తొలి క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. వెస్టిండీస్‌తో బుధవారం జరిగిన మూడో టీ-20 మ్యాచ్‌లో అతను పరుగుల మోత మోగించాడు. 53 బంతుల్లోనే 3 ఫోర్లు, 10 సిక్సర్లతో 108 పరుగులతో మోతెక్కించాడు. దీంతో కివీస్ 119 పరుగులతో విండీస్‌ను చిత్తుగా ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జట్టు.. మున్రో ధాటికి 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 243 పరుగులు చేసింది. టీ-20ల్లో ఆ జట్టుకు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. మున్రోతో పాటు మరో ఓపెనర్ మార్టిన్ గప్టిల్ (38 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 63) మెరుపు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన కరీబియన్ జట్టు 16.3 ఓవర్లలో 124 పరుగులకే కుప్పకూలింది. ఆంద్రీ ఫ్లెచర్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 46) మినహా మిగతా బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. కివీస్ బౌలర్లలో టిమ్ సౌథీ మూడు, ట్రెంట్ బౌల్ట్, ఇష్ సోధి రెండేసి వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో మూడు టీ-20ల సిరీస్‌ను కివీస్ 2-0తో కైవసం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు నెగ్గగా.. రెండో టీ-20లో వర్షం కారణంగా ఫలితం తేలలేదు. మూడు మ్యాచ్ ల్లో కలిపి 223 పరుగులు చేసిన మున్రోకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్ అవార్డులు దక్కాయి. మున్రో గతంలో బంగ్లాదేశ్, భారత్‌పై సెంచరీలు చేశాడు. కాగా, ఇప్పటికే రెండు టెస్టుల సిరీస్‌ను 0-2తో, మూడు వన్డేల సిరీస్‌ను 0-3తో కోల్పోయిన విండీస్ టీ-20ల్లోనూ ఓడి ఈ పర్యటనను తీవ్ర నిరాశతో ముగించింది.

జడేజాకు జ్వరం.. తొలి టెస్ట్‌కు ధవన్ ఫిట్


ధవన్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు ముందు భారత శిబిరంలో ఒక విషయం ఆనందం నింపితే.. మరో వార్త ఆందోళన రేకెత్తిస్తోంది. ఓపెనర్ శిఖర్ ధవన్ పూర్తి ఫిట్‌గా ఉన్నట్టు తేలగా.. ప్రధాన స్పిన్నర్ రవీంద్ర జడేజా వైరల్ జ్వరం బారిన పడ్డట్టు తెలిసింది. ఈ టూర్‌కు వచ్చేముందు చీలమండకు స్వల్ప గాయంతో ఇబ్బంది పడ్డ ధవన్ పూర్తిగా కోలుకున్నట్టు బీసీసీఐ బుధవారం ప్రకటించింది. శుక్రవారం మొదలయ్యే తొలి టెస్టులో అతను మురళీ విజయ్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే అవకాశం ఉంది. అయితే, రెండు రోజులుగా జ్వరంతో ఇబ్బందిపడుతున్న జడేజాను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. దాంతో అతను తొలి టెస్టులో బరిలోకి దిగడం అనుమానంగా కనిపిస్తోంది. కాగా, తొలి మ్యాచ్‌లో కోహ్లీసేన ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగితే గనుక.. జడేజా కంటే అశ్విన్‌ను జట్టులోకి తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.


జడేజా

గంభీర్‌కు కోల్‌కతా గుడ్‌బై?

నేడే ఐపీఎల్ రిటెన్షన్ • రా. 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

ముంబై: ఆటగాళ్లను అట్టిపెట్టుకునే జాబితాలో ఐపీఎల్ టీమ్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్).. వెటరన్ గౌతమ్ గంభీర్‌ను కాదని తొలి ప్రాధాన్యంగా వెస్టిండీస్ ఆల్‌రౌండర్ సునీల్ నరైన్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఉందని సమాచారం. రిటెన్షన్ ప్లేయర్ల లిస్టును ఆయా ఫ్రాంచైజీలు గురువారం ఐపీఎల్ పాలకమండలికి సమర్పించనున్నాయి. గౌతీని తప్పించి నరైన్ తీసుకోవాలనేది కేకేఆర్ మేనేజ్‌మెంట్ ఏకగ్రీవ నిర్ణయంగా తెలుస్తోంది. అయితే ఎంత మందిని అట్టిపెట్టుకుంటున్నారో స్పష్టమైన సమాచారం లేదు. 'కోల్‌కతా విజయాల్లో గంభీర్ ఎంతో కీలకపాత్ర పోషించాడు. అతడిని రీటెయిన్ చేసుకోకపోవడం అనేది వ్యూహాత్మకం. కానీ గౌతీని వేలంలో కూడా తీసుకోవచ్చు కదా' అని కేకేఆర్ అధికారి అన్నాడు. గంభీర్ సారథ్యంలో 2012, 2014లో కోల్‌కతా టైటిళ్లు నెగ్గింది. కాగా, మరోసారి టైటిల్ సాధించాలనే టీమ్ వ్యూహ సమీకరణల్లో గౌతీకి స్థానం కష్టమేనని విశ్లేషకులు అంటున్నారు. ధోనీ, సురేశ్ రైనా. జడేజాలను అట్టిపెట్టుకునేందుకు చెన్నై సూపర్‌కింగ్స్ సిద్ధమవగా.. ఆస్ట్రేలియన్ కెప్టెన్ స్టీవ్ స్మిత్‌ను రాజస్థాన్ రాయల్స్ తిరిగి తీసుకునే అవకాశముంది. డేవిడ్ వార్నర్‌ను సన్‌రైజర్స్ తమ వద్దే ఉంచుకోనుంది. ఏదేమైనా, ఏ జట్టుతో ఎవరెవరు ఉండిపోతారన్నది గురువారం తేలనుంది. ఇప్పటిదాకా ఆటగాళ్ల వేలం పాటను మాత్రమే ప్రత్యక్షప్రసారం చేసేవాళ్లు. ఇప్పుడు తొలిసారిగా రిటెన్షన్ విధానం కూడా ప్రత్యక్షప్రసారం కానుంది. ముంబైలో రాత్రి 7 గంటలనుంచి జరిగే ఈ కార్యక్రమాన్ని స్టార్‌స్పోర్ట్స్‌లో లైవ్‌లో వీక్షించవచ్చు.

సింధు టీమ్‌కు షాక్

లక్నో: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై స్మాషర్స్‌కు ఢిల్లీ డాషర్స్ షాకిచ్చింది. పురుషుల డబుల్స్‌లో చెన్నైకి చెందిన సుమిత్ జోడీ మినహా కెప్టెన్ పీవీ సింధు సహా మిగతా షట్లర్లంతా తమ మ్యాచ్‌లు ఓడిపోయారు. ఫలితంగా ఢిల్లీ 3-0 ఆధిక్యంతో చెన్నైపై గెలిచింది. మహిళల సింగిల్స్‌లో ఢిల్లీ స్టార్ సంగ్ జీ హ్యూన్.. సింధును చిత్తుచేసింది. పురుషుల డబుల్స్‌లో చెన్నై జోడీ..ఢిల్లీ జంటపై నెగ్గినా, ఆ తర్వాత ట్రంప్ మ్యాచ్‌లో ఓడడంతో ఉన్న ఒక్క పాయింట్ కూడా కోల్పోయింది.

కొత్త మైలురాళ్లను చేరుకోవాలని..

(కెవిన్ అండర్సన్)

ఆస్ట్రేలియన్ ఓపెన్ ముందు టాటా ఓపెన్ ఆడడం మంచి నిర్ణయమని భావిస్తున్నా. టోర్నీలో తీవ్ర పోటీ ఉండడంతో గ్రాండ్‌గా సీజన్ ఆరంభించడానికి చక్కని ప్రాక్టీస్ దొరకనుంది. భారత్‌కు రావడం ఎంతో ఆనందంగా ఉంది. నా భార్యతో కలసి పుణె సిటీని చుట్టేద్దామనుకున్నా.. కానీ ప్రాక్టీస్ కారణంగా తగిన సమయం దొరకడం లేదు. గత ఏడాది యూఎస్ ఓపెన్‌లో ఫైనల్ చేరడం నా కెరీర్‌లోనే అత్యుత్తమైన విషయంగా భావిస్తున్నా. 2017 జీవితాంతం గుర్తుండే జ్ఞాపకాలను అందించింది. కొత్త సీజన్‌లో నాతో నేనే పోటీపడి సరికొత్త మైలురాళ్లను అందుకోవాలనుకుంటున్నా.

(వ్యాసకర్త దక్షిణాఫ్రికా టెన్నిస్ ఆటగాడు)


కేరళ - ఆంధ్ర మ్యాచ్ దృశ్యం

ఆంధ్ర జట్ల ఇంటి ముఖం

• జాతీయ సీనియర్ కబడ్డీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్లు ప్రీ క్వార్టర్స్‌లోనే ఇంటి ముఖం పట్టాయి. బుధవారం జరిగిన పురుషుల రౌండ్-16లో ఏపీ 31-52తో ఉత్తరాఖండ్ చేతిలో పరాజయం పాలైంది. మహిళల విభాగంలో ఇండియన్ రైల్వేస్ సెమీస్‌కు చేరుకుంది. క్వార్టర్స్‌లో రైల్వేస్ 39-25తో ఉత్తర్‌ప్రదేశ్‌పై గెలిచింది. కాగా, ప్రీ క్వార్టర్స్‌లో కేరళ 31-21తో ఆంధ్రప్రదేశ్‌పై, ఛత్తీస్‌గఢ్ 27-23తో కర్ణాటకపై, పంజాబ్ 33-19తో బిహార్‌పై, రైల్వేస్ 37-19తో ఢిల్లీపై నెగ్గాయి.



రెగెట్టాలో అనన్య జోడీకి స్వర్ణం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కృష్ణపట్నం పోర్టులో బుధవారం ముగిసిన అంతర్జాతీయ రెగెట్టా చాంపియన్‌షిప్‌లో తెలుగు సెయిలర్లు పతకాలతో సత్తాచాటారు. లేజర్ 420 క్లాస్ డబుల్స్ విభాగంలో తెలంగాణకు చెందిన అనన్య చౌహాన్ - విష్ణు సుజీష్ జోడీ స్వర్ణం సాధించింది. ఆప్టిమిస్టిక్ మహిళల సింగిల్స్ కేటగిరీలో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. వైష్ణవికి స్వర్ణం, ఫిర్దోస్‌కు రజతం, సోనుకు కాంస్యం దక్కాయి. ఆప్టిమిస్టిక్ బాలుర కేటగిరీలో తెలుగు సెయిలర్ దుర్గాప్రసాద్ కాంస్యం గెలుచుకున్నాడు. ఈ టోర్నీలో అత్యంత వర్ధమాన సెయిలర్ అవార్డును అఖిలేశ్వర్ రెడ్డి గెలుచుకున్నాడు.

హరీశ్ సారు ఊపిరి పోశారు

ఆయన గొప్ప మానవతావాది.. ఆర్నేళ్ల నుంచి కంటికిరెప్పలా కాపాడారు

- 'ఆంధ్రజ్యోతి' చేసిన మేలును మరువను
- కిడ్నీ బాధితురాలు సుష్మ ఆనందం
- బాధితురాలి దైన్యంపై 'ఆంధ్రజ్యోతి' కథనం
- ఖరీదైన వైద్యం అందేలా మంత్రి చొరవ
- కోలుకుంటున్న డిగ్రీ విద్యార్థిని

సిద్దిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): "రెండు కిడ్నీలూ పూర్తిగా చెడిపోయాయి. కిడ్నీ మార్పిడి చేస్తే తప్ప మీ అమ్మాయి బతకదు".. వైద్యులు చెప్పిన ఈ మాటలు విని ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. తమ కూతురుకు 19 ఏళ్లకే నూరేళ్లు నిండనున్నాయని తెలిసి గుండెలవిసేలా రోదించారు. చిన్నప్పటి నుంచి కనీసం సూది మందు కూడా ఎరుగని తమ బిడ్డ.. రోజుల వ్యవధిలోనే చిక్కి శల్యం కావడాన్ని చూసి తట్టుకోలేకపోయారు. రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో కూతురుకు ఖరీదైన వైద్యం ఎలా అందించాలో తెలియక తలలు పట్టుకున్నారు. 8 నెలలు గడిచాయి. మృత్యు ముఖానికి దగ్గరైన ఆ అమ్మాయిలో ఇప్పుడు ఎంతో మార్పు! మంచం పట్టిన ఆమె చక్కగా తన పనులు తాను చేసుకుంటోంది. డిగ్రీ పరీక్షలకు సిద్ధం అవుతోంది. అప్పట్లో ఆ అమ్మాయి అనారోగ్య స్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురిస్తే... మంత్రి హరీశ్ రావు బాధితురాలికి ఖరీదైన వైద్యం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. 'ఆంధ్రజ్యోతి' కథనమే తన జీవితంలో కొత్త వెలుగు ప్రసరించేలా చేసిందని, దేవుడి రూపంలో మంత్రి హరీశ్ రావు చేసిన సాయం మరువనని, ఆ అమ్మాయి అంటోంది. తన పాలిట హరీశ్ రావే నిజమైన వైద్యుడు అని చెబుతోంది. ఆమే.. సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన సుష్మ (19). డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. తండ్రి రాజలింగం బీడీ కంపెనీలో కూలీ. ఎప్పుడూ చలాకీగా ఉండే సుష్మ 8 నెలల క్రితం ఒక్కసారిగా అస్వస్థతకు గురైంది. సుష్మ కిడ్నీలు పాడయ్యాయని వైద్యులు తెలిపారు. డయాలసిస్ చేసినా.. ఆమె ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. సుష్మ బతకాలంటే కిడ్నీ మార్పిడి ఆపరేషన్ తప్పనిసరి అని, అయినా ఆమె శరీరం సహకరించే స్థితిలో లేదని వైద్యులు తేల్చారు. సుష్మ దయనీయస్థితిపై నిరుడు మే 7న 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. సుష్మ పరిస్థితిని తెలుసుకొని హరీశ్‌రావు స్వయంగా బాధితురాలి ఇంటికి వెళ్లి.. "నీకు ఏమీ కాదు. పూర్తిగా కోలుకుంటావు. నాదీ పూచీ" అని భరోసా ఇచ్చారు. తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. స్వయంగా సుష్మను తోడ్కొని వెళ్లి నిమ్స్‌లో చేర్పించారు. మెరుగైన చికిత్స చేయాలని అక్కడి వైద్యులకు సూచించారు. ఆమె తల్లిదండ్రులకు వసతి, ప్రయాణ, తదితర ఖర్చులను ఆయనే సమకూర్చారు. సుష్మకు అవసరమైన వైద్యానికి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తున్నారు. సుష్మకు ఏదో ఒక రోజు కిడ్నీ మార్పిడి తప్పకున్నా.. ప్రస్తుతమైతే హోం డయాలసిస్ లిక్విడ్ మార్పిడి చికిత్సతో నెట్టుకొస్తోంది. కూతురు కోసం ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్‌లోనే ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు.


కాల్వ సుష్మ


సుష్మ పరిస్థితి గురించి వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు (ఫైల్);

హరీశ్ సారు దేవుడు

"కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేస్తే తప్ప బతకను అని వైద్యులు నా ముందే చెప్పేశారు. రెండు కిడ్నీలూ చెడిపోయి మంచం పట్టిన నాకు డాక్టర్ల మాటలు మరింత కుంగదీశాయి. త్వరలో చావు తప్పదనుకున్న స్థితిలో మంత్రి హరీశ్ సారు గొప్ప అండగా నిలిచారు. 'ఆంధ్రజ్యోతి' లో నాగురించి రాసిన తర్వాత హరీశ్ సారు స్వయంగా మా ఇంటికి వచ్చారు. నీకేమీ కాదు.. అనుకున్నది సాధిస్తావు" అని ధైర్యం చెప్పారు. ఒక వైద్యుడిలా నాలో మానసిక స్థైర్యాన్ని నింపారు. ఆయన ఇచ్చిన భరోసాతోనే వైద్యం చేయించుకున్నాను. నిమ్స్‌కు కూడా వచ్చి నా గురించి డాక్టర్లతో మాట్లాడేవారు. ఎన్నో దేవుళ్లను ప్రార్థించాను. వారంతా హరీశ్‌సార్ రూపంలో నన్ను బతికించారు. నాకు ఊపిరి పోసిన ఆయన గొప్ప మానవతావాది. త్వరలోనే కిడ్నీ కూడా మార్పిస్తానని ఆయన చెప్పారు. హరీశ్ సారును, 'ఆంధ్రజ్యోతి'ని జీవితంలో మరువను"


తుక్కుతో శ్రీనివాసన్ తయారుచేసిన జనరేటర్

తుక్కుతో 40లక్షల జనరేటర్

- సింగరేణి మణుగూరు ఏరియాలో ఇంజనీర్ కృషి

మణుగూరు రూరల్, జనవరి 3: పనికిరాని తుక్కు.. అమ్మితే వెయ్యి రూపాయలు కూడా రావు. కానీ, ఆ తుక్కుతోనే రూ.40లక్షల విలువ చేసే జనరేటర్ తయారు చేసి అద్భుతం సృష్టించాడో ఇంజనీర్. అది ఒక భూగర్భగనికి కావాల్సిన విద్యుత్తును అందించే జనరేటర్. సింగరేణి మణుగూరు ఏరియాలోని వర్క్‌షాప్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఎ శ్రీనివాసన్.. ఒకరోజు ఏరియాలోని మూతపడిన పీకే-1 గనిలో పాడైపోయిన జనరేటర్‌ను.. ఓసీ-2 పనికిరాని డంపర్ ఇంజన్లు ఉన్నట్లు తెలుసుకున్నారు. వెంటనే డంపర్ ఇంజన్, జనరేటర్‌లోని హైడ్రాలిక్ ఫ్యూయల్ పంప్ వినియోగించి జనరేటర్‌ను తయారు చేయాలన్న ఆలోచన తట్టింది. ఏజీఎం రాజు, డీవైజీఎం నర్సిరెడ్డిల అతనికి సహకారం అందించారు. ఇలా పనికి రాని తుక్కుతో జనరేటర్ రెడీ అయ్యింది. గతంలోనూ తుక్కుతో ట్రాన్స్‌మెషీన్ టెస్ట్ బెంచ్‌ను కూడా తయారు చేశారు.

కేంద్ర సంస్కరణలతోనే నిరంతర విద్యుత్: లక్ష్మణ్



హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ విషయంలో ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక సంస్కరణల ఫలితంగానే తెలంగాణలో రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ అందుబాటులోకి వచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ అన్నారు. బుధవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయ్ వర్గీయతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయ్ పథకంలో రాష్ట్రాన్ని చేర్చటం, నార్త్, సౌత్ గ్రిడ్ల అనుసంధానం, యాదాద్రి, భద్రాద్రి పవర్‌ప్లాంట్లకు అనుమతితో తెలంగాణకు సరిపోయేంత విద్యుత్ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందని లక్ష్మణ్ తేల్చిచెప్పారు. ఇదే అంశాన్ని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయ్ ద్వారా కేంద్రానికి నివేదిస్తున్నామని చెప్పారు.

నేటి నుంచి టీడీపీ శిక్షణ తరగతులు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ-టీఎస్ కార్యకర్తలు, నేతలకు నేటి నుంచి 2 రోజుల పాటు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దీంతోపాటు ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 18 నుంచి పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం ఈనెల 6న ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, రైతులు, యువత, కార్మికులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అంశాల వారీగా శ్రేణులకు అవగాహన కల్పిస్తామని రావుల తెలిపారు.

11 వరకు మందకృష్ణమాదిగకు రిమాండ్

బౌద్ధనగర్/చంపాపేట/హైదరాబాద్(ఆంధ్రజ్యోతి), జనవరి 3: మందకృష్ణ మాదిగకు కోర్టు ఈ నెల 11వ తేదీ వరకు రిమాండ్ విధించింది. వర్గీకరణకు పార్లమెంటులో బిల్లు పెట్టాలంటూ మంగళవారం పార్శీగుట్ట కార్యాలయంలో చేపట్టిన ఉపవాస దీక్షను పోలీసులు భగ్నం చేసి మందకృష్ణను అరెస్ట్ చేసి కంచన్‌బాగ్ ఠాణాకు తరలించారు. అక్కడ బుధవారం తన దీక్షను కొనసాగించారు. 11.30 ప్రాంతంలో మందకృష్ణను చిలకలగూడ పీఎస్‌కు తరలించి వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వైద్యపరీక్షల కోసం గాంధీ ఆస్పత్రికి తరలించి అనంతరం సికింద్రాబాద్‌లోని పదోమెట్రోపాలిటన్ జడ్జి ఎదుట హాజరు పరిచారు. జడ్జి మందకృష్ణకు 11 వరకు రిమాండు విధించారు. ఆపై ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

ఉమామాధవరెడ్డికి ఇంటిస్థలం

- మాధవరెడ్డి నక్సల్స్ దాడిలో మృతి చెందడంతో కేటాయింపు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఉమామాధవరెడ్డికి ఇంటిస్థలం కేటాయింపు అంశం ఇన్నాళ్లకు కొలిక్కివస్తోంది. ఆమె భర్త, దివంగత మంత్రి మాధవరెడ్డి 2000 సంవత్సరంలో నక్సలైట్ల మందుపాతరకు బలి కావడంతో.. ఆయన కుటుంబానికి ఇంటిస్థలం ఇవ్వాలని 2006లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2006 జూన్ 13న పుప్పాలగూడలో భూమిని కేటాయించింది. కానీ, ఆ భూమిపై వివాదం ఉండడంతో ఉమామాధవరెడ్డి దానిని పొందలేకపోయారు. తమకు షేక్‌పేటలోనే కావాలని ఉమామాధవరెడ్డి పట్టుబట్టడంతో స్థలాన్వేషణ కోసం రెవెన్యూ యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఈ మేరకు గత నవంబరు 16న ఆమె సీఎం కేసీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత ఆమె టీఆర్ఎస్‌లో చేరడం తెలిసిందే. కాగా షేక్‌పేటలో మాజీ మంత్రి కోరే స్థలం ఇప్పటికే ఓ బాధిత కుటుంబానికి కేటాయించాలని నిర్ణయించడంతో ప్రభుత్వం ఏ స్థలాన్ని ఇస్తుందన్నది చూడాల్సి ఉంది.

పంచాయతీల్లో వార్డులు

కనీసం 5.. గరిష్ఠంగా 21.. జనాభా ఆధారంగా విభజన

- 300 జనాభా వరకు ఐదు.. 500 వరకు ఏడు వార్డులు
- పంచాయతీ ఎన్నికల నాటికి ఏర్పాటు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త గ్రామపంచాయతీలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో.. ఆయా పంచాయతీల్లో వార్డుల విభజన అంశం తెరపైకి వచ్చింది. గ్రామ పంచాయతీల్లో వార్డులను ఎలా విభజిస్తారు? ఒక్కో గ్రామపంచాయతీలో కనీసం ఎన్ని వార్డులు ఉంటాయి? ఎన్ని వార్డులు ఉండాలి? అన్నదానిపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో 500 జనాభా గల ఆవాసాలు, తండాలు/ గూడేలు, వాటి సమూహాలను కూడా పంచాయతీలుగా మార్చాలని నిర్ణయించడంతో ఈ చర్చ ప్రారంభమైంది. చిన్న పంచాయతీల కారణంగా వార్డుల విభజనకు ఏవైనా ఇబ్బందులుంటాయా? అనే విషయంపై ఇటీవల చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న ఎన్నిక విధానం ప్రకారం.. సర్పంచ్‌ను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకుంటారు. ప్రతి వార్డు నుంచి ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికైన సభ్యులు... పంచాయతీ పాలకమండలిలో సర్పంచ్‌తో పాటు సభ్యులుగా ఉంటారు. అయితే, జనాభా ఆధారంగానే పంచాయతీల వార్డుల విభజన చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత మున్న నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీ జనాభా ఆధారంగా కనీసం 5 వార్డులు, గరిష్ఠంగా 21 వార్డుల వరకు ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఎన్నికలు జరగడానికి ముందు గల అధికారిక జనగణనను(ప్రస్తుతం 2011) పరిగణనలోకి తీసుకుని వార్డుల సంఖ్యను నిర్దేశిస్తారు. ఇలా ఒక గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఓటర్లను.. అన్ని వార్డులకు సమంగా విభజిస్తారు. ఉదాహరణకు రామాపురం అనే గ్రామంలో 950 మంది జనాభా (2011) ఉందనుకుంటే.. నిబంధనల ప్రకారం ఇక్కడ 9 వార్డులు ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే, ఆ గ్రామంలో ఎన్నికలు జరిగే సమయానికి ఉన్న ఓటర్లు 613 అనుకుంటే.. సగటున 68 మంది ఓటర్లు వస్తారు. అంటే 612 మంది ఓటర్లను 9 వార్డులకు సర్దుబాటు చేస్తారు. మిగిలిన ఓటరును చివరి వార్డులో చేరుస్తారు.

గ్రామ పంచాయతీల్లో వార్డులకు వెసులుబాటు ఇలా..

జనాభా	వార్డులకు అవకాశం
300 వరకు	5
301 - 500	7
501 - 1500	9
1501 - 3000	11
3001 - 5000	13
5001 - 10000	15
10001 - 15000	17
15000కు మించితే	19-21



ఒక ఇంటివారంతా ఒకే వార్డులోకి..

వార్డుల విభజనలో కొన్ని సందర్భాల్లో ఒకే ఇంటికి చెందినవారి పేర్లు వేర్వేరు వార్డుల్లో ఉంటున్నాయి. ఒక ఇంట్లో ఐదుగురు ఓటర్లు ఓటరు జాబితాలోని సీరియల్ నెంబరు 67 నుంచి 71 వరకు ఉన్నారనుకుంటే.. వార్డుల సమాన విభజనతో మొదటి ఇద్దరు ఓటర్లు మొదటి వార్డులో, మిగతా ముగ్గురు రెండో వార్డులో చేరుతున్నారు. అయితే ఇలాంటి సమస్య రాకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. సగటుకు కాస్త అటు ఇటుగానైనా సరే.. ఒక ఇంట్లోని వారంతా ఒకే వార్డులో ఉండేలా చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికలు నిర్వహించే నాటికి వార్డుల విభ జన, ఒక కుటుంబం వారంతా ఒకే వార్డులో ఉండేలా నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం.

పిటిషన్ కాలపరిమితి తేలుస్తాం

కాళేశ్వరం ప్రాజెక్టు వ్యాజ్యంపై ఎన్జీటీ

న్యూఢిల్లీ, జనవరి3(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు లేవని దాఖలైన వ్యాజ్యం కాలపరిమితిలో ఉందో లేదో మొదట తేలుస్తామని ఎన్జీటీ వెల్లడించింది. నిర్వాసితుడు హయతుద్దీన్ దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ యూడీ సాల్వే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రాజెక్టు అనుమతుల వివరాలను తెలంగాణ ప్రభుత్వం తరపున న్యాయవాది ధర్మాసనానికి సమర్పించారు. దీనిపై సమాధానం ఇస్తామని పిటిషనర్ తరపున న్యాయవాది విజ్ఞప్తి చేశారు. దీనిపై సమాధానం అవసరమేముందని, ఇవి అధికారిక అనుమతులే కదా, హైకోర్టు ఈ కేసులో మార్గనిర్దేశం చేసిందని ఏజీ ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు.



కార్గిల్‌లో మైనస్ 20.6 డిగ్రీలు

న్యూఢిల్లీ, జనవరి 3: జమ్మూకశ్మీర్‌లోని కార్గిల్‌లో ఉష్ణోగ్రతలు అత్యల్ప స్థాయికి చేరుకుంటున్నాయి. బుధవారం ఇక్కడ మైనస్ 20.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జమ్మూ నగరంలో కూడా మంగళవారం రాత్రి రికార్డు స్థాయిలో 4.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం రాత్రితో పోలిస్తే ఇది 1.7 డిగ్రీలు తక్కువ అని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పొగమంచు కారణంగా జమ్మూ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం వరకు విమానాల రాకపోకలు జరగలేదు. పలు రైళ్ల రాకపోకలకు అంతరాయమేర్పడగా, రోడ్డుమార్గంలోనూ ప్రయాణాలు సాధ్యం కాలేదని అధికారులు తెలిపారు.

రంజుగా రబీ వరి సాగు

- సాధారణం కన్నా 33% ఎక్కువ
- తగ్గిన జొన్న సాగు: వ్యవసాయశాఖ

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అక్టోబరులో కురిసిన వర్షాలకు పెరిగిన భూగర్భ జలాలు.. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు.. ఇంకేం, పంటలకు పుష్కలంగా నీళ్లు దొరికాయి. దీంతో రాష్ట్రంలో రబీ వరిసాగు దూకుడు ప్రదర్శిస్తోంది.ప్రభుత్వ అంచనాలను మించి వరి సాగవుతోంది. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం ఈ సమయానికి సాధారణంగా 86వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరినాట్లు పూర్తి కావాల్సి ఉండగా.. దాన్ని మించిపోయి 1.30లక్షల హెక్టార్లలో రైతులు నాట్లు పూర్తి చేశారు. అంటే సాధారణం కంటే ఇది 33% ఎక్కువన్న మాట. గత ఏడాది ఈ సమయానికి 77వేల హెక్టార్లలో వరినాట్లు పడగా, దానికి 53వేల హెక్టార్లు అదనంగా.. 1.30లక్షల హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు ఇవ్వడంతో నిరంతరం భూగర్భ జలాలు తోడే అవకాశం కలిగింది. ఇది రైతులకు కలిసి వచ్చి వరిసాగుకు ఉత్సుకత చూపారు. వరిసాగు పెరిగాక.. రోజువారీ ఆహార జాబితా నుంచి జొన్న క్రమంగా తగ్గిపోయింది. గతేడాది లాగే ఈ ఏడాదీ సాధారణం కంటే 20వేల హెక్టార్ల మేర జొన్న.. 38వేల హెక్టార్ల మేర మొక్కజొన్న తక్కువగా సాగైంది. మినుము, పెసర, వేరుసెనగ, పొద్దుతిరుగుడు తదితర పంటలూ సాధారణం కంటే తక్కువగానే సాగు అయ్యాయి. రాష్ట్రంలో అన్ని పంటలు కలుపుకొని ఈ సమయానికి 5.93 లక్షల హెక్టార్ల మేరకు వివిధ పంటలు సాగులోకి రావాల్సి ఉండగా 85వేల హెక్టార్లు తక్కువగా.. 5.08 లక్షల హెక్టార్ల మేరకు సాగులోకి వచ్చింది. పాయింట్ ఆఫ్ సేల్ మిషన్(పీవోఎస్)ల ద్వారా ఎరువుల అమ్మకం ప్రారంభించిన తర్వాత.. మూడ్రోజుల్లో 10వేల టన్నుల మేర ఎరువులు అమ్మినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎరువుల సబ్సిడీలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) అమల్లో భాగంగా జనవరి 1 నుంచి ఈ-పీవోఎస్ మిషన్ల ద్వారానే ఎరువుల అమ్మకాన్ని తప్పనిసరి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయశాఖ 6,641 పీవోఎస్ మిషన్లను ఎరువుల దుకాణాలకు సరఫరా చేసింది. వీటిలో 3,240 దుకాణాల్లోని పీవోఎస్‌ల ద్వారా మూడ్రోజుల్లో 10,045 టన్నుల ఎరువులు అమ్ముడయ్యాయి.

సీపీఎస్‌ను రాష్ట్రమే రద్దు చేయొచ్చు

ఆర్టీఐతో తెలుసుకున్నాం.. సీపీఎస్ ఉద్యోగుల సంఘం వెల్లడి

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): లక్షల మంది ఉద్యోగులకు గుదిబండలా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దుచేసే నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం చెబుతోంది. తెలంగాణ సంఘం అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కలువల్ శ్రీకాంత్‌పాటు ఏపీ, కర్ణాటక వంటి ఇతర రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు సమాచార హక్కు చట్టం ద్వారా సీపీఎస్ నిర్ణయాధికారంపై వివరాలు సేకరించారు. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 సెప్టెంబరులో 653, 654, 655 నంబర్ల జీవోల ద్వారా అమల్లోకి వచ్చిన సీపీఎస్‌ను రద్దు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మరో జీవోను జారీ చేయాల్సి ఉంటుంది. దీంతోపాటు 'సీపీఎస్‌లో మేం కొనసాగబోం' అని చెబుతూ పీఎఫ్ఆర్డీఏ(ప్రావిడెంట్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ)కి సమాచారమివ్వాల్సి ఉంటుంది" అని సంఘం నేతలు తెలిపారు. సీపీఎస్ వద్దనుకుంటే రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయం తీసుకోవచ్చని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తమ ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానమిచ్చిందని చెప్పారు. నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆర్టీఐ ద్వారా స్పష్టం కావడంతో దాని ఆధారంగా నిర్ణయం తీసుకొమ్మని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించమని సుప్రీంకోర్టును కోరతామని సంఘం నేతలు తెలిపారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: **K. Srinivas**, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .**Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.